www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

ఫైనల్లో ఇండియా
సెమీ ఫైనల్లో కొరియాపై గెలుపు
చైనాతో నేడు తుదిపోరు 10
ఆసియా చాంపియన్స్ ట్రోఫీ హాకీ



మంగళవారం | 17-9-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 153 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, భాద్రపదమాసం, శుక్లపక్షం; తిథి: చతుర్దశి ఉ. 11.44 తదుపరి పౌర్ణమి; నక్షత్రం: శతభిషం మ. 1.53 తదుపరి పూర్వాభాద్ర; వర్జ్యం: రా. 7.30-8.55; దుర్ముహూర్తం: ఉ. 8.31-9.20, రా. 10.06-10.52; అమృతఘడియలు: ఉ. 7.29-8.54, తె. 3.57-5.22; రాహుకాలం: మ. 3.00-4.30; సూర్యోదయం: 6.06; సూర్యాస్తమయం: 6.11 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



రాజధాని నిర్మాణాలు సేఫ్

కాంక్రీట్, ఐరన్ దృఢత్వం ఓకే

హైకోర్టు, ఐఏఎస్, ఎన్జీవోల భవనాలూ బాగున్నాయి
సీఆర్డీఏకు హైదరాబాద్, చెన్నై ఐఐటీ నిపుణుల నివేదిక
ఊపిరి పీల్చుకున్న సీఆర్డీఏ.. వైసీపీ హయాంలో
చిట్టడవిని తలపించిన అమరావతి ప్రాంతం

విజయవాడ, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలోని భవన నిర్మాణాల పటిష్ఠతకు ఎలాంటి ఢోకా లేదని, స్టీల్, కాంక్రీట్ దృఢంగా ఉన్నాయని చెన్నై, హైదరాబాద్ ఐఐటీల నిపుణులు పేర్కొన్నారు. ఈ మేరకు సీఆర్డీఏకు సోమవారం నివేదికను అందించారు. వైసీపీ హయాంలో ఐదేళ్ల పాటు రాజధాని నిర్మాణ పనులు నిలిచిపోయాయి. మూడు రాజధానులంటూ వైసీపీ ప్రభుత్వం అమరావతిని పక్కన పెట్టింది. దీంతో అప్పటికే నిర్మాణం పూర్తయిన భవనాలు, నిర్మాణంలో ఉన్న భవనాలను కూడా పట్టించుకోలేదు. ఫలితంగా గత ఐదేళ్ల కాలంలో అమరావతి చిట్టడవిని తలపించే పరిస్థితికి

మిగతా 12వ పేజీలో...



అమరావతి సురక్షితం

రాజధానిలోకి చుక్కనీరు రాకుండా గట్టి చర్యలు
కొండవీటివాగు, పాలవాగు, గ్రావిటీ కెనాల్స్ అభివృద్ధి
నెదర్లాండ్స్ కన్సల్టెంట్‌తో కాలువల ఆధునికీకరణ పనులు
ఆరు రిజర్వాయర్ల అభివృద్ధి.. 4 వరుసలుగా కృష్ణా కరకట్ట
వర్షాకాలం నాటికి అన్ని పనులూ పూర్తి.. డిసెంబరు నుంచి రాజధాని పనులు
వరద ప్రాంతాల్లో ఆస్తి పన్ను కట్టడానికి 3 నెలల సమయం: మంత్రి నారాయణ

రాజధాని రైతులకు ఎట్టకేలకు కౌలు
రూ.190 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం 12
అధికారంలోకొచ్చిన వంద రోజుల్లోపే హామీ అమలు

జెత్వానీ కేసులో 'వకీల్ సాబ్' కథ

సేమ్ టు సేమ్ సీన్!


విశాల్ గున్నీ

జెట్ స్పీడ్‌పై 'సూపర్ పోలీస్' సూపర్ స్టోరీ

అంతపెద్ద 'సార్' చెప్పారని ఏదైతే అదైందని వెళ్లారట

విచారణలో విశాల్ గున్నీ వివరణతో కొత్త విషయాలు వెలుగులోకి

ముంబై నటి కాదంబరి జెత్వానీ అక్రమ అరెస్ట్ వ్యవహారం పవన్ కల్యాణ్ సినిమా వకీల్ సాబ్ లోని సన్నివేశాలను గుర్తుకుతెచ్చింది. మూడేళ్ల క్రితం ఈ సినిమా విడుదలైతే... ఈ ఏడాది ఫిబ్రవరిలో జెత్వానీ కేసులో నిజం చేసి చూపించారు. నాటి ఇంటెలిజెన్స్ చీఫ్ పీఎస్ఆర్ ఆంజనేయులు, విజయవాడ సీపీ కాంతి రాణా, డీసీపీ విశాల్ గున్నీ 'కథ' నడిపించారు.



(అమరావతి-ఆంధ్రజ్యోతి)
'అంత పెద్ద సార్ చెప్పారని.. ఏదైతే అదైందని విమానం ఎక్కి వెళ్లిపోయా.. ఎఫ్ఐఆర్ నమోదైన గంటలోనే ముంబైకి ఫ్లైట్ ఎక్కా'.. ముంబై నటి కాదంబరి జెత్వానీ అక్రమ అరెస్ట్ వ్యవహారంలో సస్పెండైన ఐపీఎస్ అధికారి విశాల్ గున్నీ ఉన్నతాధికారులకు ఇచ్చిన వివరణ ఇది. సేమ్ టు సేమ్... పవన్ కల్యాణ్ సినిమా వకీల్ సాబ్‌లోని కోర్టు సన్నివేశంలాగా..! ఇక్కడ చిన్న తేడా ఏంటంటే.. సినిమాలో న్యాయవాది ప్రశ్నలకు

మిగతా 2వ పేజీలో...

తాడేపల్లి సీఎం ఆఫీసులో స్క్రిప్ట్
రక్తికట్టించిన పీఎస్ఆర్, రాణా, గున్నీ
ఎఫ్ఐఆర్ నమోదైన గంటలోనే ముంబై ఫ్లైట్ ఎక్కిన గున్నీ
తాజాగా ఉన్నతాధికారి విచారణ
జనవరి 31న తాడేపల్లికి రావాలని ఫోన్ రావడంతో రాణాతో వెళ్లా
సినీనటిని అరెస్ట్ చేయాలన్నారు
ఏమీ ఆలోచించకుండా వెళ్లా: గున్నీ
కాదంబరి అక్రమ అరెస్ట్, వేధింపులు
జగన్ స్నేహితుడిని కాపాడేందుకే

రాజకీయ జోక్యం, ధన బలంతోనే వేధింపులు

ఏపీ పోలీసులు వ్యవహరించిన తీరు మానవ హక్కుల ఉల్లంఘనే 3
కేసు నుంచి బడా పారిశ్రామికవేత్తను కాపాడేందుకే నా కుటుంబంపై కేసు
విద్యాసాగర్ ఫిర్యాదు పూర్తిగా కట్టుకథ.. ఓ ఆంగ్ల చానల్ ఇంటర్వ్యూలో జెత్వానీ

మొన్న ఐటీ.. నేడు గ్రీన్ ఎనర్జీ!

టెక్నాలజీ మహాశక్తిమంతమైంది. దానిని వినియోగించుకుని ప్రజలకు చౌకగా విద్యుత్ సరఫరా చేయొచ్చు. సంప్రదాయ విధానాలను అవలంబిస్తూ.. పెరిగిన విద్యుదుత్పత్తి వ్యయ భారాన్ని వారిపై ఎందుకు రుద్దాలి?
- సీఎం చంద్రబాబు

హరిత ఇంధన విప్లవం మొదలైంది: చంద్రబాబు

క్లీన్ ఎనర్జీతో ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి
క్లీన్ ఎనర్జీ గ్లోబల్ వర్సిటీ స్థాపిస్తాం
2030 నాటికి 72.60 గిగావాట్ల పునరుత్పాదక ఇంధనం
ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ తెస్తాం
ప్రజలకు చౌకగా కరెంటు ఇవ్వొచ్చు
పునరుత్పాదక ఇంధన రంగంలో పెట్టుబడులకు అపార అవకాశాలు
నోడల్ ఏజెన్సీగా న్యూ అండ్ రెన్యువబుల్ ఎనర్జీ సంస్థ
కంపెనీలకు దీని ద్వారా సహకరిస్తాం
ప్రోత్సాహకాలు, రాయితీలిస్తాం
ప్రతి నలుగురు ఐటీ నిపుణుల్లో ఒకరు భారతీయుడు
ప్రతి నలుగురు భారత నిపుణుల్లో ఒకరు తెలుగోడు: సీఎం
గాంధీనగర్ సదస్సులో ప్రసంగం


గుజరాత్‌లోని గాంధీనగర్‌లో జరిగిన 'ఆర్ఈ ఇన్వెస్ట్-2024' సదస్సులో ప్రధాని మోదీతో సీఎం చంద్రబాబు కరచాలనం

అమరావతి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(ఐటీ)ని ప్రవేశ పెట్టినప్పుడు విప్లవాత్మక మార్పులు వచ్చాయని.. ఇప్పుడు గ్రీన్ ఎనర్జీతో విప్లవం మొదలైందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. సాంకేతికత మహాబలమైనదని.. దానితో చౌకగా విద్యుదుత్పత్తి సాధించవచ్చని తెలిపారు. గుజరాత్‌లోని గాంధీనగర్‌లో కేంద్ర పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో మూడ్రోజులు జరిగే నాలుగో 'ఆర్ఈ ఇన్వెస్ట్-2024' సదస్సు సోమవారం ప్రారంభమైంది. ప్రధాని మోదీ ముఖ్య అతిథిగా

మిగతా 11వ పేజీలో...

ద్వేషిస్తున్నా.. మౌనంగానే ఉన్నా

ఈ 100 రోజుల్లో విపక్షాలు నన్ను హేళన చేశాయి
పటేల్ గడ్డపై పుట్టిన బిడ్డగా అన్నీ భరించా: మోదీ
దేశంలో తొలి వందే మెట్రో రైలు ప్రారంభం 2
మోదీ పేరు స్ఫురించేలా 'నమో భారత్'గా మార్పు
ప్రారంభానికి కొన్ని గంటల ముందు మార్చిన రైల్వే
నాగపూర్-సికింద్రాబాద్, దుర్గ్-విశాఖ రూట్లలో
2 వందే భారత్ సహా 5 రైళ్లు ప్రారంభం

జానీ మాస్టర్‌పై లైంగిక దాడి కేసు



12
పెళ్లి పేరుతో మతం మారాలన్నాడు
సినిమాల్లో అవకాశాల్లేకుండా చేస్తున్నాడు
అసిస్టెంట్ కొరియోగ్రాఫర్ ఫిర్యాదు
జానీపై జనసేన సీరియస్ యాక్షన్
పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనొద్దని ఆదేశం
ఫిల్మ్‌చాంబర్ విచారణ షురూ


వరల్డ్ రికార్డ్స్ యూనియన్ ప్రతినిధి నుంచి ధ్రువపత్రం అందుకుంటున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, అధికారులు

గ్రామసభలు.. ప్రపంచ రికార్డు

గత నెల ఒకరోజు 13,326 గ్రామ పంచాయతీల్లో సభలు 12
వరల్డ్ రికార్డ్స్ యూనియన్ నుంచి ధ్రువపత్రం అందుకున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

పదిహేను వేల గతం మరిచావా జగన్?

2019లో అధికారంలోకి వచ్చాక ఏడు నెలలకు అమ్మఒడి అమలు
ఇప్పుడు 3 నెలలకే ఇవ్వలేదని గగ్గోలు
ఐదేళ్లలో నాలుగు సార్లే అమ్మఒడి జమ
ఒక ఏడాది ఇవ్వకుండా పక్కా ప్లాన్
ఇచ్చిన దాంట్లోనూ ఏటా అనేక కోతలు
కూటమి ప్రభుత్వంపై రెట్టింపు భారం
గతం మరిచి జగన్ వ్యంగ్య వ్యాఖ్యలు



"నీకు పదిహేను వేలు.. నీకు పదిహేను వేలు.. నీకు పదిహేను వేలు' అంటూ వ్యంగ్యంగా మాట్లాడుతున్న మాజీ సీఎం జగన్ గతం మర్చిపోయారా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. 2019లో అధికారంలోకి వచ్చాక తీరిగ్గా ఏడు నెలల తర్వాత 'అమ్మఒడి' పథకాన్ని అమలుచేసిన ఆయన.. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఏర్పడిన మూడు నెలలకే 'తల్లికి వందనం' పథకం అమలు కాలేదంటూ గగ్గోలు పెడుతున్నారు.

కుట్టుకూలి.. జగన్ కనికట్టు!

రూ.248 కోట్లకుగాను రూ.62 కోట్లే చెల్లింపు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)
కూటమి ప్రభుత్వం 'తల్లికి వందనం' పథకాన్ని అమలు చేయడం లేదంటూ వైసీపీ అధినేత, విపక్ష నాయకుడు వైఎస్ జగన్ యాగీ చేస్తున్నారు. ఇటీవల గుంటూరు జైలు వద్ద ఆయన మీడియాతో మాట్లాడుతూ.. "నీకు పదిహేను వేలు.. నీకు పదిహేను వేలు" అంటూ విచిత్రంగా ప్రవర్తించి.. కూటమి సర్కారుపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ప్రస్తుత మంత్రి నిమ్మల రామానాయుడు ఎన్నికల వేళ చేసిన ప్రచారంలోని కొన్ని మాటలను ఉదహరిస్తూ వాటికి హాస్యం జోడించి వ్యంగ్యంగా విమర్శలు చేశారు. అయితే, జగన్ అధికారంలోకి వచ్చినప్పుడు అమ్మఒడి పథకాన్ని వెంటనే అమలు చేయకుండా తాత్సారం చేశారు. కానీ, ఇప్పుడు మాత్రం ఆగమేఘాలపై అమలుచేసి తీరాలని కోరుతుండడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అప్పుడు అలా: 2019, మే 30న జగన్ సీఎంగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆ తర్వాత జూన్ 12న బడులు తెరుచుకున్నాయి. వాస్తవంగా బడులు తెరుచుకునే సమయంలో అమ్మఒడి విడుదల చేస్తే

మిగతా 11వ పేజీలో...

వేసవిలా భగభగ

గాలిలో తేమ శాతం తగ్గడంతో నిప్పుల కొలిమిలా వాతావరణం 12

ఎన్పీఎస్-వాత్సల్య పథకం రేపు ప్రారంభం

బాల్యం నుంచే పిల్లల పేరిట తల్లిదండ్రులు పెన్షన్ ఫండ్‌లో జమ చేసే చాన్స్
ఏడాదికి కనీసం రూ.1,000 2

ఫైలుపై బరువుంటేనే వేగంగా కదులుతుంది

ప్రభుత్వ ఆఫీసుల్లో అవినీతిపై నితిన్ గడ్కరీ

ఖాతాలో ఉన్న నగదు మొత్తాన్నీ..

ఫ్రీజ్ చేయొద్దు

'దొంగ సొమ్ము'ను మాత్రమే నిలిపివేయాలి
సైబర్ మోసాల్లో నగదు బదిలీలకు సంబంధించి మద్రాసు హైకోర్టు తీర్పు
అనేక మంది బాధితులకు ఊరట

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలకు సంబంధించి.. నేరగాళ్లు ఎవరి బ్యాంకు ఖాతాకైనా చిన్న మొత్తంలో నగదు పంపినా.. దర్యాప్తు అధికారులు అలాంటి ఖాతాలను ఫ్రీజ్ చేస్తున్నారు. అయితే.. అలా బ్యాంకు ఖాతాను మొత్తం ఫ్రీజ్ చేయడం సరికాదని మద్రాసు హైకోర్టు తాజాగా తీర్పునిచ్చింది. ఎంత నగదు బదిలీ అయిందో.. అంతే మొత్తాన్ని ఫ్రీజ్ చేయాలని

మిగతా 2వ పేజీలో...



11

పనికొచ్చే సంస్కరణలు కావాలి!

ఆస్తి భద్రం అనే భావన ప్రజలకు కలగాలి
కొనే స్థలం సరైనదో లేదో వారికి తెలియాలి
పూర్తి వివరాలు ఆన్‌లైన్‌లో లభ్యం కావాలి
కౌన్సెలింగ్ ద్వారానే బదిలీలు చేపట్టాలి
రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఇలాంటి వెసులుబాట్లతోనే ప్రజలకు నిజమైన ఊరట

రాష్ట్రం కంటే రోత పత్రికకే ఆదాయం మెండు

ఐదేళ్లలో జగన్ పెంచిన ఆదాయం 290 కోట్లు.. జగన్ పత్రికకు దోచిపెట్టింది 300 కోట్లకుపైనే
భారతీ సిమెంట్స్ టర్నోవర్ 2 వేల కోట్లకు పైనే.. రాష్ట్ర ఆదాయం పెరిగితేనే సర్కారు ఘనత
తలసరి ఆదాయమనేది ప్రజల కష్టం.. అది గత ప్రభుత్వ ఘనత అంటూ రోత రాతలు 11

ఫైలుపై బరువుంటేనే వేగంగా కదులుతుంది..

» మన వ్యవస్థలో కొందరు 'న్యూటన్ ఫాదర్స్' ఉన్నారు..

» ప్రభుత్వ ఆఫీసుల్లో అవినీతిపై కేంద్ర మంత్రి గడ్కరీ విమర్శ



పుణే, సెప్టెంబరు 16: ప్రభుత్వ వ్యవస్థలో అనుసరిస్తున్న అవినీతి విధానాలపై కేంద్ర రోడ్డు రవాణా మంత్రి నితిన్ గడ్కరీ విమర్శలు గుప్పించారు. ప్రభుత్వ ఆఫీసుల్లో ఫైలు కదలాలంటే దానిపై బరువు (డబ్బు) ఉండాల్సిందేనని.. అప్పుడే అది వేగంగా కదులుతుందని వ్యాఖ్యానించారు. పుణేలోని కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ పుణే టెక్నలాజికల్ యూనివర్సిటీ (సీఓఈపీటీయూ)లో పూర్వ విద్యార్థులు నిర్వహించిన 'ఇంజనీర్స్ డే' కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ప్రభుత్వ విభాగాల్లో పారదర్శకత, సమయానుకూల నిర్ణయాధికారం, పనుల అవశ్యకతపై మాట్లాడారు. హైవే ప్రాజెక్టులు, రోడ్డు ప్రమాదాలు, వాటిలో మరణాలను ఉదహరిస్తూ.. సమస్యలన్నింటికీ మూలకారణం తప్పుడు వివరాలతో కూడిన ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)లేనని అభిప్రాయపడ్డారు. రోడ్లపై గుంతలనూ పూడ్చాల్సిన అవసరముందని చెప్పారు. ఆదేశాలిస్తే తప్పా ఏ పని చేయని అధికారులున్నారన్నారు. అయితే జ్ఞానమున్న వారు కూడా చట్టం వెనకాల స్ఫూర్తిని అర్థం చేసుకోకుంటే ఏం లాభమని ప్రశ్నించారు. 'నేను ఈరోజు ఇలా మాట్లాడకూడదు. ఇతర పనుల్లో డబ్బు వచ్చే చోట మీరు (అధికారులు) వేగంగా పని చేస్తారు. లేకపోతే చేయరు.. మన వ్యవస్థలో కొందరు 'న్యూటన్ ఫాదర్స్' ఉన్నారు. ఫైలుపై బరువు (డబ్బు) ఉంటే తప్ప కదలనీయరు' అని అన్నారు. వర్సిటీ పూర్వ విద్యార్థుల్లో టెస్లా, జేపీ మోర్గాన్ వంటి బహుళజాతి సంస్థల్లో పనిచేస్తున్న వారితో పాటు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ విభాగాల్లోని ఉద్యోగులున్నారు. వారిలో పలువురికి సీఓఈపీ అభిమాన్ అవార్డు అందజేశారు.

పోలీస్‌స్టేషన్‌లో మందు పార్టీ... ఎస్ఐ సహా ముగ్గురు పోలీసుల అరెస్ట్

మద్య నిషేధం అమల్లో ఉన్న బిహార్‌లో ఘటన

సాసారామ్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మద్యనిషేధం అమల్లో ఉన్న బిహార్‌లో పోలీసులు ఏకంగా పోలీస్‌స్టేషన్‌లోనే మందు పార్టీ చేసుకున్నారు. కైమూర్ జిల్లా సాన్‌హాన్ పోలీస్ స్టేషన్‌లో సబ్ ఇన్‌స్పెక్టర్ రాజీవ్ రంజన్ మరో ఇద్దరు చౌకీదార్లు, ఓ స్థానికుడితో కలిసి మందు పార్టీ చేసుకుంటుండగా ఉన్నతాధికారులకు సమాచారం అందింది. పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్న దర్యాప్తు బృందానికి పీకలదాకా మద్యం తాగిన స్థితిలో పోలీసులు కనిపించారు. వెంటనే వారిని అరెస్ట్ చేసి జిల్లా ఎస్పీ లలిత్ మోహన్ శర్మకు సమాచారమిచ్చారు. ఆ వెంటనే ఆయన మద్యం తాగుతూ దొరికిపోయిన పోలీసులను సస్పెండ్ చేశారు. బిహార్‌లో 2016 ఏప్రిల్ నుంచి మద్య నిషేధం అమల్లో ఉంది.

లోకం తీరు



ఎట్టకేలకు మమతతో జూనియర్ డాక్టర్ల చర్చలు

» సీఎం నివాసంలో భేటీ..వీడియో తీయించిన ప్రభుత్వం

కోల్‌కతా, సెప్టెంబరు 16: సమ్మె చేస్తున్న జూనియర్ డాక్టర్లు ఎట్టకేలకు సోమవారం సాయంత్రం ముఖ్యమంత్రి మమతా బెనర్జీతో చర్చలు జరిపారు. రెండుసార్లు సచివాలయానికి వెళ్లి ఆమెతో భేటీ కాకుండా వెనక్కి వచ్చిన వైద్యులు మూడో సారి మాత్రం చర్చల్లో పాల్గొన్నారు. ఈ సారి కాళీఘాట్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో చర్చలు జరిగాయి. పోలీసు పైలట్ వాహనం ఎస్కార్టుగా రాగా 35 మంది జూనియర్ డాక్టర్లు సాయంత్రం 6.20 గంటల ప్రాంతంలో ముఖ్యమంత్రి నివాసానికి చేరుకున్నారు. నిజానికి సాయంత్రం 5 గంటలకు చర్చలు ప్రారంభించాల్సి ఉన్నా 7 గంటలకు మొదలయ్యాయి. రెండు గంటల పాటు అంటే రాత్రి 9గంటల వరకు సాగాయి. తొలిసారి గురువారం రాష్ట్ర సచివాలయంలోని మీటింగ్ హాలులో ముఖ్యమంత్రి గంటల తరబడి వేచి చూసినా జూనియర్ డాక్టర్లు వెళ్లలేదు. రెండోసారి శనివారం వెళ్లినా చర్చల ప్రత్యక్ష ప్రసారంపై ఏకాభిప్రాయం కుదరకపోవడంతో జరగలేదు. దాంతో రాష్ట్ర ప్రభుత్వం స్పందిస్తూ మొత్తంగా నాలుగుసార్లు చర్చలకు ఆహ్వానించినా జూనియర్ డాక్టర్లు సానుకూలంగా వ్యవహరించడం లేదని అభిప్రాయపడింది. చర్చలకు కాకపోయినా కనీసం టీ తాగడానికైనా తన ఇంటికి రావాలని కోరుతూ శనివారం మమతా బెనర్జీ సెల్‌ఫోన్ వీడియో విడుదల చేశారు. ఈ సారి మాత్రం జూనియర్ డాక్టర్లు తమ షరతులను లిఖితపూర్వకంగా ముందుగానే పంపించారు. మినిట్స్ రాయడానికి తమ సొంత స్టెనోగ్రాఫర్లను తీసుకెళ్లారు. మొత్తం చర్చలను ప్రభుత్వం వీడియో తీయించింది. దీక్షా శిబిరానికి వెళ్లి సహచరులతో మాట్లాడిన తరువాత చర్చలపై తమ అభిప్రాయాలను చెబుతామని జూనియర్ డాక్టర్లు తెలిపారు. మినిట్స్‌ను ఖరారు చేయడంపై ఇరు పక్షాలు సంప్రదింపులు జరుపుతున్నాయి. విశ్వసనీయ వర్గాల కథనం ప్రకారం... ప్రభుత్వ ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరచాలన్న డిమాండుపై ఏకాభిప్రాయం కుదిరినట్టు తెలిసింది. రోగులు ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా సమ్మె విరమించాలని మమతా బెనర్జీ వారిని కోరారు. జూనియర్ డాక్టర్లు మాత్రం చర్చలను ప్రత్యక్ష ప్రసారం చేయాలని పట్టుబట్టారు. ఆరోగ్యశాఖ కార్యదర్శి, ఇతర ఉన్నతాధికారులతో పాటు కోల్‌కతా పోలీసు కమిషనర్‌ను తొలగించాలని డిమాండు చేశారు.

రాహుల్‌గాంధీ నాలుక కోస్తే రూ. 11 లక్షలు ఇస్తా

» శివసేన షిండే వర్గం ఎమ్మెల్యే సంజయ్ గైక్వాడ్ వ్యాఖ్యలు

ముంబై, సెప్టెంబరు 16: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీపై మహారాష్ట్ర సీఎం షిండే వర్గానికి చెందిన శివసేన ఎమ్మెల్యే సంజయ్ గైక్వాడ్ వివాదస్పద వ్యాఖ్యలు చేశారు. రాహుల్ నాలుక కోసిన వారికి రూ. 11 లక్షలు ఇస్తానని బహిరంగంగా ప్రకటించారు. "ఇటీవల అమెరికా పర్యటనలో భాగంగా జరిగిన ఓ సమావేశంలో రిజర్వేషన్లను పూర్తిగా అంతం చేయాలని రాహుల్ వ్యాఖ్యానించారు. రిజర్వేషన్ల పట్ల ఆయనకున్న చిత్తశుద్ధికి ఆ వ్యాఖ్యలే నిదర్శనం. కాబట్టే ఆయన నాలుక కోసిన వారికి నజరానా ప్రకటిస్తున్నాన"ని తెలిపారు. ఎమ్మెల్యే వ్యాఖ్యలపై కాంగ్రెస్ శ్రేణులు తీవ్రంగా మండిపడ్డాయి. సంజయ్‌పై బూల్దానా ఠాణాలో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

15 లక్షలు బ్యాంక్ బ్యాలెన్స్ ఉంటేనే బ్రిటన్‌లో ఉన్నత విద్య

లండన్, సెప్టెంబరు 16: బ్రిటన్‌లో ఉన్నత విద్యను అభ్యసించదలిచిన విద్యార్థులకు యూకే సర్కారు షాకిచ్చింది.! ఇకపై బ్రిటన్‌కు వచ్చే విద్యార్థులు తమ వసతి, నిర్వహణకు గాను బ్యాంకుల్లో చూపించాల్సిన నిల్వల మొత్తాన్ని దాదాపు రూ.15లక్షలకు పెంచింది. ఇది జనవరి 2 నుంచి అమల్లోకి రానుంది. లండన్ నగరంలో చదువుకునే విద్యార్థులు వీసా దరఖాస్తు సమయంలో నెలకు 1,483 పౌండ్ల(సుమారు రూ.1.65 లక్షలు) చొప్పున 9 నెలలకు గాను బ్యాంకు నిల్వలను చూపించాల్సి ఉంటుంది. లండన్ నగరం వెలుపల చదివే వారికి ఆ మొత్తం నెలకు 1,136 పౌండ్లు(సుమారు రూ.1.26 లక్షలు)గా నిర్ణయించారు. వీసా దరఖాస్తు సమయంలో విద్యార్థులు 9 నెలలకు గాను బ్యాంకు నిల్వలను చూపించాల్సి ఉంటుందని ప్రభుత్వం పేర్కొంది. తొమ్మిది నెలల మొత్తం రూ.13 లక్షల నుంచి రూ.15 లక్షలుగా ఉంటుంది.

చైనాలో 'బెబింకా' తుఫాను బీభత్సం!

షాంఘై, సెప్టెంబరు 16: బెబింకా తుఫాను చైనాను బెంబేలెత్తిస్తోంది. సోమవారం ఉదయం భారీ టైఫూన్ (తుఫాను) గంటకు 151 కిలోమీటర్ల వేగంతో షాంఘైను తాకడంతో ఈ ఆర్థిక నగరం అతలాకుతలమైంది. శక్తివంతమైన తుఫాను ధాటికి భీకరమైన గాలులు, భారీ వర్షాలు నగరాన్ని వణికిస్తున్నాయి. దీంతో 2.5 కోట్ల జనాభా ఉన్న షాంఘై మహా నగరంలో జనజీవనం అస్తవ్యస్తమైంది. తీవ్రమైన వాతావరణ పరిస్థితుల కారణంగా ఇక్కడ రెడ్ అలర్ట్ ప్రకటించారు. 75 ఏళ్ల క్రితం (1949లో) గ్లోరియా టైఫూన్ తర్వాత షాంఘైను తాకిన అత్యంత బలమైన తుఫాను బెబింకానేనని చైనా వాతావరణ నిపుణులు తెలిపారు. షాంఘైలోని రెండు విమానాశ్రయాల్లో ఆదివారం సాయంత్రం నుంచి వందలాది విమానాలను రద్దు చేశారు. కొన్ని రైలు సర్వీసులను కూడా నిలిపివేశారు.

ద్వేషిస్తున్నా మౌనంగానే ఉన్నా!

» ఈ 100 రోజుల్లో విపక్షాలు నన్ను హేళన చేశాయి: మోదీ

» తొలి వందే మెట్రో రైలు ప్రారంభం

» నాగపూర్-సికింద్రాబాద్, దుర్గ్-విశాఖ రూట్లలో

» వందే భారత్ సహా 5 రైళ్లు కూడా



అహ్మదాబాద్ వందే మెట్రో రైలులో ప్రయాణిస్తున్న మోదీ



ఆగ్రా-వారాణసీ వందేభారత్ రైలును ప్రారంభిస్తున్న సమయంలో ప్లాట్‌ఫారం మీద నుంచి జారి పట్టాలపై పడ్డ బీజేపీ ఎమ్మెల్యే సరిత

గాంధీనగర్, అహ్మదాబాద్, సెప్టెంబరు 16: మనసునిండా ద్వేషం నింపుకొన్న కొందరు భారత్, గుజరాత్ ప్రతిష్ఠకు భంగం కలిగించే ఏ అవకాశాన్నీ వదిలిపెట్టడం లేదని ప్రధాని మోదీ విమర్శించారు. ఇలాంటి వ్యక్తులు దేశాన్ని చీల్చే ఎజెండాతో భారత సమగ్రత, ఐక్యతను లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల అమెరికా పర్యటనలో వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీని ఉద్దేశించే మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో సోమవారం దేశంలో మొట్టమొదటిసారిగా 'వందే మెట్రో రైలు'ను మోదీ ప్రారంభించారు. ఐదు వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్ల సహా రూ.8వేల కోట్ల విలువైన పలు ప్రాజెక్టులను కూడా వర్చువల్‌గా ప్రారంభించారు. ఇందులో దుర్గ్-విశాఖపట్నం, నాగపూర్-సికింద్రాబాద్ వందేభారత్ రైళ్లు ఉన్నాయి. అనంతరం మెట్రో రైల్లో మోదీ ప్రయాణించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో.. ఆ తర్వాత గాంధీనగర్‌లో ప్రపంచ పునరుత్పాదక ఇంధన పెట్టుబడిదారుల సదస్సులోనూ మోదీ ప్రసంగించారు. మూడోసారి ప్రధాని అయ్యాక తనను రకరకాల మాటలతో విపక్షాలు అవమానించాయని.. ద్వేషాన్ని వెళ్లగక్కాయని, ఎగతాళి చేశాయని, అయినా సర్దార్ పటేల్ గడ్డ మీద జన్మించిన బిడ్డగా ఆ అవమానాలన్నీ తాను భరించి మౌనంగా ఉన్నానన్నారు. మళ్లీ అధికారంలోకి వచ్చాక ఈ వందరోజుల్లో నిర్దేశించుకున్న ఎజెండాను వేగంగా పూర్తిచేశానని చెప్పారు. తన జీవితం ప్రజల కోసమేనన్నారు. "నేను కష్టపడితే ఆ కష్టం మీ కోసం.. నేను త్యాగం చేస్తే ఆ త్యాగమూ మీ కోసమే" అని వ్యాఖ్యానించారు. ఈ వంద రోజుల్లో తమ సర్కారు ప్రతి రంగంలో పురోగతికి ప్రయత్నించిందన్నారు. అయోధ్యతో పాటు మరో 16 నగరాలను 'మోడల్ సోలార్ సిటీస్'గా అభివృద్ధి చేసే పనిలో ఉన్నామన్నారు. గుజరాత్ వవోల్ ప్రాంతంలోని 'ఉచిత సౌర విద్యుత్తు' లబ్ధిదారులతో మోదీ మాట్లాడారు.

'నమో..' భారత్

నరేంద్ర మోదీ! ఈ పేరు పొడి అక్షరాల్లో రాస్తే నమో! మోదీ పేరు స్ఫురించే విధంగా ఓ రైలుకు పేరు పెట్టేసింది రైల్వేశాఖ. భుజ్-అహ్మదాబాద్ మధ్య ప్రారంభించిన రైలుకు తొలుత అనుకున్న పేరు 'వందే మెట్రో'! సోమవారం దీనిని ప్రారంభించే కొన్ని గంటల ముందు 'నమో భారత్ ర్యాపిడ్ రైలు' అని పేరు పెట్టింది. అహ్మదాబాద్ నుంచి ప్రధాని వర్చువల్‌గా జెండా ఊపడంతో భుజ్ రైల్వే స్టేషన్ నుంచి సోమవారం 4:15 గంటలకు అహ్మదాబాద్ దిశగా ఈ రైలు పరుగుతీసింది. 5:45 గంటల్లో 359 కి.మీ దూరం ప్రయాణిస్తుంది. 12 బోగీల్లో 1,150 సీట్లుంటాయి.

ఎన్‌పీఎస్-వాత్సల్య రేపు ప్రారంభం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 16: కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల బడ్జెట్‌లో ప్రకటించిన నేషన్ పెన్షన్ స్కీం(ఎన్‌పీఎస్)-వాత్సల్య పథకం సాకారం దాల్చనుంది. ఈ పథకాన్ని బుధవారం ఆమె ఢిల్లీలో ఆవిష్కరించనున్నారు. పిల్లలు పసివారుగా ఉన్నప్పుడే వారు పేరున తల్లిదండ్రులుగానీ, సంరక్షకులుగానీ ఎన్‌పీఎస్-వాత్సల్య ఖాతాలను ప్రారంభించవచ్చు. 18 ఏళ్ల నుండి వారు మేజర్లయిన తరువాత ఆ ఖాతాలు ఆటోమేటిక్‌గా రెగ్యులర్ ఎన్‌పీఎస్ ఖాతాలుగా మారిపోతాయి. పిల్లల్లో పొదుపు, ఆర్థిక బాధ్యతలపై అవగాహన కలిగించడం కూడా ఈ పథకం ఆశయాలు. భారత పౌరులతో పాటు ఎన్‌ఆర్‌ఐలు, ఓవర్సీస్ సిటిజెన్స్ కూడా తమ పిల్లల పేరున ఈ ఖాతాలను ప్రారంభించవచ్చు. ఏడాదికి కనీసం 1,000 జమ చేసుకునే సౌలభ్యం కూడా ఉంది. గరిష్ఠ పరిమితి అంటూ ఏమీ లేదు. ఈ పొదుపు ద్వారా తల్లిదండ్రులు పన్ను మినహాయింపు పొందవచ్చు. ప్రస్తుతం 80సీ కింద లభిస్తున్న రూ.1,50,000 మినహాయింపునకు ఇది అదనం. సెక్షన్ 80(సీసీడీ)(1బీ) కింద రూ.50,000 వరకు అదనంగా పన్ను మినహాయింపు లభిస్తుంది. 60 ఏళ్లు నిండిన తరువాత అప్పటి వరకు జమయిన సొమ్ములో 60 శాతాన్ని ఏకమొత్తంగా తీసుకోవచ్చు. ఖాతాదార్లు మైనర్లయినప్పటికీ వారికి పర్మినెంట్ రిటైర్‌మెంట్ అకౌంట్ నెంబర్ (ప్రాణ్)ను కేటాయిస్తారు.

ఉద్యోగులపై వ్యతిరేక ప్రకటనను ఉపసంహరించుకొన్న సెబీ

» సమస్యలను పరిష్కరిస్తామని హామీ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 16: బయటి శక్తుల ప్రోద్బలంతోనే నిరసనలు చేస్తున్నారంటూ రెండువారాల క్రితం తమ ఉద్యోగులకు వ్యతిరేకంగా విడుదల చేసిన ప్రకటనను సెబీ సోమవారం ఉపసంహరించుకొంది. ఉద్యోగుల సమస్యలను అంతర్గతంగానే పరిష్కరిస్తామని తెలిపింది. తద్వారా సంస్థ చైర్ పర్సన్ మాధవి బుచ్ తమను వేధిస్తున్నారన్న, సెబీలో పని వాతావరణం అధ్వాన్నంగా ఉందన్న ఉద్యోగుల ఆరోపణలను అంగీకరించినట్లైంది. "సెబీలో పని వాతావరణం అతి దారుణంగా ఉందని అందులో పనిచేసే 500 మంది గ్రేడ్ ఏ ఉద్యోగులు ఆగస్టు 6న ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. సెబీ సమావేశాల్లో అరవడం, తిట్టడం, వేధించడం, అవమానించడం సర్వసాధారణంగా మారాయి అని ఫిర్యాదులో పేర్కొన్నారు. సెబీలో నాయకత్వ స్థానాల్లో ఉన్నవారిపైనా అసంతృప్తి వ్యక్తం చేశారు" అని కొన్ని రోజుల క్రితం ఓ మీడియా కథనం వెల్లడించింది. ఈ నేపథ్యంలో సెబీ సెప్టెంబరు 4న తమ ఉద్యోగులపై పలు ఆరోపణలు చేస్తూ ప్రకటన విడుదల చేసింది. బయటి వ్యక్తులు తమ ఉద్యోగులను ప్రభావితం చేసి సెబీలో అంతర్గత విభేదాలు సృష్టిస్తున్నారని, సంస్థ ప్రతిష్ఠను దెబ్బతీయడానికి ప్రయత్నిస్తున్నారని అందులో పేర్కొంది. చైర్ పర్సన్ మాధవి రాజీనామా డిమాండ్ కూడా అందులో భాగమేనని ఆరోపించింది. అసలు ప్రభుత్వానికి ఫిర్యాదు చేసింది సంస్థ ఉద్యోగులు కాదని, ఆ ఫిర్యాదు సెబీ ఎంప్లాయీస్ అసోసియేషన్ పేరిట లేదని, గుర్తు తెలియని మెయిల్ నుంచి ఫిర్యాదు వెళ్లిందని తెలిపింది. సంస్థలో అస్థిరత సృష్టించడానికే ఎవరో అలా చేశారని పేర్కొంది. అయితే, ఈ ప్రకటనను వ్యతిరేకిస్తూ సెప్టెంబరు 5 నుంచి ఉద్యోగులు ఆందోళనలు నిర్వహిస్తున్నారు. ఉద్యోగులపై సెబీ అసత్య ఆరోపణలు చేస్తోందని మండిపడ్డారు. దీంతో, సెబీ తాజాగా ప్రకటనను ఉపసంహరించుకొంది.

పాతాళానికి తొక్కేస్తాం

జమ్మూకశ్మీరులో ఉగ్రవాదం మళ్లీ పైకి లేవలేదు: అమిత్ షా



గులాబ్‌గఢ్, సెప్టెంబరు 16: జమ్మూకశ్మీరులో ఉగ్రవాదాన్ని అథఃపాతాళానికి తొక్కేస్తామని, మళ్లీ అది పైకి లేవకుండా చేస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా చెప్పారు. ఇక ఆర్టికల్ 370 అనేది చరిత్ర అన్నారు. భారత రాజ్యాంగంలో ఎన్నడూ భాగం కాబోదని స్పష్టం చేశారు. జమ్మూకశ్మీరులోని కిష్త్వార్ జిల్లాలో జరిగిన ఎన్నికల ప్రచార సభలో సోమవారం అమిత్ షా మాట్లాడారు. బుధవారం అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఆయన సుడిగాలి పర్యటన చేస్తున్నారు. మూడు సభల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నేషనల్ కాన్ఫరెన్స్-కాంగ్రెస్ కూటమి జమ్మూకశ్మీరులో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేదన్నారు. 1990లో పేట్రేగిన ఉగ్రవాదం వల్ల ఎంతో మంది అమాయకుల ప్రాణాలు కోల్పోయారని, ఇకపై అలాంటి పరిస్థితి ఉత్పన్నం కానివ్వబోమని ప్రజలకు హామీ ఇచ్చారు. కశ్మీరు గడ్డపైకి మళ్లీ పైకి లేవనంత లోతుకు ఉగ్రవాదాన్ని పాతిపెడతామన్నారు. నేషనల్ కాన్ఫరెన్స్ కాంగ్రెస్ కూటమి అధికారంలోకి వస్తే జైళ్ల నుంచి ఉగ్రవాదులను విడుదల చేస్తామని హామీలు ఇస్తోందని అమిత్ షా విమర్శించారు. "అమ్మవారి గుడి ముందు నిల్చొని హామీ ఇస్తున్నా. ఇది మోదీ సర్కారు. భారత గడ్డపై ఉగ్రవాదాన్ని విస్తరించాలని చూసే ధైర్యం ఎవరికీ ఉండదు" అని స్పష్టం చేశారు. బీజేపీ ప్రభుత్వం జమ్మూకశ్మీరులో గ్రామ స్థాయిలో భద్రతా దళాలకు ఆధునిక ఆయుధాలను సమకూర్చి, భద్రతను పటిష్ఠం చేసిందని చెప్పారు. కాంగ్రెస్ కూటమి అధికారంలోకి వస్తే ఆర్టికల్ 370ని పునరుద్ధరిస్తామని చెబుతోందని.. దాన్ని పునరుద్ధరించడం అవసరమా? అని ప్రశ్నించారు. వాళ్లు అధికారంలోకి వస్తే ఉగ్రవాదులు మళ్లీ రెచ్చిపోతారని తెలిపారు. కానీ, ప్రజలు ఎవరూ భయపడొద్దని, ఆ కూటమి అధికారంలోకి రాదని చెప్పారు.

నేడే కేజ్రీవాల్ రాజీనామా!

ఢిల్లీ ఎల్జీతో సాయంత్రం 4.30కి భేటీ.. కొత్త సీఎంగా ఆతిశీకే అవకాశాలు అధికం

» కేజ్రీవాల్‌ను ఎదుర్కొనే సత్తా బీజేపీకి ఉంటే ముందస్తు ఎన్నికలకు సిద్ధపడుతుంది: ఆప్



న్యూఢిల్లీ, సెప్టెంబరు 16: ఢిల్లీ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేస్తానని ప్రకటించిన ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ మంగళవారం లెఫ్టినెంట్ గవర్నర్ (ఎల్జీ) వీకే సక్సేనాను కలవనున్నారు. ఈ మేరకు కేజ్రీవాల్ అపాయింట్‌మెంట్ కోరగా.. ఎల్జీ సాయంత్రం 4.30 గంటలకు సమయం ఇచ్చారు. ఎల్జీతో భేటీలో కేజ్రీవాల్ రాజీనామా సమర్పించే అవకాశం ఉందని అధికారవర్గాలు తెలిపాయి. అంతకుముందే, ఉదయం ఆప్ ఎమ్మెల్యేల భేటీ కేజ్రీవాల్ అధికారిక నివాసంలో జరగనుంది. కొత్త ముఖ్యమంత్రి ఎవరనేదానిపై దీంట్లో చర్చించనున్నట్లు ఆప్ వెల్లడించింది. తద్వారా, కేజ్రీవాల్ ఎల్జీని కలవటానికి ముందే కొత్త సీఎంపై స్పష్టత రానుంది. ఢిల్లీ మంత్రి, ఆప్ నేత సౌరభ్ భరద్వాజ్ సోమవారం విలేకర్లతో మాట్లాడుతూ, బంతి బీజేపీ కోర్టులో ఉందని, కేజ్రీవాల్‌ను ఎదుర్కొనే ధైర్యం ఉంటే ముందస్తు ఎన్నికలకు వాళ్లు సిద్ధమవుతారని అన్నారు. ఆదివారం పార్టీ కార్యకర్తలతో మాట్లాడుతూ, సీఎం పదవి నుంచి రెండు రోజుల్లో వైదొలగనున్నట్లు కేజ్రీవాల్ సంచలన ప్రకటన చేసిన విషయం తెలిసిందే. తనతోపాటు ఢిల్లీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా మీద అవినీతి ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో.. తాము పదవులకు రాజీనామా చేసి ప్రజల వద్దకు వెళ్తామని, 'మీరు అవినీతి పరులు కాదు.. సచ్చీలురు' అని వారు సర్టిఫికేట్ ఇచ్చిన తర్వాతే మళ్లీ తాము పదవులను చేపడతామని కేజ్రీవాల్ ప్రకటించారు. గడువు ప్రకారం ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరగాల్సి ఉంది. అయితే, ఈ ఏడాది నవంబరులోనే మహారాష్ట్ర ఎన్నికలతో కలిపి జరపాల్సిందిగా కేజ్రీవాల్ కేంద్రాన్ని డిమాండ్ చేశారు. కాగా, ఢిల్లీ కొత్త సీఎం ఎవరవుతారనేదానిపై పలు విశ్లేషణలు వెలువడుతున్నాయి. అగ్రస్థానంలో ఢిల్లీ విద్య, ప్రజాపనుల శాఖల మంత్రి ఆతిశీ ఉన్నారు. సిసోడియా అరెస్టు తర్వాత విద్యాశాఖ బాధ్యతలు చేపట్టిన ఆతిశీ ఢిల్లీలో స్కూళ్లను మెరుగుపరిచి వాటిలో ఉన్నత ప్రమాణాలు నెలకొల్పటానికి విశేష కృషి చేశారు. కేజ్రీవాల్, సిసోడియా జైలుకు వెళ్లటంతో.. మీడియా ఎదుట పార్టీ విధానాలను, నిర్ణయాలను వివరించే బాధ్యతలు తీసుకున్నారు. ప్రతిపక్ష బీజేపీ విమర్శలను గట్టిగా ఎదుర్కొన్నారు. ఆతిశీ తర్వాత.. మరో మంత్రి సౌరభ్ భరద్వాజ్, ఎంపీలు రాఘవ్ చద్దా, సంజయ్‌సింగ్, ఆప్ సీనియర్ నేత కైలాశ్ గెహ్లాట్ తదితరుల పేర్లు వినిపిస్తున్నాయి.

ఫ్రీజ్ చేయొద్దు!

(మొదటి పేజీ తరువాయి)

స్పష్టం చేసింది. ఈ కేసుకు.. హైదరాబాద్‌కు లింకు ఉండడం గమనార్హం..! క్రిప్టో ట్రేడింగ్ పేరుతో సైబర్ నేరగాళ్లు విసిరిన వలకు.. హైదరాబాద్‌కు చెందిన బాధితుడు చిక్కి.. సర్వం కోల్పోయాడు. అయితే.. సైబర్ నేరగాళ్లు తమిళనాడులోని తిరువల్లూర్‌కు చెందిన షఫియుల్లా అనే వ్యక్తి ఖాతాకు రూ.2.48 లక్షలను బదిలీ చేశారు. అతని బ్యాంకు ఖాతాలో అప్పటికే రూ.9.69 లక్షలుండగా.. పోలీసులు మొత్తం ఖాతాను ఫ్రీజ్ చేశారు. ఏడాది పాటు పోలీసులు, బ్యాంకర్ల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోవడంతో.. షఫియుల్లా హైకోర్టును ఆశ్రయించారు. రూ.2.48 లక్షలను మాత్రమే ఫ్రీజ్ చేసి, బ్యాంకు ఖాతాను పునరుద్ధరించాలని హైకోర్టు ఆదేశించడంతో సాంత్వన పొందాడు. హైదరాబాద్ నగరంలోనూ ఈ తరహా బ్యాంకు ఖాతాలు ఫ్రీజ్ అయిన బాధితులు ఉన్నారు. పెట్రోల్ బంకులు, టీకొట్టు, బడ్డీకొట్టు, పచారీకొట్టు.. ఇలా చిరు వ్యాపారులకు రూ.100 లోపు బదిలీ అయిన నగదుకు సైబర్ నేరాలతో సంబంధాలుంటే.. మొత్తంగా బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్ చేస్తున్నారు. ఇలా పదుల సంఖ్యలో ఖాతాలు ఫ్రీజ్ అయినట్లు తెలుస్తోంది. ఇప్పుడు ఇలాంటి బాధితులకు మద్రాసు హైకోర్టు తీర్పు ఉపశమనం ఇవ్వనుంది. మద్రాసు హైకోర్టు తీర్పు నేపథ్యంలో చట్టాల సవరణ జరగాల్సి ఉంటుందని సైబర్ నేరాల నిపుణుడు ప్రసాద్ పాటిబండ్ల అభిప్రాయపడ్డారు. అయితే.. సైబర్ నేరాలు జరిగినప్పుడు.. కేటుగాళ్లు నగదు బదిలీ చేసే బ్యాంకు ఖాతాలన్నీ ఆటోమ్యాటిక్‌గా ఫ్రీజ్ అయ్యేలా ప్రస్తుతం వ్యవస్థ కొనసాగుతుందని సైబర్ క్రైమ్స్ ఏసీపీ శివమారుతి తెలిపారు. మద్రాసు కోర్టు తీర్పు నేపథ్యంలో ఇప్పుడు ఈ ప్రక్రియను బ్యాంకర్లు మాన్యువల్‌గా చేయాల్సి ఉంటుందని, ఇది చాలా క్లిష్టమైన ప్రక్రియ అని పేర్కొన్నారు.

సేమ్ టు సేమ్ సీన్!

(మొదటి పేజీ తరువాయి)

మహిళా పోలీసు ఇలాగే సమాధానం చెబుతుంది. జెత్వానీ కేసులో ఆమెను అరెస్ట్ చేయడానికి అత్యుత్సాహం ప్రదర్శించిన ఐపీఎస్ అధికారి విశాల్ గున్నీ ఉన్నతాధికారులకు వివరణ ఇచ్చారు. వకీల్‌సాబ్ సినిమాలోని సన్నివేశాలకు, జెత్వానీ కేసుకు దగ్గర పోలికలున్నాయి. సినిమాలో ముగ్గురు అమ్మాయిలను పలుకుబడి కలిగిన రాజకీయ నేత కుమారుడు లైంగిక వేధింపులకు దిగితే ఒకామె ఎదురు తిరిగి బాటిల్‌తో దాడి చేస్తుంది. నిందితుడిపై బాధితురాలు ఫిర్యాదు చేస్తే పోలీసులు స్పందించరు. కానీ రాజకీయ నేత కుమారుడు కేసు పెట్టగానే బాధితురాలిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి హింసిస్తారు. 'సర్.. అంత పెద్ద సంఘటన జరిగింది కదా అని, ఏదైతే అదైందని జెట్ స్పీడ్‌తో వచ్చేశా సార్..' అని కోర్టులో పోలీసు అధికారిణి చెబుతుంది. '40కిలోమీటర్ల దూరం.. దారిలో ట్రాఫిక్, ఫ్లైఓవర్లు.. ఎవరికైనా గంటన్నర పడుతుంది. అల్వాల్‌లో ఉన్న ఫంక్షన్ హాల్ నుంచి మొయినాబాద్ స్టేషన్‌కు సిర్ఫ్ పంద్రా మినిట్‌లో వచ్చారా అమ్మా.. సూపర్ ఉమెన్' అని న్యాయవాది స్పందిస్తారు. జెత్వానీ కేసులో కూడా సేమ్ ఇలాగే జరిగింది. ముంబైలో ఓ పారిశ్రామికవేత్తపై ఆమె పెట్టిన లైంగిక వేధింపుల కేసులో పోలీసులు తగిన విధంగా స్పందించలేదు. అదే ఏపీలో ఆమెపై వైసీపీ నేత కుక్కల విద్యాసాగర్ ఫిర్యాదు చేస్తే 'విమానమంత' స్పీడ్‌తో స్పందించారు. పైగా ఇది పూర్తిగా సివిల్ కేసు. భూలావాదేవీలకి సంబంధించిన ఈ ఫిర్యాదుపై ఎలాంటి విచారణ చేయలేదు. ఆమె తప్పు చేసినట్టు ఆధారాలు లేకున్నా జెత్వానీపై కేసు పెట్టడానికి ముందే ముంబై నుంచి ఆమెను లాక్కురావడానికి విమాన టికెట్లు బుక్ చేసుకున్నారు. డీజీపీ అనుమతి తీసుకోకుండా, నిబంధనలకు పాతరేసి, 'పెద్దలు' ఆదేశాల మేరకు ఎఫ్ఐఆర్ నమోదైన గంటలోనే ముంబైకి వెళ్లి అరెస్ట్ చేసి విజయవాడ తీసుకొచ్చారు. ముంబైలో జెత్వానీ ఫిర్యాదు చేసిన పారిశ్రామికవేత్తను ఆ కేసు నుంచి కాపాడటానికి ఏపీలో ఆమెపై అక్రమ కేసు పెట్టించారు. వకీల్ సాబ్ సినిమాలోని సన్నివేశాలను.. జెత్వానీ కేసులో ఏపీ పోలీసులు చేసి చూపించారు. ఇదంతా వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు గత ఫిబ్రవరిలో జరిగింది. జెత్వానీ అరెస్టుకు తాడేపల్లిలోని సీఎంవోలోనే ప్లాన్ వేశారు. నాటి ఇంటెలిజెన్స్ చీఫ్ పీఎస్ఆర్ ఆంజనేయులు స్కెచ్ వేయగా, నాటి విజయవాడ సీపీ కాంతిరాణా, డీసీపీ విశాల్ గున్నీ అమలు చేశారు. ప్రభుత్వం మారి టీడీపీ కూటమి వచ్చాక జెత్వానీ ఫిర్యాదుతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. విమాన టికెట్ల బుకింగ్, ఉన్నతాధికారుల విచారణలో గున్నీ ఇచ్చిన వివరణతో ఐపీఎస్‌లు అడ్డంగా బుక్కయ్యారు.

ఇదీ జెత్వానీ కేసు

ప్రముఖ పారిశ్రామికవేత్త తనపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు గత ఏడాది డిసెంబరులో ముంబై నటి కాదంబరి జెత్వానీ బంద్రాకుర్లా పోలీసు కాంప్లెక్స్‌లో ఫిర్యాదు చేశారు. పలుకుబడి కలిగిన వ్యక్తి కావడంతో పోలీసులు కేసు నమోదు చేయలేదు. ఆమె ముంబై హైకోర్టుకు వెళ్లి ఆర్డర్ తీసుకురావడంతో కేసు నమోదు చేశారు. ఆ పారిశ్రామికవేత్త అప్పటి ఏపీ సీఎం జగన్‌కి స్నేహితుడు కావడంతో డిసెంబరు చివరివారంలో తాడేపల్లికి వచ్చి సహాయం కోరారు. జెత్వానీతో వైసీపీకి చెందిన కుక్కల విద్యాసాగర్‌కు పరిచయం ఉందని, ఏదో ఒకటి చేసి తనను బయట పడేయాలని కోరారు. అంతే.. వకీల్‌సాబ్ సినిమాలో రాజకీయ నాయకులు, పోలీసులు ఒక్కటైనట్లు తాడేపల్లి ప్యాలెస్‌లో ముఖ్య నేత ఆదేశాలు అమలు చేసేందుకు ముగ్గురు సీనియర్ ఐపీఎస్ అధికారులు పథక రచన చేశారు. కృష్ణా జిల్లాలోని తన భూమిని కాజేసేందుకు జెత్వానీ నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి కొండపల్లికి చెందిన ఇద్దరు వ్యక్తుల నుంచి ఐదు లక్షలు అడ్వా న్స్ తీసుకుందని ఇబ్రహీంపట్నం పోలీసులకు విద్యాసాగర్‌తో ఫిర్యాదు ఇప్పించారు. ఈ ఏడాది ఫిబ్రవరి 2న ఉదయం 6.30కి కేసు నమోదైతే.. ఏడున్నరకు అప్పటి డీసీపీ విశాల్ గున్నీ మరో ముగ్గురు పోలీసులు ముంబైకి వెళ్లారు. అక్కడ నడిరోడ్డుపై ఆమె కారును అడ్డగించి కుటుంబ సభ్యులతో పాటు విజయవాడకు తీసుకొచ్చేశారు. సినిమాలో యువతిని వేధించినట్లు హింసించి భయపెట్టారు. ముంబైలో కేసు మార్చి 14న మూసేసే వరకూ జైల్లో పెట్టారు. ఆ తర్వాత అన్నీ సర్దుకున్నాయని ఆమెను పంపించేశారు. ఎన్నికల్లో వైసీపీ చిత్తుగా ఓడిపోయి కూటమి ప్రభుత్వం వచ్చింది. వకీల్‌సాబ్ సినిమాలో లాయర్ పాత్రధారి పవన్ కల్యాణ్ రాష్ట్రానికి ఉప ముఖ్యమంత్రి అయ్యారు. హైదరాబాద్‌లో తనకు తెలిసిన సినిమా వాళ్లతో జెత్వానీ మాట్లాడాక, ఏపీ ప్రభుత్వం తనకు న్యాయం చేయాలని కోరారు. జెత్వానీ తన తల్లితో కలసి విజయవాడకు వచ్చి ఫిర్యాదు చేయడంతో కుట్రలన్నీ బయట పడ్డాయి.

విచారణాధికారి వర్సెస్ విశాల్ గున్నీ

అధికారి: ఈ కేసులో అంత అర్జంట్‌గా ముంబైకి విమానంలో వెళ్లాల్సిన అవసరం ఏమొచ్చింది?

విశాల్ గున్నీ: సర్.. అంత పెద్ద సార్ చెప్పడంతో ఏదీ ఆలోచించలేదు. ఎఫ్ఐఆర్ నమోదైన గంటలోనే గన్నవరంలో ముంబై ఫ్లైట్ ఎక్కా.

అధికారి: ఫిబ్రవరి 2న ఉదయం ఆరున్నరకు ఎఫ్ఐఆర్ అందితే ఏడున్నరకు ఫ్లైట్ ఎక్కారు సరే.. ముందు రోజే టికెట్లు ఎలా బుక్ చేసుకున్నారు?

గున్నీ: అదంతా నాకు తెలీదు సర్.. సీపీ సర్ వారి సీసీతో చేయించినట్లున్నారు.

అధికారి: సీసీ బుక్ చేస్తే.. పోలీసు కమిషనర్ అఫిషియల్ మనీ వాడాలి కదా.. అదేదీ తీసుకోలేదు?

గున్నీ: సర్.. నా టికెట్ డబ్బులు నేనే పెట్టుకున్నా.

అధికారి: టీఏ క్లెయిమ్ చేసుకోలేదు ఎందుకు?

గున్నీ: ఇందులో నాదేమీ లేదు. టికెట్ డబ్బులు వేరేగా వచ్చాయి..

అధికారి: రాష్ట్రం దాటి వెళ్లాలంటే పైఅధికారుల నుంచి పాస్‌పోర్టు తీసుకోవాలని మీకు తెలీదా?

గున్నీ: ఆ రోజు పెద్ద సార్ చెప్పడంతో ఏమీ ఆలోచించకుండా వెళ్లా అంతే..

అధికారి: సరే ఏమి జరిగిందో వివరంగా చెప్పండి?

గున్నీ: జనవరి 31న తాడేపల్లిలోని సీఎం క్యాంపు ఆఫీసుకు రమ్మని ఫోను వచ్చింది. నేను సీపీ(కాంతి రాణా) గారితో కలిసి వెళ్లా. అక్కడ ఇంటెలిజెన్స్ చీఫ్(పీఎస్ఆర్ ఆంజనేయులు) మా ఇద్దరితో మాట్లాడారు. ముంబైలో సినీనటి ఒకామె ఉందని, వైసీపీ నాయకుడు కుక్కల విద్యాసాగర్ భూమి కాజేసేందుకు నకిలీ పత్రాలు సృష్టించిందని, ఆమెను అరెస్టు చేసి తీసుకురావాలని చెప్పారు. ఎక్కడా విషయం బయటికి రాకుండా జాగ్రత్తగా తీసుకురావాలని, ఇది ప్రభుత్వ పెద్దలకు సంబంధించిన విషయమని చెప్పారు. అందుకే ఏసీపీ, సీఐ స్థాయి వారిని పంపాల్సిన పనికి నన్ను పంపడంతో వెళ్లా.

'మహిళా పోలీసుల్ని వెంట తీసుకెళ్లలేదు. తిరిగొచ్చాక కూడా టీఏ బిల్లు పెట్టలేదు. మీరు ఏది చెప్పాలనుకుంటారో అదంతా రాతపూర్వకంగా ఇవ్వండి' అని అధికారి అడగడంతో విశాల్ గున్నీ రాసిచ్చినట్లు తెలిసింది.

ఆ స్టేట్‌మెంట్ డీజీపీ ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి చేరడంతో ముగ్గురు ఐపీఎస్ అధికారులపై వేటు పడింది.

ఇంట్లో బాణసంచా విస్ఫోటం

ఇల్లు నేలమట్టం.. ఎగిరిపడ్డ ద్విచక్రవాహనాలు



కోనసీమ జిల్లా అమలాపురం శివారు రావులచెరువులో బాణసంచా విస్ఫోటంతో పూర్తిగా నేలమట్టమైన డాబా ఇల్లు

- 9 మందికి తీవ్ర గాయాలు.. ఇద్దరి పరిస్థితి విషమం
- మరో 8 మందికి స్వల్ప గాయాలు
- భారీ పేలుడు శబ్దంతో జనం బెంబేలు
- కోనసీమ జిల్లా అమలాపురంలో ఘటన
- కలెక్టర్, ఎస్పీ కార్యాలయాలకు కూతవేటు దూరంలోనే ఘటన



పేలుడు ధాటికి దూరంగా ఉన్న రామాలయం గోడను ఢీకొని పడ్డ ద్విచక్ర వాహనాలు

అమలాపురం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): పచ్చని కోనసీమలో భారీ విస్ఫోటం కలకలం సృష్టించింది. ఓ ఇంట్లో బాణసంచా తయారు చేస్తుండగా భారీ పేలుడు సంభవించి డాబా ఇల్లు పూర్తిగా నేలమట్టమైంది. 17 మంది గాయపడ్డారు. వీరిలో తొమ్మిది మందికి తీవ్ర గాయాలయ్యాయి. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. పక్కనున్న పలు నివాసాలు స్వల్పంగా దెబ్బతిన్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురం పట్టణ శివారు రావులచెరువులో సోమవారం ఈ ఘోరం జరిగింది. సుమారు కిలోమీటరు మేర పేలుడు శబ్దం వినిపించడంతో జనం బెంబేలెత్తిపోయారు. స్థానికుల కథనం మేరకు.. రావులచెరువు ప్రాంతానికి చెందిన గొవ్వాల నాగేశ్వరరావు (62)తన ఇంట్లోనే కొంత కాలంగా బాణసంచా తయారు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. నివాసాల మధ్యలో ఇదేంటని స్థానికులు పలు పర్యాయాలు వారించినా పట్టించుకోకుండా బాణసంచా వ్యాపారాన్ని కొనసాగిస్తున్నాడు. బేరం ఉండడంతో సరుకు నిల్వలు పెట్టుకున్న నాగేశ్వరరావు.. సోమవారం ఉదయం యథావిధిగా కుటుంబ సభ్యులతో కలిసి బాణసంచా తయారీ చేస్తున్నాడు. సరిగ్గా ఉదయం 9.45 గంటలకు భారీ విస్ఫోటం సంభవించింది. దీంతో నాగేశ్వరరావు డాబా ఇల్లు పూర్తిగా ఆనవాలు లేకుండా శిథిలమై నేలమట్టమైంది. చుట్టుపక్కల ఇళ్లల్లోని వారు ప్రాణభయంతో పరుగులు పెట్టారు. పక్కనే ఉన్న గొవ్వాల సుభద్రమ్మ ఇల్లు కూడా ధ్వంసమైంది. ఈ ప్రమాదంలో బాణసంచా తయారు చేస్తున్న నాగేశ్వరరావు, ఆయన భార్య నాగలక్ష్మి (55), అతడి కుమారుడు యల్లేష్ రాజు (25), కుమార్తె కట్టా వేణు (35), మనుమడు వెంకట్ తోపాటు, సమీప ఇళ్లకు చెందిన దూనబోయిన సుబ్బలక్ష్మి, చొల్లంగి మారుతీ సుబ్రహ్మణ్యం (25), దూనబోయిన సుబ్బలక్ష్మి (45), పితాని శాంతి (26), బొక్కా మోహనప్రియ(11)లకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో బాణసంచా తయారీదారు గొవ్వాల గేశ్వరరావు, ఆయన భార్య నాగలక్ష్మి పరిస్థితి విషమంగా ఉంది. క్షతగాత్రులందరినీ అమలాపురంలోని అమలాపురం కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన వచ్చి పరిస్థితిని సమీక్షించారు.

బాధితులకు మంత్రి, ఎమ్మెల్యే పరామర్శ



చికిత్స పొందుతున్న బాణసంచా తయారీదారు నాగేశ్వరరావు

కలెక్టర్, ఎస్పీ కార్యాలయాలకు కూతవేటు దూరంలోనే ఈ ఘటన జరగడం అధికారుల్లో వణుకు పుడుతోంది. అమలాపురం ఆర్డీవో జి.కేశవర్ధనరెడ్డి, డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్, సీఐ పి.వీరబాబు సంఘటనా స్థలాన్ని తమ అధీనంలోకి తీసుకుని పేలుడుకు దారితీసిన పరిస్థితులపై విచారణ ప్రారంభించారు. ఎస్పీ బి.కృష్ణారావు ఘటనాస్థలానికి చేరుకుని బాణసంచా విస్ఫోటనానికి దారితీసిన పరిస్థితులపై పోలీసు అధికారులతో మాట్లాడారు. ఇక్కడ బాణసంచా తయారీ ఎంత కాలం నుంచి జరుగుతోందని స్థానికులను అడిగి తెలుసుకున్నారు. కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఘటనా స్థలాన్ని సందర్శించి, వివరాలు ఆరా తీశారు. అనంతరం, ఆస్పత్రికి వెళ్లి బాధితులను పరామర్శించారు.

అన్నింటికీ మౌనమే జవాబు..!

- 30 ప్రశ్నలడిగితే రెండింటికే సమాధానం
- టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడికి ముందు సమావేశమై చర్చించామని చెప్పినట్టు సమాచారం
- మాజీ ఎంపీ నందిగం సురేశ్‌పై కొనసాగుతున్న విచారణ
- నేటి మధ్యాహ్నం ఒంటి గంటకు ముగియనున్న కస్టడీ

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 16: టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో బాపట్ల వైసీపీ మాజీ ఎంపీ నందిగం సురేశ్ విచారణకు సహకరించడం లేదు. విచారణలో భాగంగా రెండోరోజైన సోమవారం దాదాపు 30 ప్రశ్నలు అడిగితే.. ఆయన ఒకటి, రెండు ప్రశ్నలకే సమాధానం ఇచ్చినట్టు తెలిసింది. మంగళగిరి రూరల్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం కూడా పోలీసులు ఆయనను విచారించారు. కేసు దర్యాప్తు అధికారి, మంగళగిరి రూరల్ సీఐ వై.శ్రీనివాసరావు... మాజీ ఎంపీని సుమారు 25 నుంచి 30 ప్రశ్నలు అడిగారు. వాటిల్లో ఒకటి, రెండు ప్రశ్నలకు మాత్రమే సురేశ్ సమాధానమిచ్చినట్టు తెలిసింది. అయితే... టీడీపీ కార్యాలయంపై దాడికి ముందు తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో సమావేశమై చర్చించిన మాట వాస్తవమేనని ఆయన అంగీకరించినట్టు సమాచారం. మిగతా ఏ ప్రశ్నలకూ ఆయన నుంచి సరైన సమాధానాలు రాలేదని పోలీసులు తెలిపారు. కాగా, నందిగం సురేశ్ పోలీసు కస్టడీ మంగళవారం మధ్యాహ్నం ఒంటి గంటకు ముగియనుంది. అనంతరం తిరిగి ఆయన్ను గుంటూరు జిల్లా జైలుకు తరలిస్తారు.

త్వరలో రైల్వే జోన్‌కు భూమి పూజ

- ఉత్తరాంధ్రను ఆంధ్రకు ముఖద్వారం చేద్దాం: రామ్మోహన్ నాయుడు
- దుర్గ్‌కు వందే భారత్ రైలు ప్రారంభం



వందేభారత్ ప్రారంభం సందర్భంగా మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కె.రామ్మోహన్ నాయుడు

విశాఖపట్నం, పార్వతీపురం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం కేంద్రంగా ఏర్పాటు చేయనున్న కొత్త రైల్వే జోన్‌కు త్వరలోనే భూమి పూజ చేయనున్నామని కేంద్ర మంత్రి కె.రామ్మోహన్ నాయుడు ప్రకటించారు. విశాఖపట్నం నుంచి దుర్గ్‌కు కొత్తగా వేసిన వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలును సోమవారం మధ్యాహ్నం ఆయన ప్రారంభించారు. ఆనంతరం ఆయన రైలులో పార్వతీపురం(బెలగాం) వరకూ ప్రయాణించారు. ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు విశాఖలోనూ, పార్వతీపురంలోనూ మాట్లాడారు. 'దశాబ్దాల పోరాట ఫలితంగా రైల్వే జోన్ లభించింది. దీనికి అవసరమైన భూమిని గత ప్రభుత్వం ఇవ్వలేదు. ఇటీవలె మేం సమస్యలన్నీ పరిష్కరించి రైల్వే అధికారులకు అప్పగించాం. ఈ విషయాన్ని కేంద్ర మంత్రికి తెలియజేస్తాం. దసరా, దీపావళి మధ్య శుభఘడియల్లో జోన్‌కు భూమి పూజను అంతే సంబరంగా నిర్వహిస్తాం. అభివృద్ధిలో సత్తాచాటి ఉత్తరాంధ్రను ఆంధ్రప్రదేశ్‌కు ముఖద్వారంగా చేద్దాం. భోగాపురం ఎయిర్‌పోర్ట్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. జంఝావతి ప్రాజెక్టుకు సంబంధించి ఒడిశాతో ఉన్న సమస్యను పరిష్కరించి పూర్తిస్థాయిలో రైతులకు సాగు నీరు అందిస్తాం. పారిశ్రామికంగా అభివృద్ధి చేసి... ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోంది. ఉత్తరాంధ్రలో వలసల నివారణకు తగు చర్యలు తీసుకుంటున్నాం. పీఎం నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వంటి నాయకుల స్ఫూర్తితో ఏపీ అభివృద్ధికి సాయశక్తులా కృషి చేస్తున్నాం. విశాఖపట్నం నుంచి ఇచ్ఛాపురం వరకు ఉత్తరాంధ్రాల్లో రైల్వేస్టేషన్లన్నీ బ్రిటీష్ వారి కాలంలో నిర్మించారు. ఆ తరువాత వాటిని ఎవరూ పట్టించుకోలేదు. ఇప్పుడు నరేంద్ర మోదీ ప్రభుత్వం అన్నింటినీ ఆధునికీకరిస్తోంది. రైల్వే ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కూడా కృషి చేస్తాం. కార్యక్రమంలో విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్, నగర మేయర్ గొలగాని హరివెంకటకుమారి, రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు, ఎమ్మెల్యేలు పి.గణబాబు, పల్లా శ్రీనివాసరావు, విష్ణుకుమార్‌రాజు, తోయక జగదీశ్వరి, కలెక్టర్లు హరేంధిర్ ప్రసాద్, ఎ.శ్యామ్‌ప్రసాద్, ఎస్పీ మాధవరెడ్డి, డీ ఆర్ఎం సౌరబ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జగన్‌కు మానసిక రుగ్మత: మంత్రి సుభాష్

సర్పవరం జంక్షన్ (కాకినాడ), సెప్టెంబరు 16: మాజీ సీఎం జగన్ మానసిక రుగ్మతతో బాధపడుతున్నారని మంత్రి వాసంశెట్టి సుభాష్ విమర్శించారు. సోమవారం కాకినాడ జిల్లా వలసపాకలో మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణమూర్తి దంపతుల నివాసానికి వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. 'అధికారం చేజారడం, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో జగన్‌కు ఏం చేయాలో పాలుపోవడం లేదు. వరదల వంటి విపత్కర పరిస్థితుల్లో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే ఆయన తన పిచ్చి మాటలు, చేష్టలతో కూటమి ప్రభుత్వంపై వరద రాజకీయం చేస్తూ ప్రజల్లో అభాసుపాలవుతున్నారు. జగన్ మీడియాకు కూటమి ప్రభుత్వంపై విష ప్రచారం చేయడం, జగన్‌కి సొంత డబ్బా కొట్టడం తప్ప మరే పనీలేదు' అని మంత్రి సుభాష్ అన్నారు.

త్వరలో కొత్త రాజకీయ పార్టీ: హర్షకుమార్



గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 16: 'వర్గీకరణకు వ్యతిరేకంగా కలసి వచ్చే వ్యక్తులు, సంఘాలతో త్వరలోనే రాష్ట్రంలో సరికొత్త రాజకీయ పార్టీని స్థాపిస్తున్నాం' అని అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ ప్రకటించారు. ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ - క్రీమీలేయర్‌ను వ్యతిరేకిస్తూ గుంటూరులో సోమవారం సదస్సు జరిగింది. సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన హర్షకుమార్ మాట్లాడుతూ... 'రాష్ట్రంలో అధికార, ప్రతిపక్ష పార్టీలు వర్గీకరణకు అనుకూలంగా ఉండడంతో ఈ నిర్ణయం తీసుకున్నాం. త్వరలోనే విధి, విధానాలు, నాయకుడు ఎవరు? అనే విషయాలను ప్రకటిస్తాం. దేశం మొత్తం వర్గీకరణను వ్యతిరేకిస్తుంటే ఉమ్మడి ఏపీలో మాత్రం మాదిగలు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. ఓ వ్యక్తి సృష్టించిన ఉద్యమంతో ఉమ్మడి రాష్ట్రాలకు చెందిన మాదిగలు పోరాటంలోకి వెళ్తున్నారు. క్రీమీలేయర్‌ను పొందుపరిచిన కారణంగా ఉద్యోగస్తుల పిల్లలకు అన్యాయం జరుగుతుంది. ఈ విషయంలో కేంద్రం మరోసారి సమీక్షకు వెళ్లే అవకాశం ఉంది. జిల్లాల వారీగా వర్గీకరణ ఎలా చేపడతారో ప్రభుత్వమే సమాధానం చెప్పాలి' అని అన్నారు. మరో అతిథి తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ... 'సుప్రీం కోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా వర్గీకరణ చేపడతాం. జిల్లాల వారీగా వర్గీకరణ చేస్తామని చంద్రబాబు చెప్పడం అభినందనీయం. వర్గీకరణ కంటే ముందు ప్రభుత్వ కొలువుల కోసం పోరాడాలి. దీనిపై యువతను చైతన్య పరచాలి' అని అన్నారు. సమావేశంలో జడ్పీ మాజీ చైర్‌పర్సన్ కూచిపూడి విజయమ్మ, విశ్రాంత న్యాయమూర్తి దేవి ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ జోక్యం, మనీ పవర్‌తోనే.. నన్ను అక్రమంగా అరెస్ట్ చేశారు

- ఎన్డీటీవీ ఇంటర్వ్యూలో ముంబై నటి జెత్వానీ



న్యూఢిల్లీ, సెప్టెంబరు 16: లైంగిక వేధింపుల కేసు నుంచి ఓ బడా పారిశ్రామికవేత్తను కాపాడటానికి ముగ్గురు ఏపీ పోలీసు అధికారులు తనను, తన కుటుంబాన్ని అక్రమంగా అరెస్ట్ చేసి వేధించారని ముంబై నటి కాదంబరి జెత్వానీ మరోసారి ఆరోపించారు. ఏపీ పోలీసులు వ్యవహరించిన తీరు ముమ్మాటికీ మానవ హక్కుల ఉల్లంఘనే అని అన్నారు. తమను అరెస్ట్ చేసి తన సెల్‌ఫోన్, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను సీజ్ చేయడం చట్టవిరుద్ధమని విమర్శించారు. తాజాగా ఎన్డీటీవీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో... తనను అక్రమంగా కేసులో అరెస్ట్ చేయించడం వెనుక రాజకీయ జోక్యం, మనీ పవర్ ఉందని జెత్వానీ సంచలన ఆరోపణలు చేశారు. ముంబైలో గత డిసెంబరులో పారిశ్రామికవేత్తపై తాను ఫిర్యాదు చేసిన లైంగిక వేధింపుల కేసు విచారణకు తాను హాజరుకాకుండా ఉండేందుకే ఏపీ పోలీసులు తనను అక్రమంగా అరెస్ట్ చేశారని చెప్పారు. కోర్టులో కేసు విచారణకు మూడు రోజుల ముందు తనను పోలీసులు అరెస్ట్ చేశారని వివరించారు. ముంబైలో ఫిబ్రవరి 5-9 మధ్య కేసు విచారణ జరగాల్సి ఉందని, తనను హాజరు కాకుండా చేస్తే కేసు మూసివేస్తారనే ఉద్దేశంతో అక్రమ కేసులో తనను ఇరికించారని తెలిపారు. భూలావాదేవీ వ్యవహారానికి సంబంధించి తనపై వైసీపీ నేత కుక్కల విద్యాసాగర్ కేసు పెట్టారని, ఇది పూర్తిగా కట్టుకథ అని చెప్పారు. తాను కానీ, తన కుటుంబ సభ్యులు కానీ ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లలేదని, ఎలాంటి భూ లావాదేవీలతో తనకు సంబంధం లేదని స్పష్టం చేశారు. ముంబైలో కేసు నుంచి పారిశ్రామికవేత్తను రక్షించడానికి ఏపీలో తనపై అక్రమ కేసు బనాయించారని ఆరోపించారు. తనపై ఫిర్యాదు చేసిన కుక్కల విద్యాసాగర్‌పై 2015 నాటికి 18 లేదా అంతకంటే ఎక్కువ కేసులు ఉన్నాయని వివరించారు. తనపై కేసు పెట్టిన సమయంలో ఆంధ్రప్రదేశ్‌లో విద్యాసాగర్ ఉన్న పార్టీ (వైసీపీ) అధికారంలో ఉందని, రాజకీయ బలంతో ప్రభావితం చేశారని ఆరోపించారు. తనపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడం, అరెస్ట్ చేయడం అంతా నిబంధనలకు విరుద్ధంగా జరిగిందని జెత్వానీ అన్నారు. కాగా ఆమె ఆరోపించినట్టుగా ఏపీ పోలీసులు ఆమెను అరెస్ట్ చేశాక ముంబైలో పారిశ్రామికవేత్తపై కేసును మూసేశారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం పోయి టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక జెత్వానీ వ్యవహారం బయటపడింది. ఈ కేసులో సీనియర్ ఐపీఎస్ అధికారులు నాటి ఇంటెలిజెన్స్ చీఫ్ పీఎస్ఆర్ ఆంజనేయులు, విజయవాడ పోలీస్ కమిషనర్ కాంతి రాణా, డీసీపీ విశాల్ గున్నీని ప్రభుత్వం సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే.

ఆ ముగ్గురిని అరెస్టు చేయాలి

- ఏపీ పౌరహక్కుల సంఘం అధ్యక్షుడు ముప్పాళ్ల సుబ్బారావు

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తప్పు చేసిన పోలీసు అధికారులను సస్పెన్షన్‌తోనే సరిపెట్టకుండా అరెస్ట్ చేసి, విచారణ చేసి చట్టప్రకారం శిక్షించాలని ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం (ఏపీసీఎల్ఏ) రాష్ట్ర అధ్యక్షుడు ముప్పాళ్ల సుబ్బారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముంబై నటి కాదంబరి జెత్వానీపై అక్రమ కేసు నమోదు వ్యవహారంలో ముగ్గురు ఐపీఎస్ అధికారులు పీఎస్ఆర్, కాంతి రాణా, విశాల్ గున్నీలపై ప్రభుత్వం సస్పెన్షన్ వేటు వేయడంపై ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాజ్యాంగ హక్కులను కాలరాసి విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులకు ఇది కనువిప్పు వంటిదన్నారు. రాజకీయ నాయకులతో కలసి హక్కుల ఉల్లంఘనకు పాల్పడే అధికారులకు జెత్వానీ కేసు ఒక గుణపాఠమని హెచ్చరించారు. జెత్వానీ కేసులో డీజీ స్థాయి అధికారులను సైతం ఉపేక్షించకుండా, నిబంధనలకు లోబడి ముగ్గురు ఐపీఎస్ అధికారులపై కూటమి ప్రభుత్వం వేటు వేయడాన్ని రాష్ట్ర ప్రజలు, ప్రజా, పౌర సంఘాలు స్వాగతిస్తున్నాయని ముప్పాళ్ల అన్నారు. నిజాయతీ, అంకితభావం, నిబద్ధత కలిగిన ఐపీఎస్‌లను సైతం జగన్ తప్పుదోవ పట్టించగలడని ఈ ఘటనతో రుజువైందన్నారు.

ఐపీఎస్ ఆఫీసర్ల సస్పెన్షన్‌ను స్వాగతిస్తున్నాం

- ఏపీజీఈఏ అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 16: వైసీపీ ప్రభుత్వ దుర్మార్గానికి ముంబై నటి కాదంబరి జెత్వానీ కేసు ఒక ఉదాహరణ అని ఏపీజీఈఏ రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ అన్నారు. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఐపీఎస్ అధికారులను సస్పెండ్ చేయడాన్ని స్వాగతిస్తున్నట్టు తెలిపారు. రాజమహేంద్రవరంలో సోమవారం జరిగిన ఏపీజీఈఏ జిల్లా ఉద్యోగుల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం తమపై చాలా అక్రమ కేసులు పెట్టి వేధించిందన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులపై దాడిచేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలన్నారు.

మల్లన్న సేవలో హైకోర్టు న్యాయమూర్తి



స్వామివారి సేవలో ఏపీ హైకోర్టు జడ్జి జస్టిస్ వి.గోపాల కృష్ణారావు

శ్రీశైలం, సెప్టెంబరు 16: శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను సోమవారం ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.గోపాల కృష్ణారావు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. న్యాయమూర్తికి ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. బాంబే హైకోర్టు జడ్జి జస్టిస్ వినయ్ జోషి కూడా సోమవారం స్వామి, అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

కేజ్రీవాల్ చాణక్యం

ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టు బెయిల్ ఇవ్వడంలో ఆశ్చర్యపోవాల్సిందేమీ లేదు కానీ, తాను రాజీనామా చేయబోతున్నట్టుగా చేసిన ప్రకటన మాత్రం ఊహించనిది. ఆర్నెల్లుగా ఆ ఊసెత్తకుండా, తిహార్ జైలునుంచి బయటకు వచ్చిన తరువాత ఈ నిర్ణయాన్ని ప్రకటించడం చాలామందికి ఆశ్చర్యం కలిగించింది. ఎన్నికల నిమిత్తం స్వల్పకాలం బెయిల్ దక్కడం వినా, సుదీర్ఘకాలంగా ఆయన జైల్లోనే ఉన్నాడు. మనీష్ సిసోడియా సహా సుప్రీంకోర్టు ఇప్పటికే కొందరికి బెయిల్ మంజూరు చేస్తూ, ఊపావంటి కఠినమైన చట్టాలు మోపిన కేసుల్లో సైతం జైలు అనేది మినహాయింపు, బెయిల్ ఒక రూల్ అన్న సూత్రాన్ని పలుమార్లు ఉద్ఘాటించింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ పెట్టిన కేసులో కేజ్రీవాల్‌కు బెయిల్ వచ్చిన వెంటనే, దాదాపు రెండేళ్లుగా నిమ్మకు నీరెత్తినట్టు ఉన్న సీబీఐ అప్పుడు హడావుడిగా రంగంలోకి దిగిన వైనాన్ని సుప్రీంకోర్టు ఈ తీర్పు సందర్భంగా గుర్తుచేసింది. కేజ్రీవాల్‌ను జైల్లోనే ఉంచాలన్న ఉద్దేశం తప్ప ఇంకేమీ కనిపించడం లేదని వ్యాఖ్యానించింది.

ఇప్పటికైనా బెయిల్ వచ్చినందుకు సంతోషించి, చక్కగా రాజ్యపాలన చేసుకోవాల్సిన కేజ్రీవాల్ హఠాత్తుగా ఇలా రాజీనామాకు ఎందుకు సిద్ధపడ్డారన్నది ప్రశ్న. నైతికవిలువల అంశమే అయితే, ఆయన జైల్లో కాలూనిన క్షణాన్నే తన పదవికి రాజీనామా చేసివుండవచ్చు. ప్రజలు ఎన్నుకున్న తనకు జైలునుంచి ఏలే హక్కు ఉన్నదని ఆయనా, పార్టీ న్యాయస్థానాల్లోనూ, ప్రజాక్షేత్రంలోనూ వాదించారు. రాజీనామా చేయకుండా జైల్లో ఉన్న ఆయనకు ఎన్నికల ప్రచారం చేసుకొనే అవకాశం కూడా న్యాయస్థానాలద్వారా దక్కింది. బెయిల్‌మీద బయటకు వచ్చి లోక్‌సభ ఎన్నికల్లో ఉధృతంగా ప్రచారం చేసుకున్నప్పటికీ, ఢిల్లీ ప్రజలు జాలి పడిందీ లేదు, బ్రహ్మరథం పట్టిందీ లేదు. ఏడు లోక్‌సభ సీట్లనూ ఐదేళ్ళనాటి మెజారిటీలను అధిగమించి మరీ బీజేపీ తన్నుకుపోయింది. పంజాబ్‌లో సైతం కేజ్రీవాల్ జైలు ప్రభావం అంతగా లేదు. పదమూడు లోక్‌సభ స్థానాల్లో మూడుమాత్రమే ఆ పార్టీకి దక్కాయి. కేజ్రీవాల్‌కు ఈ లెక్కలేమీ తెలియనివి కావు. కానీ, కోర్టుల్లో న్యాయం, ప్రజాక్షేత్రంలో తీర్పు అంటూ ఓ ఎత్తుగడకు తెరదీశారు. తాను తెచ్చిన మద్యం విధానం సరైనదని, ఢిల్లీకి ఆర్థికంగా ఎంతో లబ్ధి చేకూర్చేదనీ, తన మెడకు చుట్టిన కేసులన్నీ రాజకీయ ప్రేరేపితమైనవని వాదిస్తున్నప్పుడు వాటి సంగతి న్యాయస్థానాల్లో తేల్చుకోవాలి, పరిశుద్ధుడై ప్రజలముందుకు రావాలి. ఢిల్లీవాసులు తన సచ్ఛీలతను, నైతికతను విశ్వసించడం లేదని ఆయనకు ఇప్పుడు ఎందుకు అనుమానం కలిగిందో మరి.

ఢిల్లీలో ఎన్నికలు ఎలాగూ మరో ఐదునెలల్లో జరగాల్సి ఉన్న తరుణంలో కేజ్రీవాల్ ఎత్తుగడ ఆయనకు ఏ మేరకు లాభిస్తుందో చూడాలి. సుప్రీంకోర్టు విధించిన కఠినమైన బెయిల్ నిబంధనలు కూడా ఆయనకు అడుగడుగునా అడ్డుపడుతున్న తరుణంలో ఎన్నికలు ముందుకు జరగాలని ఆయన కోరుతున్నారు. ఆయన కోరికమేరకు ఇంతస్వల్పవ్యవధిలో, మరో రెండురాష్ట్రాలతో కలిపి ఢిల్లీలో ఎన్నికలు జరగడం అసాధ్యం. కానీ, ఫిబ్రవరివరకూ తన స్థానంలో మరొకరిని కూచోబెట్టి, పరోక్షంగా తానే రాజ్యాన్ని ఏలుతూ, బీజేపీ కక్షరాజకీయాలకు తాను బలైపోయానని, ప్రజలు గట్టిగా తనపక్షాన నిలిస్తే కానీ, తాను మళ్ళీ గద్దెనెక్కననీ ఆయన చెప్పుకోబోతున్నారు. తననూ, పార్టీలోని కీలకమైన నాయకులందరినీ అవినీతి ఆరోపణలు చుట్టుముట్టిన నేపథ్యంలో, ఈ రాజీనామా ద్వారా ప్రజలు తనను అగ్నిప్రవేశం చేసినట్టుగా భావిస్తారన్నది ఆయన ఆలోచన కావచ్చు. ఈ మూడునెలలూ ముఖ్యమంత్రి కుర్చీలోనే కూర్చొని, అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో పాల్గొనేకంటే, వేరొకరిని ఆ సీట్లో తాత్కాలికంగా కూచోబెట్టి, తాను ఒక కొత్త ముఖంతో, మళ్ళీ సరికొత్త సీఎం అభ్యర్థిగా ప్రజలముందుకు వెళ్ళడం వల్ల అధిక రాజకీయ ప్రయోజనం ఉంటుందని ఆయన నమ్మకం. సీఎం కార్యాలయం, సచివాలయం ఇత్యాది చోట్లకు వెళ్ళకూడదనీ, గవర్నర్‌కు పంపాల్సిన ఫైళ్ళమీదే సంతకాలు చేయాలని అంటూ సుప్రీంకోర్టు సవాలక్ష బెయిల్ నిబంధనలు విధించిన నేపథ్యంలో, ఈయన సీఎంగా కొనసాగితే రాష్ట్రపతిపాలన విధించాలన్న వాదన కూడా మరింత హెచ్చే ప్రమాదం ఉన్నది. ఇప్పుడు తాను తప్పుకొని, కొత్త వ్యక్తిని అక్కడ కూచోబెట్టి, ఎన్నికలు ముందుగా నిర్వహించాలన్న డిమాండ్ తెచ్చి, కేజ్రీవాల్ రాజకీయచదరంగంలో అతి వేగంగా ఎన్నో ఎత్తులు వేశారు. దశాబ్దంన్నర క్రితం అవినీతి వ్యతిరేక పోరాట యోధుడుగా తాము చూసిన కేజ్రీవాల్ ఇప్పటికీ అంతే పవిత్రంగా ఉన్నాడని ప్రజలు నమ్ముతున్నదీ లేనిదీ ఎన్నికల అగ్నిపరీక్షలో తేలుతుంది.

చుక్కల భూములకు మోక్షం కలిగిస్తారా?

చుక్కల భూముల విషయమై 2010 నుంచి రెవెన్యూ శాఖ అధికారులు భూయజమానులకు/ రైతులకు చుక్కలనే చూపిస్తున్నారు. బ్రిటీషువారు 1890–1920 మధ్య కాలంలో భూములను సర్వే చేసి భూరికార్డులను పక్కాగా తయారుచేశారు. అలా సర్వే చేసిన గ్రామాలను ప్రజల పరిభాషలో గవర్నమెంట్ గ్రామాలుగా పిలుస్తారు. ఒక గ్రామంలోని మొత్తం భూమిని సర్వే నెంబర్ వారీగా రికార్డు తయారు చేసి అందులో వివరాలు నమోదు చేస్తారు. దాన్ని 'ఏ' రిజిస్టర్/ రీ సర్వే రిజిస్టర్/ డైగ్లోట్ అని పిలుస్తారు.

సాధారణంగా ఈ రిజిస్టర్ 11 నుంచి 13 లేదా 14 కాలంలతో తయారవుతుంది. 1వ కాలంలో సర్వే నంబర్, 3వ కాలంలో G అంటే గవర్నమెంట్ అని లేదా ఈనాం (I) అని రాస్తారు. 4వ కాలంలో నంజ (wet. W)/ పుంజ (D dry)/ పోరంబోకు (P) అని రాశారు. నంజ అంటే పల్లం అని, పుంజ అంటే మెట్ట భూమి అని అర్థం. సాధారణంగా సర్వే నాటికి ఎవరి స్వాధీనంలో/సాగులో ఉంటే ఆ భూమికి వారే యజమానిగా గుర్తించి, వారి పేరు 10వ కాలంలో రాస్తారు. అంటే ఆ భూమికి పూర్తి హక్కుదారుగా గుర్తింపు. అలా రాసిన ఆ యజమాని పేరుతో సెటిల్‌మెంటు పట్టా ఇస్తారు. తరువాత ఆ భూమి వారి వారసులకు చెందుతుంది. ఒకవేళ వారు ఎవరికైనా అమ్మితే, అప్పుడు దస్తావేజు పుడుతుంది. 3వ కాలంలో G అని 4వ కాలంలో P అని ఉంటే దాన్ని GP, గవర్నమెంట్ పోరంబోకు అని పిలుస్తారు. ఇవి రోడ్లు(బండి బాటలు) కాలువలు, చెరువులు, శ్మశానాలు వంటి గవర్నమెంట్ పోరంబోకు భూములన్న మాట. వాటి వివరాలు చివరి 11వ కాలంలో ఆ సర్వే నెంబర్ ఎదురుగా రాస్తారు. ఈ విధంగా సర్వే చేసినప్పుడు కొన్ని భూములకు (సర్వే నెంబర్లకు) విస్తీర్ణం నమోదు చేసి, యజమాని కాలంలో యజమాని (హక్కుదారు) పేరు రాయకుండా చుక్కలు పెట్టి వదిలేశారు. వాటినే చుక్కల భూములుగా పిలుస్తారు.

కానీ ఆ భూములకు శిస్తు నిర్ధారించి కాలం 9లో రాశారు. కాలం 3, 4ల్లో G, Dగా రాశారు. బహుశా సర్వే జరిపినపుడు ఆ సర్వే నెంబర్‌లో వాస్తవ భూ యజమానిని సర్వే అధికారులు గుర్తించలేక చుక్కలు పెట్టి ఉంటారు. ఆ భూమిలో ఇద్దరు ముగ్గురు సాగుదార్లు ఉన్నప్పుడు... వారి మధ్య తగాదాలు ఉన్నప్పుడు సర్వే అధికారులు వాస్తవ యజమానిని గుర్తించలేక చుక్కలు పెట్టి వదిలేశారు. అలాగే అప్పట్లో కరవు కాటకాలు ఎక్కువగా ఉండేవి. పంట పండకపోయినా అప్పులు చేసి పన్నులు కట్టాల్సి వచ్చేది. అదే పెద్ద భారంగా ఉండేది. ఆ భారాన్ని తప్పించుకోవడానికి భూములు తన స్వాధీనంలో ఉన్నా సర్వే జరిగినపుడు అధికారులకు పేర్లు చెప్పకపోయి ఉండవచ్చు. అలాంటి పరిస్థితుల్లో యజమాని కాలంలో సాగు చేసుకుంటున్న వారి పేరు రాయకుండా చుక్కలు పెట్టి వదిలేశారు. కాలక్రమేణా ఆ భూములను సాగు చేసుకుంటూ వారి అవసరాలకు ఇతరులకు అమ్మేశారు. కొన్ని భూముల్లో వారి వారసులే సాగు చేసుకుంటున్నారు.



> టీడీపీ, వైసీపీ ప్రభుత్వాలు చట్టాలు చేసిన ఫారం–2 జారీ నత్తనడకన నడుస్తోంది. దేవుడు వరమిచ్చినా పూజారి వరమివ్వని చందంగా జిల్లా కలెక్టర్లు శ్రద్ధతీసుకోక, తహసీల్దార్లు చుక్కల భూములకు మరిన్ని చిక్కులు పెడుతున్నారు. అంతిమంగా చుక్కల భూముల యజమానులకు పూర్తిస్థాయిలో న్యాయం జరగడంలేదు. ప్రభుత్వ పెద్దలు కాలం వెళ్లబుచ్చకుండా తహశీల్దార్ల వద్ద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులన్నింటినీ ఒక ప్రణాళికతో వంద రోజుల్లో నూరుశాతం సమస్యలను పరిష్కరించాలి.

2010 తర్వాత కొంత మంది రెవెన్యూ అధికారులు ఏదో ఒక జిల్లాలో చుక్కల భూములను ప్రభుత్వ భూములుగా భావించి, అనాదిగా అమ్మకాలు, కొనుగోళ్లు జరుగుతున్న భూములకు రిజిస్ట్రేషన్లు నిలిపివేశారు. నెమ్మదిగా ఈ జాడ్యం అన్ని జిల్లాలకూ పాకింది. ముఖ్యంగా కడప, కర్నూలు, నెల్లూరు, చిత్తూరు, అనంతపురం జిల్లాల్లో చుక్కల భూములు ఎక్కువగా ఉన్నాయి. భూములు సర్వే చేస్తున్నపుడు సాగుకు పనికి వచ్చి, భూమి ఎవరి స్వాధీనంలో లేనపుడు వాటిని శిస్తుకట్టని/ కట్టిన గయాల్లుగా పేర్కొన్నారు. అంటే ఇది పూర్తిగా ప్రభుత్వానికి చెందిన భూమి అవుతుంది. కాలక్రమేణా ఆ భూములకే వ్యవసాయం చేసుకునేందుకు పేదవారికి 'డి' పట్టాలుగా కేటాయించేవారు. ఆ భూములను వంశపారంపర్యంగా సాగు చేసుకోవాల్సిందే కానీ అమ్మడానికి వీలు లేదు. దీని కోసం 1977లో లావాదేవీలు నిషేధిస్తూ ఒక చట్టం(9/77) తీసుకువచ్చారు. అలాగే మాజీ సైనికులకు, స్వాతంత్ర్య సమరయోధులకు ఇచ్చిన డి పట్టా భూములు 10 సంవత్సరాల తరువాత ఎవరికైనా అమ్ముకోవచ్చని ప్రభుత్వం 1990వ దశకంలో ఉత్తర్వులు ఇచ్చింది. 2023లో జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం గతంలో వ్యవసాయం కోసం ఇచ్చిన సాధారణ డి పట్టా భూములు కూడా 20 సంవత్సరాల తరువాత అమ్ముకోవచ్చని చట్టాన్ని తీసుకొని వచ్చింది. రెవెన్యూ అధికారులు చుక్కల భూములు సాగు చేస్తున్న కొంతమందికి కూడా మామూలుగానే డి పట్టాలు ఇచ్చారు. తాతల నాటి నుంచి చుక్కల భూములు సాగు చేసుకుంటున్న వాళ్ళు ఏదో ఒక హక్కు పత్రం పుడుతుంది కదా అని ఆ చుక్కల భూములకు డి పట్టాలు తీసుకున్నారు.

2015 తర్వాత ఈ చుక్కల భూములను రిజిస్ట్రేషన్ చట్టం 22–ఎ కింద నిషేధిత జాబితాలో పెట్టి, ఆ భూములకు రిజిస్ట్రేషన్లు ఆపివేయడం వల్ల భూ యజమానులు చాలా ఇబ్బందులకు లోనయ్యారు. దీంతో సమస్యను గుర్తించిన తెలుగుదేశం ప్రభుత్వం 2017లో చుక్కల భూముల విషయంలో ఒక చట్టం తీసుకునివచ్చింది. 2017కు ముందు 12 సంవత్సరాలకు పైబడి భూమిపై హక్కులున్న వారికి యాజమాన్య హక్కులు కల్పిస్తూ... ఫారం–2 సర్టిఫికెట్లు ఇమ్మని ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ఆ ఆదేశాలు రిజిస్టర్ దస్తావేజులు ఉన్న వారికి లేదా రెవెన్యూ రికార్డుల్లో ఆక్రమణదారులుగా నమోదైన వారిని హక్కుదారులుగా గుర్తించి చుక్కల భూములను వారి పేర్లపై ఆన్‌లైన్‌లో నమోదు చేసి ఫారం–2 జారీ చేసి, పట్టాదారు పాసు పుస్తకాలు ఇవ్వాలనేది ప్రభుత్వ ఉత్తర్వుల ఉద్దేశం. జగన్ ప్రభుత్వం 2023లో ఆ చట్టానికి ఒక సవరణ తెచ్చింది. దాని ప్రకారం చుక్కలు ఉండి అనాధీనం అని రాసి ఉన్నా చుక్కల భూములుగానే భావించమని సవరణ చట్టం చేశారు. రెండు ప్రభుత్వాలు చట్టాలు చేసిన ఫారం–2 జారీ నత్తనడక నడుస్తోంది. దేవుడు వరమిచ్చినా పూజారి వరమివ్వని చందంగా జిల్లా కలెక్టర్లు శ్రద్ధ తీసుకోక, తహసీల్దార్లు చుక్కల భూములకు మరిన్ని చిక్కులు పెడుతున్నారు. అంతిమంగా చుక్కల భూముల యజమానులకు పూర్తిస్థాయిలో న్యాయం జరగడంలేదు.

ఇటీవల చిత్తూరు జిల్లాలో జరిగిన అక్రమ భూ లావాదేవీలపై రెవెన్యూ వారి లీలలు గురించి పత్రికల్లో సంచలన కథనాలు వస్తున్నాయి. అందులో చిత్తూరు జిల్లాలో రాష్ట్రంలోనే అత్యధికంగా 26,465 ఎకరాల చుక్కల భూములను 22–ఎ నుండి తొలగించారన్నది ఆ వార్తల సారాంశం. ఆ తొలగింపు వెనక మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, అయన మనుషులు ఉన్నారన్నది ఆరోపణ. పేదవారు అయిన రైతులు చుక్కల భూముల విషయమై, రెవెన్యూ అధికారుల చుట్టూ తిరిగి వేసారి, అయినకాడికి రాజకీయ నాయకులకు, వారి అనుచర దళారీలకు అమ్ముకోవడానికి కారకులు రెవెన్యూ అధికారులే. వారు న్యాయంగా చెయ్యాల్సిన పనులు చేయకుండా పదే పదే కార్యాలయాల చుట్టూ తిప్పుకోవడం వల్లే పేద రైతులు భయంతో ఆ భూములను తక్కువ ధరలకు అమ్ముకునే పరిస్థితి ఏర్పడింది. వాటిని తక్కువ ధరకు కొని ఒప్పందం చేసుకొని, ఆ తరువాత రెవెన్యూ అధికారులను లోబర్చుకొని, వాటిని 22–ఎ నుండి తొలగింపజేసి, రిజిస్ట్రేషన్ చేయించుకుని మరలా వేరేవారికి ఎక్కువ ధరకు అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. ఈ పాపంలో వీఆర్వో నుంచి మంత్రి వరకు అందరూ బాధ్యులే. చుక్కల భూములపై ఎన్ని వార్తలు వచ్చినా అవి కచ్చితంగా ప్రైవేటు భూములే.

చుక్కల భూములకు సంబంధించి ఇప్పటికీ ఇంకా వేలాది కేసులు/ దరఖాస్తులు పెండింగులో ఉన్నాయి. వారసత్వంగా లేదా చాలా సంవత్సరాలుగా సాగుచేసుకున్నవారి పేర్లు ఏవైనా కారణాల వల్ల రెవెన్యూ రికార్డుల్లో(అడంగల్‌లో) నమోదు కాకపోయినా సరిహద్దు రైతులు/ గ్రామస్తుల సాక్ష్యాలను రికార్డ్ చేసి వారి పేర్లను కూడా యాజమానులుగా నమోదు చేసి ఆన్‌లైన్ అడంగల్‌లో చేర్చాలి. ఒకవేళ చుక్కల భూముల్లో అప్పటికే ప్రజోపయోగ నిమిత్తం కాలువలు తవ్వినా లేదా భవనాలు కట్టినా అలాంటి వాటిని మినహాయించి, మిగిలిన భూములకు కాలయాపన చేయకుండా వెంటనే పట్టాదారు పాసు పుస్తకాలు జారీ చేయాలి. తెలియక హక్కు వస్తుంది కదా అని డి పట్టాలు పొందిన చుక్కల భూములకు కూడా ఫారం–2 జారీ చేయాలి. ఫారం–2 జారీ చేసిన భూములను తక్షణమే 22–ఎ నుంచి తొలగించాలి.

ప్రభుత్వ పెద్దలు టీవీ కెమెరాల ముందు ప్రకటనలతో కాలం వెళ్లబుచ్చకుండా తహశీల్దార్ల వద్ద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులన్నింటినీ ఒక ప్రణాళికతో వంద రోజుల్లో నూరు శాతం సమస్యలను పరిష్కరించాలి. కోర్టు కేసుల్లో ఉన్న వాటిని మినహాయించి జిల్లా కలెక్టర్ల నుంచి చుక్కల భూములన్నింటినీ పరిష్కరించామన్న ధ్రువపత్రాలను రెవెన్యూ శాఖ మంత్రి తీసుకోవాలి. అప్పుడే చుక్కల భూముల సమస్యకు శాశ్వతంగా చుక్క (ఫుల్‌స్టాప్) పెట్టినట్టవుతుంది.

■ మారిశెట్టి జితేంద్ర
విశ్రాంత స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్

నదులూ నీళ్లపై అవగాహన లేని జగన్

విజయవాడ ముంపు గురించి వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి చేసిన ఆరోపణలను పరిశీలిస్తే ఆయనకు నదులూ నీళ్ల గురించి "అ.. ఆ.."లు కూడా తెలియవని, లేదా ఎవరైనా ఫీడ్ బ్యాక్ ఇస్తే దాన్ని వల్లెవేసి అభాసుపాలు అయ్యారని భావించాలి. లేకుంటే బుడమేరుపై వెలగలేరు వద్ద వున్న రెగ్యులేటర్ గేట్లు ఎత్తడానికి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నివాసమున్న భవనానికి ముడి పెట్టేవారు కాదు. తన నిర్లక్ష్యంతో ధ్వంసమైన పోలవరం నెపం గత టీడీపీ ప్రభుత్వంపై నెట్టివేసేందుకు చేసిన విఫలయత్నం చందంగా... బుడమేరు ముంపు కూడా 80 రోజుల క్రితమే అధికారం చేపట్టిన చంద్రబాబు నాయుడు ప్రభుత్వంపై నెట్టేందుకు చేసిన దురుద్దేశంగా భావించాలి.

అడవులను నరికివేస్తే అటవీ క్రూర జంతుజాలం జనావాసాల్లోకి వచ్చి పడతాయి. చెరువులు, వాగులు, వంకలు, కాల్వలు ఆక్రమిస్తే.. వరదలు వచ్చినప్పుడు పరీవాహక ప్రాంతంలోని ఇళ్లను ముంచెత్తుతాయి. అయిదేళ్ల కాలంలో శేషాచల అడవులను ఎర్ర చందనం దొంగలపాలు చేసి చెరబట్టినందున మిగిలివున్న కొద్దిపాటి చిరుతపులులు తిరుమల కాలినడక భక్తులపై వచ్చిపడ్డాయి. ఒక పసిబిడ్డ కూడా బలి అయ్యాడు. తాజాగా విజయవాడ పౌరుల వంతు వచ్చింది. భాషకు ఊహకు అందని అనూహ్యమైన నరకయాతన అనుభవిస్తున్నారు. దీనికి అయిదేళ్లు అధికారంలో ఉన్న జగన్మోహన్‌రెడ్డి బాధ్యుడా? లేక ఇటీవల ముఖ్యమంత్రి పదవి చేపట్టిన చంద్రబాబు నాయుడా? ఇంతకీ విషాదమేమంటే చింతామణి నాటకం ఆఖరు అంకంలో చింతామణి భక్తి గీతాలు పాడినట్లు జగన్మోహన్ రెడ్డి ఇప్పుడు సుద్దులు చెబుతున్నారు.

కృష్ణానది ఒడ్డున ఉన్న చంద్రబాబు నాయుడు నివాస భవనం మునిగిపోకుండా కాపాడేందుకు బుడమేరుపై వెలగలేరు వద్ద వున్న రెగ్యులేటర్ గేట్లు ఎత్తారని జగన్మోహన్‌రెడ్డి ఆరోపించారు. ఎవరైనా ఓటమితో మనోధైర్యం కోల్పోయినపుడు ఆ నెపం ఇతరుల మీద నెట్టదలచినపుడు అబద్ధం చెప్పినా, అది అతికినట్లు ఉండాలి. ఆ ఔచిత్యం కూడా జగన్మోహన్‌రెడ్డి కోల్పోయినట్లున్నారు. బుడమేరు వరద కృష్ణానది వైపు మళ్లించడానికి 1970లో ఈ రెగ్యులేటర్ నిర్మించారు. తదుపరి డైవర్షన్ ఛానల్ తవ్వారు. రెగ్యులేటర్ గేట్లు ఎత్తితే బుడమేరు వరద కృష్ణా నదిలో కలసిపోతుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నివాసమున్న భవనం వరద పాలౌతుంది. ఈ లాజిక్ కూడా తెలియకుండా జగన్మోహన్ రెడ్డి నోరు జారారు. వాస్తవంలో జరిగింది వేరు. డైవర్షన్ ఛానల్‌కు గట్టు బలహీనంగా ఉన్న చోట్ల రిటైనింగ్ వాల్ నిర్మించేందుకు ప్రతిపాదనలు ఉన్నా అయిదేళ్ల కాలంలో పట్టించుకోలేదు. వరద ఉధృతికి మూడు చోట్ల పెద్ద గండ్లు పడ్డాయి. వరద విజయవాడను ముంచేసింది. క్షేత్రస్థాయి పరిస్థితికి, జగన్మోహన్‌రెడ్డి ఆరోపణలకు సంబంధం లేదని క్రమేణా వాస్తవాలు వెలుగుచూస్తున్నాయి. అసంబద్ధ ఆరోపణలతో అభాసుపాలైన నేపథ్యంలో ఏదో విధంగా బయటపడేందుకు ఇప్పుడు తాజాగా మినీ హైడల్ ప్లాంటుల వాదన తెరపైకి తెచ్చారు. డైవర్షన్ ఛానల్ గట్టు బలహీనమైన చోట్లల్లా రిటైనింగ్ వాల్ నిర్మించడానికి ఇవి అడ్డు ఎలా ఉంటాయి? ప్రకాశం బ్యారేజీ దిగువన రిటైనింగ్ వాల్ నిర్మించి ఎంతో ఘనకార్యం చేసినట్లు ప్రచారం చేసుకొంటున్న జగన్మోహన్‌రెడ్డి, డైవర్షన్ ఛానల్‌కు రిటైనింగ్ వాల్ నిర్మించి ఉంటే ఈ విపత్తు దాపురించేది కాదు కదా! పైగా అయిదేళ్ల కాలంలో బుడమేరు పరీవాహక ప్రాంతంలో ఆక్రమణలు చోటుచేసుకుంటున్నా, తన పార్టీ నేతలు అక్రమ వెంచర్లు వేస్తున్నా జగన్మోహన్‌రెడ్డి సర్కారు పట్టించుకోక పోవడంతో వరద విజయవాడను ముంచేసింది. ఒక్క బుడమేరు అంశంలోనే కాదు. నదులు–నీళ్ల అంశంలో ఇంకా పలు సందర్భాల్లో జగన్మోహన్‌రెడ్డి వ్యవహరించిన తీరుతో ఆంధ్రప్రదేశ్‌కు అపారనష్టం వాటిల్లింది.

> జగన్మోహన్‌రెడ్డికి నదులు–నీళ్లు గురించి "అ.. ఆ.."లు కూడా తెలియవు. లేకుంటే బుడమేరుపై వెలగలేరు వద్ద ఉన్న రెగ్యులేటర్ గేట్లు ఎత్తడానికి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నివాసమున్న భవనానికి ముడిపెట్టేవారు కాదు. వెలగలేరు రెగ్యులేటర్ గేట్లు ఎత్తితే బుడమేరు వరద కృష్ణా నదిలో కలసి పోతుంది. చంద్రబాబు నివాస భవనం వరదపాలౌతుంది. ఈ లాజిక్ కూడా తెలియకుండా జగన్మోహన్‌రెడ్డి నోరు జారారు. ఓటమితో మనోధైర్యం కోల్పోయినపుడు ఆ నెపం ఇతరుల మీద నెట్టదలచినపుడు అబద్ధం చెప్పినా, అది అతికినట్లు ఉండాలి. ఆ ఔచిత్యం కూడా జగన్మోహన్‌రెడ్డి కోల్పోయినట్లున్నారు.



పోలవరం ప్రాజెక్టుకు ఈ రోజు దుర్గతి పట్టిందంటే ముద్దాయి జగన్మోహన్ రెడ్డి మాత్రమే. 2019 మే నెలలో ముఖ్యమంత్రి పదవి చేపట్టిన జగన్మోహన్‌రెడ్డి యథావిధిగా పోలవరం పనులు సాగించి వుంటే 2020లో వరదలు వచ్చే సమయానికి ఎగువ కాఫర్ డ్యాం గ్యాప్‌లు పూడ్చివేసి ఉండేవారు. డయాఫ్రమ్ వాల్ దెబ్బతినేది కాదు. ప్రాజెక్టు నిర్మాణం చకచకా జరిగేది. కాని కొన్నాళ్ల పాటు 2019లో వచ్చిన వరదలకే డయాఫ్రమ్ వాల్ దెబ్బతిన్నదన్న నెపం టీడీపీ ప్రభుత్వంపై నెట్టివేసే ప్రయత్నం చేశారు. అంతిమంగా హైదరాబాద్ ఐఐటి నిపుణుల బృందం రిపోర్టు వెలుగులోకి వచ్చిన తర్వాత జగన్మోహన్‌రెడ్డి అండ్ కో మౌనం వహించింది. ఇదొక్కటే కాదు. 2020లో జరిగిన అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో కేసీఆర్ కొత్త ట్రిబ్యునల్ కోసం ప్రతిపాదన చేసినపుడు రాష్ట్ర విభజన చట్టం సెక్షన్ 89 మేరకు ఒక ట్రిబ్యునల్ విచారణ సాగిస్తున్నపుడు... కొత్త ట్రిబ్యునల్ నియామకం తమకు ఆమోదయోగ్యం కాదని ముఖ్యమంత్రిగా జగన్మోహన్‌రెడ్డి డీసెంట్ నోట్ పెట్టి ఉంటే ఈ రోజు ఇంతదాకా వచ్చేదికాదు. వాస్తవం చెప్పాలంటే బుడమేరు ముంపు, పోలవరం విధ్వంసం వంటి వాటికన్నా కొత్త ట్రిబ్యునల్ నియామకం ఆంధ్రప్రదేశ్‌కు ప్రధానంగా రాయలసీమకు భవిష్యత్తులో అపార నష్టం కలిగించే ప్రమాదముంది. ఇవే కాదు, 2019లో అధికారంలోకి రాగానే కేసీఆర్‌తో చెట్టపట్టాలేసుకొని తిరిగిన తొలిరోజుల్లోనే గోదావరి–కృష్ణ అనుసంధానం అంటూ కేసీఆర్ చేసిన ప్రతిపాదనకు ఓకే చెప్పేశారు. కృష్ణలో శ్రీశైలం జలాశయం వద్ద కేవలం 400 టియంసిలే లభ్యత ఉంటుందని, గోదావరి నుంచి 900 టియంసిలు తీసుకువచ్చి రెండు రాష్ట్రాలు కృష్ణ బేసిన్‌లో ఉపయోగించుకోవాలని కేసీఆర్ ఒక పథకం తయారుచేస్తే ముందు వెనుక చూడకుండా ముఖ్యమంత్రిగా జగన్మోహన్‌రెడ్డి అంగీకరించారు. అంతిమంగా ఈ పథకం వెనక్కి పోయింది. ఇదే అమలు జరిగివుంటే గోదావరి–కృష్ణ రెండు నదుల జలాలకు ఎసరు పడేది.

ఇదే సమయంలోనే కేసీఆర్ సాక్షాత్తు తెలంగాణ శాసనసభలో పోలవరం ఎత్తు తగ్గించుకొనేందుకు జగన్మోహన్‌రెడ్డి అంగీకరించారని ప్రకటన చేశారు. జగన్మోహన్‌రెడ్డి గాని, ఆయన పార్టీ నేతలు ఒక్కరూ కేసీఆర్ ప్రకటనకు వ్యతిరేకంగా నోరు విప్పలేదు. మౌనం అంగీకారంగా రాష్ట్ర ప్రజలు భావించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభోత్సవ కార్యక్రమానికి అతిథిగా జగన్మోహన్‌రెడ్డి హాజరయ్యారు. దీనిపై కూడా అప్పట్లో ఆంధ్రప్రదేశ్‌లో రభస రేగింది. అంత క్రితం తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో తెలంగాణ ప్రభుత్వం 240 టియంసిల గోదావరి జలాలను కృష్ణ బేసిన్‌కు తరలిస్తోందని గోదావరి యాజమాన్య బోర్డు సమావేశంలో ఫిర్యాదు చేసి ఉంది. ఈ ఫిర్యాదు కేంద్ర జలసంఘం వద్దకు చేరివున్న నేపథ్యంలో జగన్మోహన్‌రెడ్డి కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి హాజరు కావడంతో గోదావరి బోర్డు సమావేశాల్లో తెలుగుదేశం హయాంలో చేసిన ఫిర్యాదు గురించి ఏపీ అధికారులు తెలంగాణను అడిగే పరిస్థితి లేకుండా పోయింది.

ఆ రోజుల్లో జగన్మోహన్‌రెడ్డి లక్షలాది రూపాయలు వ్యయం చేసి ఎంతోమంది సలహాదారులను పెట్టుకున్నా, వాస్తవంలో ముఖ్య సలహాదారు కేసీఆర్ మాత్రమే. కేసీఆర్ చెప్పినట్లు మాట్లాడేవారు, నడుచుకొనేవారు. లేకుంటే 2020లో జరిగిన అపెక్స్ కౌన్సిల్ సమావేశం సందర్భంగా మన అధికారుల సలహా తీసుకొని ఉంటే కొత్త ట్రిబ్యునల్ ప్రతిపాదన ఆమోదం పొందేది కాదు.

అంతర్ రాష్ట్ర జల వివాదాల్లోనే కాదు. అంతర్గతంగా పథకాలు అమలు చేయడంలో కూడా జగన్మోహన్‌రెడ్డి ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. ఈ రోజుకు రాయలసీమలో సిద్దేశ్వరం అలుగు, గుండ్రేవుల రిజర్వాయర్ నిర్మాణం గురించి అడుగుతున్నారు గాని, వివాదాల మధ్య మూలనపడిన పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ విస్తరణ కోరుకోవడం లేదు. కర్నూలు చీఫ్ ఇంజనీర్ కూడా ఈ రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని ఈపాటికే నిర్మింపబడిన ముచ్చుమర్రి ఎత్తిపోతలు విస్తరణగా ప్రతిపాదన పంపారు. ఈ పథకాన్ని చంద్రబాబు నాయుడు పూర్తి చేసి ప్రారంభోత్సవం చేసినందున అక్కడ నుండి అమలు జరపడం ఇష్టంలేక పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ వద్దకు మార్పు చేసి అంతిమంగా వివాదంలో పడేశారు. పైగా ఈ పథకంలో అప్రోచ్ ఛానల్ 17 కిలోమీటర్లు, అదీ రిజర్వాయర్ ముంపు ప్రాంతాలలో పెట్టడంపై ఇంజనీరింగ్ నిపుణులు ముక్కున వేలేసుకొంటున్నారు. తన హయాంలో ఐఏఎస్, ఐపీయస్ అధికారుల చేత తనూహించినదే రూల్ ఆఫ్ లాగా అమలు జరిపించిన జగన్మోహన్‌రెడ్డి, ఇంజనీరింగ్ అధికారుల చేత కూడా తను తలచింది అమలు చేయించినట్లుంది. జగన్మోహన్‌రెడ్డి చుట్టూ ఎంతో మంది సలహాదారులు, పరిజ్ఞానం గల ఇంజనీరింగ్ అధికారులు వున్నా వారి సలహా పొంది వుంటే ఒకవైపు కృష్ణ జలాలు తిరిగి పంపిణీకి కేసీఆర్ కొత్త ట్రిబ్యునల్ నియామకంపై ఆమోదం పొంది వుండగా, జగన్మోహన్‌రెడ్డి కనీసం గోదావరి జలాల్లో వాటా తేల్చేందుకు ట్రిబ్యునల్ నియామకం చేయించుకొని ఉండేవారు. ఇలా చెప్పుకుంటూపోతే నదులు–నీళ్ల అంశంపై జగన్మోహన్‌రెడ్డి అస్తవ్యస్త విధానం చాటభారతమంత ఉంది. కేవలం కేసీఆర్ సలహా మేరకు వ్యవహరించిన అనేక సంఘటనలున్నాయి. లేకుంటే బోడి గుండుకు, మోకాలికి ముడి పెట్టినట్లు బుడమేరు రెగ్యులేటర్‌కు చంద్రబాబు నాయుడు నివాసమున్న భవనానికి ముడిపెట్టేవారు కాదు.

• వి. శంకరయ్య
విశ్రాంత పాత్రికేయులు

చరిత్రపుటల్లో ఓ కమ్యూనిస్టు యోధుడు

బ్రిటిష్ సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంలో పన్నుల నిరాకరణోద్యమానికి కేంద్రమైన గుంటూరు జిల్లా పెదనందిపాడులో 1910లో ధనిక భూస్వామ్య కుటుంబంలో జన్మించారు కొల్లా వెంకయ్య. కృష్ణయ్య, రత్నమ్మ దంపతులకు ఆరుగురు సంతానంలో కొల్లా వెంకయ్య పెద్ద కుమారుడు. 1921–22లో పర్వతనేని వీరయ్య నాయకత్వంలో జరిగిన పన్నుల నిరాకరణోద్యమ ప్రభావంతో జాతీయోద్యమంలోకి ఆకర్షితులయ్యారు. పన్నెండేళ్ల వయస్సులో వెంకయ్య పెదనాన్న కొడుకు గోవిందు, ఆయన కుమారుడు పాపయ్య శాంతి సేనలో చేరారు. పెదనందిపాడు గ్రామంలో ఆజానుబాహుడు దాసరి సుబ్బయ్యశెట్టి, లావు వెంకటసుబ్బయ్యలు శాంతి సేనకు ముందు నిలిచేవారు. 1921లో శాంతి సేన ఆధ్వర్యంలో పుసులూరులో పెదనందిపాడు పరిసర ప్రాంత గ్రామ అధికారులు సభ జరిపి తమ పదవులకు రాజీనామా చేశారు. పెదనందిపాడు గ్రామ కరణం సరికా సీతారామయ్య రాజీనామా చేయగా, గ్రామస్తులు ఆయనను పల్లకీలో ఊరేగించారు. ఆ సభకు వెంకయ్య వెళ్లారు. పెదనందిపాడు ఫిర్కా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌ను గ్రామస్తులు సాంఘిక బహిష్కరణ చేశారు. ఈ ఉద్యమ సమయంలో రైతులే మాల, మాదిగలను ప్రోత్సహించి చెరువులో నీరు ముంచుకునేటట్లు చేశారు. అప్పటి నుంచి ఈ ప్రాంతంలో మార్పు కొనసాగింది. గ్రామం చివరలో ఉన్న సారా దుకాణాన్ని మూయించారు. వారు మహాత్మాగాంధీ ప్రబోధించిన అంటరానితనానికి, మద్యపానానికి వ్యతిరేకంగా, హిందూ–ముస్లిం ఐక్యత కోసం పెద్ద ఎత్తున ప్రచారం చేశారు.

1948–51 వరకు సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి మైదాన ప్రాంతం నుంచి ఆ ఉద్యమానికి సహాయ సహకారాలు అందించడానికి ఏర్పడిన కమిటీకి కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. జిల్లాలో చివుకుల శేషశాస్త్రి, దండా నారాయణస్వామి, కొనికి లక్ష్మీనారాయణ వంటి రైతు నాయకులను కాల్చి చంపుతున్న రోజులవి. ఆ కాలమంతా కొల్లా వెంకయ్య అజ్ఞాత జీవితం గడిపారు. అప్పటికే ఆయన జిల్లాలో గుర్తింపు పొందిన నాయకుడు. రహస్య జీవితమంతా చాలా గడ్డుగా నడిచింది. రాత్రిపూట రైతుల కొట్టాల్లోనూ, పగలు పొలాల్లోనూ గడిపారు. ఆ రోజుల్లో కమ్యూనిస్టులకు రక్షణ ఇవ్వటం ప్రాణసంకటంగా ఉండేది. కమ్యూనిస్టు పార్టీ నిర్మాణం కోసం వెంకయ్య గ్రామగ్రామాన కాలినడకన నడిచి ఉద్యమాన్ని నిర్మించారు.



> భారత కమ్యూనిస్టు పార్టీ రెండు విషయాల్లో తప్పు చేసిందనేది కొల్లా వెంకయ్య నిశ్చితాభిప్రాయం. మొదటిది– ఎన్నికల్లో భూస్వామ్య పార్టీలతో పొత్తు. రెండవది– సాయుధపోరాటం కొరకు పంథాను రూపొందించడం, అమలుపరచటంలోనూ! కమ్యూనిస్టు ఉద్యమ సూత్రబద్ధ ఐక్యతకు ఆయన సుదీర్ఘ కృషి చేశారు. కడదాకా ఎన్నో ఆటుపోట్లను, నిర్బంధాలను తట్టుకొని దోపిడీ రహిత సమాజం కోసం పోరాడిన వెంకయ్య నేటి తరానికి ఆదర్శప్రాయుడు.

కమ్యూనిస్టు పార్టీలో రాష్ట్ర నాయకుడుగా కొల్లా వెంకయ్య వివిధ హోదాలలో పనిచేశారు. సీపీఐ నుంచి సీపీఐ(ఎం) వైపు వచ్చారు. భారత కమ్యూనిస్టు పార్టీ మూడు నాలుగు జాతీయ కాంగ్రెస్‌లలో ఆయన కేంద్ర కంట్రోల్ కమిషన్ సభ్యుడిగా ఎన్నికయ్యారు. సీపీఐ(ఎం) నుంచి తరిమెల నాగిరెడ్డి, చండ్ర పుల్లారెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావులతో కలిసి సీపీఐ(ఎం)కి వ్యతిరేకంగా పాలకొల్లులోనూ, బర్ద్వాన్‌లోనూ సిద్ధాంత పోరాటం నిర్వహించారు. కొంతకాలం చారు మజుందార్ నాయకత్వంలోని సీపీఐ(ఎంఎల్)లో కొనసాగారు. పార్వతీపురం కుట్ర కేసులో ఇరికించబడి ఏడు సంవత్సరాలకు పైగా జైలు జీవితం అనుభవించారు. నక్సల్బరి, శ్రీకాకుళ పోరాటాలు గాడి తప్పాయని చైనావారు సలహాలు ఇచ్చారు. అది దళ చర్యల ద్వారా సాగించే వ్యక్తిగత సంహారమని జైలు నుంచి కొల్లా వెంకయ్య, కాను సన్యాల్, చౌదరి తేజేశ్వరరావు, భువన మోహన్ పట్నాయక్, నాగభూషణ పట్నాయక్, సౌరీన్ బోస్ తదితరులు చారు మజుందార్‌కు లేఖ ద్వారా తెలియజేశారు. ఆరుగురు కామ్రేడ్స్ లేఖగా అది ప్రసిద్ధి చెందింది. మార్క్సిజం–లెనినిజం, మావో ఆలోచన విధానం మా మౌలిక సిద్ధాంతం అని ఆయన పార్వతీపురం కుట్ర కేసులో వాదించారు. జిల్లా కోర్టు ఆయనకు యావజ్జీవ కారాగార శిక్ష విధించగా, హైకోర్టు కొట్టివేసింది.

1952లో పొన్నూరు నుంచి శాసన సభకు, 1957లో శాసనమండలికి, 1962లో తెనాలి నుంచి లోక్‌సభకు ఎన్నికయ్యారు. 1962లో భారత–చైనా సరిహద్దు ఘర్షణ సమయంలో నిర్బంధానికి గురయ్యారు. 1975లో అత్యవసర పరిస్థితిలో జైల్లో నిర్బంధించబడ్డారు. ఆయన అనేక సిద్ధాంత రచనలు చేశారు. సంస్కృతం, హిందీ, ఇంగ్లీషు, తెలుగు భాషల్లో ఆయనకు విశేషమైన పరిచయం ఉన్నది. వెంకయ్య నిరంతర అధ్యయనశీలి. కుల సమస్య పట్ల ఆయనకు స్పష్టమైన అభిప్రాయాలు ఉన్నాయి. కుల సమస్య వర్గ సమస్యతో ముడిపడి ఉన్నదనేది ఆయన నిశ్చితాభిప్రాయం. 1955 అసెంబ్లీ ఎన్నికల తర్వాత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర మహాసభలో ఆయన ఒక 'కీ' నోటు పెట్టారు.

1977లో జైలు నుంచి విడుదలైన తరువాత, నల్లమడ ముంపు నివారణ కోసం గొప్ప ఉద్యమం నిర్మించారు. 1973 భూగరిష్ఠ పరిమితి చట్టం అమలుకు గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో 1980లో గ్రామీణ పేదల సంఘాన్ని స్థాపించి భూ సంస్కరణల కోసం పోరాడారు. 1986లో భూ సంస్కరణల చట్టం అమలు కోసం సుప్రీంకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం వేశారు. 1991లో తీర్పు రాగా, దాని అమలు కోసం జీవిత పర్యంతం పోరాడారు.

ఈ దేశంలో కమ్యూనిస్టు పార్టీ రెండు విషయాల్లో తప్పు చేసిందనేది ఆయన నిశ్చితాభిప్రాయం. ఒకటి– ఎన్నికల్లో భూస్వామ్య పార్టీలతో పొత్తు కట్టటం, రెండు– సాయుధపోరాటం కొరకు పంథాను రూపొందించడం, అమలుపరచటంలోనూ! భారతదేశం అర్ధ వలస, భూస్వామ్య దేశం అని పార్లమెంటరీ పంథాను ఆయన తిరస్కరించారు. ఈ దేశంలో సోషలిజం స్థాపన జరగాలంటే కమ్యూనిస్టు ఉద్యమం సూత్రబద్ధంగా ఐక్యం కావాలని అందుకోసం ఆయన సుదీర్ఘ కృషి చేశారు. కడదాకా పేదరిక నిర్మూలన కోసం, సమసమాజం కోసం, ఎన్నో ఆటుపోట్లను, నిర్బంధాలను తట్టుకొని దోపిడీ రహిత సమాజం కోసం పోరాడిన కొల్లా వెంకయ్య నేటి తరానికి ఆదర్శప్రాయుడు. ఆయన చనిపోయి నేటితో 26 సంవత్సరాలు పూర్తి అయింది.

◆ కొల్లిపర వెంకటేశ్వరరావు
రాష్ట్ర కార్యదర్శి, సీపీఐ (ఎంఎల్) రెడ్ స్టార్, ఆంధ్రప్రదేశ్

విద్యాలయాలు, దేవాలయాలకు దూరంగా మద్యం దుకాణాలు


ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతున్న మద్యం పాలసీ ఈ నెలాఖరుతో ముగుస్తున్న నేపథ్యంలో కొత్త లిక్కర్ పాలసీ రూపకల్పనపై రాష్ట్ర ప్రభుత్వం మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటు చేసింది. పూర్తి పారదర్శకత పాటిస్తూ నియమ నిబంధనలు వంద శాతం అమలు జరిగేలా ఈ పాలసీ రూపొందించాలి.

రాష్ట్రంలో అక్టోబర్ ఒకటి నుండి ఏర్పాటు కానున్న కొత్త మద్యం దుకాణాలు ముఖ్యంగా విద్యాలయాలు, దేవాలయాలు, ఆస్పత్రులకు కనీసం ఒక కిలోమీటర్ దూరంలో ఉండేలా చూడాలి. జనావాసాలు, రద్దీ ప్రాంతాల్లో దుకాణాలు ఏర్పాటు చేయడం వల్ల ప్రజలు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మద్యం దుకాణాలు ఏర్పాటు చేసే ముందు గ్రామసభ ఏర్పాటు చేసి పంచాయతీ తీర్మానం జరిగిన తర్వాతనే దుకాణం ఏర్పాటు జరిగేలా నిబంధన విధించాలి. మరీ ముఖ్యంగా గ్రామాల్లో మద్యం షాపులు ఊరి చివర ఉండేలా చర్యలు తీసుకోవాలి. దీనివల్ల మహిళలకు, విద్యార్థులకు సమస్యలు తగ్గి గ్రామాల్లో తగాదాలు, అల్లర్లు జరిగే అవకాశాలు తగ్గుతాయి. కల్తీ మద్యం బారినపడి అనేకమంది అనారోగ్యం పాలై మరణాలు సంభవించిన దృష్ట్యా నాణ్యమైన మద్యం బ్రాండ్లనే విక్రయించాలి. నాసిరకం మద్యం తయారు చేసే కంపెనీలను గుర్తించి, వాటి లైసెన్స్‌లను రద్దు చేసి, కేసులు నమోదు చేయాలి.

కల్లుగీత కార్మికులకు ఉపాధి కల్పించే కార్యక్రమంలో భాగంగా మద్యం దుకాణాల కేటాయింపులో ఆ సామాజికవర్గానికి తొలి ప్రాధాన్యత కల్పించాలి. మద్యం విక్రయం ద్వారా ప్రభుత్వం అధిక ఆదాయం పొందాలనే అంశాన్ని పక్కనపెట్టి, మద్యపాన వ్యసనం నుండి ప్రజలు బయటపడేలా చర్యలు తీసుకోవాలి. మద్యం సేవించడం వల్ల కలిగే దుష్ప్రభావాలను వివరిస్తూ కౌన్సిలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయటం ద్వారా క్రమంగా మద్యం దుకాణాల సంఖ్యను తగ్గిస్తూ రాష్ట్రంలో మద్యపాన నిషేధం అమలు జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– గొనప అప్పన్న, విశాఖపట్నం

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిటోపేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com



• భక్తితో మిలాద్ ఉన్ నబీ



మిలాద్ ఉన్ నబీ సందర్భంగా పంజా సెంటర్‌లోని షాహి మసీదులో సోమవారం మహ్మద్ ప్రవక్త కేశ ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముస్లింలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. - వన్‌టౌన్

వరద మిగిల్చిన బురద



గుట్టలుగా ముం'చెత్త'గా..



మురికివాడ



- నగరంలో వరద ప్రాంతాలను వీడని మురుగు
- ఇంటి లోపల, వీధుల్లోకి చేరిన మురుగునీరు
- భరించలేని దుర్వాసనతో బాధితుల అవస్థలు
- రెండు వారాలవుతున్నా ఇంకా కన్నీరుమున్నీరు

పెను ఉప్పెనలా వచ్చిన వరద నగరాన్ని మురికివాడగా మార్చేసింది. వరద ప్రభావిత ప్రాంతాల్లో పేరుకుపోయిన మురుగు బాధితులకు చుక్కలు చూపిస్తోంది. ఇంటి లోపల, బయట, పరిసర ప్రాంతాల్లో ముందుకు కదలక అష్టకష్టాలు పెడుతోంది. నల్లగా మారిపోయిన వీధుల్లో నడవడమే కష్టం కాగా, ఇళ్లను ఎంత శుభ్రం చేసినా భరించలేని దుర్వాసన వెదజల్లుతోంది. అయినా చాలా ప్రాంతాల్లో బాధితులు అలాగే కాలం గడుపుతున్నారు. వరద వచ్చి రెండు వారాలవుతున్నా ఇంకెన్నాళ్లు తమకీ కష్టాలంటూ కన్నీరు పెట్టుకుంటున్నారు.

- విజయవాడ, ఆంధ్రజ్యోతి









ఆరని వస్తువులు.. తీరని వెతలు : వరద బాధిత ప్రాంతాల్లో పుస్తకాలు, దుస్తులు, బ్యాగులు ఆరబెట్టుకుంటూ.., సామాన్లు శుభ్రం చేసుకునే పనిలో మహిళలు

దుర్గాఘాట్ వద్ద ఏర్పాట్లు



శరన్నవరాత్రికే నవహారతి

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కృష్ణమ్మకు నవహారతుల కార్యక్రమానికి దుర్గాఘాట్ వేదిక కానుంది. ఇకపై ఇక్కడి నుంచే నవహారతులు ఇవ్వాలని దేవదాయ శాఖ, దుర్గామల్లేశ్వరస్వామి ఆలయ అధికారులు నిర్ణయించారు. అక్టోబరు మూడు నుంచి ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు ప్రారంభం కానుండగా, ఆరోజు నుంచే నవహారతుల కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు సర్వం సిద్ధం చేస్తున్నారు.

దసరా నుంచి దుర్గాఘాట్‌లో కృష్ణానదికి నవహారతులు

- పవిత్ర సంగమం నుంచి మార్పు చేసిన ప్రభుత్వం
- దేవదాయ, దుర్గగుడి అధికారులతో సమావేశం అనంతరం నిర్ణయం

నది ఉత్తరంవైపు నుంచి దక్షిణ వైపునకు ప్రవహించడం వల్లే..

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇబ్రహీంపట్నంలోని పవిత్ర సంగమం వద్ద పంటుపై ఈ హారతులిచ్చేవారు. ఆలయానికి చెందిన పురోహితులు నిత్యం అక్కడికి వెళ్లేవారు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక నవహారతులకు మంగళం పాడేసింది. వాటి గురించి పట్టించుకోవడం మానేసింది. దీంతో దుర్గామల్లేశ్వరస్వామి ఆలయ అధికారులు అక్కడి నుంచి హారతుల సామాగ్రిని తీసుకొచ్చేశారు. దుర్గాఘాట్ వద్ద, ఇరిగేషన్ శాఖ మోడల్ గెస్ట్‌హౌస్ పక్కనే ఉన్న రేకుల షెడ్ వద్ద నిర్మించిన గట్టుపై నుంచి నదికి పంచహారతులు ఇస్తున్నారు. ప్రస్తుతం నదికి ఈ పంచహారతుల ప్రక్రియ నడుస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పవిత్ర సంగమానికి పాతకళను తీసుకురావాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా అక్కడ నవహారతులు ఇవ్వాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. జలవనరుల శాఖ, దేవదాయ శాఖ, పంచాయతీరాజ్ శాఖలు సమన్వయం చేసుకుని ఈ హారతులను ప్రారంభించాలని స్పష్టం చేశారు. దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఈ ప్రదేశాన్ని పరిశీలించి త్వరలోనే నవహారతులను ప్రారంభిస్తామని వెల్లడించారు.

సీఎం భేటీ అనంతరం మారిన నిర్ణయం

కృష్ణానదికి ఇచ్చే నవహారతులకు సంబంధించి కొద్దిరోజుల క్రితం సీఎం చంద్రబాబు దేవదాయ శాఖ, దుర్గామల్లేశ్వరస్వామి ఆలయ అధికారులతో సమావేశమయ్యారు. ఇందులో హారతుల గురించి స్పష్టంగా వివరాలు తెలుసుకున్నారు. హారతులను నదికి ఇస్తారా, భక్తులకు ఇస్తారా అని ప్రశ్నించారు. సమావేశంలో పాల్గొన్న ప్రముఖ అర్చకులు నదికే ఇస్తారని చెప్పారు. కాశీలో నది వైపునకు తిరిగి గంగకు హారతులు ఇస్తారు. దీన్ని తిలకించడానికి భక్తులు కొంతమంది ఘాట్లపై ఉంటారు. మరికొంతమంది బోట్లలో నదిలోకి వెళ్తారు. నది వైపునకు తిరిగి హారతులు ఇస్తే భక్తులకు కనిపించదు. దీంతో భక్తులు తిలకించడానికి వీలుగా హారతులు ఉండాలని చంద్రబాబు ఆదేశించారు. నది ఉత్తరం వైపు నుంచి దక్షిణ వైపునకు ప్రవహిస్తోంది. ఎగువ నుంచి వచ్చే నదికి హారతులు ఇవ్వడం దేశంలో ఎక్కడా లేదని, ఇలా ప్రవహించే నదికి హారతులు ఇవ్వడం చాలా ఉత్తమమని అర్చకులు సీఎంకు వివరించారు. ప్రస్తుతం పంచహారతులు ఇస్తున్న ప్రదేశం నుంచి ఉత్తరం వైపు నుంచి ప్రవహించే నదికి హారతులు ఇస్తారు. దుర్గాఘాట్‌లో మెట్లపై భక్తులు కూర్చుని ఈ హారతులను వీక్షించడానికి వీలుంటుంది. ఈవిధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. తొమ్మిది మంది పురోహితులు నిలబడేందుకు తొమ్మిది చెక్క బల్లలను ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం ఐదు బల్లలు ఉన్నందున కొత్తగా మరో నాలుగు చేయించారు.

నవహారతులు ఇవీ..
ఓంకారం, నాగ, పంచ, సింహ, సూర్య, చంద్ర, నంది, కుంభ, నక్షత్ర హారతులు ఇస్తారు.

దసరా ఉత్సవ ఏర్పాట్ల పరిశీలన

ఇంద్రకీలాద్రిని పరిశీలించిన అధికారులు

- క్యూ మార్గాలు, ఎమర్జెన్సీ గేట్ల పనులకు సూచనలు
- స్నానఘాట్లు, ప్రసాదం కౌంటర్ల వద్ద తనిఖీలు
- పోలీస్ బందోబస్తుపై క్షేత్రస్థాయి సమీక్ష
- పర్యటనలో పాల్గొన్న సీపీ, దుర్గగుడి ఈవో



6లో..

అనధికార పార్కింగ్ దందా

అడ్డగోలు వసూలు.. ప్రశ్నిస్తే దాడులు

- ఆగస్టు 8న టెండర్.. ఇప్పటికీ డబ్బు చెల్లించలేదు
- వీఎంసీ నిర్ణయించిన ధర కారుకు రూ.30
- వసూలు చేసేది రూ.50 నుంచి రూ.100

(విజయవాడ-ఆంధ్రజ్యోతి/వన్‌టౌన్) : నగరంలో పార్కింగ్ మాఫియా చెలరేగిపోతోంది. వీఎంసీ నిబంధనలు తుంగలో తొక్కడంతో పాటు వీఎంసీ నిర్ణయించిన ధరల కంటే రెండు

- మిగతా 6లో

న్యూస్ బాక్స్



శాంతినగర్-కవులూరు గ్రామాల మధ్య గండ్లకు మరమ్మతులు

గండ్లకు మరమ్మతులు

జి.కొండూరు : శాంతినగర్-కవులూరు గ్రామాల మధ్య రహదారిపై గండ్ల మరమ్మతు పనుల్ని సోమవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ ఆదేశాల మేరకు అధికారులు పనులు ప్రారంభించారు. మరమ్మతు పనులు పూర్తయితే దెబ్బతిన్న మంచినీటి పైపులైన్ పనులు కూడా పునరుద్ధరించే అవకాశం ఉంది.



మాట్లాడుతున్న కోగంటి రవికుమార్

డీసీ విజయరాజును సస్పెండ్ చేయాలి

గొల్లపూడి, సెప్టెంబరు 16 : దేవదాయశాఖలో అవినీతి రారాజు విజయరాజును సస్పెండ్ చేసి విచారణ చేయాలని ఏపీ ఎండోమెంట్ ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర అధికార ప్రతినిధి కోగంటి రవికుమార్ డిమాండ్ చేశారు. సోమవారం గొల్లపూడిలోని దేవదాయశాఖ కార్యాలయం వద్ద విలేకర్లతో మాట్లాడుతూ, సీఎం చంద్రబాబు ఆశయాలకు తూట్లు పొడుస్తూ భక్తులు ఇచ్చిన సొమ్మును దేవదాయశాఖలోని కాకినాడ డీసీ విజయరాజు వంటి కొంత మంది వ్యక్తులు దోచుకుంటున్నారని ఆరోపించారు. ఇలాంటి చర్యలతో దాతల హృదయాలు శోకిస్తున్నాయన్నారు. గత ఆరేళ్ల క్రితం విజయరాజుపై ఏసీబీ అధికారులు దాడులు చేసి వందల కోట్ల ఆస్తులు, పట్టు చీరెలు, బంగారం, వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నారన్నారు. కోర్టు ఆర్డర్ ఉన్నా నాటి మంత్రి వెలంపల్లి అండతో ఆర్థిక సంబంధమైన డీసీ పోస్టు వేయించుకున్నాడన్నారు. అన్ని ఆధారాలతో విజయరాజుపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులు చేసినట్టు తెలిపారు. ఆరేళ్లుగా ఏసీబీ విజయరాజుపై చార్జిషీటు దాఖలు చేయలేదని, తక్షణం అతడిని సస్పెండ్ చేసి చార్జిషీటు వేయాలని డిమాండ్ చేశారు.

క్రైం కార్నర్


రూ.140 ఇవ్వలేదని కుటుంబంపై దాడి

గుడివాడ రూరల్ : గుడివాడ రూరల్ మండలం పర్నాస గ్రామానికి చెందిన గంటా తంబి రూ.140 డబ్బులు ఇవ్వలేదని గ్రామానికి చెందిన కొందరు సోమవారం దాడి చేశారు. గంటా తంబి కుటుంబసభ్యులతో కలిసి పర్నాస గ్రామంలో నివాసం ఉంటూ చికెన్ షాపు నడుపుకుంటున్నాడు. రెండు సంవత్సరాల క్రితం నుంచి తంబికి, అదే గ్రామానికి చెందిన కొలుసు నాగభూషణం చికెన్ తాలూకు డబ్బులు రూ.140 ఇవ్వకుండా ఉన్నందున ఈనెల 8న సదరు డబ్బు అడగ్గా ఇద్దరికీ మాటమాటా పెరిగి తోపులాట జరిగింది. 15వ తేదీ ఉదయం నాగభూషణం, కుమారులు, బంధువులు కలిసి తంబి ఇంట్లోకి దౌర్జన్యంగా చొరబడి, తంబి, భార్య, పిల్లలపై దౌర్జన్యం చేసి కొట్టి, కులంపేరుతో దూషించారని, చంపేస్తామని బెదిరించారని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కొలుసు బాలకృష్ణ, కొన్నిపోటి నాగ వెంకటేశ్వరరావు, కొలుసు నాగభూషణం, కొన్నిపోటి మహేష్, వెలగల దీపక్, నిఖిల్, లక్కీ, నవీన్, అభిషేక్, కొలుసు ప్రసాద్, నెల్లపు తేజ, సాహు, తలపోతు కాశీ విశ్వనాథ్‌లపై కేసు నమోదు చేశారు.

భర్త, అత్త, ఆడపడుచులపై కేసు

గుడివాడరూరల్:గుడివాడ మల్లాయిపాలెం పంచాయతీ లక్ష్మీనగర్‌కి చెందిన అబ్దుల్ రషీద్ కుమార్తె అబ్దుల్ ఖాదరునిసకి మచిలీపట్నం ఇంగ్లీష్ పాలెంకి చెందిన మహమ్మద్ పరీద్‌తో 2022వ సంవత్సరంలో పెద్ద సమక్షంలో వివాహం చేశారు. భర్త, అత్త, ఆడపడుచులు అదనపు కట్నం తెమ్మని మానసికంగా, శారీరకంగా హింసిస్తున్నట్టు ఖాదరున్నిసా ఫిర్యాదు చేయటంతో ఎస్ఐ చంటిబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గోపీకృష్ణ మృతదేహం లభ్యం



జగ్గయ్యపేట రూరల్ : ముక్త్యాల వద్ద కృష్ణానదిలో ఆదివారం సాయంత్రం స్నానానికి దిగి గల్లంతైన వ్యక్తి మృతదేహాన్ని సోమవారం గజ ఈతగాళ్లు వెలికితీశారు. ముక్త్యాల గ్రామ శివారులోని తెలంగాణా రాష్ట్రం సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలం దొండపాడు గ్రామానికి చెందిన యలగాల గోపీకృష్ణ (25), స్నేహితుడు గుండెబోయిన గోపీ, మరికొందరితో కలిసి కృష్ణానది ఘాట్ వద్ద స్నానానికి దిగారు. ఈత రాకపోవటంతో వరద ఉధృతికి గోపీకృష్ణ గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న పోలీస్, రెవెన్యూ, పంచాయతీ అధికారులు గజ ఈతగాళ్లతో గాలింపు చేపట్టారు. సోమవారం ఉదయం మృతదేహం లభించటంతో పోస్టుమార్టం నిమిత్తం జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

దసరా ఉత్సవ ఏర్పాట్ల పరిశీలన



దసరా ఉత్సవ ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీపీ రాజశేఖర్ బాబు, ఈవో రామారావు, అధికారులు

వన్‌టౌన్ : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో వచ్చేనెల 3వ తేదీ నుంచి 12వ తేదీవరకు నిర్వహించనున్న దసరా మహోత్సవాలకు సంబంధించి ఏర్పాట్లను ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్‌బాబు సోమవారం ఆలయ ఈవో కేఎస్ రామారావు, ఇంజనీరింగ్, పోలీస్ అధికారులు, సిబ్బందితో కలిసి పరిశీలించారు. కెనాల్ రోడ్డులోని వినాయకుడి గుడి నుంచి ఏర్పాటు చేస్తున్న క్యూలైన్లను పరిశీలించారు. భక్తుల ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, ఎమర్జన్సీ గేట్లు, తదితరాలను పరిశీలించి తగు సూచనలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉండటంతో వారికి అనుగుణంగా అమ్మవారి దర్శనానికి ఎటువంటి అంతరాయం లేకుండా క్యూలలో సజావుగా వెళ్లేందుకు ఏర్పాట్లు ఉండాలని ఆయన సూచించారు. సీతమ్మవారి పాదాల వద్ద ఏర్పాటు చేస్తున్న కేశఖండనశాలకు సంబంధించి మౌలిక సదుపాయాలు, తదితరాల గురించి చర్చించారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఎక్కడా ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. స్నాన ఘాట్లు, జల్లు స్నానాలు, టిక్కెట్ కౌంటర్లు, చెప్పుల స్టాండ్లు, లగేజీ కౌంటర్లు, ప్రసాదం కౌంటర్లు, తదితరాల విషయంలో పలు సూచనలు చేశారు. భక్తులు వేచి ఉండేందుకు ఏర్పాటు చేసిన స్థలాలు, పార్కింగ్ స్థలాలు, తదితరాల పై కూడా దేవస్థానం అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రసాదం కౌంటర్ల వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. ఇటీవల కొండచరియలు విరిగి పడిన ప్రాంతంలో జరుగుతున్న మరమ్మతు పనులను పరిశీలించారు. ఘాట్ రోడ్డులో పరిస్థితులను అధ్యయనం చేసి తగు సూచనలు చేశారు. భక్తులకు అన్న వితరణ



సిద్ధమవుతున్న భక్తుల క్యూ లైన్లు

ఏర్పాట్లతో పాటు ఏఏ పాయింట్ల వద్ద పోలీసు బందోబస్తు నిర్వహించాలన్న దానిపై క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భక్తులు ఒత్తిడికి గురికాకుండా క్యూలలో సజావుగా నడిచేందుకు వీలుగా ఏర్పాట్లు ఉండాలని ఇంజనీరింగ్ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఈఈ లింగం రమాదేవి, ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్స్ అసోసియేషన్ అపన్నహస్తం



వరద బాధితులకు కిట్లను పంపిణీ చేస్తున్న ఆర్పీ సిసోడియా, సెంట్రల్ ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు

విజయవాడ, సెప్టెంబరు 16 : వరదల ముంపు ప్రాంత ప్రజలను ఆదుకోవటానికి రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ అసోసియేషన్ తరపున రూ.25 లక్షలు సమీకరించారు. దీనికి సంబంధించిన చెక్కును రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ సమక్షంలో, ముఖ్యమంత్రి చంద్రబాబు సహాయ నిధికి అందించారు. దీనికి అదనంగా సింగ్‌నగర్‌లో వరద బాధితులకు సోమవారం 2,500 కుటుంబాలకు రూ. 1100 విలువ చేసే దుస్తుల కిట్లను అందజేశారు. పంపిణీ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, ఏపీ రెవెన్యూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్పీ సిసోడియా, ఏపీ సబ్ రిజిస్ట్రార్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎ.గోపాల్, ప్రధాన కార్యదర్శి ఎం.కృష్ణప్రసాద్, ఆర్గనైజింగ్ సెక్రటరీ కె.వెంకటేశ్వరరావు, రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ విజయవాడ డీఐజీ రవీంద్రనాథ్, నెల్లూరు డీఐజీ వి.కిరణ్‌కుమార్, ఎన్టీఆర్ జిల్లా రిజిస్ట్రార్ వీఎస్ఆర్ ప్రసాద్, జిల్లా రిజిస్ట్రార్ కె.రామారావు తదితరులు పాల్గొన్నారు.

రాచరిక వ్యవస్థకు చెల్లు!

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలలో

పోడియంల తొలగింపు



గుణదల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పోడియంను తొలగిస్తున్న సిసోడియా, ఎమ్మెల్యే గద్దె

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలలో మార్పులు ప్రారంభమౌతున్నాయి. రిజిస్ట్రేషన్ల శాఖలో పారదర్శక సేవలు అందించేందుకు ఒక వైపున ఉన్నతాధికారులు విస్పష్ట నిర్ణయాలు తీసుకుంటుండగా మరోవైపు స్నేహపూర్వక వాతావరణాన్ని కల్పించే దిశగానూ శరవేగంగా అడుగులు పడుతున్నాయి. బ్రిటీష్ కాలం నుంచి సబ్ రిజిస్ట్రార్ల కార్యాలయాలో భారీ పోడియాలపై అధికారులు కూర్చుని విధులు నిర్వహించటం ఆనవాయితీగా వస్తోంది. ఇవి న్యాయస్థానాలలో న్యాయమూర్తులు కూర్చునే పోడియంలుగా ఉంటాయి.

కాలం మారినా ఇప్పటికీ రిజిస్ట్రేషన్ అధికారులు ఇదే కొనసాగిస్తున్నారు. దీనిని గుర్తించిన ప్రభుత్వం అధికారులు-ప్రజల మధ్య స్నేహపూర్వక సంబంధాలు కొనసాగించాలని నిర్ణయించింది. దీనికి అడ్డుగా ఉన్న రాచరికపోడియాలను తొలగించాలని నిర్ణయించింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలలో పోడియాల తొలగింపు కార్యక్రమం చేపట్టడం జరిగింది. పటమట, గుణదల, గాంధీనగర్ సబ్ రిజిస్ట్రార్ల కార్యాలయాలలో పోడియంల తొలగింపు పనులు యుద్ధ ప్రాతిపదికన జరిగాయి. కార్యాలయంలో ఎత్తుగా ఉండే డయాస్, దాని చుట్టూ ఉండే చెక్క పార్టీషనింగ్, ఎరుపు క్లాత్‌లను పూర్తిగా తొలగించారు. గుణదల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పోడియం తొలగింపు కార్యక్రమంలో ఏకంగా రాష్ట్ర రెవెన్యూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్పీ సిసోడియా, రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ ఐజీ శ్రీధర్ బాబులు స్వయంగా పాల్గొనటం విశేషం. ఈ కార్యక్రమంలో విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామమోహన్ కూడా పాలుపంచుకున్నారు. విజయవాడ నగరంలో ప్రధానమైన మూడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలతో పాటు విజయవాడ రూరల్, ఇబ్రహీంపట్నం, మైలవరం ఇలా గ్రామీణ ప్రాంతాలలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలలో కూడా పోడియం తొలగింపు పనులు చేపట్టారు. పోడియం తొలగింపు వల్ల స్నేహపూర్వక వాతావరణం నెలకొంది.



మిలాద్ ఉన్ నబి కార్యక్రమంలో పాల్గొన్న కొనకళ్ల నారాయణ, తదితరులు

శాంతి సామరస్యాలకు దర్పణం మిలాద్ ఉన్ నబి

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 16 : మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని సోమవారం మిలాద్ ఉన్ నబి సందర్భంగా సోమవారం రాత్రి నిర్వహించిన భారీ ర్యాలీ నగరంలో వినూత్న శోభ సంతరించుకుంది. ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర పాల్గొని ప్రసంగించారు. శాంతి సామరస్యాలకు మచిలీపట్నం ప్రతీకగా నిలిచిందన్నారు. మహమ్మద్ ప్రవక్త బోధించిన సిద్ధాంతాలను ప్రజల వద్దకు తీసుకుని వెళ్లాలన్నారు. మాజీ ఎంపీ కొనకళ్ళ నారాయణరావు మాట్లాడుతూ, ఒకే రోజు వినాయక నిమజ్జనం, మిలాద్ ఉన్ నబి పండుగలు హిందూ ముస్లింల సామరస్యత, ఐక్యతకు నిదర్శనంగా నిలిచాయన్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ మాట్లాడుతూ, నగరంలో వందలాది సంవత్సరాల నుంచి ఎంతో చరిత్ర కలిగిన దర్గాలు, మసీదులు ఉన్నాయన్నారు. ర్యాలీలో టీడీపీ నాయకులు కొనకళ్ల బుల్లయ్య, మోటమర్రి బాబా ప్రసాద్, చిత్తజల్లు నాగరాము, హసీంబేగ్, ఎండి ఇలియాస్ పాషా, తలారి సోమశేఖర్, పిప్పళ్ల కాంతారావు, గడ్డం రాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు కార్పొరేటర్ చిత్తజల్లు నాగరాము, బండి రామకృష్ణ తదితరులు పానీయాలు అందజేశారు.

సీఎం సహాయనిధికి కనకదుర్గా ఫైనాన్స్ విరాళం



చంద్రబాబుకు విరాళం ఇస్తున్న కనకదుర్గా ఫైనాన్స్ యాజమాన్యం

వన్‌టౌన్ : వరద బాధితులను ఆదుకునేందుకు సీఎం సహాయనిధికి విజయవాడకు చెందిన కనకదుర్గా ఫైనాన్స్ లిమిటెడ్ యాజమాన్యం సోమవారం సీఎం చంద్రబాబును కలిసి రూ.5 లక్షలు విరాళం అందజేశారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో సంస్థ చైర్మన్ సంధిరెడ్డి లక్ష్మీనారాయణ, ఎండీలు జయప్రకాష్ నారాయణ, శ్రీమన్నారాయణ, గాయత్రిలు ఉన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు వారిని అభినందించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ వరద బాధితులను ఆదుకునేందుకు దాతలు, స్వచ్ఛంద సంస్థలు, పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలు ముందుకు రావాలని పిలుపు నిచ్చారు.

నరెడ్‌కో అమరావతి అధ్యక్షుడిగా గళ్లా



గళ్లా రామచంద్రరావు



ఎన్.రాంబాబు

గుంటూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (నరెడ్‌కో) అమరావతి అధ్యక్షుడిగా శ్రీ భ్రమర టౌన్‌షిప్ అధినేత గళ్లా రామచంద్రరావును సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం సాయంత్రం విజయవాడలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో నరెడ్‌కో జనరల్ బాడీ సమావేశం జరిగింది. సమావేశంలో కొత్త కమిటీని సభ్యులు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గళ్లా రామచంద్రరావుకు, కమిటీకి బోర్డు గౌరవ సభ్యులైన వీవీ నర్సయ్య, జి.పున్నారావు, కె.రామకోటేశ్వరరావు, వి.శ్రీనివాసరావు, రాజవరపు రవి, ఎంఎం కొండయ్యలు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గళ్లా రామచంద్రరావు మాట్లాడుతూ, నారెడ్‌కో అమరావతి అధ్యక్షుడిగా తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు ప్రతిఒక్కరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ.. రియల్ ఎస్టేట్ రంగంలో ప్రతిఒక్కరికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తానని, ఎవరికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా భవిష్యత్తులో అసోసియేషన్ మరింత అభివృద్ధి చెందే విధంగా పనిచేస్తానన్నారు. రాజధాని అమరావతి ప్రాంతంలో అన్ని అనుమతులు ఉన్న అప్రూవుడ్ లే-అవుట్‌లు మాత్రమే చేయాలని, అటువంటి లేఔట్లను మాత్రమే నరెడ్‌కో ప్రోత్సహిస్తుందని గళ్లా తెలిపారు. ముఖ్యంగా రాజధాని అమరావతి అభివృద్ధికి నారెడ్‌కో కొత్త కమిటీ శాయశక్తుల కృషి చేస్తుందని తెలిపారు.

కొత్త కమిటీ : అధ్యక్షుడిగా గళ్లా రామచంద్రరావు, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ ఎ.సాంబశివరావు, జనరల్ సెక్రటరీ ఎన్.రాంబాబు, కోశాధికారిగా మారం చంద్రశేఖర్, ఉపాధ్యక్షులుగా పెద్ది సుబ్బారావు, ఎం.హనుమంతరావు, ఎం.రామకృష్ణ, పీవీకే చైతన్య, జాయింట్ సెక్రెటరీలుగా టి.దుర్గాప్రసాదరావు, జి.శివ నాగబాబు, అజీమతుల్లా, ఈసీ మెంబర్లుగా కేవీఎస్ రామాంజనేయులు, ఎం.సత్యనారాయణ, డి.రమేష్ కుమార్, కె.కృష్ణ, జి.కృష్ణ హేమంత్, డి.రమేష్ కుమార్ ఎన్నికయ్యారు.

అక్టోబరులో నూతన మద్యం పాలసీ

వరద బాధితులకు అన్ని సహాయ చర్యలు

ప్రజా దర్బార్‌లో సమస్యలకు పరిష్కారం : మంత్రి కొల్లు రవీంద్ర



బాధితురాలికి ఉత్తర్వుల కాపీ అందిస్తున్న రవీంద్ర

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 16 : వైసీపీ పాలనలో ప్రభుత్వ మద్యం దుకాణాల పేరుతో ప్రజల నుంచి కోట్లాది రూపాయలు దోచుకోవడంతో పాటు నాసిరకం మద్యం అందించిందని, ఈ విధానానికి స్వస్తి చెబుతూ అక్టోబరు మొదటి వారంలో నూతన పాలసీని ప్రవేశపెడుతున్నామని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. సోమవారం టీడీపీ నియోజకవర్గ కార్యాలయం వద్ద ప్రజాదర్బార్ నిర్వహించారు. ప్రజల నుంచి మంత్రి పెద్ద ఎత్తున వినతి పత్రాలు స్వీకరించారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ సోడిశెట్టి బాలాజీలతో పాటు టీడీపీ సీనియర్ నేత గొర్రెపాటి గోపీచంద్, గోపు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రజాదర్బార్‌లో ప్రజలు సమర్పించిన పలు సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు. బుడమేరు వరద నష్టానికి జిల్లా మొత్తం అతలాకుతలమైందని, బాధితులకు ప్రభుత్వం సాయం అందిస్తుందన్నారు. అదే విధంగా కేంద్ర ప్రభుత్వం కూడా నష్టపరిహారం చెల్లించేందుకు ముందుకు వచ్చిందన్నారు. టీడీపీ, జనసేన కార్యకర్తలు సంయమనం పాటిస్తూ కార్యక్రమాలు నిర్వహించాలని మంత్రి హితవు పలికారు. వాగ్వివాదాలకు పాల్పడితే సహించేది లేదన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సనకా నాగులు, పీవీ ఫణికుమార్, పిప్పళ్ల కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

బ్యారేజీపైకి భారీ పడవలు కుట్రదారులపై చర్యలు తప్పవు..

మచిలీపట్నం టౌన్ : విజయవాడ మణిహారం ప్రకాశం బ్యారేజిని కూల్చేందుకు 50 టన్నుల బరువున్న పడవలను వదిలిన కుట్రదారులు వైసీపీ నాయకులపై చర్యలు తప్పవని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. సోమవారం రాత్రి ఆయన మీడియాతో మాట్లాడారు. బుడమేరు వరదతో విజయవాడ మహానగరంలో 32 డివిజన్లు నీట మునిగాయని, లక్షలాది మంది తీవ్రమైన అవస్థలకు గురయ్యారన్నారు. గన్నవరం, గుడివాడ, పెనమలూరు నియోజకవర్గాల్లో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారన్నారు. మాజీ సీఎం జగన్‌రెడ్డి బాధితుల వద్దకు వెళ్లకుండా విమర్శలు చేయడం హాస్యాస్పదమన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ పిలుపునకు స్పందించి పెద్ద ఎత్తున సేవలందించడంతో విజయవాడ నగరం కోలుకుందన్నారు. కరకట్టలు, బ్యారేజీల వద్ద తెల్లవార్లు కాపలా కాసిన అధికారులు, కార్యకర్తల రుణం తీర్చుకోలేమన్నారు. గత ప్రభుత్వం సరైన చర్యలు తీసుకోకపోవడం వల్లే బుడమేరుకు వరదలు దాపురించాయన్నారు.

ఇసుక అక్రమ రవాణా.. రెండు ట్రాక్టర్ల సీజ్



సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్లు

చిట్యాల(తిరువూరు) : చిట్యాల సమీపంలోని కట్టలేరు వాగునుంచి కొందరు వ్యక్తులు, ఇసుక అక్రమ తోలకాలను యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. సోమవారం ఉదయం నుంచి వాగులో పెద్దఎత్తున ట్రాక్టర్లతో తెలంగాణ ప్రాంతానికి, ఇసుక రవాణా భారీగా జరిగినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇసుక, మట్టి అక్రమంగా తరలిస్తున్నా అధికారులు మిన్నకుండటం పట్ల, పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఒకవైపు పట్టణంలో వినాయక విగ్రహాల నిమజ్జనం సందర్భంగా పోలీసులు రహదారిపై బందోబస్తు నిర్వహిస్తుండగా, ఇసుక ట్రాక్టర్లు వెళుతున్నా ఎవరూ పట్టించుకోకపోవడం గమనార్హం. ఇదే విషయమై తహసీల్దార్ లక్ష్మిని వివరణ కోరగా.. ఇసుక తోలకాలపై సమాచారం వచ్చిందని, వాగువద్దకు రెవెన్యూ సిబ్బందిని పంపుతున్నట్టు తెలిపారు.

చిట్యాల వాగునుంచి ఇసుక తోలకాలు చేస్తున్న రెండు ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఉదయం నుంచి భారీస్థాయిలో ఇసుక తరలిస్తున్నా మొక్కుబడిగా రెండు ట్రాక్టర్లను పట్టుకున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

బై బై గణేశా..

మంగినపూడి బీచ్‌లో 102 విగ్రహాల నిమజ్జనం



మంగినపూడి బీచ్‌లో వినాయక నిమజ్జనంలో భక్తులు

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 16 : మచిలీపట్నంలో సోమవారం మంగినపూడి బీచ్‌కు దాదాపు వంద వినాయక విగ్రహాలు నిమజ్జనానికి తరలాయి. మేళతాళాలు, డిజేలతో, జానపద నృత్య కళాకారులతో ఊరేగింపుగా బీచ్‌కు భక్తులు తరలివెళ్లారు. పండుగ వాతావరణంలో బీచ్‌కు ట్రాక్టర్లు, లారీలపై నిమజ్జనానికి విగ్రహాలను తీసుకుని వెళ్లారు. డీఎస్పీ అబ్దుల్ సుభాన్, ఆర్‌పేట సీఐ ఏసుబాబు, బందరు రూరల్ ఎస్ఐ నాగరాజులతో పాటు పెద్ద సంఖ్యలో పోలీసులు శాంతి భద్రతలను పరిరక్షించారు. మిలాద్ ఉన్‌నబి ర్యాలీలు, గణేష్ నిమజ్జన ర్యాలీలతో పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించారు. సముద్ర తీరం విగ్రహాలతో రంగులమయమైంది.

విగ్రహ నిమజ్జనంలో రెండు వర్గాల వివాదం.. ఉద్రిక్తత

పెడన : పెడన బస్టాండ్ సెంటర్‌లో ఆదివారం రాత్రి ఇరువర్గాల మధ్య వివాదం ఉద్రిక్తతకు దారితీసింది. ముందు జాగ్రత్త చర్యగా పట్టణంలో పోలీసులు మోహరించారు. బస్టాండ్ సెంటర్‌లోని గణపతి ఆలయం సమీపంలో ఒక వర్గానికి చెందిన వారు జెండా కట్టగా మరో వర్గం అభ్యంతరం తెలిపింది. ఈ సందర్భంగా ఇరువర్గాల మధ్య వాగ్వివాదం జరిగి పరిస్థితి ఉద్రిక్తంగా మారుతున్న సమయంలో పోలీసులు ఇరువర్గాలకు నచ్చచెప్పి శాంతింప చేశారు. జెండా కట్టిన వర్గానికి అనుకూలంగా ఇతర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన వ్యక్తులు విధ్వంసం సృష్టించారు. గణపతి ఆలయంపైన, విగ్రహంపైన రాళ్లదాడి చేశారు. ఈ దాడిలో విధులు నిర్వహిస్తున్న సీఐ నాగేంద్రప్రసాద్, కానిస్టేబుల్ నాగరాజుకు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసు వాహనం పాక్షికంగా ధ్వంసమైంది. జెండా కట్టడాన్ని వ్యతిరేకించిన వర్గానికి చెందిన కొందరు దాడిలో గాయపడ్డారు. ఈ పరిస్థితుల్లో పోలీసులు లాఠీలకు పని చెప్పారు. దీంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. సోమవారం సాయంత్రం మళ్లీ గొడవలు జరిగే అవకాశం ఉండటంతో పట్టణంలో పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. పట్టణ శివార్లలో పోలీసు పికెట్‌లు ఏర్పాటు చేశారు.

అనధికార పార్కింగ్ దందా

(5వ పేజీ తరువాయి)

మూడు రెట్లు అధిక ధర వసూలు చేస్తున్నారు. ఇదేమని ప్రశ్నించిన వాహనదారులపై దాడులు చేస్తున్నారు. కెనాల్ రోడ్డు పార్కింగ్‌లో గత శనివారం పార్కింగ్ మాఫియా దందాను ప్రశ్నించిన ఓ వాహనదారుడిపై కాంట్రాక్టర్ మైలవరపు వినయ్ దాడి చేయడం వివాదాస్పదమవుతోంది. అంతే కాదు.. ఈ పార్కింగ్‌ను అనధికారికంగా నిర్వహిస్తుండటం గమనార్హం.

నిబంధనలకు విరుద్ధంగా..

కెనాల్ రోడ్డు వినాయకుడి గుడి వెనుక ఉన్న 1,000.29 చదరపు అడుగుల పార్కింగ్ స్థలానికి ఆగస్టు 8న విజయవాడ నగరపాలక సంస్థ అధికారులు ఏడాదికి వేలం నిర్వహించారు. మొత్తం 34 మంది టెండర్ ఫారాలు కొన్నారు. 27 మంది పాల్గొనగా, మైలవరపు వినయ్ రూ.32 లక్షలకు పాడుకున్నారు. కార్పొరేషన్ నిబంధనల ప్రకారం టెండరును దక్కించుకున్న కాంట్రాక్టర్.. పాడుకున్న మొత్తంలో మూడో వంతు సొమ్ము కార్పొరేషన్‌కు చెల్లించాలి. స్టాండింగ్ కమిటీలో ఆమోదం పొందాక కమిషనర్ అనుమతితో టెండర్‌దారుడికి పార్కింగ్ స్థలాన్ని అప్పగించాలి. అయితే, గతనెల 27వ తేదీన జరిగిన స్టాండింగ్ కమిటీలో పార్కింగ్ వేలం పాటకు ఆమోదం తెలిపారు. నిబంధనల ప్రకారం టెండరుదారుడు ముందస్తుగా పాడుకున్న మొత్తంలో మూడో వంతు సొమ్ము కార్పొరేషన్‌కు చెల్లించి కమిషనర్ అనుమతి తీసుకోవాలి. కానీ, స్టాండింగ్ కమిటీ అనుమతి లభించిన వెంటనే కాంట్రాక్టర్ స్థలాన్ని స్వాధీనం చేసుకుని అనధికారికంగా పార్కింగ్ రుసుం వసూలు చేయడం ప్రారంభించారు. నిబంధనల ప్రకారం ఒక కారును మూడు గంటల పాటు పార్కింగ్ చేసినందుకు రూ.30, మోటార్ సైకిల్‌కు రూ.10 చొప్పున వసూలు చేయాలి. అదికూడా కార్పొరేషన్ నిర్ణయించిన వినాయకుడి గుడి వెనుక నుంచి 1,000.29 చదరపు అడుగుల ప్రాంతంలో ఉన్న వాహనాల నుంచే రుసుము వసూలు చేయాలి. కాంట్రాక్టర్ ఆ నిబంధనలు ఉల్లంఘించి కార్పొరేషన్ రశీదు పేరుతో కారు, ఆటోలకు రూ.50 నుంచి రూ.100, తుఫాను వాహనం, మినీ బస్సులకు రూ.100 నుంచి రూ.200 చొప్పున అడ్డగోలుగా వసూలు చేస్తున్నారు. వినాయకుడి గుడి నుంచి బొడ్డుబొమ్మ సెంటర్ వరకు సుమారు 6 వేల చదరపు అడుగుల్లో పార్కింగ్ రుసుం వసూలు చేస్తున్నారు.

ప్రశ్నిస్తే దాడులు

వాహనాల నుంచి అదనంగా రుసుం వసూలు చేస్తున్నారని వాహనదారులు ప్రశ్నిస్తుంటే, వారిపై దౌర్జన్యానికి, బెదిరింపులకు పాల్పడుతున్నారు. గత శనివారం ఓ వాహనదారుడు తన కారును అక్కడ పార్కింగ్ చేసుకుని వెళ్తుండగా, నిర్ణీత రుసుం కంటే ఎందుకు ఎక్కువ వసూలు చేస్తున్నారని ప్రశ్నించాడు. దీంతో అతనిపై దాడికి తెగబడ్డారు. కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తామన్నా ఎవరికి చెప్పుకొంటావో చెప్పుకోమంటూ రుబాబు చేశారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	119, 128, 139
చికెన్ విత్ స్కిన్	236
చికెన్ స్కిన్‌లెస్	246



నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.45

రాజీవ్‌నగర్‌లో విజన్ ఫర్ ఆసియా ఉచిత వైద్య పరీక్షలు

వన్‌టౌన్, సెప్టెంబరు 16: విజన్ ఫర్ ఆసియా స్వచ్ఛంద సంస్థ, వియ్ ఫర్ యు ట్రస్ట్, ఆశ్రయం హ్యాండ్ ఆఫ్ హోప్ సంస్థల సహకారంతో రాజీవ్‌నగర్ వరద బాధితులకు సోమవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. దాదాపు 300 మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. వైద్యులు వరప్రసాద్, వాసవి, స్వరూప్, సుష్మలు వైద్య పరీక్షలు నిర్వహించారు. మెడికల్ మేనేజర్ జయరాజ్ ఖరీదైన వైద్య పరికరాలను అందజేశారు. దాకూరి డేవిడ్, జె.జోసఫ్‌లు ఈ కార్యక్రమానికి సహకరించారు.



వరద ప్రాంతాల్లో త్వరితగతిన పారిశుధ్య పనులు పూర్తి చేయాలి

● కమిషనర్ హెచ్‌ఎం ధ్యానచంద్ర



చిట్టినగర్, సెప్టెంబరు 16: వరద ప్రభావిత ప్రాంతాల్లో త్వరితగతిన పారిశుధ్య పనులు పూర్తి చేసి ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. సోమవారం ముస్తాబాద్, రాజీవ్‌నగర్, ఉడాకాలనీ, నున్న కండ్రిక తదితర ప్రాంతాల్లో కమిషనర్ పారిశుధ్య పనులను పరిశీలించారు. వరద ప్రాంతాల్లో పేరుకుపోయిన వ్యర్థాలను యుద్ధప్రాతిపదికన తొలగించాలన్నారు. వరద ప్రాంతాల్లో ఉన్న స్కూల్స్ ఆసుపత్రుల పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో ప్రజారోగ్య విభాగాధికారులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న బొప్పన భవకుమార్

అన్నదానం

పటమట: 13వ డివిజన్ పటమట రఘురామకల్యాణ వేదికలో వినాయక చవితి సందర్భంగా శ్రీ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బొప్పన భవకుమార్ సోమవారం ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు ఆలూరి శంకరరావు, డాక్టర్ నందకుమార్‌లు పాల్గొన్నారు.

కృష్ణలంక: కృష్ణలంక 20వ డివిజన్ ఎం హోటల్ సెంటర్ వద్ద వినాయక చవితి ఉత్సవాల కార్యక్రమంలో భాగంగా సోమవారం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో టీడీపీ యువ నాయకుడు గద్దె క్రాంతి కుమార్ పాల్గొని ప్రారంభించారు. అన్నదానం నిమిత్తం కమిటీ వారికి రూ.5 వేల ఆర్థిక సాయాన్ని ఆయన అందజేశారు.

ఓజోన్ రక్షణ అందరి బాధ్యత



కేవీఎస్ఆర్ సిద్ధార్థ ఫార్మశీ విద్యార్థుల ర్యాలీ

మొగల్రాజపురం, సెప్టెంబరు 16: భూమి మీద జీవరాశులు బతకాలంటే సూర్యకాంతి నుంచి వచ్చే అల్ట్రావయెలెట్ కిరణాలను అడ్డుకునే ఓజోన్ పొర అతి ముఖ్యమైనదని, దానిని కాపాడుకునే బాధ్యత ప్రతి ఒక్కరిదని నగర వాసులకు కేవీఎస్ఆర్ సిద్ధార్థ ఫార్మశీ విద్యార్థులు అవగాహన కల్పించారు. అంతర్జాతీయ ఓజోన్ దినోత్సవాన్ని పురస్కరించుకుని కళాశాల ఫార్మా కాగ్నసీ, ఎకో క్లబ్, ఎన్‌ఎస్‌ఎస్ విభాగం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. పారిశ్రామికీకరణలో వెలువడే వ్యర్థాలు, ఏసీలు, వాహనాలు, ఫ్రిడ్జ్‌ల వల్ల వచ్చే కాలుష్యం వల్ల వాతావరణంలో ఉండే ఓజోన్ పొర ఎలా పాడవుతుందో, దానిని రక్షించుకోవాలంటే ఎం చేయాలనే దాని మీద ఈ ర్యాలీలో ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఘంటా విజయ్‌కుమార్, డాక్టర్ వి.కరుణశ్రీ, డాక్టర్ పి. శ్వేత, విద్యార్థులు పాల్గొన్నారు.

పీబీ సిద్ధార్థ కళాశాలలో..

అంతర్జాతీయ ఓజోన్ పరిరక్షణా దినోత్సవాన్ని పీబీ సిద్ధార్థ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. సోమవారం విద్యార్థులకు భౌతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఓజోన్ పరిరక్షణపై క్విజ్, వ్యాసరచన, డ్రాయింగ్, ఉపన్యాసం, పోస్టర్ ప్రజంటేషన్ పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రాజెక్టు మేనేజర్, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, అకడమిక్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా(హైదరాబాద్) ఉత్తమ్‌సింగ్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్, ఏపీ కాలుష్యనియంత్రణ మండలి పి.శ్రీనివాసరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలలు, కళాశాలల నుంచి సుమారు 400 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థినీ విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మనోరంజని, డీన్ రాజేష్ జంపాల, భౌతికశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ టీఎస్ కృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేబీఎన్ కాలేజీలో..

వన్‌టౌన్: కేబీఎన్ కళాశాల పీజీ, యూజీ రసాయన శాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో సోమవారం ఓజోన్ పరిరక్షణ దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఓజోన్ పొర క్షీణత, పర్యావరణానికి ముప్పు అనే అంశంపై జరిగిన సదస్సుకు కేఎల్ విశ్వవిద్యాలయ రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఎ. వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలుష్యాల వల్ల పర్యావరణ సమతుల్యత దెబ్బతిని గ్లోబల్ వార్మింగ్, తద్వారా జీవవైవిధ్యం దెబ్బతింటుందన్నారు. విద్యార్థులకు ఈ విషయంపై మరింత లోతైన అవగాహన ఉండాలన్నారు. హిందూ హైస్కూల్ విద్యా సంస్థల పాలనా అధికారి డాక్టర్ ఎ. నారాయణరావు మాట్లాడుతూ విద్యార్థులు తమ జీవన విధానంలో మార్పులు తెచ్చుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. కృష్ణవేణి, విభాగాధిపతులు కేపీటీ విజయభాస్కర్, డాక్టర్ ఓ. శైలజ, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు అతిథులు బహుమతులు అందజేశారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న అతిథులు



విజయవాడ	స్వర్ణమల్టీప్లెక్స్	మచిలీపట్నం	సిరివెంకట్
విజయవాడ	ఊర్వశి INOX	గుడివాడ	ABR సినిమాస్
ఎంజీరోడ్	లైలా INOX	పెడన	శ్రీకృష్ణతులసి
లబ్బీపేట	పీవీపీసినీపోలీస్	గుడ్లవల్లేరు	రామకృష్ణ
బెంజిసర్కిల్	క్యాపిటల్‌సినిమాస్	కైకలూరు	శ్రీవెంకటరమణ
పటమట	LEPL INOX	బంటుమిల్లి	నటరాజ్
అశోక్‌నగర్	పవర్1 సినీపోలీస్	గన్నవరం	శాంతి
వన్‌టౌన్	సాయిరామ్ స్క్రీన్స్	హనుమాన్‌జంక్షన్	శ్రీకృష్ణాటాకీస్
భవానీపురం	స్వాతి	నూజివీడు	ద్వారకకాంప్లెక్స్
పాయకాపురం	రవీంద్రసినిమాస్	ఇబ్రహీంపట్నం	స్వర్ణసినీమ్యాక్స్
కానూరు	శ్రీవిజయలక్ష్మి	కంచికచర్ల	పీవీఆర్‌సినీప్లెక్స్
పోరంకి	బాలాజీ సినీవిల్లా	నందిగామ	విజయ
కంకిపాడు	శ్రీవిజయలక్ష్మి	జగ్గయ్యపేట	శ్రీఅలంకార్‌సినిమాస్
ఉయ్యూరు	శాంతి	మైలవరం	సంఘమిత్ర
పామర్రు	శివరామ్	తిరువూరు	న్యూప్యాలెస్
చల్లపల్లి	కోమల	విస్సన్నపేట	వెంకటేశ్వర
అవనిగడ్డ	రామకృష్ణ		

Annapurna Studios (P) Ltd release

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ



గవర్నర్‌పేట, సెప్టెంబరు 16: బుడమేరు ముంపునకు గురైన ప్రాంతాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య పనులు నిర్వహించిన విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ శానిటరీ కార్మికులకు మహంతి అప్పలనరసయ్య, మహాలక్ష్మీ (ఎంఏఎం) చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. 25వ డివిజన్ సీతారామపురంలోని ట్రస్ట్ కార్యాలయం వద్ద ముంపు ప్రాంతాల్లో పనిచేసిన 300 మంది శానిటరీ సిబ్బందికి ట్రస్ట్ చైర్మన్ మహంతి వాసుదేవరావు (వాసు) దంపతులు దుప్పట్లు, చీరలు పంపిణీ చేయడంతో పాటు స్వీట్ ప్యాకెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మహంతి గౌతమి పాల్గొన్నారు.



పటమట : 12వ డివిజన్‌లో పారిశుధ్య కార్మికులకు సోమవారం టీడీపీ యువ నాయకుడు గద్దె క్రాంతి కుమార్, కార్పొరేటర్ పొట్లూరి సాయి బాబులు దుస్తులు పంపిణీ చేశారు. వరదల సమయంలో అందించిన సేవలను వారు కొనియాడారు.

మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో 3 నుంచి దసరా ఉత్సవాలు

చిట్టినగర్, సెప్టెంబరు 16: చిట్టినగర్‌లో ఉన్న మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో అక్టోబరు 3వ తేదీ నుంచి 12వ తేదీ వరకు దసరా ఉత్సవాలను కన్నుల పండువగా నిర్వహించేందుకు కమిటీ నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. అక్టోబరు 3న మహాలక్ష్మీదేవి అలంకారం, 4న బాలాత్రిపుర సుందరీదేవి, 5న గాయత్రిదేవి, 6న అన్నపూర్ణాదేవి, 7న లలితా త్రిపురసుందరీదేవి, 8న సంతోషిమాతదేవి, 9న సరస్వతిదేవి, 10న దుర్గాదేవి, 11న మహిషాసురమర్దని దేవి, 12న రాజరాజేశ్వరిదేవి అలంకారంలో మహాలక్ష్మి అమ్మవారు దర్శనమిస్తారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గవర్నర్‌పేట, సెప్టెంబరు 16: విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం సూర్యారావుపేట సెక్షన్ నక్కలరోడ్డు ఫీడర్ పరిధిలో మంగళవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ ఈఈ బీవీ సుధాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏలూరు రోడ్డు ఫెూరీల దొడ్డి ఏరియా, విజయా టాకీస్ ఏరియా, నక్కలరోడ్డు, చిలుకు దుర్గయ్య వీధి, గోవిందరాజులు నాయుడు వీధి, నరసింహ నాయుడు వీధి, కాశేశ్వరరావు రోడ్డు, తాడేపల్లి వారి వీధి, పీసపాటి వారి వీధి, డోర్నకల్ రోడ్డు ప్రాంతాల్లో కరెంట్ ఉండదని తెలిపారు.



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న రిటైర్డ్ ఐపీఎస్ అధికారి రవీంద్రబాబు తదితరులు

బాధితులను స్వచ్ఛంద సంస్థలు ఆదుకోవాలి

చిట్టినగర్, సెప్టెంబరు 16: విపత్తుల బాధితులను ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు ఆదుకోవాలని రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఎం.రవీంద్రబాబు అన్నారు. ఏపీఎస్‌బీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం చిట్టినగర్ విశ్వబ్రాహ్మణ కల్యాణమండపంలో వరద బాధిత పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరద బాధితులకు నాయీ బ్రాహ్మణ ఎంప్లాయీస్ వెల్ఫేర్ సర్వీసెస్ పలు సేవలు అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుతోరణం ప్రతిక సంపాదకుడు అన్నవరపు బ్రహ్మయ్య, తుమ్మిడి సంస్థల యజమాని తుమ్మిడి శ్రీనివాస్, ఏపీఎస్‌బీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్కాపురం కనకారావు, నాయకులు కె. భానుప్రసాద్, కుటుంబ సంక్షేమ శాఖ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ ఎం. రామనాథం, నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు డి.రాము, నవిరి మహేష్, రాయవరపు గణపతి తదితరులు పాల్గొన్నారు.

కండ్రికలో దివ్యాంగులకు సరుకుల కిట్ల పంపిణీ



వన్‌టౌన్: బుడమేరు వరద ముంపునకు గురైన 64వ డివిజన్ కండ్రిక ప్రాంతంలో 100 మంది దివ్యాంగులకు విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ఆదేశాల మేరకు డివిజన్ టీడీపీ నాయకులు కె. రవికుమార్ ఆధ్వర్యంలో నిత్యావసర కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సీహెచ్ శోభారాణి, సీహెచ్ చంద్రహాస్, ఎం.పూజిత, మనోజ్, జయలలిత, సుదీక్ష, అమరేశ్వరరావు, పాల్గొన్నారు.

వాకర్స్ ఉదారత



భవానీపురం: భవానీపురం వాకర్స్ ఫ్రెండ్ సర్కిల్ సభ్యులు చనుమోలు ఫ్లై ఓవర్ బ్రిడ్జి కింద సోమవారం 500 మంది నివాసితులకు రూ.60వేల విలువైన దోమతెరలు, ప్లాస్టిక్ బక్కెట్, భోజనం ప్లేట్, రెండు మగ్గులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ ప్రెసిడెంట్ రాము, సెక్రటరీ కృష్ణారెడ్డి, ట్రెజరర్ వెంకటరెడ్డి, కనకారావు, జనార్ధనరావు, చెక్కా శ్రీనివాస్, రామచంద్రరావు, మధు, సుబ్బారావు, నారిండి కిషోర్‌లు పాల్గొన్నారు.

దుప్పట్లు, వాటర్ బాటిళ్ల పంపిణీ



విద్యాధరపురం: 40వ డివిజన్ భవానీపురంలో వరద బాధితులు 700 కుటుంబాలకు అలుగుండ్ల సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం వాటర్ బాటిల్స్, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, రాష్ట్ర నాయకుడు ఎంఎస్ బేగ్, మంచు వెంకటేష్ యాదవ్, వెలుగు పిచ్చయ్య, బొమ్మనబోయిన శ్రీను, మల్లెల వెంకట రెడ్డి, తిరుపతి రెడ్డి పాల్గొన్నారు.

రోజ్ సొసైటీ ఆధ్వర్యంలో...



పటమట: రోజ్ సొసైటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో సోమవారం జక్కంపూడి, అజిత్‌సింగ్‌నగర్, రాజరాజేశ్వరిపేట వరద బాధితులు వెయ్యి మందికి రూ.5లక్షల విలువ గల దుప్పట్లు, టవళ్లు, నైటీ, లుంగీలు, నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ ఉష, సెక్రటరీ ఘంటసాల లక్ష్మి, ట్రెజరర్ స్వామి, విజయబాబు, మాధవి, రత్నలక్ష్మి, లక్ష్మితులసి, సుమబిందు, పద్మావతి, విజయలక్ష్మి, మౌనిక, విశాల పాల్గొన్నారు.

అనంతలక్ష్మి సేవా సంఘం ఆధ్వర్యంలో ...



సత్యనారాయణపురం: అనంతలక్ష్మి సేవా సంఘం ఆధ్వర్యంలో సోమవారం ముత్యాలంపాడు అల్లూరి సీతారామరాజు కల్యాణ మండపంలో బుడమేరు మధ్యకట్ట, విజయదుర్గానగర్‌లోని వరద బాధితులకు పదిరోజులకు సరిపడా నిత్యావసర వస్తువులు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అనంతలక్ష్మీ సేవా సంఘం అధ్యక్షుడు అప్పలరాజు, టీడీపీ నాయకుడు క్షత్రియసేవా సంఘం సభ్యులు మురళీకృష్ణంరాజు, సత్యనారాయణ రాజు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



రైల్వే మిక్స్‌డ్ హైస్కూల్ పూర్వ విద్యార్థుల వితరణ

రైల్వేస్టేషన్: రైల్వే మిక్స్‌డ్ హైస్కూల్ 1990- 1991 బ్యాచ్ విద్యార్థులు తమ వంతుగా వరద బాధితులకు దుస్తులు పంపిణీ చేశారు. సోమవారం జరిగిన కార్యక్రమంలో సుమారు లక్ష రూపాయల విలువైన దుస్తులను బాధితులకు అందజేశారు.

టీడీపీ 56వ డివిజన్ అధ్యక్షుడికి బుద్ధా ఆర్థిక సాయం



వన్‌టౌన్, సెప్టెంబరు 16: ఇటీవల వరదల్లో పాత రాజరాజేశ్వరిపేటలోని 56వ డివిజన్ అధ్యక్షుడు ఎం.ఈశ్వర్ ఇల్లు నీట మునిగి గృహోపకరణాలన్నీ పాడైపోవటంతో వాటి కొనుగోలు నిమిత్తం టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్ధా వెంకన్న సోమవారం రూ.20 వేలు ఆర్థిక సహాయాన్ని అందించారు. ఆయన అల్లుడు పశ్చిమ టీఎన్‌టీయూసీ గౌరవ అధ్యక్షుడు కాండ్రేగుల రవీంద్ర ఈ సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో 40వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు పొనుగుపాటి చిన సుబ్బయ్య, నందం భవానీప్రసాద్, 52వ డివిజన్ అధ్యక్షుడు ఈగల సాంబ, నారాయణ, బొక్కల సత్తిబాబు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక



మధురానగర్, సెప్టెంబరు 16: తిరుమల తిరుపతి దేవస్థానంలో అర్బన్ డిజైన్, ప్లానింగ్ ఎక్స్‌పర్ట్‌గా నియామకమైన ఏపీ మాజీ టౌన్ ప్లానింగ్ డైరెక్టర్ వి.రాముడిని మధురానగర్ షిర్డీ సాయిబాబా మందిర కార్యదర్శి, ఏపీఎన్జీవో మాజీ నాయకుడు, బీసీ ముదిరాజ్ సభ నాయకుడు పీవీఎల్ఎన్ రాజు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నీతి నిజాయితీ గల రాముడిని ఈ పదవిలో నియమించినందుకు సీఎం చంద్రబాబుకు, దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.

నేడు మెగా రక్తదాన శిబిరం

విద్యాధరపురం, సెప్టెంబరు 16: ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా మంగళవారం భవానీపురంలోని ఎన్డీయే కార్యాలయంలో మెగా రక్తదాన శిబిరం జరుగుతుందని కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగే ఈ శిబిరంలో రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు.

వరద బాధితుల గోడు పట్టని జగన్

9వ డివిజన్‌లో దుస్తులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే గద్దె



పటమట, సెప్టెంబరు 16 : గత వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు అనేక ప్రకృతి వైపరీత్యాలు, తుఫాన్‌లు సంభవించాయని, ఆ సమయంలో అప్పటి సీఎం జగన్ బాధితులను పరామర్శించడం గానీ, ఒక్క రూపాయి ఆర్థిక సాయంగాని చేయలేదని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ఆరోపించారు. 9వ డివిజన్ పటమటలంక అవధూత ఆశ్రమం వద్ద అనంత్ డైమండ్స్ ఆధ్వర్యంలో 400 మంది వరద బాధితులకు దుప్పట్లు, చీరలను ఎమ్మెల్యే గద్దె, దాత జాస్తి పద్మ శేఖర్‌లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ చెన్నుపాటి కాంతి శ్రీ, చెన్నుపాటి గాంధీ, యలమంచలి దేవేంద్ర, అన్నాభత్తుల బాబీ, కడియం మురళీకృష్ణ, రమేష్, లక్ష్మి నరసింహాలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం: ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు ప్రతీ రోజు డివిజన్లలో పర్యటిస్తున్నానని, తద్వారా అవి పరిష్కారం అవుతాయని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ భరోసా ఇచ్చారు. 9వ డివిజన్ పటమటలంక అవధూత ఆశ్రమం సమీపంలో ఆయన స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కరెంట్ కనెక్షన్లు లేక ఇబ్బంది పడుతున్నామని, మంచినీరు అందించాలని స్థానికులు ఎమ్మెల్యేకు మొరపెట్టుకున్నారు. వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని కోరగా, అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ● పటమటలంకకు చెందిన మైలా లక్ష్మి టిఫిన్ బండి నడుపుకునేందుకు ఆర్థిక సాయం చేయాలని కోరగా, గద్దె తన సొంత నిధులతో రూ.5వేల ఆర్థిక సహాయం అందజేశారు.

మేనేజ్‌మెంట్ కోర్సుల్లో ప్రవేశానికి క్యాట్



దరఖాస్తు గడువు తేదీ సెప్టెంబరు 20కి పొడిగింపు

మేనేజ్‌మెంట్ కోర్సుల్లో ప్రవేశాలకు ఉద్దేశించిన పరీక్ష 'కామన్ అడ్మిషన్ టెస్ట్(క్యాట్)' దరఖాస్తు గడువు తేదీని పొడిగించారు. అర్హులైన అభ్యర్థులు సెప్టెంబరు 20వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఆన్‌లైన్ కంప్యూటర్ ఆధారిత విధానంలో నిర్వహించే క్యాట్‌లో సాధించిన పర్సంటైల్ ఆధారంగా సీట్లను కేటాయిస్తారు. క్యాట్ స్కోరు ఆధారంగా ఐఐఎంలే కాకుండా ఇతర ప్రముఖ కళాశాలలు కూడా సీట్లను భర్తీ చేస్తాయి. ఈ ఏడాది పరీక్షను దేశవ్యాప్తంగా 170 నగరాల్లో నిర్వహించనున్నారు.

ఐఐఎంలు: ముంబయి, అమృత్‌సర్, బెంగళూరు, బోధ్ గయా, కోల్‌కతా, ఇండోర్, జమ్ము, కాశీపూర్, కోజికోడ్, లఖ్‌నవూ, నాగ్‌పూర్, రాయ్‌పూర్, రాంచీ, రోహ్‌తక్, సంబల్‌పూర్, షిల్లాంగ్, సిర్మౌర్, తిరుచిరాపల్లి, ఉదయపూర్, విశాఖపట్నం.

అర్హత: కనీసం 50 శాతం మార్కులతో బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు 45 శాతం మార్కులు చాలు. డిగ్రీ చివరి సంవత్సరం పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

పరీక్ష విధానం: ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారు. పరీక్షలో మూడు విభాగాలు ఉంటాయి. సెక్షన్-1 వెర్బల్ ఎబిలిటీ అండ్ రీడింగ్ కాంప్రహెన్షన్, సెక్షన్-2 డేటా ఇంటర్‌ప్రిటేషన్ అండ్ లాజికల్ రీజనింగ్, సెక్షన్-3 క్వాంటిటేటివ్ ఎబిలిటీ నుంచి ప్రశ్నలు ఇస్తారు. ప్రతి ప్రశ్నకు మూడు మార్కులు కేటాయించారు. పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి ఆయా సంస్థలు గ్రూప్ డిస్కషన్స్, రిటెన్ ఎబిలిటీ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూస్ నిర్వహించి తుది ఎంపికను చేపడతాయి.

రిజిస్ట్రేషన్ ఫీజు: రూ.2500. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులు రూ.1250 చెల్లించాలి.

తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: అనంతపురం, చిత్తూరు, గుంటూరు, కాకినాడ, కర్నూలు, నెల్లూరు, రాజమండ్రి, శ్రీకాకుళం, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, విజయనగరం, హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, వరంగల్.

దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 20

అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్: నవంబరు 5 నుంచి 24 వరకు

పరీక్ష తేదీ: నవంబరు 24

ఫలితాల ప్రకటన: జనవరి రెండో వారంలో

వెబ్‌సైట్: https://iimcat.ac.in/

దిక్సూచి DIKSUCHI

ఎన్‌జీ రంగా వర్సిటీలో ఎన్ఆర్ఐ కోటా

గుంటూరులోని ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ- పీజీ, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ఎన్ఆర్ఐ/ఎన్ఆర్ఐ స్పాన్సర్డ్ కోటా సీట్ల భర్తీకి దరఖాస్తు గడువు పొడిగించింది. అకడమిక్ మెరిట్, ఇంటర్వ్యూల ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. ప్రవాస భారతీయుల పిల్లలు, వారు స్పాన్సర్ చేసిన బంధువుల పిల్లలు దరఖాస్తు చేసుకోవచ్చు. పీజీ ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. పీహెచ్‌డీ వ్యవధి మూడేళ్లు. ఇందులో ఆరు సెమిస్టర్లు ఉంటాయి. గరిష్ఠంగా ఏడేళ్లలో పూర్తిచేసే వీలుంది.



స్పెషలైజేషన్‌లు

అగ్రికల్చర్: జెనెటిక్స్ అండ్ ప్లాంట్ బ్రీడింగ్, ప్లాంట్ పాథాలజీ, సీడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, మైక్రో బయాలజీ, సాయిల్ సైన్స్, మాలిక్యులర్ బయాలజీ అండ్ బయోటెక్నాలజీ, ప్లాంట్ ఫిజియాలజీ, ఎంటమాలజీ, ఆగ్రోనమీ, అగ్రికల్చరల్ ఎకనావిక్స్, అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ ఎడ్యుకేషన్, అగ్రికల్చరల్ స్టాటిస్టిక్స్, అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్.

అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ: సాయిల్ అండ్ వాటర్ కన్జర్వేషన్ ఇంజనీరింగ్, ప్రాసెస్ అండ్ ఫుడ్ ఇంజనీరింగ్, ఫామ్ మెషినరీ అండ్ పవర్ ఇంజనీరింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ టెక్నాలజీ.

కమ్యూనిటీ సైన్స్(హోమ్ సైన్స్): ఫుడ్ అండ్ న్యూట్రిషన్, హ్యూమన్ డెవలప్‌మెంట్ అండ్ ఫ్యామిలీ స్టడీస్, రిసోర్స్ మేనేజ్‌మెంట్ అండ్ కన్జూమర్ సైన్స్, ఎడ్యుకేషన్ అండ్ కమ్యూనికేషన్ మేనేజ్‌మెంట్.

సీట్ల వివరాలు: పీజీ ప్రోగ్రామ్‌లో 53 సీట్లు ఉన్నాయి. కమ్యూనిటీ సైన్స్, అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ విభాగాలకు ఒక్కోదానిలో రొటేషనల్ బేసిస్ మీద 6 సీట్లు నిర్దేశించారు. అగ్రికల్చర్ విభాగానికి 41 సీట్లు కేటాయించారు.

- పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో 14 సీట్లు ఉన్నాయి. కమ్యూనిటీ సైన్స్, అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ విభాగాలకు ఒక్కో దానిలో రొటేషనల్ బేసిస్ మీద ఒక సీటు నిర్దేశించారు. అగ్రికల్చర్ విభాగానికి 12 సీట్లు కేటాయించారు.
- **దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 30
- **వెబ్‌సైట్:** www.angrau.ac.in

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లు

హైదరాబాద్‌లోని యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్(యూఓహెచ్) 2024-25 విద్యా సంవత్సరానికిగాను వివిధ పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి గడువు తేదీని పొడిగించింది. మొత్తం 22 పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఆల్ ఇండియా ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్, ఇంటర్వ్యూ ద్వారా సీట్లను భర్తీ చేస్తారు. హైదరాబాద్, భువనేశ్వర్, కొచ్చి, పట్నా, ఢిల్లీ, గువాహటి, కోల్‌కతాల్లో ప్రవేశ పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు.

స్పెషలైజేషన్లు - సీట్లు

- ఇంగ్లీష్-6, తెలుగు-19, ఉర్దూ-3, అప్లయిడ్ లింగ్విస్టిక్స్-8, హిస్టరీ-8, పొలిటికల్ సైన్స్-10, సోషియాలజీ-20, ఆంత్రోపాలజీ-9, ఎడ్యుకేషన్-2, రీజనల్ స్టడీస్-5, ఇండియన్ డయాస్పొరా-2, సోషల్ ఎక్స్‌క్లూజన్ అండ్ ఇన్‌క్లూజివ్ పాలసీ-4, జెండర్ స్టడీస్-5, ఎకనామిక్స్-28, డ్యాన్స్-3, ఆర్ట్ హిస్టరీ అండ్ విజువల్ స్టడీస్-1, కమ్యూనికేషన్-3, ట్రాన్స్‌లేషన్ స్టడీస్-4, ఇంగ్లీష్ లాంగ్వేజ్ స్టడీస్-8, హెల్త్ సైన్సెస్: ఆప్టోమెట్రి-2, మెటీరియల్స్ ఇంజనీరింగ్-16, నానో సైన్స్ అండ్ టెక్నాలజీ-4.
- ఇంతకు ముందు(నోటిఫికేషన్ తేదీ 2024 జూన్ 3) దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు మరల దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదు.


అర్హత: కనీసం 55 శాతం మార్కులతో సంబంధిత మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.600. ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు రూ.550; ఓబీసీ-ఎన్‌సీఎల్ రూ.400; ఎస్సీ/ఎస్టీ/పీడబ్ల్యూడీ(పీహెచ్) అభ్యర్థులకు రూ.275.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 20
- **హాల్ టిక్కెట్స్ డౌన్‌లోడ్:** అక్టోబరు 10
- **ప్రవేశ పరీక్ష తేదీలు:** అక్టోబరు 19, 20
- **ఇంటర్వ్యూకు ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** నవంబరు 18
- **ఇంటర్వ్యూలు :** నవంబరు 18 నుంచి 21 వరకు
- **ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** డిసెంబరు 2
- **అడ్మిషన్ కౌన్సిలింగ్ తేదీలు:** డిసెంబరు 10, 11
- **తరగతులు ప్రారంభం:** 2025 జనవరి 1
- **వెబ్‌సైట్:** http://acad.uohyd.ac.in/

నవ్య | చిత్రజ్యోతి

బీస్ట్ మోడ్ ఆన్



బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రామ్‌చరణ్ ఓ చిత్రంలో నటిస్తున్న సంగతి తెలిసిందే. స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతోన్న ఈ చిత్రానికి 'ఆర్‌సి16' అనేది వర్కింగ్ టైటిల్. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్‌లో ఉందీ చిత్రం. జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. తాజాగా, రామ్‌చరణ్ ఓ ఫొటోను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసి ఈ సినిమాపై అంచనాలను రెట్టింపు చేశారు. "బీస్ట్ మోడ్ ఆన్. ఆర్‌సీ 16 లోడింగ్" అని పేర్కొన్నారు.

ఓనమ్ పర్వదినం సందర్భంగా 'కూలీ' సినిమా సెట్స్‌లో సూపర్‌స్టార్ రజనీకాంత్ స్టెప్పులేశారు. ఆయన నటిస్తున్న 'వేట్టయాన్' సినిమాలోని 'మానసిలాయో' పాటకు స్టెప్పులేసి ఆయన చిత్రబృందంలో జోష్ తెచ్చారు. ఈ సినిమాలోని కీలక సన్నివేశాల చిత్రీకరణ వైజాగ్‌లో జరుగుతున్న సంగతి తెలిసిందే.








వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయనిధికి హీరో సాయిదుర్గ తేజ్ విరాళంగా ప్రకటించిన రూ. పది లక్షలు, హీరో విష్వక్‌సేన్ రూ పది లక్షలు, నిర్మాత సూర్యదేవర నాగవంశీ రూ. 25 లక్షలు, హాస్యనటుడు ఆలీ దంపతులు రూ. 3లక్షల చెక్కులను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంతరెడ్డికి అందజేశారు.

తిన్నడి స్నేహితుడు



విష్ణు మంచు నటిస్తున్న 'కన్నప్ప' నుంచి ప్రతి సోమవారం వస్తున్న అప్‌డేట్లు సినిమా మీద అంచనాలు పెంచుతున్నాయి. ఈ సోమవారం తిన్నడికి విధేయుడు, స్నేహితుడు అయిన టిక్కీని పరిచయం చేశారు. టిక్కీ మరెవరో కాదు.. విష్ణు స్వారీ చేసే గుర్రం. టిక్కీతో ఉన్న విష్ణు పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో విష్ణు లుక్ ఆకట్టుకుంటోంది. డాక్టర్ మోహన్‌బాబు ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న 'కన్నప్ప' చిత్రానికి ముఖేశ్‌కుమార్ సింగ్ దర్శకుడు. డిసెంబర్‌లో ఈ భారీ చిత్రం విడుదల కానుంది.

నువ్వే నా సూర్యుడు.. చంద్రుడు



నటుడు సిద్ధార్థ్, నటి అదితీరావు హైదరీ సోమవారం వివాహబంధంలోకి అడుగుపెట్టారు. దీనికి సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు అదితి. 'నువ్వే నా సూర్యుడు.. చంద్రుడు.. నువ్వే నా తారాలోకం. మిసెస్ అండ్ మిస్టర్ అదు సిద్దు' అనే కాప్షన్‌ను ఆమె జత చేశారు. వీరి పెళ్లి ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. వనపర్తి జిల్లా శ్రీరంగాపూర్‌లోని వీరి వివాహం జరిగిందని అంటున్నారు కానీ అక్కడి ఆలయంలో మాత్రం ఆ ఛాయలేవీ కనిపించలేదు. అక్కడ ఏ వివాహం కూడా జరగలేదని ఆలయ పూజారులు తెలియజేస్తున్నారు. మరెక్కడైనా ఆ వివాహం జరిగిందేమోననే భావన వ్యక్తమవుతోంది. అదితీరావు హైదరీ వనపర్తి సంస్థానాధీశుల్లో చివరి రాజుగా ఉన్న రామేశ్వర్‌రావు మనుమరాలు, ఆయన కూతురు విద్యారావు సంతానం అదితి. సిద్ధార్థ్, అదితి ఇద్దరికీ ఇది రెండో వివాహం. సిద్ధార్థ్ తన చిన్ననాటి స్నేహితురాలు మేఘనను 2003లో ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. ఆ తర్వాత 2007లో ఇద్దరి మధ్యలో వచ్చిన విభేదాల కారణంగా విడాకులు తీసుకున్నారు. అదితి 2002లో సత్యదీప్ మిశ్రాను పెళ్లి చేసుకొని 2012లో విడిపోయారు.

- ఆంధ్రజ్యోతి, శ్రీరంగాపూర్

బాలీవుడ్‌లో హీరోలు.. దక్షిణాదిలో విలన్లు

తెలుగు సినిమాల్లో ప్రతినాయక పాత్రలకు పరభాషా విలన్లను ఎంచుకోవటం మేకర్స్‌కు ఎప్పట్నుంచో ఉన్న ఆనవాయితీ. అయితే ఆ పరభాషా విలన్ల స్థానంలో ఇప్పుడు ఒకే ఇండస్ట్రీకి చెందిన నటులు ఎక్కువగా కనిపిస్తున్నారు. బాలీవుడ్‌లో హీరోలుగా ఉన్న ఎంతో మంది నటులు ఇప్పుడు దక్షిణాది సినిమాల్లో విలన్లుగా ఎంట్రీ ఇస్తున్నారు. అలా దక్షిణాదిలో విలన్లుగా మారిన వారెవరో ఓ లుక్కేద్దాం.








సైఫ్ అలీఖాన్

బాలీవుడ్‌లో మంచి హిట్ ట్రాక్ ఉన్న కథానాయకుల్లో సైఫ్ అలీఖాన్ ఒకరు. లవర్ బాయ్ నుంచి యాక్షన్ రోల్స్ వరకు ఎన్నో పాత్రల్లో నటించి మెప్పించిన ఆయన.. ప్రస్తుతం ప్రతినాయకుడిగా మారారు. ఇప్పటికే ఓం రౌత్ దర్శకత్వంలో ప్రభాస్ నటించిన పౌరాణిక చిత్రం 'ఆది పురుష్' చిత్రంలో రావణుడి పాత్రను పోషించారు సైఫ్. ఇప్పుడు కొరటాల శివ దర్శకత్వంలో ఎన్టీఆర్ నటిస్తున్న 'దేవర'లో 'భైర' పాత్రలో నటిస్తున్నారు. ఇటీవలే విడుదలైన 'భైర' గ్లింప్స్, ట్రైలర్‌తో సినిమాలో ఆయన పాత్ర ఎంత క్రూరంగా ఉంటుందో సినీ ప్రియులకు మేకర్స్ హింటిచ్చారు.

ఇమ్రాన్ హష్మీ

బాలీవుడ్‌లోనే మోస్ట్ రొమాంటిక్ హీరోల్లో ఇమ్రాన్ హష్మీ ఒకరు. సీరియల్ కిస్సర్‌గా పేరు తెచ్చుకున్న ఆయన.. ఇప్పుడు ప్రతినాయకుడి పాత్రలకు సిద్ధమయ్యారు. సుజీత్ దర్శకత్వంలో పవన్‌కల్యాణ్ నటిస్తున్న 'దే కాల్ హిమ్ ఓ.జీ' (ఒరిజినల్ గ్యాంగ్‌స్టర్)లో ఆయన ఓమి భాయ్ అనే పాత్రలో కనిపిస్తున్నారు. ఇమ్రాన్ బర్త్‌డే సందర్భంగా రిలీజైన పోస్టర్‌లో ఆయన పాత్ర ఎంతో పవర్‌ఫుల్‌గా ఉండబోతోందని అర్థమవుతోంది.





సంజయ్ దత్

దక్షిణాదికి బాలీవుడ్ నటుడు సంజయ్‌దత్ హీరోగానూ.. విలన్‌గానూ ఇప్పటికే సుపరిచితం. ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో యష్ హీరోగా నటించిన 'కేజీఎఫ్' సిరీస్‌లో 'అధీరా' పాత్రలో కరడుగట్టిన విలన్‌గా ఆయన కనిపించారు. గతేడాది లోకేశ్ కనగరాజ్, తమిళ నటుడు విజయ్ కలయికలో వచ్చిన 'లియో'లోను ఆయన పోషించిన పాత్ర ప్రతినాయక ఛాయలున్నదే. ఈ మధ్యే రామ్ హీరోగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో తెరకెక్కిన 'డబుల్ ఇస్మార్ట్' చిత్రంలోనూ 'బిగ్ బుల్'గా ఆయన అదరగొట్టారు. ప్రస్తుతం మారుతి దర్శకత్వంలో ప్రభాస్ నటిస్తున్న హారర్ కామెడీ 'రాజా సాబ్'లోనూ ఆయన నటిస్తున్నారు. ఇందులో ప్రభాస్ జీవితాన్ని మలుపు తిప్పే ఘోస్ట్ పాత్రలో ఆయన కనిపించనున్నారని టాక్. అయితే ఇది పాజిటివా, నెగెటివా అన్నది ప్రస్తుతానికి సస్పెన్స్. ఇక ఇప్పటికే వివేక్ ఒబెరాయ్ 'వినయ విధేయ రామ', 'వివేకం' 'లూసిఫర్'లో.. అర్జున్ రామ్‌పాల్ 'భగవంత్ కేసరి'లో.. అక్షయ్‌కుమార్ '2.0' చిత్రాలలో విలన్ పాత్రలు పోషించిన సంగతి తెలిసిందే.

బాబీ డియోల్

ప్రతినాయకుడి అవతారమెత్తిన మరో బాలీవుడ్ కథానాయకుడు బాబీ డియోల్. ఇప్పటికే 'యానిమల్' సినిమాలో రణ్‌బీర్‌తో తలపడ్డారు ఆయన. 'యానిమల్'లో కనిపించింది కాసేపు అయినా.. తన నటనతో ప్రేక్షకులకు విలన్ అంటే వీడేరా అనే ఫీల్‌ను కలిగించారు బాబీ. ఆయన ప్రస్తుతం దక్షిణాదిలో విలన్‌గా వరుస అవకాశాలను సొంతం చేసుకున్నారు. తమిళ నటుడు సూర్య నటిస్తున్న 'కంగువ'లో భీకరమైన పోరాట యోధుడిగా ఆయన కనిపించనున్నారు. అలాగే, కే.ఎస్.రవీంద్ర దర్శకత్వంలో బాలకృష్ణ హీరోగా నటిస్తున్న 'ఎన్‌బీకే109' చిత్రంలోనూ ప్రతినాయకుడిగా కనిపించనున్నారు. పవన్‌కల్యాణ్ నటిస్తున్న హిస్టారికల్ యాక్షన్ డ్రామా 'హరిహర వీరమల్లు'లోనూ బాబీడియోల్ ప్రతినాయకుడిగా నటిస్తున్నారు. ఇందులో ఆయన మొఘల్ ఎంపెరర్ ఔరంగజేబ్ పాత్రను పోషించడం విశేషం. అలాగే విజయ్ నటిస్తున్న నూతన చిత్రంలోనూ ఆయన ప్రతినాయకుడి పాత్రను పోషించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని తెలిసింది. హెచ్.వినోద్ దర్శకత్వంలో తెరకెక్కనున్న ఈ సినిమా వర్కింగ్ టైటిల్ 'విజయ్ 69'.

ఇన్ ప్రోగ్రెస్

జైలుకి వెళ్లిన గొర్రె



సుహాస్ హీరోగా నటించిన యూనిక్ ఎంటర్‌టైనర్ 'గొర్రె పురాణం' ఈ నెల 20న విడుదల కానుంది. పురాణం బాబీ దర్శకత్వంలో ప్రవీణ్‌రెడ్డి నిర్మించారు. ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. 'నా పేరు రామ్.. అలియాస్ యేసు. గొర్రె జైల్లో ఉండడం ఏందీ.. ఆడికెల్లి తప్పించుకోవడం ఏంది? ఇదంతా మీకు వింతగా ఉంది కదూ' అనే వాయిస్ ఓవర్‌తో ట్రైలర్ మొదలైంది. ఒక గొర్రె ఓ గ్రామంలో రెండు మతాల మధ్య చిచ్చు పెట్టిన నేపథ్యాన్ని చాలా ఆసక్తికరంగా ప్రజెంట్ చేశారు. పోసాని కృష్ణమురళి, రఘు కీలక పాత్రలు పోషించారు.

మహిళల రక్షణ కోసం



ప్రవీణ్ కె.వి స్వీయ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'మహీష'. యషిక, పృధ్వీరాజ్, వైష్ణవి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఆదివారం ఈ సినిమా టీజర్‌ను దర్శకుడు కొండా విజయ్‌కుమార్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "టీజర్ బాగుంది. మహిళల రక్షణ కోసం చేసిన చిత్రమిది" అని చెప్పారు. "ధర్మాన్ని ఎలా కాపాడాలో ఇందులో చూపిస్తున్నాం. ప్రేక్షకులకు కావాల్సిన అన్ని ఎలిమెంట్స్ ఇందులో ఉన్నాయి" దర్శకుడు, హీరో ప్రవీణ్ కె.వి అన్నారు.

ఫ్యామిలీ ఆడియన్స్‌కు నచ్చేలా..



చంద్రహాస్ హీరోగా నటిస్తున్న 'రామ్‌నగర్ బన్నీ' చిత్రం టీజర్‌ను సోమవారం విడుదల చేశారు. ఈ సినిమాలో విస్మయశ్రీ, రిచా జోషి, అంబికా వాణి, రీతూ మంత్ర హీరోయిన్లు. శ్రీనివాస్ మహత్ దర్శకుడు. అక్టోబర్ నాలుగున సినిమాను విడుదల చేస్తున్నట్లు నిర్మాతలు మలయజ ప్రభాకర్, పొడకండ ప్రభాకర్ చెప్పారు. ఈ సినిమా కోసం చంద్రహాస్ బాగా కష్టపడ్డాడనీ, అతనికి మంచి పేరు తెచ్చే సినిమా అవుతుందని దర్శకుడు శ్రీనివాస్ మహత్ చెప్పారు. అన్ని ఎలిమెంట్స్‌తో ప్రేక్షకులందరికీ నచ్చేలా చిత్రం ఉంటుందని తెలిపారు. ఫ్యామిలీ ఆడియన్స్‌ను దృష్టిలో పెట్టుకుని చిత్రకథ ఎన్నుకున్నామనీ, తన కుమారుడి మొదటి సినిమాను సకుటుంబంగా ప్రేక్షకులు చూడాలనుకున్నామనీ ప్రభాకర్ చెప్పారు మరో రెండు సినిమాలు ఉన్నా మొదట 'రామ్‌నగర్ బన్నీ'నే విడుదల చేస్తున్నామని తెలిపారు.

సండే గర్ల్ ఫ్రెండ్




కామ్నా శర్మ, సుమన్, అలీ ప్రధాన పాత్రలు పోషించే 'సండే గర్ల్ ఫ్రెండ్' షూటింగ్ సోమవారం ప్రారంభమైంది. హీరోయిన్ కామ్నాపై చిత్రీకరించిన ముహూర్తపు షాట్‌కు నటి ఇంద్రజ కెమెరా స్విచ్ ఆన్ చేయగా, అలీ తొలి క్లాప్ ఇచ్చారు. సుమన్ స్క్రిప్ట్ అందజేశారు. లవ్, మ్యూజికల్ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా ఉంటుందని దర్శకుడు గడ్డం వెంకటరమణారెడ్డి చెప్పారు. పాటల రికార్డింగ్ పూర్తయిందనీ, త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ మొదలు పెడతామనీ ఆయన తెలిపారు.

సైకలాజికల్ థ్రిల్లర్



ప్రిన్స్, నరేశ్ అగస్త్య హీరోలుగా నటించిన 'కలి' చిత్రం అక్టోబర్ 4న విడుదల కానుంది. జర్నలిస్టు రాఘవేంద్రరెడ్డి సమర్పణలో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రానికి శివ శేషు దర్శకుడు. కలి పాత్ర చుట్టూ అల్లుకున్న కథ ఇదనీ, ఈ సైకలాజికల్ థ్రిల్లర్ ప్రేక్షకులకు సరికొత్త అనుభూతి కలిగిస్తుందనీ దర్శకుడు చెప్పారు. లీలా గౌతమ్ వర్మ ఈ సినిమాకు నిర్మాత. నేహా కృష్ణన్, గౌతంరాజు, గుండు సుదర్శన్, మణిచందన, మధుమణి ఇతర ముఖ్య తారాగణం.

ఆంధ్రజ్యోతి
నవ్య డాక్టర్
9
మంగళవారం • 17 సెప్టెంబరు 2024



కంటి వ్యాధులను సకాలంలో కనిపెట్టే పరీక్షలు చవకలో అందుబాటులోకొచ్చినప్పుడే వాటిని అరికట్టడం సాధ్యపడుతుంది. ఆ దిశగా సరికొత్త పరిశోధనలకు పూనుకున్న ఎల్‌వి ప్రసాద్ కంటి ఆస్పత్రి శాస్త్రవేత్తలు, తాజాగా కొన్ని పరికరాలను ఆవిష్కరించారు. వాటి పనితీరు, ప్రయోజనాల గురించి తెలుసుకుందాం!

విలువైన కళ్ల కోసం చవకైన పరికరాలు

పిల్లలు, పెద్దలు కలిగి ఉండే వేర్వేరు కంటి సమస్యలకు వేర్వేరు నిర్ధారణా ప్రక్రియలుంటాయి. ఇందుకోసం వాడుకలో ఉన్న పరికరాలు ఖరీదైనవీ, పరీక్షలు ఖర్చుతో కూడుకున్నవీ అయినప్పుడు అందరూ వాటిని వినియోగించుకోలేకపోతూ ఉంటారు. ఫలితంగా కంటి సమస్యలను సకాలంలో కనిపెట్టలేక, సమస్య తీవ్రత పెరిగి కంటిచూపు క్షీణించే పరిస్థితిని ఎదుర్కొంటూ ఉంటారు. ఈ ఇబ్బందులను అధిగమించాలంటే తక్కువ ఖర్చుతో, తక్కువ సమయంలో, సమస్యను కచ్చితంగా కనిపెట్టే పరికరాలు అందుబాటులోకి రావాలి. అలాంటి పరికరాలను ఆవిష్కరించిన శాస్త్రవేత్తలు వాటి గురించి ఇలా వివరిస్తున్నారు.



గ్లాకోమాను అరికట్టే 'ఓం'

తిరిగి సరిదిద్దలేనంతగా కంటిని దెబ్బతీసే సమస్య గ్లాకోమా! క్రమం తప్పకుండా పరీక్ష చేయించుకుంటూ, కంటి వైద్యుల కనుసన్నల్లో నడుచుకోవడం మినహా గ్లాకోమాను నియంత్రించే ఇతరత్రా మార్గాలే లేవు. అయితే తరచూ వైద్యులను కలవలేని వాళ్లు, పెద్దలు, దివ్యాంగులు, ఐసియుల్లో ఉన్నవాళ్లు క్రమం తప్పకుండా గ్లాకోమా పరీక్షలు చేయించుకోవడం సాధ్యపడదు. కానీ తాజాగా రూపొందిన ఓమ్ (ఆర్డర్ ఆఫ్ మ్యాగ్నిట్యూడ్) విఆర్ హెడ్‌సెట్, పరీక్షకు అనుకూలంగా ఉండడంతో పాటు, సులువుగా ఎక్కడికైనా తీసుకువెళ్లగలిగే సౌలభ్యాన్ని కూడా కలిగి ఉంది. పైగా కేవలం పది నిమిషాల వ్యవధిలో సమస్యను కచ్చితంగా అంచనా వేయగలుగుతుంది. ఈ పరీక్ష ఖర్చు కేవలం 50 రూపాయలే!



డాక్టర్ శిరీష

స్పార్క్‌తో... మయోపియాకు అడ్డుకట్ట



పిల్లలను వేధించే కంటి సమస్యల్లో మయోపియా ఒకటి. ఐదు నుంచి 15 ఏళ్ల పిల్లల్లో తలెత్తే ఈ సమస్యలో దగ్గరి దృష్టి మెరుగ్గానే ఉన్నప్పటికీ, దూర దృష్టి తక్కువగా ఉండడంతో పిల్లలు బోర్డు మీద రాసి ఉన్న అక్షరాలను, పవర్ పాయింట్ ప్రెజెంటేషన్‌ను చూడలేక ఇబ్బంది పడుతూ ఉంటారు. ఈ సమస్య తీవ్రత ఇటీవలి కాలంలో ఎంతో పెరిగింది. ఇంతకు ముందు వంద మంది పిల్లల్లో ఐదుగురికి ఈ సమస్య ఉంటే, ప్రస్తుతం ప్రతి ఇద్దరు పిల్లల్లో ఒకర్లో కనిపిస్తోంది. ఇందుకు కారణం గ్యాడ్జెట్స్ వాడకం పెరగడమే! వాటిని కనిపెట్టే సంప్రదాయ విధానాలు ముందున ఉంచీ ఉన్నప్పటికీ, కళ్లద్దాలతో సరిపెట్టే పరిస్థితి ఉండేది. అయితే ఇప్పుడు కంటి మధ్యలోనే (సెంట్రల్ రిఫ్రాక్షన్) కాకుండా, ఇరువైపులా (పెరిఫెరల్ రిఫ్రాక్షన్) పవర్‌లను కనిపెట్టే పరికరాన్ని మేం సృష్టించాం. కంటికి ఇరువైపులా పవర్‌లను పరీక్షించడానికి మన దేశంలో కనీసం పది లక్షల రూపాయలు ఖర్చవుతాయి. కాబట్టి ఈ పరీక్ష అందరికీ సాధ్యపడకపోవచ్చు. ఈ సమస్యను పరిష్కరించడంతో పాటు, సమస్య ఉందని నిర్ధారించినప్పుడు, దాన్ని పెరగకుండా నియంత్రించే పరికరం స్పార్క్ (సింప్లిఫైడ్ పెరిఫెరల్ యాన్సిలరీ రిఫ్రాక్షన్)ను రూపొందించాం. మయోపతి కేసుల తగ్గుదలకూ, కచ్చితమైన చికిత్స అంచనాకూ, స్పార్క్ పరికరం ఎంతో బాగా సహాయపడుతుంది. మయోపియాకు ఇప్పటివరకూ కంటి చుక్కలు, కాంటాక్ట్‌లెన్స్‌లు, కళ్లజోళ్లు అందుబాటులో ఉన్నాయి. అయితే కంటి మధ్యలో, పక్కల్లో ఉన్న పవర్ ఆధారంగా కచ్చితమైన ప్రత్యామ్నాయాలను ఎంచుకోగలిగితే, ఖరీదైన కాంటాక్ట్‌లెన్స్‌లు, కళ్లజోళ్ల అవసరం తప్పుతుంది.



డాక్టర్ పవన్

బేబీస్ కోసం 'బావీస్'



కంటి చూపు ఒక్కటే సరిపోదు. దాన్లో కలర్ విజన్, త్రీడి విజన్, సైడ్ విజన్ లాంటివి కూడా సమర్థంగా ఉండాలి. మరీ ముఖ్యంగా పసికందుల్లో ఈ లక్షణాలను కనిపెట్టడం కోసం ఇంతకు ముందు, టార్చ్‌లైట్ కళ్లలోకి వేసి, కంటి కదలికలను గమనించేవారు. అయితే ఈ పరీక్షతో పసికందుల కంటిచూపును మాత్రమే నిర్ధారించగలిగేవారు తప్ప, ఆ చూపు ఎంత స్పష్టంగా కనిపెట్టే వీలుండేది కాదు. ప్రస్తుతం ఆవిష్కరణకు నోచుకున్న పరికరం పసికందులు కళ్లు, కంటిచూపుకు సంబంధించిన కీలక సమాచారాన్ని అందించగలుగుతుంది. పసికందులు వెలుగుకు మాత్రమే స్పందిస్తూ కళ్లను తిప్పగలుగుతారు కాబట్టి ఆ కదలికల ఆధారంగా, పసికందు దృష్టి సారించిన లక్ష్యం ఆధారంగా వారి కంటి చూపును కచ్చితంగా అంచనా వేయడం కోసం తాజాగా 'బావీస్' (బేబీ విజన్ స్క్రీనర్) పరికరాన్ని ఆవిష్కరించాం. డోమ్ లాంటి ఈ పరికరంలో ఒక ఎల్‌ఇడి లేదా బహుళ ఎల్‌ఇడిలను వెలిగించి, పసికందులు కాంతి ప్రసరించే దిశను కనిపెట్టగలుగుతున్నదీ లేనిదీ వైద్యులు తెలుసుకోగలుగుతారు. ఈ ప్రక్రియలో కాంతిని కనిపెట్టడం కోసం పసికందులు తీసుకునే సమయాన్ని అంచనా వేయవచ్చు. కొన్ని సందర్భాల్లో, హైపోగ్లైసెమిక్ ప్రభావానికి లోనైన పసికందులు బ్రెయిన్ డ్యామేజీతో పుడుతూ ఉంటారు. ఈ పిల్లలు పెరిగే క్రమంలో ఎదుగుదల సమస్యలను ఎదుర్కొంటారు. కాబట్టి బావీస్‌తో ఇలాంటి సమస్యను ప్రారంభంలో కనిపెట్టవచ్చు. బావీస్‌లో ఉండే ఇన్‌ఫ్రారెడ్ కెమెరా సహాయంతో, పసికందుల్లో క్యాటరాక్ట్, మీడియా ఒపాసిటీ సమస్యలను కూడా కనిపెట్టవచ్చు. అలాగే పసికందుల్లో మెల్ల కళ్లను కూడా బావీస్‌తో కనిపెట్టవచ్చు.



డాక్టర్ ప్రేమ నందిని

ఎల్‌వి ప్రసాద్ నేత్రాలయం, దేశ వ్యాప్త నేత్ర సంరక్షణ రంగంలో, వినూత్న విధానాలకూ, నిబద్ధతకూ పేరు పొందింది. పరిశోధన, ఆవిష్కరణలపరంగా కంటి సంరక్షణల విధానాల అభివృద్ధిలో గణనీయమైన పురోగతిని సాధించింది. **సెంటర్ ఫర్ టెక్నాలజీ ఇన్నొవేషన్ డైరెక్టర్, రమేష్ కెకునయా** సారథ్యంలో వైద్యులు, డిజైనర్లు, ఇంజనీర్ల బృందం, కంటి సమస్యల పరిష్కారం, నియంత్రణల పరంగా అత్యాధునిక సాంకేతికతల ఆధారంగా నిరంతరం కొత్త పరికరాల సృష్టి కోసం కృషి చేస్తూ ఉండడం విశేషం.



మెదడు పనితీరును కనిపెట్టే... ప్యూపిల్ ఎన్





కాంతి ప్రభావానికి కదిలే, కంటి కదలికల ఆధారంగా మెదడు పనితీరును పసిగట్టే పరికరమే, ప్యూపిల్ ఎన్. ప్రమాదాల బారిన పడినవాళ్లు, ఇంటెన్సివ్ కేర్‌కు చేరుకున్న బాధితులు, క్లిష్టమైన ఆరోగ్య పరిస్థితులకు లోనైన వాళ్లలో మెదడు పనితీరు వేగంగా క్షీణిస్తూ ఉంటుంది. క్షీణించిన మెదడు పనితీరును సత్వరం కనిపెట్టడం ద్వారా పరిస్థితి మరింత దిగజారకుండా కచ్చితమైన చికిత్సను ఆశ్రయించడంలో ఈ పరికరం కీలకంగా మారుతుంది. ప్రస్తుతం న్యూరోలైట్స్, న్యూరోఆప్టిక్ ప్యూపిలోమీటర్ లాంటి 6 నుంచి 7 లక్షల ధర పలికే పరికరాలు అందుబాటులో ఉన్నాయి. ఫలితంగా ఈ సౌలభ్యం అన్ని ఆస్పత్రుల్లో అందుబాటులో ఉండకపోవచ్చు. తాజాగా రూపొందుతున్న ప్యూపిల్ ఎన్ కేవలం లక్ష రూపాయలకే అందుబాటులోకి రాబోతోంది.



డాక్టర్ శ్రీకాంత్ భరద్వాజ్

అవగాహన

ఆరోగ్యం కోసం వీటికి దూరం

ఆరోగ్యకరమైన జీవనశైలి కోసం ప్రపంచ ఆరోగ్య సంస్థ కొన్ని తినకూడని పదార్థాల చిట్టాను విడుదల చేసింది. అవేంటంటే...

చక్కెర: ఊబకాయం, మధుమేహాలతో ప్రత్యక్ష సంబంధం కలిగి ఉన్న చక్కెర వాడకాన్ని వీలైనంత తగ్గించాలి. చక్కెరతో కాలేయం, పిత్తాశయం, జీర్ణ వ్యవస్థ మీద విపరీతమైన ఒత్తిడి పడుతుంది. కాబట్టి చక్కెర వాడకాన్ని మానేయడం అన్ని విధాలా శ్రేయస్కరం.

వేపుళ్లు: డీప్ ఫ్రైలతో అధిక క్యాలరీలు, ఉప్పు, అనారోగ్యకరమైన కొవ్వులు శరీరంలోకి చేరతాయి. ఇవి గుండెజబ్బులకు దారి తీస్తాయి కాబట్టి నూనెలో వేయించే స్నాక్స్ దూరంగా ఉండాలి.

పాస్తా, బ్రెడ్: ప్రపంచంలోని అత్యంత అనారోగ్యకరమైన ఆహారపదార్థాలు, పాస్తా, బ్రెడ్. ఈ రిఫైన్డ్ కార్బొహైడ్రేట్స్ తెల్ల బ్రెడ్, పాస్తా, చక్కెరతో తయారయ్యే స్నాక్స్‌లలో ఉంటాయి. ఇవి రక్తంలోని చక్కెరను పెంచుతాయి. కాబట్టి వీటికి బదులుగా పొట్టు తీయని ధాన్యాలు, వాటితో తయారయ్యే పిండ్లతో తయారైన పదార్థాలనే ఎంచుకోవాలి.

కాఫీ: కాఫీతో కెఫీన్ ఉంటుందనే విషయం గుర్తు పెట్టుకోవాలి. దీంతో తల నొప్పి, డిప్రెషన్, నిద్రలేమి, అధిక రక్త పోటు, అలసటలు వేధిస్తాయి. కాబట్టి కాఫీని పరిమితంగా తీసుకోవాలి.



ఉప్పు: ఉప్పు లేని ఆహారం తినలేం! అలాగని అవసరానికి మించి తింటే, హైపర్‌టెన్షన్, హృద్రోగ వ్యాధులు తప్పవు. కాబట్టి వీలైనంత తగ్గించి వాడుకోవాలి. ఉప్పుతో తయారయ్యే స్నాక్స్ తినడం మానుకోవాలి. కెచప్, నిల్వ పచ్చళ్లు, సాల్టెడ్ చిప్స్ లాంటివి మానేయాలి.

పొటాటో చిప్స్: పొటాటో చిప్స్, మైక్రోవేవ్ పాప్‌కార్న్‌తో అనారోగ్యకరమైన కొవ్వులు, క్యాలరీలు ఎక్కువ. కాబట్టి ఇవి తినకూడదు.

చీజ్: చీజ్‌లో శాచురేటెడ్ ట్రాన్స్ ఫ్యాట్స్ ఉంటాయి. ఇవి గుండె ఆరోగ్యాన్ని దెబ్బ తీస్తాయి.

దోమ కాటుకు విరుగుడు ఇలా...

దోమలు కుడితే దురదలు, దద్దుర్లు సహజం. ఈ అసౌకర్యాలను పరిష్కరించుకోడానికి కొన్ని చిట్కాలున్నాయి. అవేంటంటే...

ఐస్ ప్యాక్: దురద, దద్దుర్లు తలెత్తిన ప్రదేశంలో ఐదు నుంచి పది నిమిషాల పాటు ఐస్‌ప్యాక్ పెట్టుకుంటే చర్మం అడుగున ఉండే రక్తనాళాలు కుంచించుకుపోయి దురద తగ్గుతుంది.

యాపిల్ సైడార్ వెనిగర్: దురద ఉన్న చోట యాపిల్ సిడార్ వెనిగర్ అద్దుకుంటే, దీని క్షార గుణం వాపు, దురదలను మటుమాయం చేస్తుంది.

టూత్‌పేస్ట్: మెంథాల్, పెప్పర్‌మింట్ ఫ్లేవర్‌తో కూడిన టూత్‌పేస్ట్‌ను కూడా దోమ కుట్టిన ప్రదేశంలో అద్దుకోవచ్చు. కూలింగ్ ప్రభావాన్ని కలిగి ఉండే ఈ టూత్‌పేస్ట్‌లు దురద నుంచి తక్షణ ఉపశమనాన్ని అందిస్తాయి.



ఉల్లిపాయ: చక్రాల్లా తరిగి దోమ కుట్టిన ప్రదేశంలో రుద్దుకోవాలి. దీన్లోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు దోమ కాటు దురదలను తగ్గిస్తాయి.

తులసి: తులసిలో కాంఫర్, థైమాల్ ఉంటాయి. దురదను తగ్గించుకోవడం కోసం తులసి ఆకులను మెత్తగా దంచి దోమలు కుట్టిన చోట పట్టు వేయాలి.

వెల్లుల్లి: వెల్లుల్లి యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ బ్యాక్టీరియాల్ గుణాలను కలిగి ఉంటుంది. కాబట్టి దురద నుంచి ఉపశమనం దక్కుతుంది. అందుకోసం వెల్లుల్లిని దంచి, కొద్దిగా కొబ్బరినూనె జోడించి, దోమలు కుట్టిన ప్రదేశంలో రుద్దుకోవాలి.

కీలు మార్పిడి కోసం రోజుల తరబడి ఆస్పత్రుల్లో గడిపే రోజులకు కాలం చెల్లింది. ఒక్క రోజులో కీలు మార్పిడి చేయించుకుని, ఇంటికెళ్లిపోగలిగే ఆధునిక సర్జరీలు అందుబాటులోకొచ్చాయి. ఆ సర్జరీలు, వాటికి ఉండవలసిన అర్హతల గురించి వైద్యులు ఇలా వివరిస్తున్నారు.

సర్జరీ తర్వాత... ఒక్క రోజులో ఇంటికి

సర్జరీ తదనంతర తేలికగా ఇన్‌ఫెక్షన్లకు గురయ్యే అవకాశాలు ఎక్కువ. ఎక్కువ రోజులు ఆస్పత్రిలో ఉంటే, ఖర్చు కూడా ఎక్కువగానే ఉంటుంది. ఈ ఇబ్బందుల నుంచి తప్పించుకోవడం కోసం, రోగి త్వరగా కోలుకుని, దైనందిన జీవితానికి అలవాటు పడిపోవడం కోసం 24 గంటల్లో కీలు మార్పిడి చేయించుకుని, నడుచుకుంటూ ఇంటికి వెళ్లగలిగే, డే కేర్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జరీలు అందుబాటులో కొచ్చాయి. పూర్తి కీలు మార్పిడి, పాక్షిక కీలు మార్పిడి, డైరెక్ట్ యాంటీరియర్ హిప్ రీప్లేస్‌మెంట్, రోబోటిక్ అసిస్టెడ్ సర్జరీ మొదలైన సింగిల్ సైడ్ (ఒక కాలి సర్జరీ) సర్జరీలకు రోజుల తరబడి ఆస్పత్రిలో ఉండవలసిన అవసరం లేదు. ఇవన్నీ చిన్న కోతతో పూర్తయ్యే సర్జరీలు కాబట్టి 24 గంటల్లోనే నడుచుకుంటూ ఇంటికి వెళ్లిపోవచ్చు. ఉదాహరణకు తుంటి సర్జరీ వెనక నుంచి, పక్క నుంచి ముందు నుంచి చేయవచ్చు. డైరెక్ట్ యాంటీరియర్ హిప్ రీప్లేస్‌మెంట్‌లో కండరాలను కత్తిరించకుండా, చిన్న కోతతో సర్జరీ చేయడం జరుగుతుంది. ఈ సర్జరీ చేయించుకున్న వాళ్లు తదనంతరం ఎలాంటి నియమాలు పాటించవలసిన అవసరం లేదు. వీళ్లు నేల మీద కూర్చోవచ్చు. పద్మాసనం వేయవచ్చు. ఈ తరహా సర్జరీలు కూడా డే కేర్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జరీల కోవలోకే వస్తాయి. కొవిడ్ తర్వాత ఎవ్యాస్క్యులర్ నెక్రోసిస్‌కు గురయ్యే యువత సంఖ్య కూడా పెరిగింది. వీళ్లలో తుంటి ఎముక దెబ్బతిన్నప్పుడు సర్జరీతో మార్పిడి చేయవలసి వస్తుంది. ఇది కూడా డే కేర్ సర్జరీ కోవకే చెందుతుంది.



కీలు మార్పిడి

సూటయ్యే వారికే...

రెండు వైపులా రెండు కాళ్లకూ సర్జరీ చేసినప్పుడు, మధుమేహం, అధిక రక్తపోటు, ఊబకాయం కలిగి ఉన్న వ్యక్తులకు కీలు మార్పిడి సర్జరీలు చేసినప్పుడు, వాళ్లను ఒక్క రోజులోనే ఇంటికి పంపించడం సాధ్యపడదు. ఇవేవీ లేకుండా, ఆర్థ్రయిటిస్ ఉండి, సింగిల్ జాయింట్ మార్పిడి చేయించుకోవాలనుకున్నవాళ్లు డే కేర్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జరీని ఎంచుకోవచ్చు. మరీ ముఖ్యంగా సర్జరీ తర్వాత నొప్పిని కొంత మేరకు తట్టుకోగలిగి ఉండి, ఇతరుల సహాయం లేకుండా బాత్రూమ్‌కు వెళ్లి రాగలిగి, కుర్చీలో కూర్చోగలిగే వ్యక్తులను మాత్రమే వైద్యులు ఈ తరహా సర్జరీలకు ఎంచుకుంటారు. అయితే అందుకోసం సర్జరీకి ముందే వైద్యుల బృందం రోగికి పెయిన్ మేనేజ్‌మెంట్ స్ట్రాటజీలను నేర్పించడంతో పాటు సర్జరీ కోసం చిన్న కోతతో కూడిన రోబోటిక్ అసిస్టెడ్ సర్జరీలను ప్లాన్ చేస్తుంది.

బహుళ ప్రయోజనాలు

ఆస్పత్రిలో ఎక్కువ రోజుల పాటు వైద్యులు పర్యవేక్షణలో ఉండి, పూర్తిగా కోలుకున్న తర్వాతే ఇంటికి వెళ్లడం మేలనే అపోహలు సర్వత్రా ఉంటాయి. కానీ ఆస్పత్రి నుంచి ఎంత వీలైతే అంత త్వరగా డిశ్చార్జ్ అయిపోయి, ఇంటికి చేరుకోవడం అన్ని విధాలా శ్రేయస్కరం. నిజానికి రీప్లేస్‌మెంట్ సర్జరీల విషయంలో సర్జరీ తర్వాత వైద్యుల పర్యవేక్షణ అవసరం ఉండదు. అన్ని విధాలా సూట్ అయ్యే రోగులను ఇలాంటి సర్జరీలకు ఎంచుకుంటారు కాబట్టి సర్జరీ తదనంతర సమస్యలు తలెత్తే అవకాశాలు ఉండవు. పైగా ఒక్క రోజులో డిశ్చార్జ్ అయిపోవడం వల్ల, ఇన్‌ఫెక్షన్లు సోకే అవకాశాలు ఉండవు. ఆస్పత్రి ఖర్చులు కూడా తగ్గుతాయి. ఒక్క రోజులో సర్జరీ చేయించుకుని ఇంటికి చేరుకోవడంతో రోగుల్లో ఆత్మవిశ్వాసం, కోలుకునే వేగం పెరుగుతాయి. సర్జరీ తదనంతర నొప్పి విషయంలో కూడా వైద్యులు, ముందుగానే రోగుల స్వభావాన్ని అంచనా వేస్తారు. పెయిన్ టాలరెన్స్ స్కోర్స్ ఆధారంగా రోగుల వ్యక్తిగత స్వభావాలను బట్టి సర్జరీకి తగిన వ్యక్తులనే వైద్యులు ఎంచుకుంటారు. కాబట్టి ఆస్పత్రిలో రీఎడ్మిషన్ సమస్య తప్పుతుంది.



డాక్టర్ కృష్ణ కిరణ్
ఆర్థొపెడిక్ సర్జన్,
మెడికవర్ హాస్పిటల్స్,
హైదరాబాద్.

గుడ్ లైఫ్

ఈ స్లీప్ హైజీన్ సూపర్

సాయంత్రం ఐదున్నరకు చివరి భోజనం చేసి, పెందలాడే నిద్రపోవడం అలవాటు చేసుకున్న తర్వాత, తాను రెట్టింపు హుషారుగా ఉండగలుగుతానని చెప్పి, బాలీవుడ్ నటి అనూష్క శర్మ, కొత్త తల్లులందర్నీ ఆలోచనలో పడేసింది. నిజానికి ఇది అద్భుతమైన ఆరోగ్యకరమైన అలవాటనీ, కొద్దిపాటి అవగాహనతో పిల్లల తల్లులందరికీ ఈ అలవాటు సాధ్యపడుతుందనీ వైద్యులు కూడా అంటున్నారు.

చిన్నపిల్లల తల్లులకు కంటి నిండా నిద్ర తప్పని సరి. కానీ సాధారణంగా తల్లులు, పిల్లలను నిద్ర పుచ్చి, అప్పుడు పనులకు పూనుకుంటూ ఉంటారు. టివి చూడడం, ఫోన్లు మాట్లాడడం, వ్యాపకాలకు పూనుకోవడం, వంటగది సర్దుకోవడం, ఇంటి పనులు చేసుకోవడం లాంటివి చేస్తూ ఏ అర్థరాత్రికో నిద్రకు ఉపక్రమిస్తూ ఉంటారు. కానీ కంటి నిండా నిద్ర పోలేకపోతే, శరీరంలో సత్తువ సన్నగిల్లుతుంది. రోగ నిరోధకశక్తి కుంటుపడి తేలికగా ఇన్‌ఫెక్షన్లకు గురవుతారు. బ్రెయిన్ ఫాగ్ రోజంతా వేధిస్తుంది. పిల్లల పనులు రెట్టింపు భారంగా మారతాయి. కానీ చంటి పిల్లలతో సాయంత్రం పెందలాడే నిద్రపోవడం ఎలా సాధ్యపడుతుంది? అని అనుకోవచ్చు. నిజానికి దైనందిన జీవితంలో చిన్నపాటి మార్పులతో ఈ అలవాటు సాధ్యపడుతుంది. అదెలాగంటే...

- స్క్రీన్ టైమ్ తగ్గించుకోవడం, నిద్రకు ముందు చురుకైన పనుల్లో పాల్గొనడం, అవసరానికి మించి కెఫీన్ తీసుకోవడం, ఆలస్యంగా తినడం... ఇవన్నీ నిద్రకు దూరం చేసే అలవాట్లే! ఉదయాన్నే పరిపూర్ణమైన హుషారుతో నిద్రలేవాలనుకుంటే, రాత్రి భోజనం సాయంత్రమే ముగించేసి, పెందలాడే నిద్రపోవాలి.
- పిల్లల నిద్రవేళలను అనుసరించాలి. పిల్లలూ, తల్లులూ ఒకే నిద్రవేళలను క్రమం తప్పక పాటించేలా చూసుకోవాలి. పిల్లల నిద్రవేళల్లో తల్లులూ నిద్రకు ఉపక్రమిస్తే, ఇద్దరూ ఆరోగ్యంగా, హుషారుగా ఉంటారు. పెందలాడే నిద్రపోవడానికి పడగ్గది వాతావరణాన్ని అందుకు అనువుగా మార్చుకోవాలి. కంటి నిండా నిద్ర పట్టడం కోసం పడగ్గది కిటికీలకు ముదురు రంగు కర్టెన్లు కట్టుకోవాలి. నిద్రాభంగం కలిగించే శబ్దాలు పడగ్గదిలోకి చొరబడకుండా చూసుకోవాలి.
- కమ్మని నిద్ర పట్టాలంటే పగటివేళ శరీరానికి ఎండ సోకేలా చూసుకోవాలి. కాబట్టి ఉదయం



వేళ తక్కువ తాపమానాల్లో పసికందులతో పాటు ఆరుబయట కొన్ని నిమిషాలు గడపడం అలవాటు చేసుకోవాలి.

గుడ్ ఫుడ్

జాజికాయ జబర్దస్త్

చాలా చాలా అరుదుగా ఉపయోగించే సుగంధ ద్రవ్యం జాజికాయ. కాజూ కట్లీ లాంటి కొన్ని స్వీట్లలో మాత్రమే జాజికాయ సువాసన తగులుతూ ఉంటుంది. కొందరు బిరియానీల్లో, ఇంకొన్ని తీపి పదార్థాల్లో వాడుతూ ఉంటారు. అయితే కమ్మని సువాసన వెదజల్లే జాజికాయలో ఎన్నో ఆరోగ్యకరమైన అంశాలు కూడా ఉన్నాయి. అవేంటంటే...

జాజికాయ కొన్ని తీవ్ర వ్యాధులను అరికడుతుంది. కేన్సర్, డీజనరేటివ్ డిసీజెస్, గుండె జబ్బుల నుంచి రక్షణ కల్పిస్తుంది. ఫ్రీ ర్యాడికల్స్‌తో కణాలకు జరిగే నష్టాన్ని అరికట్టే సయానిడిన్స్ అనే శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు ఫినైల్ ప్రాపనాయిడ్స్, టెర్పీన్స్ అనే, ఎసెన్షియల్ ఆయిల్స్ జాజికాయలో ఉంటాయి. ఇవన్నీ ఫ్రీ రాడికల్స్‌ను స్థిరీకరించి, కణ నష్టాన్ని అరికడతాయి. దీన్లోని మోనోటర్పీన్స్ సాబినిన్, టెర్పినాల్, పినీన్, మొదలైన కాంపౌండ్లు ఇన్‌ఫ్లమేషన్‌ను అరికడతాయి. అయితే జాజికాయకు గర్భవిచ్ఛిత్తిని ప్రేరేపించే స్వభావం ఉంటుంది. కాబట్టి గర్భిణులు వీటిని తీసుకోకూడదు. అలాగే మానసిక సమస్యలున్న వాళ్లు కూడా వీటికి దూరంగా ఉండడం మేలు. శరీర బరువులో ఒక కిలోకు రెండు మిల్లీగ్రాముల జాజిపొడి ఆరోగ్యకరం.





27 నుంచి రెండు షాపింగ్ పండుగలు

ఆన్‌లైన్ షాపింగ్ ప్రియులకు మరో పది రోజుల్లో రెండు షాపింగ్ పండుగలు అందుబాటులోకి రానున్నాయి. రాబోయే పండుగల సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని దేశీయ ఇ-కామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్ "బిగ్ బిలియన్ డేస్", అంతర్జాతీయ ఇ-కామర్స్ దిగ్గజం అమెజాన్ "గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్" సెప్టెంబరు 27వ తేదీ నుంచి ప్రారంభించనున్నాయి.

బిగ్ బిలియన్ డేస్: ఫ్లిప్‌కార్ట్ బిగ్ బిలియన్ డేస్ 2024 సెప్టెంబరు 27 నుంచి అక్టోబరు 6వ తేదీ వరకు జరుగుతుంది. ఫ్లిప్‌కార్ట్ ప్లస్, వీఐపీ సభ్యులకు ఒక రోజు ముందే అంటే 26వ తేదీ నుంచే ఇది అందుబాటులోకి వస్తుంది. ఇది బిగ్ బిలియన్ డేస్ 11వ ఎడిషన్ అని ఫ్లిప్‌కార్ట్ గ్రూప్ సీఈఓ కల్యాణ్ కృష్ణమూర్తి తెలిపారు. 20 పైగా నగరాల్లోని 2 లక్షల ఎస్‌కేయూల ద్వారా ఆర్డర్ ఇచ్చిన రోజునే వస్తువును కస్టమర్‌కు డెలివరీ చేయాలని ఫ్లిప్‌కార్ట్ భావిస్తోంది. ఫ్లిప్‌కార్ట్ ప్లస్, వీఐపీ లాయల్టీ ప్రోగ్రామ్ కస్టమర్లకు టాప్ బ్రాండ్లపై ప్రత్యేక డీల్స్ అందుబాటులో ఉంటాయి. అలాగే సాధారణ కస్టమర్లకు కూడా గృహోపకరణాలు, ఎలక్ట్రానిక్స్, అంతర్జాతీయ ఫ్యాషన్, సౌందర్య సాధనాల బ్రాండ్ల పై అత్యుత్తమ డీల్స్ అందుబాటులో ఉంటాయి. షాప్సీ ద్వారా తొలిసారి కొనుగోళ్లు చేసే వారికి వివిధ ఉత్పత్తులపై ప్రత్యేక పొదుపు అవకాశం ఉంటుంది.

అమెజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్: 27వ తేదీ నుంచి అందరికీ అందుబాటులోకి రానున్న అమెజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్ కూడా ప్రైమ్ సభ్యులకు ఒక రోజు ముందుగానే అందుబాటులోకి వస్తుంది. కస్టమర్లకు గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్ 2024 విస్తృత శ్రేణిలో ఉత్పత్తులు అందుబాటులో ఉంచుతుందని అమెజాన్ వైస్ ప్రెసిడెంట్ సౌరబ్ శ్రీ వాస్తవ చెప్పారు. పలు ఉత్పత్తులపై ఆకర్షణీయమైన డీల్స్ అందించడంతో పాటు వేగంగా డెలివరీ చేయనున్నట్టు తెలిపారు. అలాగే ఈ సందర్భంగా అనేక కొత్త ఉత్పత్తుల విడుదలను కూడా అమెజాన్ ప్రోత్సహిస్తోంది.

ప్రపంచ మేటి కంపెనీల్లో హెచ్‌సీఎల్ టెక్

న్యూఢిల్లీ: టైమ్ పత్రిక నిర్వహించిన ప్రపంచ ఉత్తమ కంపెనీలు, 2024 జాబితాలో భారత ఐటీ దిగ్గజం హెచ్‌సీఎల్ టెక్ స్థానం సంపాదించింది. భారత్ కేంద్రంగా కార్యకలాపాలను నిర్వహిస్తున్న కంపెనీల్లో నంబర్-1గా నిలిచింది. వృత్తిపరమైనసేవల జాబితాలోనూ ప్రపంచంలో 10వ స్థానం సంపాదించింది. ప్రముఖ కంపెనీగా, టాప్ ఎంప్లాయర్‌గా ఈ గుర్తింపు తమ స్థాయిని మరింత పెంచిందని హెచ్‌సీఎల్ టెక్ ఒక ప్రకటనలో తెలిపింది.

బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ బ్లాక్‌బస్టర్ లిస్టింగ్

- తొలిరోజే షేరు 136% వృద్ధితో అప్పర్ సర్క్యూట్‌కు చేరిక
- రూ.1.37 లక్షల కోట్లు దాటిన మార్కెట్ విలువ
- ఇన్వెస్టర్లకు ఒక లాట్‌పై రూ.20,330 లాభం



ముంబై: బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ లిస్టింగ్‌కు అపూర్వ స్పందన లభించింది. ఐపీఓ ధర రూ.70తో పోలిస్తే, రెట్టింపునకు పైగా లాభంతో లిస్టయింది. బీఎస్ఈలో కంపెనీ షేరు 114.28 శాతం ప్రీమియంతో రూ.150 వద్ద ట్రేడింగ్ ప్రారంభమైంది. ఇంట్రాడే ట్రేడింగ్‌లో 135.7 శాతం ఎగబాకి అప్పర్ సర్క్యూట్ రూ.164.99 వద్ద స్థిరపడింది. తొలిరోజు ట్రేడింగ్ ముగిసేసరికి, కంపెనీ మార్కెట్ సంపద రూ.1,37,406.09 కోట్లకు చేరుకుంది. బీఎస్ఈలో 608.99 లక్షల కంపెనీ షేర్లు ట్రేడయ్యాయి. ఈ నెల 11తో ముగిసిన రూ.6,560 కోట్ల బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ మెగా ఐపీఓకు సైతం ఏకంగా 63.60 రెట్ల బిడ్లు లభించాయి.

ఇన్వెస్టర్లకు బంపర్ లాభాలు

బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ ఐపీఓలో షేర్లు లభించిన ఇన్వెస్టర్లకు మొదటి రోజే లాభాల పంటపడింది. ఈ ఇష్యూలో ఒక లాట్ ద్వారా 214 షేర్లు ఆఫర్ చేశారు. షేరు ధర రూ.70 ప్రకారం లాట్ (214) షేర్ల కొనుగోలు విలువ రూ.14,980. ఆ రకంగా ఈ ఇష్యూలో ఒక లాట్ షేర్లు లభించిన ఇన్వెస్టర్ పెట్టుబడి విలువ తొలిరోజే రూ.20,330 లాభంతో మొత్తం రూ.35,310కి చేరుకుంది.

నం.1 హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీగా అవతరణ

స్టాక్ మార్కెట్ లిస్టింగ్‌తో బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ రూ.1.37 లక్షల కోట్ల మార్కెట్ క్యాప్‌తో దేశంలో అత్యంత విలువైన హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీగా అవతరించింది. హౌసింగ్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (హడ్కో) రూ.49,477 కోట్ల మార్కెట్ క్యాప్‌తో రెండో స్థానంలో ఉండగా.. ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ (రూ.37,434 కోట్లు), పీఎన్‌బీ హౌసింగ్ ఫైనాన్స్ (రూ.27,581 కోట్లు), ఆధార్ హౌసింగ్ ఫైనాన్స్ (రూ.20,045 కోట్లు), ఆప్టస్ వేల్యూ హౌసింగ్ ఫైనాన్స్ ఇండియా (రూ.16,598 కోట్లు), ఆవాస్ ఫైనాన్షియర్స్ (రూ.14,278 కోట్లు), కెన్‌ఫిన్ హోమ్స్ (రూ.11,983 కోట్లు), సమ్మాన్ క్యాపిటల్ (రూ.11,773 కోట్లు), హోమ్ ఫస్ట్ ఫైనాన్స్ కంపెనీ ఇండియా(రూ.10,602 కోట్లు) ఆ తర్వాత స్థానాల్లో ఉన్నాయి.

క్రాస్ లిమిటెడ్ లిస్టింగ్ ఓకే

వాహన విడిభాగాల తయారీ సంస్థ క్రాస్ లిమిటెడ్ సైతం సోమవారం షేర్లను మార్కెట్లో లిస్ట్ చేసింది. బీఎస్ఈలో కంపెనీ షేరు ఐపీఓ ధర రూ.240 వద్దనే లిస్ట్ అయినప్పటికీ, తొలిరోజు ట్రేడింగ్ నిలిచేసరికి 8.13 శాతం లాభంతో రూ.259.50 వద్ద ముగిసింది.



మహీంద్రా సరికొత్త ఎల్‌సీవీ 'వీరో'

ప్రారంభ ధర రూ.7.99 లక్షలు

రూ.900 కోట్లతో యూపీపీ ప్లాట్‌ఫామ్ అభివృద్ధి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): మహీంద్రా అండ్ మహీంద్రా (ఎం అండ్ ఎం) మార్కెట్లోకి సరికొత్త తేలికపాటి వాణిజ్య వాహనం (ఎల్‌సీవీ) 'వీరో' తీసుకువచ్చింది. 3.5 టన్నుల లోపు విభాగంలో ఈ వాహనం సరికొత్త ప్రమాణాలు నెలకొల్పనుందని ఎం అండ్ ఎం ఆటోమోటివ్ డివిజన్ ప్రెసిడెంట్ విజయ్ నక్రా వెల్లడించారు. మహీంద్రా కొత్తగా అభివృద్ధి చేసిన అర్బన్ ప్రాస్పర్ ప్లాట్‌ఫామ్‌పై (యూపీపీ) వీరోను డిజైన్ చేసినట్లు ఆయన చెప్పారు. డీజిల్, సీఎన్‌జీ వేరియంట్ ఆప్షన్స్‌తో అందుబాటులో ఉండనున్న వీరో ప్రారంభ ధర రూ.7.99 లక్షలు. 1,600 కేజీల పేలోడ్ సామర్థ్యంతో కూడిన వీరో లీటర్ డీజిల్‌కు 18.4 కిలోమీటర్ల మైలేజీ ఇవ్వనుండగా కేజీ సీఎన్‌జీకి 19.2 కిలోమీటర్ల మైలేజీ ఇస్తుందని విజయ్ పేర్కొన్నారు. 3.5 టన్నుల లోపు విభాగంలో కంపెనీ స్థానాన్ని వీరో మరింత బలోపేతం చేస్తుందన్నారు. ఈ విభాగంలో ఎవరు అందించనటువంటి ఫీచర్లు, టెక్నాలజీని వీరో వాహనంలో పొందుపరిచినట్లు ఆయన చెప్పారు. మారుతున్న పరిస్థితులు, వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా ఈ వాహనాన్ని డిజైన్ చేసినట్లు తెలిపారు. ఈ విభాగంలో తొలిసారిగా డ్రైవర్ సైడ్ ఎయిర్‌బ్యాగ్, రివర్స్ పార్కింగ్ కెమెరా, 10 అంగుళాల టచ్‌స్క్రీన్, పవర్ విండోస్‌ను కొత్త వీరోలో ఉన్నాయన్నారు.

త్వరలో ఎలక్ట్రిక్ వీరో: ప్రస్తుతం డీజిల్, సీఎన్‌జీ వేరియంట్లలో మాత్రమే వీరో అందుబాటులో ఉంటుందని, సాధ్యమైనంత త్వరగా ఎలక్ట్రిక్ వీరో ను తీసుకువచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు మహీంద్రా ఆటోమోటివ్ డివిజన్ సీఈఓ నళినికాంత్ వెల్లడించారు. దేశంలో తొలిసారిగా యూపీపీ పేరుతో మల్టీ ఎనర్జీ మాడ్యులర్ కమర్షియల్ వాహన (సీవీ) ప్లాట్‌ఫామ్‌ను మహీంద్రా అభివృద్ధి చేసిందని, దీని ద్వారా 1 నుంచి 2 టన్నులకు పైబడి పేలోడ్స్ సామర్థ్యాలతో కూడిన మరిన్ని వాహనాలను తీసుకువచ్చే వీలుందన్నారు. ఈ కొత్త ప్లాట్‌ఫామ్ కోసం రూ.900 కోట్ల పెట్టుబడి పెట్టినట్లు ఆయన చెప్పారు. కాగా వీరో.. వీ2, వీ4, వీ6 వేరియంట్లలో అందుబాటులో ఉంటుందన్నారు. ఇందులో వీ2 ధర రూ.7,99 లక్షలు, వీ4 రూ.8.99 లక్షలు, వీ6 ధర రూ.9.56 లక్షలుగా ఉంది.

బోనస్ ఇష్యూ ప్రక్రియ మరింత వేగంగా..

న్యూఢిల్లీ: బోనస్ షేర్ల జారీ, ట్రేడింగ్ ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు సెబీ సోమవారం కొత్త మార్గదర్శకాలు జారీ చేసింది. ఇకపై రికార్డు తేదీ తర్వాత 2 రోజుల (టీ+2) నుంచే ఇన్వెస్టర్లు బోనస్ షేర్ల ట్రేడింగ్ నిర్వహించవచ్చు. ఇది అక్టోబరు 1 నుంచి ఇది అమలులోకి రానుందని సెబీ తన సర్క్యులర్‌లో స్పష్టం చేసింది. ప్రస్తుతం బోనస్ ఇష్యూలో షేర్ల క్రెడిట్, వాటి ట్రేడింగ్‌కు సంబంధించి నిర్దేశిత టైమ్‌లైన్ లేదు. దాంతో కంపెనీలు ప్రస్తుత షేర్‌హోల్డర్లకు బోనస్ షేర్ల జారీతోపాటు ఆ షేర్లను ట్రేడింగ్‌కు అందుబాటులోకి తెచ్చేందుకు రికార్డు తేదీ తర్వాత 2 నుంచి 7 రోజుల వరకు సమయం తీసుకుంటున్నాయి.

బెంజ్ సరికొత్త ఈవీ

ధర రూ.1.41 కోట్లు



న్యూఢిల్లీ: జర్మనీ లగ్జరీ కార్ల దిగ్గజం మెర్సిడెస్ బెంజ్ భారత మార్కెట్లో ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) శ్రేణిని మరింత విస్తరించింది. దేశీయంగా తయారుచేసిన ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ 'ఈక్యూఎస్ 580 4మ్యాటిక్‌'ను సోమవారం విడుదల చేసింది. కేవలం ఒకే వేరియంట్‌లో లభించే ఈ కారు ధర రూ.1.41 కోట్లు. ఈ కారు బ్యాటరీ ప్యాక్‌పై 10 ఏళ్ల వారంటీ కల్పిస్తున్నట్లు కంపెనీ వెల్లడించింది. కారు గంటకు సున్నా నుంచి 100 కిలోమీటర్ల వేగాన్ని కేవలం 4.7 సెకండ్లలో అందుకోగలదని, గరిష్ఠంగా గంటకు 210 కి.మీ వేగంతో ప్రయాణించగలదని బెంజ్ తెలిపింది. అంతేకాదు, బ్యాటరీ పూర్తి చార్జింగ్‌తో 809 కి.మీ వరకు ప్రయాణించగలదట. 200 కిలోవాట్ డీసీ ఫాస్ట్ చార్జర్‌తో కేవలం 31 నిమిషాల్లో 10 నుంచి 80 శాతం చార్జింగ్ అవుతుందని, ఇంట్లో 7.4 కిలోవాట్ ఏసీ చార్జర్‌తో చార్జ్ చేయడానికి మాత్రం 18.5 గంటలు పడుతుందని కంపెనీ స్పష్టం చేసింది.

కొత్త గరిష్ఠాలకు సూచీలు

ముంబై: ఈక్విటీ మార్కెట్ సూచీలు సోమవారం సరికొత్త గరిష్ఠాలకు చేరుకున్నాయి. సెన్సెక్స్ ఒక దశలో 293.4 పాయింట్లు పెరిగి 83,184.34 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును నమోదు చేసింది. చివరికి 97.84 పాయింట్ల వృద్ధితో 82,988.78 వద్ద స్థిరపడింది. సూచీకిది సరికొత్త జీవనకాల గరిష్ఠ ముగింపు స్థాయి. నిఫ్టీ సైతం ఒకదశలో 89.2 పాయింట్లు ఎగబాకి 25,445.70 వద్ద కొత్త ఇంట్రాడే రికార్డును నమోదు చేసింది. చివరికి 27.25 పాయింట్ల లాభంతో 25,383.75 వద్ద క్లోజైంది.

- ప్రిఫరెన్షియల్ ఇష్యూ ద్వారా నిధుల సమీకరణ ప్రతిపాదనపై నిర్ణయం తీసుకునేందుకు ఈనెల 19న కంపెనీ బోర్డు భేటీ కానుందని రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ తెలిపింది. అయితే, సమీకరించనున్న నిధుల విలువను మాత్రం వెల్లడించలేదు.
- మహారాష్ట్రకు 6,600 మెగావాట్ల థర్మల్, పునరుత్పాదక ఇంధన సరఫరా చేసేందుకు దీర్ఘకాలిక ఒప్పందం కుదుర్చుకున్న నేపథ్యంలో అదానీ పవర్, అదానీ గ్రీన్ ఎనర్జీ షేర్లు భారీగా లాభపడ్డాయి. బీఎస్ఈలో అదానీ పవర్ షేరు ధర 5.12 శాతం ఎగబాకి రూ.666 వద్ద ముగియగా.. అదానీ గ్రీన్ ఎనర్జీ స్టాక్ 7.67 శాతం లాభంతో రూ.1,925 వద్ద స్థిరపడింది.
- బాస్మతి బియ్యంపై కనీస ఎగుమతి ధరను ఎత్తివేయడంతో ఈ విభాగ కంపెనీల షేర్లు భారీగా పుంజుకున్నాయి. కోహినూర్ ఫుడ్స్ 20 శాతం, ఎల్‌టీ ఫుడ్స్ 6.70 శాతం, కేఆర్‌బీఎల్ 5.87 శాతం పుంజుకున్నాయి.
- ఆర్కేడ్ డెవలపర్స్ ఐపీఓకు అనూహ్య స్పందన లభించింది. ఇష్యూ తొలిరోజే 5.79 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. నార్తర్న్ ఏఆర్‌సీ క్యాపిటల్ ఆఫర్‌కు సైతం మొదటి రోజు 2.86 రెట్ల బిడ్లు లభించాయి.
- వెస్టర్న్ క్యారియర్స్ (ఇండియా) లిమిటెడ్ ఐపీఓకు రెండో రోజు నాటికి 4.83 రెట్ల సబ్‌స్క్రిప్షన్ నమోదైంది. ఫ్యాబ్‌టెక్ టెక్నాలజీ ఐపీఓకు అనుమతి కోరుతూ సెబీకి ప్రాథమిక ముసాయిదా పత్రాలు సమర్పించింది.ఐపీఓలో భాగంగా కంపెనీ1.20 కోట్ల తాజా ఈక్విటీ షేర్లను జారీ చేయనుంది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	75,050 ▲	68,800 ▲	98,000 ▲
ముంబై	73,490 ▲	67,320 ▲	88,310 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

17వ తేదీ

హైదరాబాద్	510	విజయవాడ	545
వరంగల్	512	గోదావరి	540
చిత్తూరు	553	విశాఖపట్నం	550

డజను గుడ్లు రూ. 72

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	100	విజయవాడ	113
వరంగల్	100	గుంటూరు	115
కరీంనగర్	100	ఒంగోలు	115
మహబూబ్‌నగర్	100	చిత్తూరు	115
కర్నూలు	100	నెల్లూరు	115
విశాఖపట్నం	101	అనంతపురం	115
గోదావరి	113		

స్పోర్ట్స్



తిరుగులేని భారత్

ఫైనల్లో హర్మన్‌ప్రీత్ సేన

- సెమీస్‌లో కొరియా చిత్తు
- టైటిల్‌కోసం చైనాతో అమీతుమీ నేడు

ఆసియా చాంపియన్స్ ట్రోఫీ హాకీ

మ 3.30 నుంచి

హులున్‌బుయిర్ (చైనా): అద్భుత ఫామ్‌లో ఉన్న కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ రెండు గోల్స్‌తో ముందుండి నడిపించగా..అన్ని విభాగాల్లో అదరగొట్టిన భారత్ ఆసియా చాంపియన్స్ ట్రోఫీ హాకీ టోర్నీలో టైటిల్ నిలబెట్టుకొనేందుకు అడుగు దూరంలో నిలిచింది. సోమవారం జరిగిన సెమీఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ భారత్ 4-1తో కొరియాను చిత్తు చేసింది. ఉత్తమ్ సింగ్ (13వ నిమిషం), హర్మన్‌ప్రీత్ (19, 45), జర్మన్‌ప్రీత్ సింగ్ (32) భారత్ తరపున గోల్స్ సాధించారు. యాంగ్ జిహాన్ (33వ) కొరియాకు ఏకైక గోల్ అందించాడు.

పాక్‌పై చైనా గెలుపు

మంగళవారం జరిగే ఫైనల్లో ఆతిథ్య చైనా జట్టుతో హర్మన్‌సింగ్ సేన తలపడనుంది. అంతకుముందు షూటౌట్‌కు దారి తీసిన మరో సెమీఫైనల్లో చైనా 2-0తో మాజీ చాంపియన్ పాకిస్థాన్‌కు షాకిచ్చింది. నిర్ణీత సమయం ముగిసే సరికి రెండు జట్లు 1-1తో సమంగా నిలిచాయి. లీగ్ దశలో చైనాతో పోరులో మనోళ్లు 3-0తో విజయం సాధించారు.

ఆదినుంచే..

కొరియాతో మ్యాచ్‌లో భారత్ ఆరంభంనుంచే ఎదురు దాడికి దిగింది. దాంతో చేష్టలుడిగిన ప్రత్యర్థి ఆత్మరక్షణకే పరిమితమైంది. కొరియా గోల్‌పోస్ట్‌పై పదేపదే దాడి చేసిన భారత్ 13వ నిమిషంలో ఫలితం రాబట్టింది. అరైజీత్ సింగ్ నుంచి అందుకొన్న పాస్‌ను ఉత్తమ్ పొరపాటుకు తావులేకుండా గోల్‌పోస్ట్‌లోకి పంపడంతో భారత్‌కు 1-0 ఆధిక్యం లభించింది. రెండో క్వార్టర్ ఆరంభంలోనే కొరియాకు వరుసగా రెండు పెనాల్టీకార్నర్లు దక్కినా సద్వినియోగం చేసుకోలేకపోయింది. మరోవైపు ఈ క్వార్టర్ నాలుగో నిమిషంలో లభించిన పెనాల్టీ కార్నర్‌ను హర్మన్ తనదైన శైలిలో గోల్‌గా మలిచాడు. ఈసారి టోర్నీలో భారత సారథికిది ఆరో గోల్ కావడం విశేషం. ప్రథమార్థం తర్వాతా ఏమాత్రం జోరు తగ్గని భారత్ మూడో క్వార్టర్ రెండో నిమిషంలోనే సూపర్ గోల్ సాధించింది. సుమీత్ అందించిన అమోఘమైన స్కూప్‌ను సర్కిల్ వెలుపల లెఫ్ట్‌ఫ్లాంక్‌లో అందుకున్న జర్మన్‌ప్రీత్ ప్రత్యర్థి డిఫెండర్లు నివ్వెరపరుస్తూ గోల్‌లోకి పంపాడు. మరికొద్దిసేపటికే కొరియాకు పెనాల్టీ కార్నర్ లభించగా యాంగ్ జిహాన్ గోల్‌గా మలిచాడు. అయినా వెనక్కు తగ్గని భారత్ దాడుల ఉధృతిని ఏమాత్రం తగ్గించకుండా ఆడింది. ఈక్రమంలో క్వార్టర్ ముగిసే సమయంలో మరో పెనాల్టీ కార్నర్ దక్కింది. ఎప్పటిలాగే హర్మన్ దానిని అలవోకగా గోల్ పోస్ట్‌లోకి కొట్టాడు. ఆట మరో ఎనిమిది నివిషాల్లో ముగుస్తుందనగా.. కీపర్ కర్కేరా ప్రత్యర్థి రెండు గోల్స్ అవకాశాలను వమ్ము చేశాడు.

సచిన్ రికార్డుకు చేరువలో రోహిత్

బంగ్లాతో సిరీస్‌లో రోహిత్ శర్మను అనేక రికార్డులు ఊరిస్తున్నాయి. బంగ్లాపై మూడు ఫార్మాట్లలో అత్యధిక పరుగులు సాధించిన భారత బ్యాటర్లలో కోహ్లీ 1577 రన్స్‌తో టాప్‌లో ఉండగా.. సచిన్ టెండూల్కర్ (1316 పరుగులు) రెండో స్థానంలో నిలిచాడు. రోహిత్ (1296 రన్స్) మరో 21 పరుగులు సాధిస్తే మాస్టర్ రికార్డును అధిగమించే అవకాశం ఉంది.

కెరీర్‌లో 50 శతకాల మైలురాయికి రోహిత్ మరో రెండు సెంచరీల దూరంలో ఉన్నాడు. సచిన్ (100), కోహ్లీ (80) భారత ఆటగాళ్లలో టాప్-2లో ఉన్నారు.

టెస్ట్ క్రికెట్‌లో అత్యధిక సిక్స్‌లు బాదిన భారత బ్యాటర్ వీరేంద్ర సెహ్వాగ్ (90) రికార్డును బద్దలు కొట్టడానికి రోహిత్ (84) ఇంకా 7 సిక్స్‌ల దూరంలో ఉన్నాడు. ఓవరాల్‌గా బెన్ స్టోక్స్ (131), న్యూజిలాండ్ మాజీ ఆటగాడు బ్రెండన్ మెకల్లమ్ (107), ఆస్ట్రేలియా మాజీ వికెట్ కీపర్ గిల్‌క్రిస్ట్ (100) టాప్-3లో ఉండగా.. హిట్‌మ్యాన్ 11వ స్థానంలో నిలిచాడు.

భారత్, బంగ్లా సిరీస్ షెడ్యూల్

తొలి టెస్ట్	అక్టోబరు19 -23	చెన్నై
రెండో టెస్ట్	27-అక్టోబరు 1	కాన్పూర్
తొలి టీ20	అక్టోబరు 6	గ్వాలియర్
రెండో టీ20	అక్టోబరు 9	ఢిల్లీ
మూడో టీ20	అక్టోబరు 12	హైదరాబాద్



ప్రాక్టీస్‌లో రోహిత్ జడేజా

నెట్స్‌లో శ్రమించిన టీమిండియా

జోరుగా.. హుషారుగా!

కోహ్లీ, రోహిత్ సాధన ● జైస్వాల్‌కు బుమ్రా పరీక్ష

చెన్నై: బంగ్లాదేశ్‌తో తొలి టెస్ట్ నేపథ్యంలో భారత జట్టు నెట్స్‌లో తీవ్రంగా శ్రమిస్తోంది. ఎంపిక చేసిన 16 మంది టీమిండియా సభ్యులు సోమవారం జరిగిన శిక్షణ శిబిరంలో చెమటోడ్చారు. గతవారమే ఇక్కడకు చేరుకొన్న రోహిత్ సేనకు ఇది మూడో ప్రాక్టీస్ సెషన్. బంగ్లాతో రెండు టెస్ట్‌ల సిరీస్‌లో భాగంగా గురువారం నుంచి తొలి మ్యాచ్ జరగనుంది. తొలి విడతలో కోహ్లీతోపాటు యశస్వి జైస్వాల్ పక్కపక్క నెట్స్‌లో సాధన చేశారు. వీరిద్దరూ బుమ్రా, అశ్విన్‌ను ఎదుర్కొన్నారు. అయితే, జైస్వాల్‌ను మాత్రం తన పేస్, స్వింగ్‌తో తీవ్రంగా పరీక్షించిన బుమ్రా.. రెండుసార్లు వికెట్లను గిరాటేశాడు. స్థానిక బౌలర్లను ఎదుర్కోవడంలో కూడా యశస్వి తడబడ్డాడు. ఆ తర్వాత రోహిత్ శర్మ, గిల్, సర్ఫరాజ్ ప్రాక్టీస్ చేశారు. బంగ్లా స్లో బౌలర్లను దృష్టిలో ఉంచుకొని రోహిత్ ఎక్కువగా స్పిన్ బౌలింగ్‌ను ఎదుర్కొన్నాడు. జడేజా, రిషభ్ పంత్‌తోపాటు సిరాజ్ కూడా స్థానిక బౌలర్ల బౌలింగ్‌లో సాధన చేశారు. భారత్ మరో రెండు నెట్ సెషన్స్‌లో పాల్గొనే అవకాశం ఉంది. చెపాక్ వికెట్ సాధారణంగా స్పిన్నర్లకు అనుకూలించనున్న నేపథ్యంలో తుది జట్టులో జడేజా, అశ్విన్, కుల్దీప్‌లకు చోటు దక్కే చాన్సులుండగా.. బుమ్రా, సిరాజ్ పేస్ భారాన్ని మోయనున్నారు. ఇదే జరిగితే అక్షర్ పటేల్‌కు తుది జట్టులో చోటు కష్టమే.! ఇక, బ్యాటింగ్ విషయానికొస్తే రెండేళ్ల తర్వాత పంత్ టెస్టులోకి రీఎంట్రీ ఖాయంగా కనిపిస్తుండడంతో.. ఇంగ్లండ్‌తో సిరీస్‌లో ఆకట్టుకొన్న వికెట్ కీపర్ ధ్రువ్ జురెల్‌ను బెంచ్‌కే పరిమితం చేసే అవకాశాలున్నాయి. కాగా, చెన్నై వేడి వాతావరణంలో జట్టు ప్రాక్టీస్ చేసిన తీరుపై ఫీల్డింగ్ కోచ్ దిలీప్ సంతృప్తి వ్యక్తం చేశాడు. ఆటగాళ్లను రెండు గ్రూప్‌లుగా చేసి క్యాచింగ్ ప్రాక్టీస్ పోటీని నిర్వహించినట్టు తెలిపాడు. ఇందులో తక్కువ తప్పులు చేసిన కోహ్లీ టీమ్ గెలిచిందని చెప్పాడు.

బంగ్లా కూడా..

ఆదివారం ఇక్కడకు చేరుకొన్న బంగ్లా తొలి నెట్ సెషన్‌లో పాల్గొంది. బ్యాటర్లు సాధన చేస్తున్న వీడియోను బంగ్లా క్రికెట్ బోర్డు నెట్‌లో పోస్టు చేసింది. బ్యాటర్లు లిట్టన్ దాస్, హసన్ జాయ్, జకీర్ హసన్, షద్మన్ ఇస్లాం తమ ఫుట్‌వర్క్‌ను మెరుగుపరచుకొంటూనే విభిన్న రకాల షాట్లను ప్రాక్టీస్ చేశారు. పేసర్ నహీద్ రాణాతోపాటు స్పిన్నర్లు కూడా బ్యాటర్లను ఇబ్బందిపెట్టడానికి ప్రయత్నించారు. ఇంగ్లండ్‌లో కౌంటీలు ఆడుతున్న షకీబల్ మంగళవారం జట్టులో చేరే అవకాశం ఉంది.



తేలిగ్గా తీసుకొంటే..!

● హెచ్చరించిన గవాస్కర్

బంగ్లాను ఏమాత్రం తేలిగ్గా తీసుకొన్నా పరాభవం తప్పదని టీమిండియాను మాజీ ఆటగాడు సునీల్ గవాస్కర్ హెచ్చరించాడు. పాకిస్థాన్‌ను వైట్‌వాష్ చేసిన బంగ్లా.. మరో సంచలనం కోసం తీవ్రంగా పోరాడే అవకాశం ఉందని చెప్పాడు. రెండు టెస్టుల్లోనూ పాక్‌ను ఓడించి తన సత్తా ఏమిటో బంగ్లా ప్రపంచానికి తెలియజేసింది. కొన్నేళ్ల కిందట ఆదేశ పర్యటకు వెళ్లిన మనల్ని దాదాపుగా ఓడించినంత పనిచేసింది. ఆ జట్టులో సీనియర్లతోపాటు కుర్రాళ్లు అదరగొడుతున్నారు. అంతర్జాతీయ క్రికెట్‌లో ఆధిపత్యం ఎలా చెలాయించాలో వారు వేగంగా నేర్చుకొంటున్నారని గవాస్కర్ అన్నాడు. వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ ఫైనల్ చేరుకోవాలంటే స్వదేశంలో జరిగే ప్రతీ టెస్ట్ భారత్‌కు ఎంతో కీలకమని చెప్పాడు.

భారత జట్ల డబుల్ హ్యాట్రిక్

వరుసగా ఆరో విజయం ● చెస్ ఒలింపియాడ్

బుడాపెస్ట్: ప్రతిష్ఠాత్మక చెస్ ఒలింపియాడ్‌లో భారత పురుషులు, మహిళల జట్లు జోరు కొనసాగిస్తున్నాయి. వరుసగా ఆరో రౌండ్‌లోనూ విజయంతో డబుల్ హ్యాట్రిక్ సాధించాయి. సోమవారం జరిగిన ఈ రౌండ్‌లో పురుషుల జట్టు 3-1తో హంగేరీపై గెలుపొందింది. మహిళల జట్టు 2.5-1.5తో ఆర్మీనియాపై నెగ్గింది. పురుషుల జట్టులో..తెలుగు గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఇరిగేసి-ననన్‌ని, విదిత్ గుజ్‌రాతీ-బెంజమిన్‌ని ఓడించారు. ప్రజ్ఞానంద-పీటర్ లెకో, గుకేశ్-రిచర్డ్ గేమ్‌లు డ్రా అయ్యాయి. మహిళల్లో..దివ్య దేశ్‌ముఖ్-ఎలీనాపై గెలుపొందింది. తెలుగు జీఎం హారిక, వైశాలీ, తానియా తమ గేమ్‌లను ఫలితం లేకుండా ముగించారు. ఆరు రౌండ్ల తర్వాత రెండు జట్లు చెరో 12 పాయింట్లతో కొనసాగుతున్నాయి.



టాప్-5లో అర్జున్, గుకేశ్

వరల్డ్ చెస్ లైవ్ రేటింగ్స్‌లో ఇద్దరు భారత క్రీడాకారులు అర్జున్ ఇరిగేసి 4వ (2788.1 రేటింగ్), గుకేశ్ (2775.9) ఐదో ర్యాంకులో నిలిచారు. ఇలా ఇద్దరు ఆటగాళ్లు లైవ్ రేటింగ్స్‌లో టాప్-5లో నిలవడం భారత చెస్ చరిత్రలో తొలిసారి కావడం విశేషం. ఇక.. కార్ల్‌సన్, కరువానా, హికారు నకమురా తొలి మూడు స్థానాల్లో ఉన్నారు.

భారత ఫుట్‌బాల్ మహిళల జట్టు కోచ్‌గా సంతోష్ కశ్యప్

న్యూఢిల్లీ: జాతీయ ఫుట్‌బాల్ సీనియర్ మహిళల జట్టు చీఫ్ కోచ్‌గా సంతోష్ కశ్యప్ నియమితుడయ్యాడు. భారత మాజీ ఫుట్‌బాలరైన 58 ఏళ్ల కశ్యప్ దశాబ్దకాలం పాటు ఐ లీగ్, మోహన్ బగాన్, ఐజ్వాల్ ఎఫ్‌సీ, ముంబై ఎఫ్‌సీతో పాటు ఐఎస్ఎల్‌లో ఒడిశా ఎఫ్‌సీ జట్లకు కోచ్‌గా పనిచేశాడు. కశ్యప్‌కు అసిస్టెంట్ కోచ్‌గా పీవీ ప్రియ, గోల్‌కీపింగ్ కోచ్‌గా రఘువీర్ ప్రవీణ్ వ్యవహరిస్తారని అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య సోమవారం ప్రకటించింది. వచ్చేనెల ఖట్మాండులో జరిగే శాఫ్ మహిళల చాంపియన్‌షిప్ కోచ్‌గా కశ్యప్‌కు తొలి టోర్నీ కానుంది.

అంతజరిగినా.. ఆరోజు రవిశాస్త్రి పార్టీ ఇచ్చాడు



అశ్విన్

చెన్నై: నాలుగేళ్ల క్రితం ఆస్ట్రేలియాతో జరిగిన టెస్టు సిరీస్‌ను భారత్ 2-1తో గెలుచుకుని చరిత్ర సృష్టించింది. అయితే అందులో భాగంగా జరిగిన తొలి టెస్టులో మాత్రం కేవలం 36 పరుగులకే కుప్పకూలింది. ఈ ఫార్మాట్‌లో భారత్‌కిదే అత్యల్ప స్కోరు. ఆ సమయంలో అప్పటి కోచ్ రవిశాస్త్రి తమలో ఆత్మవిశ్వాసాన్ని కలిగించిన తీరుపై స్పిన్నర్ అశ్విన్ చెప్పుకొచ్చాడు. 'అడిలైడ్ టెస్టులో మేం తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం పొందినా ఆ తర్వాత ఇన్నింగ్స్‌లో 36 రన్స్‌కే ఆలౌటయ్యాం. డ్రెస్సింగ్ రూమ్‌లో అంతా తీవ్ర నిరాశలో కూరుకుపోయాం. కానీ అదే రోజు సాయంత్రం రవిశాస్త్రి మాకు డిన్నర్ ఇవ్వడంతో పాటు సంగీత కార్యక్రమం ఏర్పాటు చేశాడు. అందులో తను పాత హిందీ పాటలు పాడగా.. మేం కూడా అనుసరించి మనసులను తేలిక చేసుకున్నాం. ఆ తర్వాత కసిగా ఆడి మెల్‌బోర్న్‌లో గెలిచాం' అని అశ్విన్ వివరించాడు.



బాబు ప్రభుత్వం @ 100

రేపు కూటమి ఎమ్మెల్యేల సమావేశం

- వంద రోజుల సందర్భంగా ప్రత్యేక భేటీ
- సర్కారు విజయాలు, భావి కార్యాచరణపై చర్చ

అమరావతి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో టీడీపీ-జనసేన-బీజేపీ ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు అవుతున్న సందర్భాన్ని పురస్కరించుకుని పాలక కూటమి ఎమ్మెల్యేలు ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. బుధవారం (18న) మంగళగిరిలో టీడీపీ కార్యాలయం సమీపంలోని సీకే సమావేశ మందిరంలో ఈ భేటీ జరుగుతుందని టీడీపీ వర్గాలు తెలిపాయి. ఆ రోజు ఉదయం రాష్ట్ర సచివాలయంలో మంత్రివర్గ సమావేశం జరగనుంది. తర్వాత సాయంత్రం 4 గంటలకు ఎమ్మెల్యేల భేటీ ఏర్పాటు చేశారు. ఇది 2-3 గంటలపాటు జరిగే అవకాశం ఉంది. ఇటీవల టీడీపీ నుంచి సస్పెండైన సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలాన్ని తప్ప.. మూడు పార్టీల ఎమ్మెల్యేలందరినీ దీనికి ఆహ్వానిస్తారు. వంద రోజుల సందర్భంగా ఎమ్మెల్యేలకు వారి పనితీరుపై ప్రోగ్రెస్ కార్డులు తయారుచేసి ఎవరికి వారికి విడిగా ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు తొలుత భావించారు. అప్పటికి అవి సిద్ధమైతే ఇవ్వాలని... లేని పక్షంలో తర్వాత ఇవ్వాలని ఇప్పుడు అనుకుంటున్నట్లు సమాచారం. వంద రోజుల పాలనలో ప్రభుత్వం సాధించిన విజయాలను వివరించడంతోపాటు భవిష్యత్ కార్యాచరణపై చర్చించే అవకాశం ఉంది. ఇంకోవైపు.. మిత్రపక్షాలకు సీట్లు ఇచ్చిన నియోజకవర్గాల్లో టీడీపీ ఇన్‌చార్జులు, వైసీపీ గెలిచిన స్థానాల్లో ఓడిపోయిన టీడీపీ అభ్యర్థులతో కూడా విడిగా సమావేశం నిర్వహించాలని ఆ పార్టీ నాయకత్వం నిర్ణయించింది. వారంతా మంగళవారం అమరావతిలో అందుబాటులో ఉండాలని కోరినట్లు సమాచారం.

నామినేటెడ్ పోస్టులకు శ్రీకారం!

- తొలి చాన్సు రిటైర్డ్ ఐఏఎస్ కృష్ణయ్యకు
- త్వరలో మరో పది నియామకాలు
- ఇందులో జనసేన, బీజేపీలకూ వాటా

అమరావతి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబు సారథ్యంలోని టీడీపీ కూటమి ప్రభుత్వం నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రారంభించింది. మొదటి అవకాశం బీసీ వర్గాలకు చెందిన విశ్రాంత ఐఏఎస్ అధికారి పి.కృష్ణయ్యకు దక్కింది. ఆయన్ను రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి(ఏపీపీసీబీ)కి అధ్యక్షుడిగా నియమించింది. ఈ పదవిలో గత జగన్ ప్రభుత్వం రిటైర్డ్ సీఎస్ సమీర్ శర్మను నియమించింది. వైసీపీ ఘోరపరాజయం దరిమిలా ఆయన రాజీనామా చేయడంతో.. కూటమి ప్రభుత్వం కృష్ణయ్యకు అవకాశం ఇచ్చింది. టీడీపీ ప్రతిపక్షంలో ఉన్న సమయంలో ఆయన ఆ పార్టీ కీలక అంతర్గత బృందంలో సభ్యుడిగా ఉన్నారు. సోమవారం బాధ్యతల స్వీకారానికి ముందు ఆయన తమ పార్టీ కేంద్ర కార్యాలయాన్ని సందర్శించారు. కాగా.. ప్రభుత్వం ఏర్పడి త్వరలో వంద రోజులు కానున్న సందర్భంగా మరికొన్ని నామినేటెడ్ పదవులను త్వరలో భర్తీ చేయనున్నట్లు టీడీపీ వర్గాలు తెలిపాయి. వీటిలో జనసేన, బీజేపీ నేతలకు కూడా అవకాశం కల్పిస్తారు. పది వరకూ పదవుల భర్తీకి ప్రతిపాదనలు సిద్ధమయ్యాయని, మిత్రపక్షాల ఆమోదంతో కొద్ది రోజుల్లోనే ఉత్తర్వులు జారీ అవుతాయని ఆ వర్గాలు చెప్పాయి. మొన్నటి సార్వత్రిక ఎన్నికల్లో మిత్రపక్షాలకు సీట్ల కేటాయింపు వల్ల అవకాశం కోల్పోయిన టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జులకు వీటి భర్తీలో ప్రాధాన్యం కల్పించే అవకాశముంది. రాష్ట్ర స్థాయిలో కీలకంగా పనిచేసిన ఒకరిద్దరికి కూడా చోటు లభించనున్నట్లు సమాచారం. విడతలవారీగా పోస్టుల భర్తీ ఉంటుందని.. ప్రాంతాలు, సామాజిక సమీకరణలు పరిగణనలోకి తీసుకుంటారని అంటున్నారు.

పరిశ్రమలు, పర్యావరణం.. రెండూ ముఖ్యమే

- 'ఆంధ్రజ్యోతి'తో పీసీబీ చైర్మన్ కృష్ణయ్య

రాష్ట్రంలో కాలుష్య నిర్మూలనపై ప్రత్యేక దృష్టి పెట్టి, కాలుష్య నియంత్రణపై ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు కృషి చేస్తామని పీసీబీ చైర్మన్ పీ కృష్ణయ్య చెప్పారు. సోమవారం బాధ్యతలు చేపట్టిన ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. 'పరిశ్రమలు, పర్యావరణం రెండూ ముఖ్యమే. అయితే కాలుష్యం ఎక్కువైతే.. మానవ మనుగడకే ముప్పు అనే అంశంపై ప్రజల్లో చైతన్యం తీసుకురావటానికి ప్రయత్నిస్తాం. పర్యావరణ పరిరక్షణ చట్టాల అమలుకు చర్యలు తీసుకుంటాం. చెత్తపై ఫోకస్ పెడతాం. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఇతర మంత్రుల సహకారంతో మెరుగైన సేవలు అందించడానికి కృషి చేస్తాం. చెత్త విషయంలో ప్రజల బాధ్యత కూడా పెరగాలి. ప్రతి ఒక్కరూ కాలుష్య నియంత్రణకు పాటుపడాలి. పీసీబీలో సిబ్బంది కొరత తీర్చడానికి కృషి చేస్తా' అని కృష్ణయ్య అన్నారు. కాగా, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్ర మండలి(పీసీబీ) చైర్మన్‌గా విశ్రాంత ఐఏఎస్ అధికారి పి.కృష్ణయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గత ప్రభుత్వంలో పీసీబీ చైర్మన్‌గా ఉన్న సమీర్‌శర్మ ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చాక రాజీనామా చేశారు. పీసీబీ చైర్మన్ ఎంపిక కోసం ప్రభుత్వం నియమించిన ఉన్నత స్థాయి కమిటీ కృష్ణయ్య పేరును సిఫారసు చేసింది. ఆమేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మూడేళ్ల పాటు ఆయన ఈ పదవిలో ఉంటారని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.

సీబీఎస్ఈని ఎలా రద్దుచేస్తారు?

- పేదల వ్యతిరేకి చంద్రబాబు
- తిరోగమనంలోకి విద్యారంగం: జగన్

అమరావతి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో సీబీఎస్ఈ విద్యావిధానాన్ని రద్దుచేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సరి కాదని వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అన్నారు. చంద్రబాబు ఈ నిర్ణయం ద్వారా మరోసారి తనను తాను పేదల వ్యతిరేకిగా రుజువు చేసుకున్నారని సోమవారం 'ఎక్స్' వేదికగా విమర్శించారు. పేదలకు నాడు వైసీపీ ప్రభుత్వం కల్పించిన నాణ్యమైన విద్యావకాశాలకు గండి కొడుతున్నారని ఆయన ఆరోపించారు. విద్యారంగాన్ని తిరిగి తిరోగమనంలోకి చంద్రబాబు, మంత్రి లోకేశ్ తీసుకెళుతున్నారన్నారు. "పేద విద్యార్థులు ఎప్పటికీ కింది స్థాయిలోనే ఉండిపోవాలా? వారి జీవితాలకు శాపంపెట్టేలా చంద్రబాబు ఎందుకు నిర్ణయాలు తీసుకుంటున్నారు" అని ప్రశ్నించారు. కాగా, నాటి వైసీపీ ప్రభుత్వం మూడేళ్ల క్రితం సీబీఎస్ఈ సిలబస్‌ను ప్రవేశపెట్టి, ఆరో తరగతికి వర్తింపచేసింది. ఈ తరగతి విద్యార్థులు ఇప్పుడు పదో తరగతిలో ఉన్నారు. పాఠశాలల్లో సీబీఎస్ఈని ప్రవేశపెట్టిన తర్వాత ఆ సిలబస్‌లో పరీక్షలు రాస్తున్న తొలి బ్యాచ్ ఇదే. ఈ క్రమంలో వారి సామర్థ్యాన్ని పరిశీలించడం కోసం ఇటీవల ఎసెస్‌మెంట్ పరీక్షను ప్రభుత్వం నిర్వహించింది. ఈ పరీక్షలో చాలా మంది విద్యార్థులు ఉత్తీర్ణులు కాలేకపోయారు. దీంతో.. సీబీఎస్ఈ సిలబస్ చదువుతున్న 10వ తరగతి విద్యార్థులకు కూడా స్టేట్ సిలబస్‌లోనే పరీక్షలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. వాస్తవం ఇది కాగా, జగన్ వ్యాఖ్యలు అందుకు భిన్నంగా ఉన్నాయని విద్యారంగ నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు.

ఆత్మలతో మాట్లాడి సీబీఎస్ఈ పెట్టారు

- జగన్ ఏం చదివారో, ఎక్కడ చదివారో తెలియదు
- మంత్రి లోకేశ్ కౌంటర్



అమరావతి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): 'ఏం చదివావో తెలియదు. ఎక్కడ చదివావో అసలే తెలియదు. నువ్వు విద్యాశాఖ గురించి లెక్చర్ ఇవ్వడం వింతగా ఉంది ఫేక్ జగన్' అంటూ విపక్ష నేత జగన్‌కు మంత్రి నారా లోకేశ్ 'ఎక్స్' ద్వారా కౌంటర్ ఇచ్చారు. కనీస అవగాహన లేకుండా రాత్రి ఆత్మలతో మాట్లాడి ఉదయం వెయ్యి పాఠశాలల్లో సీబీఎస్ఈ పెట్టాలనే నిర్ణయం తీసుకున్నారని సోమవారం లోకేశ్ విమర్శించారు. ఆ నిర్ణయం విద్యార్థుల పాలిట శాపంగా మారిందన్నారు. సీబీఎస్ఈ విధానంలో పరీక్షలు రాయడానికి అవసరమైన సామర్థ్యాల పెంపు, టీచర్లకు శిక్షణ ఇవ్వకుండానే పరీక్ష విధానం మార్చడం వల్ల 75వేల మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఆత్మలతో కాకుండా నిపుణులతో చర్చించి వచ్చే ఏడాది నుంచి 6వ తరగతి నుంచి పరీక్షా విధానంలో క్రమంగా మార్పులు తీసుకొచ్చి, సీబీఎస్ఈలో పరీక్షలు రాయడానికి విద్యార్థులను సన్నద్ధం చేస్తామన్నారు. గుడ్లు, చిక్కీలు, ఆఖరికి ఆయాల జీతాలు కూడా బకాయిపెట్టిపోయిన జగన్ బడుల రూపురేఖలు మార్చానని చెప్పుకోవడం విడ్డూరంగా ఉందని విమర్శించారు.

మొన్న ఐటీ.. నేడు గ్రీన్ ఎనర్జీ!

(మొదటి పేజీ తరువాయి)

పాల్గొన్నారు. ఈ సందర్భంగా పునరుత్పాదక ఇంధనంపై ప్రజెంటేషన్ ఇచ్చిన చంద్రబాబు.. తర్వాత ప్రసంగించారు. క్లీన్ ఎనర్జీ ద్వారా పరోక్షంగానూ, ప్రత్యక్షంగానూ పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. రాష్ట్రంలో రెన్యువబుల్ ఎనర్జీలో పెట్టుబడులు పెట్టేందుకు అపార అవకాశాలున్నాయని ప్రకటించారు. న్యూ అండ్ రెన్యువబుల్ ఎనర్జీ సంస్థ నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తుందని.. పెట్టుబడులు పెట్టే సంస్థలకు ఈ సంస్థ ద్వారా సహకారం అందిస్తామని తెలిపారు. రాష్ట్రంలో క్లీన్ ఎనర్జీ గ్లోబల్ విశ్వవిద్యాలయం స్థాపిస్తామన్నారు. పునరుత్పాదక విద్యుదుత్పత్తిలో ప్రపంచంలోనే అత్యుత్తమ పద్ధతులు అవలంబిస్తామని స్పష్టం చేశారు. గ్రీన్‌ఎనర్జీ రంగంలో విప్లవం రాబోతుందని.. దీనిని దేశం అందుకోవాలని.. ఈ విప్లవానికి నాయకత్వం వహించాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో 2030నాటికి 72.60 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా అడుగులు వేస్తున్నట్లు చెప్పారు. అదే ఏడాది జాతీయ స్థాయిలో 500 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్ అందుబాటులోకి వస్తుందన్నారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాలతో పెట్టుబడుల స్థావరంగా మలుస్తామని చెప్పారు. చంద్రబాబు ఇంకా ఏమన్నారంటే..

జనంపై భారం పడకుండా..

గతంలో విద్యుత్ కోతలు గణనీయంగా ఉండేవి. ఈరోజు విద్యుత్ రంగంలో గణనీయమైన మార్పులు వచ్చాయి. సాంకేతికతను జోడించడం ద్వారా విద్యుత్ చార్జీల భారం జనంపై పడకుండా తగ్గించవచ్చు. క్లీన్ ఎనర్జీలో సాంకేతికతను అందిపుచ్చుకోవాలి. విద్యుత్ బిల్లుల నియంత్రణకు పునరుత్పాదక ఇంధనం(ఆర్ఈ)తో పాటు కటింగ్ ఎడ్జ్ సాంకేతికత వాడాలి. గ్రిడ్ నిర్వహణలో సమతూకానికి విద్యుత్ ట్రాన్స్‌మిషన్ వ్యవస్థను మెరుగుపరచాలి. గ్రీన్ హైడ్రోజన్ హబ్‌ల ద్వారా నేరుగా ట్రాన్స్‌మిషన్ చేయాలి. ఆంధ్రలో ఉత్తమ పారిశ్రామిక విధానాలను అమలు చేస్తున్నాం. 2014లో సౌర, పవన విద్యుత్ పాలసీ ప్రవేశపెట్టాం. రాష్ట్రంలో క్లీన్ ఎనర్జీ నాలెడ్జ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాల్సి ఉంది. నెడ్‌క్యాప్ నోడల్ ఏజెన్సీగా పనిచేస్తోంది. విన్-విన్నర్ విధానంలో భూసమీకరణ జరుగుతుంది. గతంలో విద్యుత్ పంపిణీ సంస్థలు.. కరెంటు బిల్లులను ఇంటింటికీ పంపేవి. కానీ ఇప్పుడీ రంగంలో సాంకేతికత పెరిగింది. రిమోట్ ఆధారంగా విద్యుత్ సేవలు అందించడం.. ఆపేయడం వంటి సాంకేతిక విధానాన్ని అమల్లోకి తెచ్చాం. రాష్ట్రంలో ప్రస్తుతం 4,335 మెగావాట్ల సోలార్, 3,083 మెగావాట్ల పవన, 443 మెగావాట్ల బయో, 36 మెగవాట్ల వేస్ట్ టు ఎనర్జీ ఉత్పత్తి అవుతోంది. 40 గిగావాట్ల సౌరశక్తి, 20 గిగావాట్ల పవన శక్తి, 12 గిగావాట్ల పంప్డ్ స్టోరేజీ. 25 గిగావాట్ల బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ, ఒక ఎంపీటీఏ గ్రీన్ హైడ్రోజన్, 2,500 కేఎల్‌పీడీ బయో విద్యుత్ ఉత్పత్తి చేయడమే లక్ష్యం. రాష్ట్రంలో రూఫ్‌టాప్ విద్యుదుత్పత్తి గణనీయంగా పెంచడంపై దృష్టిసారించాం. పెరిగిన సాంకేతికతతో ఈ విద్యుత్‌ను సొంత అవసరాలకే గాక.. పీక్ అవర్‌లో మళ్లీ వాడుకునేలా స్టోరేజీ వ్యవస్థ అమల్లోకి రానుంది. కొత్తగా ఇంటిగ్రేటెడ్ క్లీన్‌ఎనర్జీ పాలసీ -2024ను తీసుకొస్తాం. వీలింగ్ చార్జీలను మాఫీ చేస్తాం.

ప్రతి నలుగురిలో ఒక తెలుగోడు

ఐటీ విప్లవం వచ్చాక ప్రతి నలుగురు ఐటీ నిపుణుల్లో ఒక భారతీయుడు ఉంటున్నారు. ప్రతి నలుగురు భారత ఐటీ నిపుణుల్లో ఒకరు తెలుగు రాష్ట్రాలకు చెందినవారు ఉంటున్నారు.



గుజరాత్ రాజధాని గాంధీనగర్‌లో సోమవారం జరిగిన రెన్యువబుల్ ఎనర్జీ ఇన్వెస్టర్స్ మీట్-2024కు హాజరైన ప్రతినిధులతో సీఎం చంద్రబాబు

> ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన ద్వారా రాష్ట్రంలో 10 లక్షల ఇళ్లలో రూఫ్‌టాప్ సోలార్ విద్యుదుత్పత్తిని లక్ష్యంగా పెట్టుకున్నాం. గతంలో పీపీపీ అమలు చేశాం. ఇప్పుడు 'పీ-4' (పబ్లిక్, ప్రైవేట్, పీపుల్, పార్ట్‌నర్‌షిప్స్) అమలు చేస్తాం.
> - సీఎం చంద్రబాబు

దండి కుటీర్‌కు చంద్రబాబు

అమరావతి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): గాంధీనగర్‌లో చరిత్ర ప్రసిద్ధమైన దండి కుటీర్‌ను సందర్శించాలని ప్రధాని మోదీ సీఎం చంద్రబాబుకు సూచించారు. ఆర్ఈ ఇన్వెస్ట్-2024 సదస్సు సందర్భంగా దండి కుటీర్ విశిష్టతను వివరించారు. దరిమిలా చంద్రబాబు దానిని సందర్శించారు. 'దండికుటీర్ సందర్శన నా జీవితంలో మరపురాని ఘట్టంగా గుర్తుండిపోతుంది. గాంధీజీ జీవిత చరిత్రను భవిష్యత్ తరాలు తెలుసుకునేలా ఇది ఉంది' అని సందర్శకుల పుస్తకంలో చంద్రబాబు రాశారు. అనంతరం గుజరాత్ సీఎం భూపేంద్ర పటేల్ ఆహ్వానం మేరకు చంద్రబాబు ఆయన నివాసంలో తేనేటి విందుకు హాజరయ్యారు. భారతదేశ రాజకీయాల్లో విజనరీ లీడర్‌గా, అభివృద్ధి పాలకుడిగా చంద్రబాబు ఎప్పటి నుంచో స్ఫూర్తిగా ఉన్నారని పటేల్ కొనియాడారు.



రాష్ట్రానికి సోలార్ అవార్డు

అనంతపురంలో సోలార్ పార్కుల ఏర్పాటుకు గాను కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషీ నుంచి రాష్ట్ర ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ అవార్డు అందుకున్నారు. గాంధీనగర్ సదస్సులో విద్యుత్ మంత్రి గొట్టిపాటి రవికుమార్, పునరుత్పాదక విద్యుత్ ప్రోత్సాహక సంస్థ ఎండీ కేవీ చక్రధరబాబు తదితరులు పాల్గొన్నారు.

పదైదు వేల గతం.. మరిచావా జగన్?

(మొదటి పేజీ తరువాయి)

తల్లిదండ్రులకు ఉపయోగపడేది. కానీ, 7 నెలలు మౌనంగా ఉండి.. 2020, జనవరి 9న అమ్మఒడి నగదు విడుదల చేసింది. అది కూడా సంక్రాంతి పండగ సమయంలో ప్రజలకు ఈ నగదు ఉపయోగపడుతుందనే కోణంలో ఇస్తున్నట్లు అప్పట్లో వైసీపీ నేతలు చెప్పుకొచ్చారు.

ఇప్పుడు ఇలా

ఈ ఏడాది జూన్ 12న సీఎంగా చంద్రబాబు, మంత్రులు ప్రమాణ స్వీకారం చేశారు. ఆ మరుసటి రోజే బడులు తెరుచుకున్నాయి. అంటే, ప్రమాణ స్వీకారానికి, బడుల పునఃప్రారంభానికి మధ్య ఒక్క రోజు కూడా గడువు లేదు. పైగా ఈ ప్రభుత్వం ఇంట్లో ఎంత మంది పిల్లలుంటే అంతమందికీ తల్లికి వందనం పథకం అమలు చేస్తామని హామీ ఇచ్చింది. దీంతో ఈ పథకం అమలుపై ప్రభుత్వం కసరత్తు కొనసాగుతోంది. అందులోనూ విద్యా సంవత్సరం ప్రారంభమైనందున కొంత గడువు తర్వాత నిధులు విడుదల చేయాలని భావిస్తున్నారు. తల్లికి వందనం పథకం అమలుకు గతంతో పోలిస్తే దాదాపుగా రెట్టింపు నిధులు అవసరమని అధికారులు అంచనా వేస్తున్నారు. గత ప్రభుత్వం పిల్లల సంఖ్యతో సంబంధం లేకుండా తల్లుల సంఖ్యను ఆధారంగా తీసుకుని అమ్మఒడి అమలుచేసింది. దీంతో ఏటా సుమారుగా 42 లక్షల మందికి 'అమ్మఒడి' నిధులు ఇచ్చారు. కానీ, ఇప్పుడు పాఠశాలలు, జూనియర్ కాలేజీల్లో చదువుతున్న విద్యార్థులు దాదాపుగా 75 లక్షల మందికి ఈ పథకం కింద నిధులు ఇవ్వాలి. అంటే అప్పుడు చేసిన ఖర్చుతో పోలిస్తే రెట్టింపు అవుతుంది. అందువల్ల నిధుల సమీకరణపై ప్రభుత్వం దృష్టి పెట్టింది.

ఐదేళ్లు.. నాలుగు విడతలే!

'ఐదేళ్లలో ఏటా రూ.15 వేలు చొప్పున ఐదేళ్లలో రూ.75 వేలు ఇస్తాం' అని జగన్ అధికారంలోకి వచ్చిన కొత్తలో ప్రకటించారు. తీరా పదవీకాలం ముగిసే నాటికి కేవలం నాలుగు విడతల్లో రూ.60 వేలు కూడా ఇవ్వకుండా మాట తప్పారు. అధికారంలోకి వచ్చిన వెంటనే అమ్మఒడి అమలుచేసి ఉంటే ఐదు సార్లు తల్లులకు నగదు వచ్చేది. కానీ, ఏడు నెలలు ఆలస్యం చేశారు. అలా రెండేళ్లు ఇచ్చారు. అదే కొనసాగించినా ఐదుసార్లు తల్లుల ఖాతాలకు వచ్చేది. కానీ.. ఒక ఏడాది ఎగ్గొట్టాలనే ప్లాన్‌తో మొదటి రెండేళ్ళ సంక్రాంతి సమయంలో అమ్మఒడి విడుదల చేసిన ప్రభుత్వం మూడో ఏడాదికి ఏకంగా ఏడాదిన్నర గ్యాప్ తీసుకుంది. 2021 జనవరిలో అమ్మఒడి ఇచ్చిన తర్వాత 2022 జూన్‌లో ఇచ్చింది. దీంతో ఐదో విడత అమ్మఒడి నిధులు వేయకుండానే ఎన్నికలకు వెళ్లారు. ఫలితంగా ఐదేళ్లలో నాలుగు సార్లే తల్లులకు అమ్మఒడి నగదు అందింది. ఇక ఇచ్చిన మాట ప్రకారం రూ.15 వేలు కూడా ఇవ్వలేదు. మొదటి ఏడాది రూ.15 వేలు, రెండో ఏడాది రూ.14 వేలు, చివరి రెండేళ్ళ రూ.13 వేలు చొప్పున ఇస్తూ వచ్చారు. ఇలా నిర్వహణ పేరుతో నగదులో కోత పెట్టారు. ఇవన్నీ మర్చిపోయిన జగన్ ఇప్పుడు మూడు నెలల్లోనే 'తల్లికి వందనం' ఇవ్వలేదని గగ్గోలు పెడుతుండడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కుట్టుకూలి.. కనికట్టు!

రూ.248 కోట్లకు గాను 62 కోట్లే చెల్లింపు

జగన్ హయాంలో విద్యార్థుల యూనిఫాంకు ఇస్తానన్న కుట్టుకూలి డబ్బులు ఎగ్గొట్టారు. 'విద్యా కానుక' పథకం కింద ఒక్కొక్క విద్యార్థికి బ్యాగు, బెల్టుతో పాటు 3 జతల యూనిఫాం క్లాత్ ఇచ్చారు. వాటికి అతితక్కువ కుట్టుకూలి నిర్ణయించారు. 1 నుంచి 8 తరగతుల విద్యార్థులకు జతకు రూ.40 చొప్పున రూ.120... 9, 10 తరగతుల విద్యార్థులకు జతకు రూ.80 చొప్పున రూ.240 ఇస్తామన్నారు. టైలర్ ఖర్చుల భారం తల్లిదండ్రులపై పడకుండా, అది కూడా ప్రభుత్వమే ఇస్తుందని అప్పట్లో జగన్ ప్రకటించారు. అయితే నిధుల విడుదలను మాత్రం గాలికొదిలేశారు. ఆ నిధులు ఇస్తున్నట్లు విద్యాకానుక లెక్కల్లో చూపుతూ వచ్చారు. కానీ, ఐదేళ్లలో ఒక్కసారే తల్లుల ఖాతాల్లో కుట్టుకూలి డబ్బులు వేశారు. గత ఐదేళ్లలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 43 లక్షలుగా ఉంది. వీరికి కుట్టుకూలి కింద ఏడాదికి రూ.62 కోట్లు అవుతుంది. ఆ లెక్కన నాలుగేళ్లలో రూ.248 కోట్లు ఇవ్వాలి. కానీ ఒక్క ఏడాది మాత్రమే రూ.61.73 కోట్లు తల్లుల ఖాతాల్లో జమ చేశారు. ఆ తర్వాత నిధులు ఇవ్వలేదు.

పనికొచ్చే సంస్కరణలు కావాలి!

- ఆస్తి భద్రం అనే భావన ప్రజలకు కలగాలి
- కొనే స్థలం సరైనదో లేదో వారికి తెలియాలి
- పూర్తివివరాలు ఆన్‌లైన్‌లో లభ్యం కావాలి
- రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఇలాంటి వెసులుబాట్లతోనే ప్రజలకు నిజమైన ఊరట

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ప్రజలకు గౌరవ మర్యాదలు కల్పించడం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు మరిన్ని చర్యలకు దారి చూపుతున్నాయి. ప్రజలకు స్నేహపూరితంగా సేవలు అందించేలా కార్యాలయాలను మలచడం ఒక ఎత్తు! అధికారి ఎదుట ఉండే ఎత్తయిన పోడియం తీసివేయడం, కుర్చీల ఎత్తు తగ్గించడం, ప్రజలకు కూడా కుర్చీలు ఏర్పాటుచేయడం వంటివి ఇందులో భాగమే. అవి అవసరమే. అదే సమయంలో ప్రజలకు రిజిస్ట్రేషన్ ప్రక్రియను సురక్షితం, సులభతరం చేసే సంస్కరణలకు కూడా చోటు ఉండాలని పలువురు కోరుతున్నారు. తమ ఆస్తి భద్రం అనే భావన కలిగినప్పుడే రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన ప్రజలు సంతోషంగా వెనుదిరుగుతారు. పైగా గత ప్రభుత్వం.. రిజిస్ట్రేషన్ ప్రక్రియ అంటేనే దడుచుకునే స్థితికి ప్రజలను తీసుకెళ్లింది. ఈ నేపథ్యంలో రిజిస్ట్రేషన్ వ్యవస్థలో రావాల్సిన సంస్కరణలపై ముందుగా దృష్టి సారించాలని లబ్ధిదారులు కోరుకుంటున్నారు.

ఆస్తి సక్రమమైనదా కాదా ?

కొనుగోలు చేస్తున్న ఆస్తి సక్రమమైనదా కాదా? ఆ ఆస్తి ఎవరి పేరు మీద ఉంది? గతంలో ఎవరెవరి చేతులు మారింది?... రిజిస్ట్రేషన్లకు సంబంధించి ప్రజలు ముఖ్యంగా ఎదుర్కొంటున్న సమస్యలివి. చాలా మంది నకిలీ పత్రాలతో మోసాలకు పాల్పడుతున్నారు. కొన్న తర్వాతే ఆ నకిలీల గుట్టు బయటకొస్తుండడంతో ప్రజలు లబోదిబోమంటున్నారు. ఒకే ఆస్తిని చాలామందికి అమ్ముతున్న వారు కూడా ఉన్నారు. ఇలాంటి మోసాలను కట్టడి చేసే ఏర్పాట్లు రిజిస్ట్రేషన్ వ్యవస్థలో ఉండాలి. అవీ..

> - ఏదైనా సర్వే నంబరు ఎంటర్ చేయగానే దానిపై జరిగిన కొనుగోలు కార్యకలాపాలు వచ్చేలా ఉంటే ప్రజలు మోసపోరు.
> - సర్వే నంబర్‌తోనే ఏది ప్రభుత్వ భూమో, ఏది నిషేధిత జాబితాలో ఉందో తెలుసుకునే వెసులుబాటు కూడా ప్రజలకు నేరుగా కల్పించాలి.
> - డాక్యుమెంట్ రైటర్ల వ్యవస్థ వేళ్లూనుకుపోయి ఉంది. రిజిస్ట్రేషన్ కావాల్సిన ప్రతి ఒక్కరూ డాక్యుమెంట్ రైటర్ వద్దకు వెళ్లాల్సిందే ఇప్పుడు. అలా కాకుండా డాక్యుమెంట్ రైటర్లను కచ్చితంగా కాకుండా ఆప్షనల్ కింద ఉండేలా చర్యలు తీసుకుంటే జనాలకు మేలు చేసినవారవుతారు. అవసరం లేదనుకున్నవాళ్లు స్వయంగా డాక్యుమెంట్ తయారుచేసుకునేలా ఒక ఫార్మాట్‌ను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొస్తే ప్రజలపై పెనుభారం తగ్గుతుంది.

ప్రహసనంలా బదిలీలు..

రిజిస్ట్రేషన్ల శాఖలో బదిలీలు పెద్ద ప్రహసనంలా మారాయి. ఆ శాఖ ఉన్నతాధికారులపై భారీఎత్తున ఆరోపణలు వస్తున్నాయి. ఆగస్టు 31తో బదిలీల ప్రక్రియను ముగించాలనుకున్నారు. కానీ, అవి ఓ కొలిక్కి రాకపోగా, గందరగోళంగా మారడంతో ఆ ప్రక్రియను ఈ నెల 15వరకు పొడిగించారు. అకస్మాత్తుగా వరదలు రావడంతో ఈ గడువును ఇదేనెల 22 వరకు పొడిగించారు. అయినప్పటికీ ఈ రోజుకి కూడా ఆ బదిలీలకు మార్గదర్శకాల్లేవు. 2016లో చంద్రబాబు హయాంలో ఈ బదిలీలపై స్పష్టమైన మార్గదర్శకాలిచ్చారు. రెండేళ్లు దాటిన వారిని కౌన్సిలింగ్ ద్వారా బదిలీ చేశారు. ఇప్పుడు కౌన్సిలింగ్ ద్వారా బదిలీ చేయడానికి వచ్చిన సమస్య ఏంటో అర్థం కావడం లేదు. బదిలీల గడువు పెరుగుతూ ఉండడంతో ఈ శాఖలో బదిలీలపై రాజకీయ ఒత్తిడి తీవ్రంగా పెరుగుతోంది. మంత్రులు, ఎమ్మెల్యేలు వారివారి సిఫారసులను మంత్రి దృష్టికి తీసుకొస్తున్నారు. ఉన్నతాధికారులు ఏం ఆశించి మీనమేషాలు లెక్కిస్తున్నారో అర్థం కావడం లేదు. బదిలీలకే ఇంత తటపటాయిస్తే జనాలకు ఉపయోగపడే సంస్కరణలు అసలు ఈ శాఖలో సాధ్యమయ్యే పనేనా? అని పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్రం కంటే రోత పత్రికకే ఆదాయం మెండు

- రాష్ట్ర ఆదాయం పెరిగితేనే ప్రభుత్వం ఘనత
- తలసరి ఆదాయమనేది ప్రజల కష్టం
- అది గత ప్రభుత్వ ఘనత అంటూ రోత రాతలు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ఒక రాష్ట్ర తలసరి ఆదాయం పెరగడమనేది ప్రజలకు సంబంధించిన అంశం. దాని అర్థం ప్రజల సంపాదనా సామర్థ్యం పెరిగిందని. కానీ, రాష్ట్ర ఆదాయం పెరిగితే మాత్రం ఆ గొప్ప మాత్రం ప్రభుత్వానిదే. పారిశ్రామిక రంగం, సేవారంగం పుంజుకుంటేనే రాష్ట్ర ఆదాయం పెరుగుతుంది. జగన్ హయాంలో ఆ రెండు రంగాలు అటకెక్కాయని చెప్పుకోవడానికి కూడా ఏమీ మిగల్లేదని ప్రముఖ రేటింగ్ ఏజెన్సీ క్రిసిల్ తన ప్రతి నివేదికలోనూ స్పష్టం చేసింది. ఈ విషయాలు దాచేసి.. 2014-19 చంద్రబాబు హయాంతో పోల్చితే 2019-24 జగన్ హయాంలో రాష్ట్ర తలసరి ఆదాయం విపరీతంగా పెరిగిందంటూ రోతపత్రిక 'సాక్షి'లో ఒక అర్థంలేని వార్తను వండివార్చారు.

ఎవరి హయాంలో ఎంత ఆదాయం...

2013-14లో ఉమ్మడి రాష్ట్రం ఆదాయం రూ.1,10,719 కోట్లు. చంద్రబాబు హయాంలో 2014-15లో ఏపీ ఆదాయం రూ.65,695 కోట్లు, కాగా అదే సమయంలో తెలంగాణ ఆదాయం రూ.51,042 కోట్లు. అలాగే, సీఎంగా చంద్రబాబు దిగిపోయిన ఏడాది 2018-19లో ఏపీ ఆదాయం రూ.1,14,684 కోట్లు కాగా తెలంగాణ ఆదాయం రూ.1,01,420 కోట్లు. ఐదేళ్లపాటు తెలంగాణ కంటే ఏపీ ఆదాయమే ఎక్కువ. కొత్తగా విభజన జరిగి, రాజధాని కూడా లేని, అనేక సవాళ్లతో కూడిన రాష్ట్రంలో ఐదేళ్లలో రూ.65,695 కోట్ల ఆదాయాన్ని చంద్రబాబు రూ.1,14,684 కోట్లకి పెంచారు. నికరంగా ఐదేళ్లలో బాబు పెంచిన ఆదాయం రూ.48,989 కోట్లు. జగన్ హయాంలో 2022-23లో ఏపీ ఆదాయం రూ.1,58,282 కోట్లు కాగా తెలంగాణ ఆదాయం రూ.1,59,349 కోట్లు. తెలంగాణ... తొలిసారి ఏపీని దాటేసింది. సీఎంగా జగన్ దిగిపోయేనాటికి రాష్ట్ర ఆదాయం రూ.1,73,963 కోట్లు. అంటే ఐదేళ్లలో రూ.1,14,684 కోట్ల ఆదాయం రూ.1,73,963 కోట్లకు పెరిగింది. విభజన జరిగిన ఏడాది రాష్ట్ర రెవెన్యూ లోటు రూ.16,000 కోట్లు ఇవ్వాలని చంద్రబాబు కేంద్రాన్ని కోరింది. కానీ, అప్పుడు ఇవ్వలేదు. జగన్ హయాంలో రెవెన్యూ లోటుకింద రూ.10,000 కోట్లు రాష్ట్రానికి ఇచ్చారు. మొత్తం ఆదాయంలో రూ.10,000 కోట్లు అవే. జగన్ హయాంలో నికరంగా పెరిగిన రాష్ట్ర ఆదాయం రూ.49,279 కోట్లు. బాబు హయాంలో అది రూ.48,989 కోట్లు. అంటే గత ఐదేళ్లలో చంద్రబాబు కంటే జగన్ ఖజానాకు పెంచిన ఆదాయం రూ.290 కోట్లు మాత్రమే.


సాక్షి, భారతీ సిమెంట్స్ ఆదాయాలే పెరిగాయి

రోతపత్రిక 'సాక్షి'కి జగన్ ప్రకటనల ద్వారా నాడు రూ.403 కోట్లు దోచిపెట్టారు. చంద్రబాబు సీఎంగా 2018-19లో దిగిపోయేనాటికి ఆ పత్రిక ఆదాయం రూ. 100 కోట్లు లోపే. సీఎంగా జగన్ 2023-24లో దిగిపోయేనాటికి ఆ సంస్థ ఆదాయం రూ.403 కోట్లు. అంటే, ఐదేళ్లలో ఆ పత్రికకు పెరిగిన ఆదాయం రూ. 300 కోట్లకుపైగానే ఉంది. అంటే.. రాష్ట్రానికి ఐదేళ్లలో పెరిగిన అదనపు ఆదాయం కంటే రోతపత్రికకు పెరిగిన ఆదాయమే ఎక్కువ అన్నమాట! ఇది కాకుండా, వలంటీర్లు జగన్ పత్రికనే కొనాలని, ప్రభుత్వ కార్యాలయాల్లో అవసరం లేకపోయినా పదేసి పేపర్లు సరఫరా చేసి ఖజానా నుంచి ఆ పత్రికకు బిల్లులు చెల్లించారు. జగన్ హయాంలో పేదల ఇళ్లు నిర్మించకపోయినప్పటికీ వాటి పేరుతో భారతి సిమెంట్, నాడు-నేడు పథకానికి భారతీ సిమెంట్, ప్రభుత్వానికి ఎక్కడ సిమెంట్ అవసరమైనా భారతీ సిమెంటే కొన్నారు. అందుకే 2022 అక్టోబర్ - డిసెంబరు త్రైమాసికంలో భారతి సిమెంట్స్ లాభం రూ.255 కోట్లు. 2021లో రూ.1300 కోట్లు ఉన్న టర్నోవర్ 2024 జనవరి నాటికి రూ.2,000 కోట్లు దాటేలా ప్రభుత్వ సొమ్మును జగన్, ఆయన సతీమణి కంపెనీకి దోచిపెట్టారు. భారతీ సిమెంట్స్‌లో భారతికి రూ.2.35 కోట్ల షేర్లున్నాయి. వీటి విలువ రూ.2,380 కోట్లు. ఇలా 17 కంపెనీల్లో భారతీ డైరెక్టర్‌గా ఉన్నారు. అయినప్పటికీ వరద బాధితుల కోసం రూపాయి కూడా ఇవ్వలేదు. ఇంతలా రాష్ట్రాన్ని దోచుకున్న జగన్, ఆయన సతీమణి రాష్ట్రానికి కష్టం వచ్చినప్పుడు మాత్రం పైసా కూడా తీయలేదు.

రాచరిక దర్పానికి స్వస్తి!

- రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో పోడియాల తొలగింపు
- బెజవాడ ఆఫీస్‌లో స్వయంగా తీసేసిన సిసోడియా
- రాష్ట్రవ్యాప్తంగా మొదలైన ఫ్రెండ్లీ రిజిస్ట్రేషన్ సేవలు

విజయవాడ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ప్రజలకు స్నేహపూర్వక సేవలు అందుబాటులోకి వచ్చాయి. సోమవారం విజయవాడలోని గుణదల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రాచరికపు దర్పానికి ప్రతీకగా ఉన్న పోడియాన్ని.. రాష్ట్ర రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ ఐజీ ఎంవీ శేషగిరిబాబుతో కలిసి రెవెన్యూ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్‌పీ సిసోడియా స్వయంగా తొలగించారు. ప్రజలకు అనువుగా ఉండేలా రాష్ట్రంలోని పలు కార్యాలయాల అమరికలో కూడా పలు మార్పులు చేశారు. అధికారుల దర్పం వల్ల ప్రజలలో అపోహలు నెలకొంటాయని, స్నేహపూర్వక వాతావరణాన్ని పెంపొందించటం కోసమే ఈ నిర్ణయం తీసుకున్నట్టు సిసోడియా వెల్లడించారు రాష్ట్ర వ్యాప్తంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలలో స్నేహపూర్వక వాతావరణాన్ని కల్పించి మర్యాదపూర్వక సేవలను అందించేందుకు మార్పులకు శ్రీకారం చుట్టామన్నారు. ప్రభుత్వ అధికారులు కూడా ప్రజా సేవకులే అనే భావనను ప్రజలలో కల్పించటానికి పోడియం తొలగింపు చర్యలు చేపట్టినట్టు తెలిపారు. రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయాలలో సబ్ రిజిస్ట్రార్ల పోడియాలు చూస్తే .. అక్కడికి వచ్చే ప్రజలు తామేదో కోర్టులలో ఉన్నామనే భావనకు గురి అవుతున్నారని సిసోడియా తెలిపారు. ప్రజలు ఈ భావనకు లోను కాకుండా ఉండాలన్న ఉద్దేశంతోనే ఇలాంటి మార్పులు తీసుకు వస్తున్నామన్నారు. ఇకపై సబ్ రిజిస్ట్రార్లకు సేవలు పొందేందుకు వచ్చే క్రయ, విక్రయదారులు మంచి వాతావరణంలో సేవలను పొందగలుగుతారని చెప్పారు.



గుణదల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోని పోడియంను తొలగిస్తున్న రెవెన్యూ ప్రత్యేక కార్యదర్శి ఆర్పీ సిసోడియా, ఎమ్మెల్యే గద్దే

స్టాంప్ పేపర్‌కు కొరత లేదు: ఐజీ

రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయాలలో పారదర్శకంగా సేవలు అందించే చర్యలను తీసుకుంటున్నామని రాష్ట్ర రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ ఐజీ ఎంవీ శేషగిరిబాబు అన్నారు. స్టాంప్ పేపర్ల కొరతకు సంబంధించి అసత్య ప్రచారాలు చేస్తున్నారని, రాష్ట్రంలో 40 లక్షల స్టాంప్ పేపర్స్ ఉన్నాయని చెప్పారు. ఈ స్టాంపులు అందుబాటులో ఉన్నాయన్నారు.

విశ్వవిద్యాలయాల ప్రక్షాళన: మంత్రి లోకేశ్



అమరావతి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో రాజకీయ పునరావాస కేంద్రాలుగా మారిన విశ్వవిద్యాలయాలను సమూలంగా ప్రక్షాళన చేయాలని నిర్ణయించామని మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ఇందులో భాగంగా రాజకీయాలకు అతీతంగా విద్యారంగ నిపుణులను వైస్ చాన్సలర్లుగా నియమించాలని నోటిఫికేషన్ జారీచేశామని సోమవారం ఎక్స్‌లో తెలిపారు. పరిశోధనలపై దృష్టిసారించి, వర్సిటీ ర్యాంకులు మెరుగుపర్చడమే తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయి విద్యా సంస్థలకు దీటుగా తీర్చిదిద్దే సంకల్పం కలిగిన ప్రొఫెసర్ల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని తెలిపారు. ఈ నెల 28 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

వరద బాధితులకు దాతల సాయం

- మంత్రి లోకేశ్‌కు విరాళాల చెక్కుల అందజేత

అమరావతి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): వరద బాధితులకు సాయం చేసేందుకు అనేక మంది దాతలు పెద్ద మనస్సుతో ముందుకొస్తున్నారు. సోమవారం హైదరాబాద్‌లో మంత్రి లోకేశ్‌ను పలువురు దాతలు కలసి విరాళాలు అందజేశారు. మోల్డ్ టెక్ ప్యాకేజింగ్ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ ఆదివిష్ణు సందీప్ రూ.25 లక్షలు, ప్రీయూనిక్ సంస్థ డైరెక్టర్ అనిల్‌కుమార్ చిగురుపాటి రూ.15 లక్షలు, ప్రఖ్యాత గుండె వైద్య నిపుణుడు ఆళ్ల గోపాలకృష్ణ గోఖలే రూ.10 లక్షల చెక్కును మంత్రి లోకేశ్‌కు అందజేశారు. వరద బాధితులను ఆదుకునేందుకు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్న దాతలకు మంత్రి లోకేశ్ ధన్యవాదాలు తెలిపారు.

ప్రకాశం డీఈవోపై విచారణ

అమరావతి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లా విద్యాశాఖాధికారి(డీఈవో)పై వచ్చిన పలు ఆరోపణలపై పాఠశాల విద్యాశాఖ విచారణ చేపట్టింది. విచారణాధికారిగా గుంటూరు ఆర్జేడీని నియమించింది. వరద బాధితుల కోసం విరాళాల సేకరణ, డీఈవో ఆఫీసు ఐటీ సెల్‌లో నియామకాల్లో అక్రమాలు, ఉత్తమ ఉపాధ్యాయుల నుంచి నగదు వసూలు తదితర అంశాలపై తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం ఆ శాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేయగా స్పందించిన ఆయన ఈ మేరకు విచారణకు ఆదేశించారు.

వేసవిని తలపిస్తున్న ఎండలు

- గాలిలో తేమ శాతం తగ్గడంతో నిప్పుల కొలిమిలా వాతావరణం
- నెల్లూరు, కావలిలో 38.2 డిగ్రీల ఉష్ణోగ్రత

విశాఖపట్నం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): పశ్చిమ బెంగాల్‌లో కొనసాగుతున్న తీవ్ర వాయుగుండం దిశగా నైరుతి గాలులు వీస్తుండడంతో రాష్ట్రంలో శనివారం నుంచి పొడి వాతావరణం నెలకొంది. రెండు రోజులపాటు గాలిలో ఎక్కువగా ఉన్న తేమ శాతం సోమవారం తగ్గిపోయింది. దీంతో రాష్ట్రంలో వాతావరణం వేసవిని తలపించింది. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఎండ తీవ్రత ఒకేలా కొనసాగింది. కొన్నిచోట్ల మధ్యాహ్న సమయంలో వేడిగాలులు వీయడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. వారం క్రితం వర్షాలు తగ్గిన తర్వాత ఎండలు క్రమేపీ పెరుగుతూ వచ్చాయి. అయితే కోల్‌కతాకు సమీపంలో తీవ్ర వాయుగుండం కొనసాగుతున్న నేపథ్యంలో శనివారం నుంచి ఎండలు పెరిగి వేసవి వాతావరణం నెలకొంది. రాష్ట్రంలో పగటి ఉష్ణోగ్రతలు రెండు నుంచి నాలుగు డిగ్రీలు ఎక్కువగా నమోదవుతున్నాయి. సోమవారం నెల్లూరు, కావలిలో 38.2 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఇదే సమయంలో రుతుపవన ద్రోణి తూర్పుభాగం తీవ్ర వాయుగుండం మీదుగా వెళ్లడంతో అల్లూరి సీతారామరాజు జిల్లాలో మినహా రాష్ట్రంలో మరెక్కడా వర్షాలు లేవు. ఇది కూడా వేడి వాతావరణం కొనసాగేందుకు ఒక కారణమని వాతావరణ నిపుణుడొకరు తెలిపారు. రుతుపవన ద్రోణి తూర్పుభాగం పశ్చిమ బెంగాల్‌లో ఉన్న తీవ్ర వాయుగుండం మీదుగా పయనించడంతో రాష్ట్రంలో స్వల్ప రుతుపవన విరామం ఏర్పడిందన్నారు.

గ్రామ సభలపై పవన్ ప్రత్యేక దృష్టి

- ప్రతినెలా తప్పనిసరి చేస్తూ నిర్ణయం
- మొక్కుబడికి స్వస్తి చెప్తూ కొత్త ఒరవడి
- రెండ్రోజుల్లో కేంద్రం నుంచి ఆర్థిక సంఘం నిధులూ వచ్చే అవకాశం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు, పంచాయతీ సమావేశాలు నిర్వహించడం అత్యంత ప్రాధాన్యమైన ప్రక్రియ. గ్రామ పంచాయతీల్లో సమావేశాలు మొక్కుబడిగా మారకుండా కేంద్ర ప్రభుత్వం సైతం గ్రామ పంచాయతీల సమావేశాల ప్రాధాన్యం పెంచేందుకు అవార్డులిచ్చి ప్రోత్సహిస్తోంది. గ్రామాభివృద్ధిపై కీలకమైన నిర్ణయాలు తీసుకునేందుకు ప్రతి మూడు నెలలకోసారి గ్రామ సభ, ప్రతి ఆర్నెల్లలోపు ఒక పంచాయతీ సమావేశం నిర్వహిస్తారు. గ్రామాల్లో ఏ పనులు నిర్వహించాలన్నా గ్రామ పంచాయతీల్లో తీర్మానాలు చేసి పనులు ప్రారంభిస్తారు. అలాంటి గ్రామ సభలు, పంచాయతీ సమావేశాలు రాను రాను మొక్కుబడిగా మారాయి. ప్రభుత్వం ఏటా గ్రామ సభలు నిర్వహించేందుకు ప్రత్యేక అధికారులను నియమించి హడావుడి చేసినా పక్కాగా గ్రామ సభలు జరగడం అరుదుగానే ఉంది. గ్రామాల్లో తీసుకునే నిర్ణయాలకు అత్యంత ముఖ్యమైన పంచాయతీ సమావేశాలు మొక్కుబడిగా నిర్వహించడం, ఎన్నికైన మొదటి సమావేశంలో తప్ప వార్డు మెంబర్ కూడా సమావేశాలకు హాజరైన పరిస్థితి ఉండడం లేదు. కొన్ని మేజర్ పంచాయతీలు తప్ప రాష్ట్రంలో సుమారు 10 వేల పంచాయతీల్లో గ్రామ సభలు, పంచాయతీ సమావేశాలు మొక్కుబడిగానే నిర్వహిస్తున్నారు.

పవన్ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచే..

పంచాయతీల అభివృద్ధితోనే గ్రామస్వరాజ్యం సాధ్యం!.. ఇది అందరూ చెప్పే మాట. కానీ ఆచరణలో చిత్తశుద్ధి కనిపించదు. పంచాయతీలకు అరకొర నిధులు.. ఆపై మొక్కుబడి సమావేశాలు.. ఏటా జరిగే తంతు ఇది! కానీ ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా డిప్యూటీ సీఎంగా బాధ్యతలు స్వీకరించిన పవన్ కల్యాణ్ తనదైన శైలిలో పంచాయతీ అభివృద్ధిపై దృష్టిసారించారు. గ్రామాల అభివృద్ధితోనే ప్రగతి సాధ్యమని నమ్మిన ఆయన.. ఈ దిశగా సమర్థుడైన అధికారి కోసం అన్వేషించారు. కేరళలో పనిచేస్తున్న తెలుగు ఐఏఎస్ అధికారి కృష్ణతేజను ఏరికోరి ఎంచుకున్నారు. ఆయనను పంచాయతీరాజ్ డైరెక్టర్‌గా ఇక్కడికి తీసుకొచ్చి ఈ బాధ్యతలు అప్పజెప్పారు. దేశ వ్యాప్తంగా పంచాయతీ సమావేశాలు, గ్రామ సభలు ఏయే రాష్ట్రంలో ఏ విధంగా జరుగుతున్నాయో అధ్యయనం చేసిన కృష్ణతేజ.. మొదట ఉపాధి హామీ పథకంద్వారా చేపట్టే గ్రామసభలపై దృష్టి సారించారు.

> కుదేలైన గ్రామ పంచాయతీలను గాడిలో పెట్టాలి.. మొదట గ్రామసభ నుంచే ప్రక్షాళన మొదలు కావాలి.. గ్రామ సభలు, పంచాయతీ సమావేశాలు స్వచ్ఛంగా జరగాలి.. అభివృద్ధిలో ప్రజలందరినీ భాగస్వాములను చేయాలి..గ్రామ పాలన ప్రజలందరికీ తెలియాలంటే గ్రామ సభలో ప్రజలందరూ చర్చించాలి.. పంచాయతీల్లో పారదర్శకంగా పనులు నిర్వహించాలంటే పంచాయతీ సమావేశాలు పక్కాగా జరగాలి! ఇదీ.. పవన్ కల్యాణ్ సత్సంకల్పం! ఈ దిశగా తనదైన శైలిలో ముందుకు వెళ్తున్నారు! తగిన కార్యాచరణకు అధికారులను ఆదేశించారు. గత నెల ఒకేరోజు 13,326 గ్రామసభలను నిర్వహించడం ద్వారా తాజాగా వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కింది..

ఉపాధి పనుల కోసం గ్రామ సభలు

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పంచాయతీల్లో పనులు నిర్వహించాలంటే కచ్చితంగా గ్రామసభల ద్వారా పనులు ఆమోదిస్తూ తీర్మానాలు చేయాల్సి ఉంటుంది. ఈ క్రమంలో ఉపముఖ్యమంత్రి ముందుగా ఉపాధి పనులకు సంబంధించి గ్రామ సభలను రాష్ట్ర వ్యాప్తంగా ఒకే రోజు నిర్వహించాలని నిర్ణయించారు. ఈ గ్రామ సభలను ఒక ఉద్యమం లాగా నిర్వహించారు. సాక్షాత్తు ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, మంత్రులు రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ సభల్లో పాల్గొని గ్రామసభల ప్రత్యేకతను చాటారు. గ్రామసభతో పాటు గ్రామ పంచాయతీ సమావేశాలను కూడా పకడ్బందీగా నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ప్రతి గ్రామపంచాయతీలోనూ ప్రతి నెలా విధిగా సమావేశాలు నిర్వహించాలని, అందరు వార్డు మెంబర్లతోపాటు సర్పంచ్, ఉపసర్పంచ్ అధికారులు పాల్గొని రియల్‌గా తీర్మానాలు చేయడం ద్వారా గ్రామ సభలకు ప్రాధాన్యం తీసుకురావాలని భావిస్తున్నారు. ఇప్పటికే పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కూడా అందించారు. ఈ క్రమంలో 13,326 గ్రామ పంచాయతీల్లో ఒకేరోజు సభలు నిర్వహించడం ద్వారా వరల్డ్‌రికార్డు సాధించారు. దీంతో ఇప్పుడు ఈసభల నిర్వహణ ప్రత్యేకత సంతరించుకుంది.

ఆన్‌లైన్ దిశగా గ్రామ సభలు

రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి పంచాయతీలో గ్రామ సభలు, పంచాయతీ సభలను ఆన్‌లైన్‌లో పెట్టడం ద్వారా పారదర్శకతతో పాటు మొక్కుబడి సమావేశాలు నిర్వహించే అవకాశం లేకుండా చేయవచ్చని పవన్‌కల్యాణ్ భావిస్తున్నారు. ఇప్పటికే కేంద్రం గ్రామ సభలు నిర్వహించేందుకు సాఫ్ట్‌వేర్ సిద్ధం చేయగా, దేశంలోని వివిధ రాష్ట్రాలు ఈ సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించుకుంటున్నాయి. మన రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇలాంటి సాఫ్ట్‌వేర్‌ను రూపొందించి గ్రామ సభల సమాచారం పారదర్శకంగా ఉండేలా చేయాలని నిర్ణయించారు.

పంచాయతీ ఖాతాలు సైతం ఆన్‌లైన్..!

ఏయే పంచాయతీలో ఎంత నిధులున్నాయి?, ఏయే పనుల కోసం ఎంత ఖర్చు చేశారన్న విషయంపై ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం వెబ్‌సైట్ రూపొందించింది. కేంద్ర ప్రభుత్వమిచ్చే 15వ ఆర్థిక సంఘం నిధులకు సంబంధించి వివరాలు వెబ్‌సైట్లలో ఉన్నాయి. అయితే ఈ పనులకు సంబంధించి మరింత పారదర్శకత కోసం పంచాయతీరాజ్‌శాఖ వెబ్‌సైట్‌ను రూపొందించాలని భావిస్తోంది. పంచాయతీల్లో జనరల్ ఫండ్‌వివరాలు వెబ్‌సైట్‌లో నమోదు చేయడం ద్వారా గ్రామ పాలన సజావుగా సాగుతుందంటున్నారు.



గ్రామసభలు.. ప్రపంచ రికార్డు

అమరావతి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన 100 రోజుల లోపు సరికొత్త రికార్డును సృష్టించారు. ఆగస్టు 23న స్వర్ణ గ్రామ పంచాయతీ పేరిట రాష్ట్ర వ్యాప్తంగా 13,326 గ్రామ పంచాయతీల్లో ఒకేరోజు గ్రామ సభలు నిర్వహించారు. రూ.4500 కోట్ల విలువైన ఉపాధి హామీ పనులకు తీర్మానాలు చేశారు. ఒకేరోజు ఈ స్థాయిలో ప్రజల భాగస్వామ్యంతో సభలు నిర్వహించడం అతిపెద్ద గ్రామ పాలనగా గుర్తిస్తూ వరల్డ్ రికార్డ్స్ యూనియన్ తమ రికార్డుల్లో నమోదు చేసింది. ఈ సందర్భంగా సోమవారం ఉదయం హైదరాబాద్‌లోని పవన్ కల్యాణ్ నివాసంలో కార్యక్రమం నిర్వహించారు. ఇందుకు సంబంధించిన రికార్డు ధ్రువపత్రాన్ని, మెడల్‌ను వరల్డ్ రికార్డ్స్ మేనేజర్ క్రిస్టఫర్ టేలర్ క్రాఫ్ట్ ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు అందజేశారు. గ్రామాలకు స్వపరిపాలన అందించాలనే ఆకాంక్షతో మొదలైన ఈ ప్రయాణంలో ఈ కొత్త మైలురాయిని అందుకోవడం ఆనందంగా ఉందని పవన్ కల్యాణ్ సంతోషాన్ని వ్యక్తం చేశారు. అధికార యంత్రాంగానికి, స్థానిక సంస్థల ప్రతినిధులకు అభినందనలు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలియజేశారు. రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు గ్రామ సభల్లో భాగస్వాములైనందుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్‌కుమార్, డైరెక్టర్ కృష్ణతేజ, ఉపాధి హామీ పథకం డైరెక్టర్ షణ్ముఖ్‌కుమార్, జాయింట్ కమిషనర్ శివప్రసాద్ పాల్గొన్నారు.

సంస్కృతాంధ్ర పండితుడు.. రాజేశ్వరశర్మ కన్నుమూత

- నన్నెచోడుని కవిత్వంపై ప్రామాణిక పరిశోధన
- ఉస్మానియా తెలుగు శాఖ అధ్యక్షుడిగా సేవలు



హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): సంస్కృతాంధ్ర పండితుడు, విశ్రాంత ఆచార్యుడు, విమర్శకుడు అమరేశం రాజేశ్వరశర్మ (95) కన్నుమూశారు. వారం కిందట అస్వస్థతకు గురైన ఆయన ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం అర్ధ రాత్రి తుదిశ్వాస విడిచారు. రాజేశ్వర శర్మ స్వస్థలం కామారెడ్డి జిల్లా చిన్నమల్లారెడ్డి గ్రామం. వేములవాడ, నిజామాబాద్, సీతారాంబాగ్, విజయనగరం, కొవ్వూరు తదితర సంస్కృత కళాశాలల్లో వ్యాకరణ శాస్త్రాన్ని అభ్యసించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎంఏ తెలుగు, పీహెచ్‌డీ పూర్తి చేశారు. 'నన్నెచోడుడి కవిత్వం-కుమార సంభవం'పై ఆయన పీహెచ్‌డీ పరిశోధనను అత్యంత ప్రామాణిక విమర్శనా గ్రంథంగా పండితులు చెబుతారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా 1951లో ఉద్యోగ జీవితం ప్రారంభించిన రాజేశ్వర శర్మ.. వివేకవర్ధిని కళాశాల అధ్యాపకుడిగా, ఓయూ అనుబంధ కళాశాలల తెలుగు అచార్యుడిగా, తెలుగు శాఖ అధిపతిగా, కాకతీయ విశ్వవిద్యాలయం డీన్‌గా 1989 వరకు సేవలందించారు. యూజీసీ ఎమిరెటస్ ప్రొఫెసర్‌గా రెండేళ్ల బాధ్యతలు నిర్వర్తించారు. ఇటీవలి వరకు కూడా రాజమండ్రి, విజయనగరం సంస్కృత కళాశాలల్లో వ్యాకరణాన్ని బోధించారని రాజేశ్వరశర్మ శిష్యుడు, ప్రముఖ కవి నాళేశ్వరం శంకరం గుర్తుచేసుకున్నారు. భాషా శాస్త్రాల్లో సాధికారత కలిగిన రాజేశ్వరశర్మ ఓయూ న్యాయ కళాశాలలో ఎల్ఎల్‌బీ చదివారు. కొంతకాలం ప్రాక్టీస్ చేశారు. ఆయన రచనలు 'ఆంధ్ర లక్షణ దీపిక', 'నన్నెచోడుడి కవిత్వం', 'వేదం వేంకట రాయ శాస్త్రి రూపక సమాలోచనం', 'అహోబిల పండితీయాంధ్ర వివరణము', 'ఆంధ్ర వ్యాకరణ వికాసం', 'సాయి సచ్చరిత్ర ముక్తావళి గేయప్రబంధము' తదితర సాహిత్య విమర్శ, వ్యాకరణ శాస్త్ర గ్రంథాలతో పాటు ఆత్మకథ 'ఆత్మ నివేదనం' పుస్తకాలుగా వెలువడ్డాయి. బాలల కోసం 'చరిత్ర పుటలు' పేరుతో కొన్ని నాటికలు రాశారు. 'పోతన భాగవత పంచశతి నీరాజనం', 'శారదా మంజీరము' తదితర పుస్తకాలకు సంపాదకత్వం వహించారు. రాజేశ్వరశర్మ సాహిత్య కృషికి తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కారంతో సత్కరించింది. కామారెడ్డి, ప్రాచ్య విద్యా పరిషత్తు స్థాపక కార్యదర్శిగా, వరంగల్‌లో పోతన భాగవత పంచశతి మహోత్సవ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించారు. ఆయన శిష్యులు తెలుగు, సంస్కృత పండితులుగా ఉన్నారు. రాజేశ్వరశర్మ సతీమణి నరసమాంబ ఇటీవల కన్నుమూశారు. వీరికి ఇద్దరు కుమార్తెలు, ముగ్గురు కుమారులు. సోమవారం అంబర్‌పేట శ్మశానవాటికలో రాజేశ్వరశర్మ అంత్యక్రియలు నిర్వహించారు.

మద్యం పాలసీపై అభిప్రాయ సేకరణ

అమరావతి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అమలు చేయబోతున్న నూతన మద్యం పాలసీపై మహిళా సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధుల నుంచి అభిప్రాయాలు, సూచనలు కోరుతున్నట్లు ఎక్సైజ్ శాఖ కమిషనర్ నిశాంత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడలోని ప్రసాదంపాడులో ఉన్న ఎక్సైజ్ కార్యాలయంలో గానీ, మంగళగిరి ఐహెచ్‌సీ టవర్స్‌లోని పాత సెబ్ ఆఫీసులో గానీ రాతపూర్వకంగా అందించవచ్చని లేదా apcommissioner.pe@gmail.comకు ఈమెయిల్ చేయొచ్చని పేర్కొన్నారు.

అమరావతి.. సురక్షితం!

- రాజధానిలోకి చుక్కనీరు రాకుండా గట్టి చర్యలు
- కొండవీటివాగు, పాలవాగు గ్రావిటీ కెనాల్స్ అభివృద్ధి
- ఆరు రిజర్వాయర్ల అభివృద్ధి
- 4 వరుసలుగా కృష్ణా కరకట్ట
- 2 నెలల్లో టెండర్లు..
- డిసెంబరు నుంచి రాజధాని పనులు
- మంత్రి నారాయణ వెల్లడి



పెనుమాక రైతుల నుంచి అంగీకార పత్రాలు తీసుకుంటున్న మంత్రి నారాయణ

విజయవాడ, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి), తాడేపల్లి/తుళ్లూరు: కృష్ణానదికి వందేళ్లలో ఎన్నడూ రాని వరద వచ్చినా రాజధాని అమరావతి మునిగిపోలేదని, భవిష్యత్తులో చుక్కనీరు కూడా రాకుండా ఉండేందుకు భారీ ప్రణాళికలు రూపొందిస్తున్నామని పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ చెప్పారు. అమరావతిలో మూడు భారీ కాలువల విస్తరణ, రిజర్వాయర్లు, పంపింగ్ స్టేషన్ల ఏర్పాటు, కృష్ణా కరకట్ట బలోపేతం వంటివి చేపట్టనున్నట్టు తెలిపారు. వచ్చే వర్షాకాలం నాటికి వీటన్నింటినీ పూర్తి చేయనున్నట్టు చెప్పారు. సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. "కృష్ణానదికి కనీవినీ ఎరుగని జలాలు వచ్చినా 2,017 చదరపు కిలోమీటర్ల పరిధిలోని అమరావతి క్యాపిటల్ సిటీ ఎలాంటి ఇబ్బందులూ ఎదుర్కోలేదు. గతంలో వైసీపీ ప్రభుత్వం అమరావతి మునిగిపోతుందని, రాజధానిగా ఈప్రాంతం పనికిరాదని ప్రచారం చేసింది. వైసీపీ నేతలు కొందరు ప్రపంచ బ్యాంకుకు నెగిటివ్‌గా రిపోర్టు ఇచ్చారు. కానీ, ఇవన్నీ అబద్ధపు ప్రచారాలేనని మరోసారి తేలిపోయింది. అమరావతి క్యాపిటల్ సిటీ నిర్మించే విషయంలో రాజధాని లోపల మూడు భారీ కాలువలకు ప్రాధాన్యతఇచ్చాం. భవిష్యత్తులో ఎలాంటి వరద ప్రమాదం లేకుండా కొండవీటి వాగు, పాల వాగు, గ్రావిటీ కెనాల్స్‌ను ఆధునీకరించేలా డిజైన్ చేశాం. నెదర్లాండ్ దేశానికి చెందిన సంస్థను కన్సల్‌టెంట్‌గా తీసుకుని డిజైన్స్ చేయిస్తున్నాం. వచ్చే వర్షాకాలం నాటికి ఈ 3 కాలువలు పూర్తి చేయాలని నిర్ణయించాం. ఎట్టి పరిస్థితుల్లో కూడా రాజధానిలోకి చుక్కనీరు రాకుండా కాలువల ఆధునీకరణకు డిజైన్ చేయించాం. ఎంత నీరు వచ్చినా వీటిలోనే స్టోర్ అవుతుంది. ఎలాంటి పంపింగ్ కూడా అవసరం లేదు. మరో ఆరు రిజర్వాయర్లను కూడా ప్లాన్ చేశాం. నీరుకొండ దగ్గర 0.4 టీఎంసీ, కృష్ణాయపాలెం దగ్గర 0.1 టీఎంసీ, శాఖమూరు దగ్గర 0.01 టీఎంసీ, సిటీ బయట 0.3 టీఎంసీ, 0.02 టీఎంసీ, వైకుంఠపురం దగ్గర 0.03 టీఎంసీ సామర్థ్యంతో కూడిన రిజర్వాయర్లను కూడా అభివృద్ధి చేస్తాం. అవసరం లేకపోయినా ముందస్తు చర్యగా కృష్ణానదిలోకి వెళ్లటానికి వీలుగా ఉండవల్లి, వైకుంఠపురం దగ్గర పంపింగ్ స్టేషన్స్ ప్లాన్ చేశాం. ఉండవల్లి దగ్గర 12,350 క్యూసెక్కులు, వైకుంఠపురంలో 5,650 క్యూసెక్కుల సామర్థ్యంతో పంపింగ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నాం" అని మంత్రి వివరించారు. అమరావతికివెళ్లే కృష్ణాకరకట్టను గతంలో 4 లైన్లుగా అభివృద్ధి చేసేలా డిజైన్ చేశామన్నారు.

డిసెంబరు నుంచి..

అమరావతిలో ప్రస్తుతం చేపట్టిన కంప తొలగింపు పనులు వారం రోజుల్లో పూర్తి కావస్తున్నాయని మంత్రి నారాయణ చెప్పారు. రాజధానిలో ఐకానిక్ టవర్ల నుంచి హైకోర్టు, ప్రభుత్వ అపార్ట్‌మెంట్లు, అధికారుల గృహాలు, ట్రంక్ ఇన్‌ఫ్రా, ఎల్‌పీఎస్ ఇన్‌ఫ్రాలకు ఒక్కొక్కటిగా టెండర్లు పిలుస్తున్నామని, కన్సల్‌టెంట్ల కోసం ఆర్ఎఫ్‌పీలను కూడా విడుదల చేశామన్నారు. డిసెంబరు నెల నాటికి యుద్ధప్రాతిపదికన పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. ఇదిలా వుంటే, అమరావతి నిర్మాణాలపై చెన్నై, హైదరాబాద్ ఐఐటీ నిపుణులు ఇచ్చిన నివేదికపై మంత్రి సంతోషం వ్యక్తం చేశారు. రాజధాని పనులు వడివడిగా ముందుకు సాగేందుకు అవకాశం ఏర్పడిందన్నారు. కాగా, వరద ప్రభావిత మునిసిపాలిటీలు, కార్పొరేషన్లు, పట్టణాభివృద్ధి సంస్థల పరిధిలో ఆస్తి పన్ను చెల్లింపునకు 3నెలల సమయం ఇస్తున్నామన్నారు.

రైతుల ఇంటికే వెళ్లి

2014-19లో కొంత మేర ల్యాండ్ పూలింగ్ ఆగినట్టు మంత్రి నారాయణ చెప్పారు. రైతులకు కొన్ని అనుమానాలు ఉన్నాయని, వాటని నివృత్తి చేస్తే ఇస్తామంటున్నారని చెప్పారు. రైతులు ఎవరు ముందుకు వచ్చినా వారితో మాట్లాడటానికి తాను సిద్ధంగా ఉన్నానన్నారు. సెంటు ఇస్తానన్నా కూడా వారింటికి వెళ్లి మాట్లాడతానని తెలిపారు. ఆదివారం పది మంది రైతులు 11 ఎకరాలు ఇచ్చారని, సోమవారం కూడా మరికొందరు ల్యాండ్ పూలింగ్ కింద భూములు ఇస్తామన్నారని మంత్రి వివరించారు. కొందరు రైతులు జోన్ మార్చమని కోరుతున్నారని, అది విధానపరమైన విషయం కావడంతో సీఎంతో చర్చించాల్సి ఉంటుందన్నారు. గతంలో లాటరీ సిస్టమ్‌లో ప్లాట్లు ఇచ్చేవారమని, నేడు రైతులకు 'ఫస్ట్ కమ్ ఫస్ట్' పేరిట ప్లాట్లు ఇస్తామన్నారు. ఈ విషయాన్ని ఫైనల్ చేశామని ఒకటి రెండు రోజుల్లో జీవో కూడా వస్తుందన్నారు. తాడేపల్లి మండలం పెనుమాక గ్రామంలో 7.2ఎకరాలకు సంబంధించి నలుగురు రైతులు అంగీకార పత్రాలు అందించారని తెలిపారు. కాగా, సోమవారం రాత్రి పెనుమాక గ్రామానికి వచ్చిన మంత్రి... రైతులు మేకా వెంకటరెడ్డి, అనిత, సుబ్బారెడ్డి, శివారెడ్డి, లక్ష్మారెడ్డి, మరో రైతు నుంచి అంగీకార పత్రాలు తీసుకున్నారు.

రాజధాని నిర్మాణాలు సేఫ్

(మొదటి పేజీ తరువాయి)

చేరుకుంది. తాజాగా కూటమి సర్కారు వచ్చిన తర్వాత మళ్లీ అమరావతిపై దృష్టి పెట్టింది. అమరావతిని పూర్తి చేయాలన్న సంకల్పంతో ఇక్కడి నిర్మాణాల దృఢత్వంపై ఐఐటీ నిపుణులతో ప్రభుత్వం పరిశీలన చేయించింది. ఈ క్రమంలో గత నెలలో చెన్నై, హైదరాబాద్ ఐఐటీల నిపుణులు పలుమార్లు అమరావతిలో పర్యటించి నిర్మాణాలను నిశితంగా పరిశీలించారు. తాజాగా తమ నివేదికను సీఆర్‌డీఏ అధికారులకు అందించారు. భవనాలన్నీ బాగానే ఉన్నాయని, తదుపరి నిర్మాణ పనులు చేపట్టవచ్చని, వాటిని కూల్చివేయాల్సిన అవసరం లేదని నివేదికలో నిపుణులు స్పష్టం చేశారు. దీంతో సీఆర్‌డీఏ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఐఐటీ సంస్థలు కనుక అమరావతి నిర్మాణాల పటుత్వంపై అనుమానం వ్యక్తం చేసి ఉంటే వాటిని కూల్చివేసి మళ్లీ మొదటి నుంచి నిర్మాణాలు చేపట్టాల్సి వచ్చేది.

నివేదికల్లోని కీలక అంశాలు

ఐదు ఐకానిక్ టవర్లను రాఫ్ట్ ఫౌండేషన్ టెక్నాలజీతో చేపట్టారు. ఐఐటీ సంస్థలు రెండూ ఈ నిర్మాణాలు బాగున్నాయని తేల్చిచెప్పాయి. కాంక్రీట్‌లో కానీ, ఐరన్‌లో కానీ ఎక్కడా లోపాలు లేవని పేర్కొన్నాయి. వాస్తవానికి సచివాలయ ఐకానిక్ టవర్లు గత ఐదేళ్లుగా నీళ్లలో నానుతున్నాయి. దీంతో వీటి పటిష్ఠతపై అనేక అనుమానాలు నెలకొన్నాయి. అయితే.. ఐఐటీ సంస్థలు ఈ టవర్ల కాంక్రీట్, స్టీల్ బాగుందని పేర్కొన్నాయి. హైకోర్టు భవనానికి సంబంధించి కూడా ఐఐటీ నిపుణులు సంతృప్తి వ్యక్తం చేశారు.

నిశిత పరిశీలన

అమరావతిలో భవన నిర్మాణ పనులకు సంబంధించి ముందుకు వెళ్లే విషయంలో ప్రభుత్వం టెక్నికల్ కమిటీని నియమించింది. ఈ కమిటీ సూచనల ప్రకారం ఐఐటీ సంస్థల ద్వారా అమరావతి నిర్మాణాలను పరిశీలన చేయాలని నిర్ణయించారు. దీంతో హైదరాబాద్, చెన్నై ఐఐటీ సంస్థలకు బాధ్యతలు అప్పగించారు. ఈ సంస్థలు రెండూ గత నెలలో అమరావతికి వచ్చి సిమెంట్ కాంక్రీట్, ఐరన్ ముక్కలను కట్ చేసుకుని శాంపిళ్లను తీసుకువెళ్లి అన్ని కోణాల్లోనూ పరీక్షించాయి. పరీక్షలలో కాంక్రీట్, స్టీల్ బాగున్నాయని, సచివాలయ టవర్లకు సంబంధించి రాఫ్ట్ ఫౌండేషన్ దుర్భేద్యంగా ఉందని తాజాగా నివేదిక ఇచ్చాయి.

రాజధాని రైతులకు ఎట్టకేలకు కౌలు

- రూ.190 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం
- అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోపే హామీ అమలు
- మెట్ట ఎకరాకు 54వేలు.. జరీబుకు 95వేలు
- అమరావతి రైతుల హర్షాతిరేకాలు
- గత మూడేళ్లుగా కౌలు ఇవ్వకుండా వేధించిన జగన్ సర్కార్
- అసైన్డ్ రైతుల కౌలుపై వీడని సందిగ్ధం

గుంటూరు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు రాజధాని రైతుల కౌలు కల నెరవేరింది. గత వైసీపీ ప్రభుత్వం గడిచిన మూడేళ్లుగా కౌలు ఇవ్వకుండా వేధించడంతో రాజధాని రైతులు పడరాని పాట్లు పడ్డారు. ఇటీవల అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన 100 రోజుల్లోపే కౌలు విడుదల చేయడంతో రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం వంద రోజుల్లోపే కౌలు నగదు విడుదల చేయడంతో రైతుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. గత వైసీపీ ప్రభుత్వం రాజధాని రైతులకు కౌలు చెల్లించకుండా ముప్పుతిప్పలు పెట్టింది. గడిచిన ఐదేళ్ల కాలంలో కోర్టు మెట్లెక్కకుండా రైతులకు కౌలు దక్కిన దాఖలాలే లేవు. చివరికి కోర్టు తీర్పులు, ఆదేశాలను కూడా పెడచెవిన పెట్టిన వైసీపీ ప్రభుత్వం ఆఖరి రెండు సంవత్సరాల్లో ఒక్క రూపాయి కూడా రైతులకు కౌలు చెల్లించలేదు. ఇప్పుడు ఆ భారం మొత్తం కూటమి ప్రభుత్వంపైనే పడింది. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో కౌలు విడుదల చేసి రైతులకు ఇచ్చిన మాటను కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుంది. అన్నమాట ప్రకారం సోమవారం సాయంత్రం రైతులకు తొమ్మిదో ఏడాది కౌలు కింద రూ. 190 కోట్లు విడుదల చేసింది. మెట్ట రైతులకు ఎకరానికి రూ. 54వేలు, జరీబు రైతులకు రూ. 95వేల చొప్పున వార్షిక కౌలు రైతులకు అందనుంది. కాగా, గత ప్రభుత్వం పెండింగ్ పెట్టిన మరో ఏడాది కౌలు ఇంకా విడుదల కావాల్సి ఉంది. దానిపై కూడా రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. మరోవైపు కూటమి ప్రభుత్వం వార్షిక కౌలు గడువును మరో ఐదేళ్లు పొడిగించి రైతులకు భరోసా కల్పించింది.

అయితే, అసైన్డ్ రైతుల కౌలు చెల్లింపు విషయంలో ఇప్పటికీ గందరగోళం కొనసాగుతోంది. గత వైసీపీ ప్రభుత్వం కుట్రపూరితంగా చేపట్టిన సీఐడీ విచారణ వారి పాలిట శాపంగా మారింది. ఆ కేసుల నెపంతో అట్టడుగు వర్గాలైన అసైన్డ్ రైతులు చాలా మందికి ఇప్పటికీ కౌలు దక్కలేదు. వారికి మూడేళ్లపాటు కౌలు రావాల్సి ఉంది. దీనిపై ప్రభుత్వం, సీఆర్డీఏ దృష్టి సారించాలని అసైన్డ్ రైతులు కోరుకుంటున్నారు.

కౌలు విడుదల హర్షణీయం..

ప్రభుత్వం వచ్చిన వంద రోజుల్లో రాజధాని రైతులకు కౌలు చెల్లించడం హర్షణీయం. గత ప్రభుత్వం కౌలు సకాలంలో చెల్లించకపోవడంతో రైతులు అనేక ఇబ్బందులు పడ్డారు. ముఖ్యమంత్రి చంద్రబాబు వారి ఇబ్బందులను గుర్తించి త్వరిత గతిన కౌలు చెల్లించారు. పదో ఏడాది కౌలు, అసైన్డ్ రైతుల కౌలు కూడా చెల్లించేలా చర్యలు చేపట్టాలి.

- పువ్వాడ సుధాకర్, కన్వీనర్, అమరావతి జేఏసీ

జానీ మాస్టర్‌పై లైంగిక దాడి కేసు

- పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనొద్దని మాస్టర్‌కు జనసేన ఆదేశాలు
- ఫిల్మ్‌చాంబర్ విచారణ షురూ



నార్సింగ్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ టాలీవుడ్ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్(షేక్ జిలానీ బాషా)పై లైంగిక వేధింపుల కేసు నమోదైంది. ఆయన తనపై అత్యాచారానికి పాల్పడటంతోపాటు.. లైంగికంగా వేధించాడంటూ ఆయన వద్ద అసిస్టెంట్ కొరియోగ్రాఫర్‌గా పనిచేస్తున్న 21 ఏళ్ల యువతి తొలుత మహిళా భద్రత విభాగం డీజీ శిఖా గోయెల్‌కు ఫిర్యాదు చేశారు. ఆమె సూచనల మేరకు రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని, లిఖితపూర్వకంగా ఫిర్యాదు అందజేశారు. అయితే.. నేరం జరిగిన ప్రాంతం తమ పరిధి కాకపోవడంతో జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసిన పోలీసులు.. కేసును నార్సింగ్ ఠాణాకు బదిలీ చేశారు. నార్సింగ్ పోలీసులు లైంగిక దాడి, వేధింపులు, రక్తగాయాలయ్యేలా దాడి చేయడం వంటి సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు. పోలీసుల కథనం ప్రకారం.. 2017లో ఓ కాంటెస్ట్‌లో పాల్గొనే అవకాశం వచ్చిన బాధితురాలు.. హైదరాబాద్‌కు వచ్చారు. 2019 నుంచి జానీ మాస్టర్ వద్ద అసిస్టెంట్ కొరియోగ్రాఫర్‌గా పనిచేస్తున్నారు. ముంబైలో షూటింగ్ సమయంలో అక్కడ హోటల్ గదిలో తనపై జానీ మాస్టర్ లైంగిక దాడికి పాల్పడ్డట్లు బాధితురాలు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఎక్కడైనా చెబితే ఉద్యోగంలోంచి తీసేస్తానని, సినిమాల్లో ఎక్కడా పని దొరకకుండా చేస్తానని బెదిరించినట్లు తెలిపారు. దాంతో తాను మిన్నకుండిపోవడాన్ని అవకాశంగా తీసుకుని, తరచూ షూటింగ్ ప్రదేశాల్లో వేధించేవాడని.. వ్యానిటీ వ్యాన్‌లో తన కోరిక తీర్చాలంటూ బలవంతపెట్టేవాడని వివరించారు. ఒప్పుకోకుంటే తన జుట్టు పట్టుకుని దాడి చేసేవాడని.. ఓ సందర్భంలో అద్దంతో నా ముఖంపై కొట్టాడని వాపోయారు. మాట వినకపోతే.. షూటింగ్ లొకేషన్‌లో అందరి ముందు అవమానపరిచేవాడని, అసభ్యంగా తాకేవాడని తెలిపారు. మతం మారి, తనను పెళ్లి చేసుకోవాలని హింసించేవాడని చెప్పారు.

జానీ భార్య చేయి చేసుకుంది..

జానీ మాస్టర్ వేధింపులు పెరగడంతో.. తాను సొంతంగా పనిచేయడం ప్రారంభించినట్లు బాధితురాలు పోలీసులకు తెలిపారు. దీంతో జానీ మాస్టర్ ఓ రోజు తన భార్యతో కలిసి తన ఇంట్లోకి బలవంతంగా చొరబడ్డారని, మాస్టర్ భార్య తనపై చేయి చేసుకున్నారని వివరించారు. ఓ సారి రాత్రి ఇంటికి వచ్చి, తలుపు తట్టాడని, తాను స్పందించకపోవడంతో.. బయట పార్క్ చేసి ఉన్న తన స్కూటీని ధ్వంసం చేశాడని తెలిపారు. తాను షూటింగ్‌లో ఉన్న ప్రాంతానికి వచ్చి, గొడవపడేవాడని, పెళ్లి చేసుకుంటానని, మతం మారాలని అందరి ముందు వేధించేవాడని వెల్లడించారు. "ఈ క్రమంలో కొందరు గుర్తుతెలియని వ్యక్తులు నాపై దాడికి యత్నించారు. గుర్తుతెలియని పార్సిల్ పంపి భయభ్రాంతులకు గురిచేశారు. ఇండస్ట్రీలో నేను ఒప్పుకొన్న పనులను కూడా చేయకుండా జానీ మాస్టర్ వేధింపులకు గురిచేస్తున్నారు. అతనిపై కఠిన చర్యలు తీసుకోగలరు" అని ఫిర్యాదులో పేర్కొన్నారు.

జనసేన సీరియస్ యాక్షన్

జానీ మాస్టర్ పవన్‌కల్యాణ్ వీరాభిమాని. ఇటీవలి అసెంబ్లీ/లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ తరఫున విస్తృతంగా ప్రచారం చేశారు. ఆయనపై అత్యాచారం కేసు నమోదవ్వడంతో.. జనసేన కాన్ఫ్లిక్ట్ మేనేజ్‌మెంట్ చీఫ్ వేములపాటి అజయ్‌కుమార్ కీలక నిర్ణయం తీసుకున్నారు. "కేసును పార్టీ సీరియస్‌గా తీసుకుంది. పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండాలని షేక్ జానీ బాషాను ఆదేశించాం. తక్షణమే ఈ నిర్ణయం అమల్లోకి వస్తుంది" అని ఓ ప్రకటనలో స్పష్టం చేశారు. జానీ మాస్టర్‌పై తెలుగు ఫిల్మ్ చాంబర్ కార్యదర్శి కె.ఎల్.దామోదర ప్రసాద్ ప్రకటన విడుదల చేశారు. "జానీ మాస్టర్‌పై విచారణ కొనసాగుతుంది. ఈ విషయంలో బాధితురాలి గోప్యతను కాపాడాలని మీడియాను అభ్యర్థిస్తున్నాం" అని వెల్లడించారు.

ఇప్పటికీ మార్పు లేదు: తాప్సీ పన్ను

మహిళలకు సమాజంలో ఎదురవుతున్న సమస్యలపై తీసిన బాలీవుడ్ చిత్రం 'పింక్'. ఈ సినిమా విడుదలై సోమవారానికి ఎనిమిదేళ్లయిన రోజునే.. జానీ మాస్టర్‌పై అత్యాచారం కేసు నమోదైంది. ఈ చిత్రంలో నటించిన తాప్సీ పన్ను సోషల్ మీడియాలో సినిమా సంగతులను గుర్తుచేసుకున్నారు. 'ఈ సినిమా భారతీయ చిత్ర పరిశ్రమలో ఇంతటి గుర్తింపు తెచ్చుకుంటుందని మా చిత్ర బృందం ఊహించలేదు. విడుదలై ఎనిమిదేళ్లు గడిచినా సమాజంలో ఎటువంటి మార్పూ లేదు. ఇప్పటికీ మహిళలకు తగిన భద్రత లేదు' అని పేర్కొన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.



రజతాలను సాధించిన క్రీడాకారిణిలను అభినందిస్తున్న హెచ్‌ఎం, కోచ్

తైక్వాండోలో డాన్‌బాస్కో విద్యార్థులకు పతకాలు

విజయవాడ స్పోర్ట్స్: ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రాలో ని ఈనెల 8నుంచి 10వరకు నిర్వహించిన జాతీయ సబ్ జూనియర్, జూనియర్ తైక్వాండో చాంపియన్‌షిప్‌లోని గుణదలలోని కార్మెల్ నగర్‌లోని డాన్‌బాస్కో సీబీఎస్‌ఈ స్కూల్ విద్యార్థులు పతకాలతో సత్తా చాటారు. సబ్ జూనియర్ గ్రూప్ పూమ్‌సేలో సీ నిహారికకు రజతం, జూనియర్ గ్రూప్ పూమ్‌సేలో పీ రిత్విక రజతం కైవసం చేసుకున్నారు. సో మవారం స్కూల్ ఆవరణలో జరిగిన అభినందన స భలో క్రీడాకారిణులను ప్రధానోపాధ్యాయులు ఫాదర్ భాస్కర్, కోచ్ ఎం అంకమ్మరావు అభినందించారు.

రేపు స్కూల్ గేమ్స్ నిర్వహణపై సమావేశం

నగరంలోని కృష్ణలంక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 19న ఉదయం 10 గంటలకు స్కూల్ గేమ్స్ అండర్-19కు సంబంధించి జిల్లా జట్ల ఎంపికలు, అంతర్ జిల్లాల పోటీలపై ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల ఇంటర్ విద్యాశాఖాధికారుల సమావేశం ని ర్వహించనున్నారు. జిల్లా డీవీఈవో సీఎస్‌ఎస్‌ఎన్ రె డ్డి, కృష్ణా జిల్లా డీవీఈవో పీబీ సాల్మన్‌రాజు హాజరు కానున్నారు. ఉమ్మడి జిల్లాల్లోని జూనియర్ ప్రభుత్వ కళాశాలు, ప్రైవేట్ జూనియర్ కళాశాలలు, ఎయిడెడ్ జూనియర్, ట్రైబల్ వెల్ఫేర్ కళాశాలలు, మోడల్ స్కూల్స్, హైస్కూల్ ప్లస్, కేజీబీవీ, గురుకుల కళాశాలల్లో పనిచేస్తున్న జూనియర్ లెక్చరర్ ఫిజికల్ ఎ డ్యుకేషన్, ఫిజికల్ డైరెక్టర్లు, పీఈటీ, ఇతర అధ్యాపకులు ఎవరైనా సమావేశానికి హాజరు కావాలన్నారు.

వరద ప్రాంతాల్లో పన్నులు, చార్జీలు రద్దు చేయాలి

- సీపీఎం నేత సీహెచ్ బాబూరావు

చిట్టినగర్: కష్టాల్లో ఉన్న వరద బాధితులకు ఈ ఏడాది ఇంటిపన్నులు, ఇతర చార్జీలు పూర్తిగా ర ద్దు చేయాలని సీపీఎం రాష్ట్ర నేత సీహెచ్ బాబూరావు సోమవారం ఒక ప్రకటనలో వీఎంసీ కమిషనర్‌ను కోరారు. ప్రజలు వరద కష్టాల్లో ఉంటే నెలాఖరులోపు ఆస్తి పన్ను, మంచినీటి, డ్రైయినేజీ చార్జీలు, ఖాళీ స్థలాలపై పన్నులు చెల్లించాలని, లేకుంటే పె నాల్టీలు పడతాయని వీఎంసీ ప్రకటన విడుదల చే యటం బాధాకరమన్నారు. మున్సిపల్ శాఖ మంత్రి వరద ప్రాంతాల్లో పర్యటించి బాధితులను ఆదుకుంటామని చెప్పి, పన్నుల వసూలకు ఆదేశాలివ్వడం సరికాదన్నారు. వరద బాధిత ప్రాంతాల్లో పన్నులు పూర్తిగా రద్దు చేస్తూ మున్సిపల్ శాఖ ఆదేశాలు జారీ చేయాలని కోరారు.

హిందువులపై దాడి హేయం

వన్‌టౌన్: కృష్ణాజిల్లా పెడనలో బస్టాండ్ వెనుక ఉన్న వినాయకుడి దేవాలయం, మండపాలపై ఆదివారం అర్ధరాత్రి ఇనుపరాడ్లు, రాళ్లతో ముస్లింలు దాడి చేయటం హేయమని బీజేపీ రాష్ట్ర అధికార ప్ర తినిధి సాదినేని యామినిశర్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దాదాపు 300 నుంచి 400 మంది ముస్లింలు హిందువులపై దాడిచేశారని, అడ్డుకుంటున్న డీఎస్పీ, సీఐ, కానిస్టేబుళ్లపైన దాడి చేయటం దారుణమన్నారు. పైగా సోమవారం కూడా అత్యధిక సంఖ్యలో ముస్లింలు దాడికి ప్రయత్నించడాన్ని ఎలా చూడాలని ప్రశ్నించారు. ఈ చర్య అప్రజాస్వామికమని, తీవ్రమైన నేరమన్నారు. నేరస్థులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని ఆమె కోరారు.



గణేశ్ నిమజ్జనోత్సవం సందర్భంగా ఫన్‌టైమ్స్ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో భక్తుల కోలాహలం

లంబోదరా.. వెళ్లిరావయ్యా!





ఘనంగా ఫన్‌టైమ్స్.. నిమజ్జనోత్సవం

పటమట: గురునానక్ కాలనీలోని ఫన్‌టైమ్స్ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో 26వ గణపతి మహోత్సవాల్లో భాగంగా శ్రీ లక్ష్మీగణపతి హోమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం 8వేల మందికి భారీ అన్నదానం నిర్వహించారు. స్వామివారి నిమజ్జనోత్సవం బేతాళ నృత్యాలు, తీన్‌మార్ వాయిద్యాల నడుమ రాత్రి ఘనంగా చేపట్టారు. నెక్కడపు విజయకృష్ణ, అట్లూరి స తీష్‌కుమార్, ముప్పవరపు సతీష్, దాసరి హరికృష్ణ, యలమంచిలి సుమన్, పొట్లూరి నాగభూషణరావు, కమిటీ మెంబర్లు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీశైల మల్లన్న కల్యాణోత్సవం

- దూండీ గణేషుడ్ని దర్శించుకున్న అనంతపురం ఎంపీ లక్ష్మీనారాయణ

భవానీపురం: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా లేబర్ కాలనీ స్టేడియం గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన 72 అడుగుల విజయ మహా గణపతి విగ్రహం వద్ద శ్రీశైల మల్లన్న కల్యాణోత్సవాన్ని 24 జంటలతో సోమవారం ఘనంగా నిర్వహించారు. శ్రీశైల దేవస్థానం ప్రధాన అర్చకులు పర్యవేక్షణలో మంగళ వాయిద్యాల నడుమ ఉత్సవ మూర్తులను ఈ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కల్యాణోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు. దూండీ గణేష్ సేవా సమితి పర్యావరణ హితం కోరుతూ మట్టి గణపతి విగ్రహ నమూనా ఏర్పాటులో భాగంగానే దేవదాయ శాఖ మంత్రి ఈ ప్రాంగణంలో 8 ప్రముఖ దేవాలయాల ఆధ్వర్యంలో భక్తుల కోసం ఉత్సవమూర్తులతో కల్యాణోత్సవాలు చేస్తామన్న హామీలో భాగంగా తొలి కల్యాణోత్సవం నిర్వహించినట్టు నిర్వాహకులు దూండీ రాకేష్ తెలిపారు. రోజు విడిచి రోజు ప్రత్యేక ఉత్సవ మూర్తులతో కల్యాణోత్సవాలు చేస్తామన్నారు. సోమవారం రాత్రి ప్రత్యేక పూజల్లో అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

యువకులపై పోలీసుల దాష్టీకం

వన్‌టౌన్, సెప్టెంబరు 16: వినాయక నిమజ్జనానికి వెళ్లిన యువకులను సోమవారం వేకువజామున ఘాట్ వద్ద పోలీసులు అనుచితంగా చితక బాదిన సంఘటన సీతమ్మవారి పాదాల వద్ద చోటు చేసుకుంది. ఈ సంఘటన కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. తొలుత సూర్యారావుపేటకు చెందిన విగ్రహాన్ని నిమజ్జనం చేసే క్రమంలో అక్కడున్న కృష్ణలంక పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ రామారావు యువకులను ఉద్దేశించి ఇద్దరు మాత్రమే నిమజ్జనానికి వెళ్లాలని సూచించారు. అయితే ముగ్గురు వెళ్లటంతో ఆయన పరుష పదజాలంతో దూషించాడు. ఎందుకు తిడుతున్నారని అడగటంతో ఆయన సహా మరికొందరు పోలీసులు లాఠీలకు పనిచెప్పారు. యువకులు పెద్ద ఎత్తున ఆర్తనాదాలు చేస్తున్నా లాఠీలను ఝళిపించటం మానలేదు. కొంచెం దూరంలో చూస్తుండేవారికి ఈ సంఘటన ఎంతో బాధాకరమనిపించింది. ఈ సమయంలో నదివద్ద సుమారుగా 14 విగ్రహాలుండగా, వెలుపల ఊరేగింపుగా వచ్చిన మరో 30, 40 విగ్రహాలు బారులు తీరాయి. ఈ గొడవతో మిగతా వారంతా భయభ్రాంతులకు గురయ్యారు. సూర్యారావుపేట ప్రాంతం నుంచి వినాయక నిమజ్జనం ఊరేగింపులో వచ్చిన ఓ యువకుడిని పోలీసులు తొలుత ఏ కారణం లేకుండానే అతడి కాలర్‌ను పట్టుకుని ఈడ్చుకువెళ్లి లాఠీకి పనిచెప్పారు. ఓ నలుగురైదుగురు పోలీసులు అతడిని చుట్టిముట్టి ఎక్కడపడితే అక్కడ కొట్టారు. ఇదే సమయంలో వాగు సెంటర్‌కు చెందిన ఓ ఉవకుడు ఆ కుర్రాడిని ఎందుకు కొడుతున్నారని ప్రశ్నించగా, అతడిని కూడా ఈడ్చుకువెళ్లి తల, కాళ్లపై ఇష్టానుసారం కొట్టారు. తొలుత ఇదే సమయంలో సీఐ అక్కడకు రావటంతోనే పోలీసులు మరింతగా రెచ్చిపోయి ఆ యువకులపై తమ ప్రతాపం చూపించారు. సీఐ అక్కడకు వచ్చినప్పటికీ ఎలాంటి విచారణ చేయకుండా యువకులను చితకబాదుతుంటే చోద్యం చూసినట్టుగా చూడటం వింతగొల్పింది. పోలీసులు జరిపిన ఈ కాఠిన్య వైఖరిపై పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు.



యువకుడిని కాలర్ పట్టుకున్న పోలీసులు, పోలీసుల దెబ్బలకు తేలిన గాయాలు

భార తీనగర్, సెప్టెంబరు 16: దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని ఏపీసీఎల్‌ఎఫ్ రాష్ట్ర చైర్మన్ ఆలివర్ రాయ్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ క్రిస్టియన్ లీడర్స్ ఫోరం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న డినమినేషన్స్, ఫెలోషిప్‌లు, అసోసియేషన్ల రాష్ట్ర క్రైస్తవ నేతలతో మహానాడు రోడ్డు సమీపంలోని ఆలీవ్ హాల్

దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలి

- ఏపీసీఎల్‌ఎఫ్ రాష్ట్ర చైర్మన్ ఆలివర్ రాయ్



సమావేశంలో పాల్గొన్న క్రైస్తవ నాయకులు

సాముహిక సమావేశం సోమవారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలీవర్ రాయ్ మాట్లాడుతూ దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదాపై త్వరలో జస్టిస్ బాలకృష్ణ కమిటీ ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా రాష్ట్ర పర్యటన దృష్ట్యా క్రైస్తవ నేతల సన్నాహక సమావేశం ఏర్పాటు చేసామన్నారు. జస్టిస్ బాలకృష్ణ కమిటీకి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రాంతాల నుంచి 5వేలకు పైగా అర్జీలను సమర్పించాలని తీర్మానించినట్టు తెలిపారు. క్రైస్తవ, ఇస్లాం మతంలోకి మారిన దళిత హిందువులకు షెడ్యూల్డ్ కులాలకు వర్తింపజేసేటట్టు రిజర్వేషన్ ప్రయోజనాలను అందించాలని కోరుతూ పిటిషన్ దాఖలైనట్టు తెలిపారు. దీనికి స్పందిస్తూ కేంద్రప్రభుత్వం విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేసిందన్నారు. ఈ కమిషన్ ప్రస్తుతం వివిధ రాష్ట్రాల్లో ప్రజాభిప్రాయాల సేకరణలో ఉందన్నారు. జస్టిస్ బాలకృష్ణ కమిషన్ నగరానికి వచ్చినప్పుడు 10వేల మంది దళిత క్రైస్తవులు, మత పెద్దలు, క్రైస్తవ నేతలతో కలిసి ఎస్సీ హోదా కల్పించాలనే అంశాన్ని కమిషన్‌కు బలంగా తెలియపరచేందుకు ప్రణాళిక రూపొందించినట్టు తెలిపారు. ఫాదర్ బస్కో, బిషప్‌సాగర్, పలు క్రైస్తవ సంఘాల నేతలు, న్యాయవాదులు, వైద్యులు పాల్గొన్నారు.

వరద.. కోలుకోలేని దెబ్బ

- రోడ్డున పడిన గ్యాస్ డీలర్ ● రూ.14 లక్షలపైనే నష్టం ● ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు

భవానీపురం, సెప్టెంబరు 16: బుడమేరు వరదలతో 43వ డివిజన్ హెచ్‌బీ కాలనీలో చంద్రబాగ్ స్కూల్ సమీపంలోని శ్రీ కన్నమ్మ గోపాలరావు గ్యాస్ ఏజెన్సీ నిర్వహిస్తున్న పి సుభాష్ చంద్రబోస్ గ్యాస్ డీలర్‌షిప్‌లోకి వరద నీరు పోటెత్తడంతో తీవ్రంగా నష్టపోయాడు. బతుకు జీవుడా అంటూ బయటపడినప్పటికీ తీరని నష్టాన్ని భర్తీ చేసి ఆదుకోవాలని ప్రభుత్వం, హెచ్‌బీ గ్యాస్ ఉన్నతాధికారులను కోరుతున్నాడు. హెచ్‌బీ కాలనీతో పాటు, గొల్లపూడి, గుంటుపల్లి, రాయనపాడు, కవులూరు, భవానీపురం, విద్యాధరపురం, వైఎస్‌ఆర్ కాలనీ, రాజరాజేశ్వరిపేట, ముస్తాబాద వరకు 3,500 దీపం కనెక్షన్లు ఉండగా, 500 ఉజ్వల్ కనెక్షన్‌దారులున్నారు. వరద నీరు ముంచెత్తడంతో కంప్యూటర్లు, ప్రింటర్లు, దసరా దీపావళి ఆఫర్ల కోసం కొత్తగా తెచ్చిన గ్యాస్‌స్టవ్‌లు, రెగ్యురేటర్లతో పాటు వినియోగదారులకు చెందిన డాక్యుమెంట్లు తడిసి పూర్తిగా పాడయ్యాయన్నారు. 2016 నుంచి గ్యాస్ ఏజెన్సీని నడుపుతున్నానని, రూ.14లక్షల నష్టం వచ్చిందని, ఎన్యూమరేషన్ అధికారులకు వివరాలు తెలిపినట్టు సుభాష్ ఆంధ్రజ్యోతికి తెలిపారు. వరద తగ్గుముఖం పట్టిన తరువాత నుంచి గ్యాస్ బండలను డోర్ డెలివరీ చేస్తూ రోడ్డుపైనే కస్టమర్లకు సర్వీస్ ఇస్తున్నారు. మొత్తం 16 మంది సిబ్బంది, ఆరుగురు వాహనాల్లో బండ్లను తీసుకెళ్లేవారు ఉపాధి పొందుతున్నారు.



రోడ్డుపైనే గ్యాస్ సర్వీసులు చేస్తున్న సుభాష్ చంద్రబోస్



ఆసుపత్రి ప్రాంగణంలో మాట్లాడుతున్న వైద్యులు

ప్రపంచంలోనే అత్యధిక కార్నియా ఆపరేషన్లు

- ఎల్వీపీఈఐ ఆసుపత్రి ఘనత

పెనమలూరు, సెప్టెంబరు 16: ప్రపంచంలోనే అత్యధిక సంఖ్యలో కార్నియా మార్పిడులు చేసిన సంస్థగా తాడిగడప ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి రికార్డును నెలకొల్పినట్టు ఆసుపత్రి ఎగ్జిక్యూటివ్ అధ్యక్షుడు ప్రశాంత్‌గర్గ్ పేర్కొన్నారు. సోమవారం ఆసుపత్రి ప్రాంగణంలో ఆయన మాట్లాడుతూ 1987లో ఆసుపత్రి స్థాపించినప్పటి నుంచి ఆసుపత్రిలో 50వేలకు పైగా కార్నియా మార్పిడి ఆపరేషన్లు చేసినట్టు తెలిపారు. దేశంలో రామాయమ్మ నేత్రనిధి, హైదరాబాద్ మొహిసిన్ నేత్రనిధి, విశాఖపట్నం దృష్టిదాన్ నేత్రనిధి సంస్థలు ఏటా 12వేలకు పైగా నేత్రదానాలను అందుకున్నాయన్నారు. దీంతో ఉమ్మడి రాష్ట్రాల్లో కార్నియా మార్పిడుల వెయిటింగ్ లిస్టు లేదన్నారు. శాంతిలాల్ సంఘ్వీ కార్నియా సంస్థ డైరెక్టర్ డాక్టర్ ప్రవీణ్ వడ్డపల్లి మాట్లాడుతూ కార్నియా వ్యాధులతో వచ్చే కంటి సమస్యలకు సరైన చికిత్స అందుబాటును కొనసాగించడంపై సంస్థ దృష్టి పెడుతుందన్నారు.



కేంద్రమంత్రి శ్రీనివాసవర్మను సత్కరిస్తున్న ఏపీ జేఏసీ అమరావతి నేతలు

ఎదిగే కొద్దీ ఒదిగి ఉండే నేత శ్రీనివాసవర్మ

- అమరావతి జేఏసీ

వన్‌టౌన్, సెప్టెంబరు 16: కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ ఎంత ఎత్తుకెదిగినా ఒదిగి ఉండే నేతని అమరావతి జేఏసీ నేతలు కొనియాడారు. సోమవారం నగరంలోని బీజేపీ కార్యాలయంలో మంత్రిని కలిసి ఏపీ జేఏసీ అమరావతి అనుబంధ ఉద్యోగ సంఘాలు ఆయనను సత్కరించాయి. అమరావతి జేఏసీ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మంత్రి శ్రీనివాసవర్మకు ఉద్యోగులన్నా, ఉద్యోగ సంఘాలన్నా ప్రత్యేకమైన అభిమానం ఉందన్నారు. అమరావతి జేఏసీ స్టేట్ సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు, కోశాధికారి కనపర్తి సంగీతరావుతో పాటు రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర నాయకత్వం, ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నాయకత్వం, పి.ఆర్. ఇంజనీర్స్ అసోసియేషన్, ఏపీ పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్, ఏపీ జేఏసీ అమరావతి మహిళా విభాగం, ఏపీ క్లాస్ 4 ఎంప్లాయిస్ అసోసియేషన్, మునిసిపల్ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్, గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్, డీఎల్‌పీవోలు, డీసీవోల రాష్ట్ర అసోసియేషన్, గ్రామ, వార్డు, సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సంస్థ, లేబర్ ఆఫీసర్స్ అసోసియేషన్, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం, గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం, ఏపీ వీఆర్‌ఏ సంఘం, జిల్లా రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ నేతలు పాల్గొన్నారు. అనంతరం మంత్రికి దుశ్శాలువా కప్పి పుష్పగుచ్ఛాలతో అభినందనలు తెలిపారు.

యువ పారిశ్రామికవేత్తలకు అండగా ప్రభుత్వం

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్

పెనమలూరు, సెప్టెంబరు 16: ఔత్సాహిక యువ పారిశ్రామికవేత్తలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్నారై సాధికారత మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం ఇంజనీర్స్ డే సందర్భంగా స్థానిక వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని విద్యార్థునుద్దేశించి మాట్లాడారు. వివిధ రంగాల్లో జాతీయ ప్రగతిని నడిపించడంలో ఇంజనీర్ల పాత్రను వివరించారు. అకాడమీ ఉపాధ్యక్షుడు ఎం రాజయ్య మాట్లాడుతూ మోక్షగుండం విశ్వేశ్వరయ్య 163వ జయంతి సందర్భంగా రాష్ట్రంలో అభివృద్ధి చెందుతున్న ఐటీ, కోర్ పరిశ్రమలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఆధునిక ఇంజనీరింగ్, సాంకేతిక పితామహుడు విశ్వేశ్వరయ్య అని కొనియాడారు. ప్రిన్సిపాల్ ఏవీ రత్నప్రసాద్ మాట్లాడుతూ సస్టెయినబిలిటీ కోసం ఇన్నోవేషన్ గురించి విద్యార్థులకు తెలియజెప్పారు. తొలుత మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను కళాశాల యాజమాన్యం సత్కరించింది. రిజిస్ట్రార్ డాక్టర్ ఎం రవిచంద్, డీన్‌లు పాల్గొన్నారు.



మంత్రిని సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

తక్కువ ధరకే టీవీల రిపేరు శుభపరిణామం: ఎమ్మెల్యే ఉమ

గుణదల, సెప్టెంబరు 16: వరదముంపునకు గురైన ప్రాంతాల్లో పాడైపోయిన ఎలక్ట్రానిక్ వస్తువులను ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు తక్కువ ధరకే సర్వీస్ చేసేందుకు ముందుకు రావడం శుభపరిణామమని ఎమ్మెల్యే బొండా ఉమ అన్నారు. చుట్టుగుంట వద్దగల బిగ్ టీవీ సొల్యూషన్స్ సంస్థ అధినేత కొల్లి సీతారామ్ ఎల్‌సీడీ టీవీలను రూ.100 సర్వీస్ చార్జితో పార్ట్‌లకు 50 శాతం రాయితీతో రిపేరు చేసి అందించేందుకు ముందుకు రావడం మంచి పరిణామమన్నారు. వరదముంపుకు గురైన ప్రాంతాల్లో టీవీలు రిపేరుకు వచ్చినవారు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. సీఎం చంద్రబాబు పిలుపు మేరకు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను స్ఫూర్తిగా తీసుకుని తాము ముందుకొచ్చామని సంస్థ అధినేత కొల్లి సీతారామ్ తెలిపారు. టీవీలు సర్వీస్ చేస్తున్న విధానాన్ని బొండ ఉమ సోమవారం స్వయంగా పరిశీలించారు. జిల్లా రోడ్ సేఫ్టీ అధ్యక్షుడు ఎన్‌జీవో సభ్యుడు బేతు రామ్మోహన్‌రావు, టీడీపీ నేతలు నవనీతం సాంబశివరావు, షేక్ బాషా, వల్లభనేని సతీష్, పట్టపు సాంబశివరావు పాల్గొన్నారు.



రిపేరు తీరును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర, అధికారులు

స్వచ్ఛత హి సేవలో పాల్గొనండి

- వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

చిట్టినగర్, సెప్టెంబరు 16: స్వచ్ఛత హి సేవలో ప్రజలంతా పాల్గొనాలని వీఎంసీ కమిషనర్ హెచ్‌ఎం ధ్యానచంద్ర అన్నారు. మంగళవారం సింగ్ నగర్ మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో జరగనున్న స్వచ్ఛతా హి సేవ ప్రారంభోత్సవ ఏర్పాట్లను సోమవారం ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. స్వచ్ఛభారత్ మిషన్ ప్రారంభమై పదేళ్లు పూర్తయిన సందర్భంగా స్వచ్ఛత హి సేవ జరుగుతోందన్నారు. నగర ప్రజలు, విద్యార్థులంతా పాల్గొని, స్వచ్ఛ విజయవాడలో భాగస్వాములు కావాలన్నారు. మంగళవారం ఉదయం స్వచ్ఛత హి సేవ ఉదయం 7.30 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. అదనపు కమిషనర్ కె.సత్యవతి, డిప్యూటీ సిటీ ప్లానర్ జూబిన్ చీరన్ రాయ్ పాల్గొన్నారు.



బుడమేరు డైవర్షన్ కెనాల్ గండ్లు పూడ్చిన ప్రదేశం వద్ద జరుగుతున్న కట్టల బలోపేతం పనులు

సీపేజ్ పూర్తిగా కట్టడి

▸▸ బుడమేరు గండ్ల వద్ద ఫలించిన యత్నాలు.. తుది దశకు చేరిన కట్ట బలోపేతం పనులు

జి.కొండూరు, సెప్టెంబరు 16: బెజవాడను ముంచిన బుడమేరు డైవర్షన్ కెనాల్ (బీడీసీ) గండ్ల పూడ్చివేత పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేసిన అధికార యంత్రాంగానికి పెద్ద సవాల్‌గా మారిన సీపేజ్‌ను ఎట్టకేలకు పూర్తిగా కట్టడి చేయగలిగారు. దీంతో అధికారులు సోమవారం ఊపిరి పీల్చుకున్నారు. గండ్ల పూడ్చివేతకు ఆర్మీని సైతం రంగంలోకి దింపి సక్సెస్ చేసినా.. సీపేజ్‌ను అరెస్టు చేయలేక అధికారులు సతమతమయ్యారు. సీపేజ్ అరెస్టుకు జీయో మేంబరిన్ షీట్స్ వాడారు. అయినా గండ్ల వద్ద ఎంతో కొంత నీరు లీకవుతుండటంతో గండ్లు పూడిన కట్టకు మూడు మీటర్ల దూరంలో సమాంతరంగా మరో కట్టను ఏర్పాటు చేశారు. మధ్యలో ఉన్న గ్యాప్‌లో నల్ల మట్టిని లేయర్ లేయర్లుగా వేసి యంత్రాలతో రోలింగ్ చేసి సోమవారం నాటికి సీపేజ్‌ను పూర్తిగా కట్టడి చేయగలిగారు. ప్రస్తుతం కట్టను బలోపేతం చేసేందుకు దాని ఎత్తు పెంచే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మరో పక్క రైట్ బ్యాంక్‌కు పడిన గండ్లకు సైతం మరమ్మతులు చేస్తున్నారు.

జమిలి సాధ్యంకాదు!

▸▸ ఇప్పుడున్న రాజ్యాంగం

▸▸ ప్రకారం అలా కుదరదు

▸▸ హరియాణాలో ఉన్నది ట్రబుల్ ఇంజన్ సర్కార్

▸▸ కాంగ్రెస్ నేత చిదంబరం



ఛండీగఢ్, సెప్టెంబరు 16: జమిలి ఎన్నికలపై కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి పి. చిదంబరం కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం ఉన్న రాజ్యాంగం ప్రకారం జమిలి ఎన్నికలు సాధ్యంకావని తెలిపారు. జమిలి జరగాలంటే కనీసం ఐదు రాజ్యాంగ సవరణలైనా చేయాల్సి ఉందని వ్యాఖ్యానించారు. ఒకే దేశం-ఒకే ఎన్నికలు(జమిలి) ఈ టర్మ్‌లోనే నిర్వహించాలని బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే సర్కారు భావిస్తున్నదంటూ వస్తున్న వార్తలపై సోమవారం ఆయన స్పందించారు. "ఇప్పుడున్న రాజ్యాంగం ప్రకారం జమిలి సాధ్యంకాదు. కనీసం ఐదు సవరణలైనా చేయాలి. కానీ, ప్రధాని మోదీకి రాజ్యాంగాన్ని సవరించేంత సంఖ్యా బలం పార్లమెంటు ఉభయ సభల్లోనూ లేదు. జమిలి నిర్వహణకు రాజ్యాంగపరమైన అనేక అడ్డంకులు ఉన్నాయి. ఇక, మా విషయానికి(ఇండియా కూటమి) జమిలి ఎన్నికలకు మేం వ్యతిరేకం" అని చిదంబరం వ్యాఖ్యానించారు. రిజర్వేషన్లను ఎత్తేసేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రయత్నిస్తోందన్న ప్రధాని విమర్శలు ఆయన తిప్పికొట్టారు. "మేమెందుకు రద్దు చేస్తాం? రిజర్వేషన్లపై ఉన్న 50 శాతం సీలింగ్‌ను ఎత్తివేయాలని కోరుతున్నది మేమే కదా! కుల గణన చేపట్టాలని కూడా డిమాండ్ చేస్తున్నాం కదా. అలాంటప్పుడు ప్రధాని చెప్పేది ఎలా నమ్ముతారు?" అని ప్రశ్నించారు. అక్టోబరు 5న జరగనున్న హరియాణా అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ముఖ్యమంత్రి అభ్యర్థిని ఎందుకు ప్రకటించలేదన్న ప్రశ్నకు స్పందిస్తూ.. ఎన్నికలకు ముందే ముఖ్యమంత్రి అభ్యర్థిని ప్రకటించే సంప్రదాయం కాంగ్రెస్ పార్టీకి లేదన్నారు. "హరియాణాలో డబుల్ ఇంజన్ సర్కారు ఉందని బీజేపీ ప్రగల్భాలు పలుకుతోంది. కానీ, ఇది ట్రబుల్ ఇంజన్ సర్కారుగా ఉంది. ఒక ఇంజన్‌లో చమురు లేదు. మరో ఇంజన్ రిపేరుకొచ్చింది. మరి డబుల్ ఇంజన్‌తో ఏంటి ప్రయోజనం?" అని చిదంబరం ఎద్దేవా చేశారు.

నేటి నుంచి టీడీపీ ఆఫీస్‌లో 'ప్రజా వేదిక' పునఃప్రారంభం

అమరావతి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో వినతులు స్వీకరించే ప్రజా వేదిక కార్యక్రమం మంగళవారం నుంచి పునఃప్రారంభం అవుతుందని పార్టీ ఎమ్మెల్సీ పీ అశోక్‌బాబు తెలిపారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు పార్టీ కార్యాలయంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు... పార్టీ కార్యకర్తలు, నాయకులకు అందుబాటులో ఉండి, ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారని చెప్పారు. ఈనెల 17న ఎమ్మెల్యే శ్రీరామ్ తాతయ్య, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి, 18న ఎమ్మెల్యేలు నక్కా ఆనంద్‌బాబు, మొహ్మద్ నజీర్ అహ్మద్, 19న మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు గ్రీవెన్స్‌లో పాల్గొంటారని తెలిపారు.

పోతిరెడ్డిపాడును గరిష్ఠ స్థాయిలో ఎందుకు వాడరు?

▸▸ రాష్ట్ర సమగ్రాభివృద్ధి అధ్యయన వేదిక కన్వీనర్ టి.లక్ష్మీనారాయణ

అమరావతి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నుంచి గరిష్ఠస్థాయిలో కృష్ణా జలాలను ఎందుకు వదలడం లేదు? అని రాష్ట్ర సమగ్రాభివృద్ధి అధ్యయన వేదిక కన్వీనర్ టి.లక్ష్మీనారాయణ నిలదీశారు. సోమవారం ఆయన ఒక ప్రకటన చేశారు. 'ప్రకాశం బ్యారేజీ నుంచి ఈ ఏడాది (జూన్ ఒకటో తేదీ నుంచి సెప్టెంబరు 13 దాకా) 647 టీఎంసీలను సముద్రంలోకి వదిలారు. శ్రీశైలం నుంచి భారీగా వరదనీటిని దిగువకు విడుదల చేశారు. సోమవారమూ ప్రకాశం బ్యారేజీ నుంచి 1,04,792 క్యూసెక్కులను కిందకు వదిలారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యం 44,000 క్యూసెక్కులున్నా... ఇన్ని రోజులూ 30,000 క్యూసెక్కులకే ఎందుకు పరిమితం చేశారు?' అని లక్ష్మీనారాయణ ప్రశ్నించారు. అలాగే వివిధ రిజర్వాయర్లలో నిల్వ సామర్థ్యాన్ని గరిష్ఠ స్థాయిలో ఉపయోగించుకోకపోవడాన్ని ఆయన తీవ్రంగా తప్పు పట్టారు.

ఫైనాన్స్ వ్యాపారి దారుణహత్య

▸▸ డబ్బులిస్తామని ఫోన్ చేసి రమ్మని.. గొంతు కోసిన వైనం

▸▸ హత్యకు ఆర్థిక లావాదేవీలే కారణం!

▸▸ బాపట్ల సూర్యలంక తీరంలో ఘటన



బాచు ఏసుబాబు (ఫైల్)

బాపట్ల, సెప్టెంబరు 16: ఫైనాన్స్ తీసుకున్న డబ్బులు తిరిగి ఇస్తామని పిలిచి మరీ దారుణంగా హత్యచేసిన ఘటన బాపట్ల జిల్లాలోని సూర్యలంక సముద్ర తీరం సమీపంలో సోమవారం జరిగింది. వివరాల ప్రకారం.. కృష్ణా జిల్లాకు చెందిన బాచు ఏసుబాబు సుమారు 10 ఏళ్ల నుంచి బాపట్ల పట్టణంలోని కారుమూరి హనుమంతరావు కాలనీలో నివాసం ఉంటూ ఫైనాన్స్ వ్యాపారం చేస్తున్నాడు. తీసుకున్న డబ్బు తిరిగి ఇస్తామని కొందరు ఫోన్ చేసి ఆయన్ను సూర్యలంకకు రమ్మన్నారు. ఏసుబాబు తన అసిస్టెంట్ చంద్రశేఖర్ అలియాస్ చిన్నితో కలిసి సూర్యలంక వెళ్లగా.. కుందేరువాగు చప్టా వద్ద కొందరు వ్యక్తులు కత్తులతో దాడి చేసి గొంతు కోశారు. దీంతో ఏసుబాబు అసిస్టెంట్ అక్కడి నుంచి పారిపోయాడు. రక్తం కారుతుండగానే ఏసుబాబు బైక్‌పై సూర్యలంక శివాలయం దగ్గరకెళ్లి జరిగిన విషయాన్ని అక్కడున్న వాళ్లకు కొంతవరకు చెప్పినట్లు సమాచారం. ఆ తర్వాత సమాచారం అందుకొన్న పోలీసులు కొనఊపిరితో ఉన్న ఏసుబాబును అంబులెన్స్‌లో ఏరియా వైద్యశాలకు తరలించారు. అప్పటికే ఆయన మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై రూరల్ సీఐ గంగాధరరావు ఆధ్వర్యంలో పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి అసిస్టెంట్‌ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. హత్య జరిగిన తర్వాత గుర్తుతెలియని వ్యక్తులు ఆ విషయాన్ని మృతుడి భార్యకు ఫోన్ చేసి చెప్పినట్లు తెలిసింది. నిత్యం పర్యాటకుల రద్దీతో, పోలీసులు తిరుగుతూ ఉండే సూర్యలంక తీరంలో పట్టపగలు హత్య జరగటం చర్చనీయాంశంగా మారింది. కొంతకాలంగా బాపట్ల, చీరాల పరిసర ప్రాంతాలలో హత్యల పరంపర కొనసాగుతుండడం ఆందోళన కలిగిస్తున్నది.

డబ్బులిస్తామని పిలిచి చంపారు: అమ్ములు, మృతుడి భార్య

ఫైనాన్స్ తీసుకున్న డబ్బులు ఇస్తామని ఆదర్శనగర్‌కు చెందిన చంద్రశేఖర్ అనే వ్యక్తి పిలిచి తన భర్తను హత్య చేశారని మృతుడి భార్య అమ్ములు తెలిపారు. ఏసుబాబుకు ఫోన్‌చేయడంతో ఆయన వెళ్లాడని, కొంతసేపటికి హత్య జరిగినట్లు తెలిసిందని కన్నీరుమున్నీరయ్యారు. బతుకు తెరువు కోసం బాపట్ల వచ్చిన తమ కుటుంబానికి తీవ్ర అన్యాయం చేశారని ఆమె బోరున విలపించింది. సకాలంలో ఆస్పత్రిలో చేర్పించి ఉంటే, తన భర్త బతికుండేవాడని ఆవేదన వ్యక్తం చేశారు.

బంగారు గనిపై ఘర్షణ

పపువా న్యూగినియాలో 30 మంది కాల్చివేత!



పోర్ట్ మోర్స్‌బై, సెప్టెంబరు 16: బంగారు గనిపై పట్టు కోసం పపువా న్యూ గినియాలో హింస చెలరేగింది. అల్లర్లు, విధ్వంసాలు, కాల్పులతో అట్టుడికింది. భద్రతా దళాలకు అత్యవసర అధికారాలు అప్పగించి ఆయుధాలతో కనిపిస్తే కాల్చివేత ఉత్తర్వులు జారీ చేసేంతగా పరిస్థితి దిగజారింది. ఇదంతా.. ఈ ఏడాది మే నెలలో కొండచరియలు విరిగిపడి, 2 వేల మంది ప్రాణాలను బలిగొన్న బంగారు గని ఉన్న ప్రాంతంలోనే జరగడం గమనార్హం. ఆస్ట్రేలియాకు సమీపాన ఉండే ఓషియానియా దేశమైన పపువా న్యూ గినియాలో న్యూ పోర్గెరా ప్రాంతంలోని బంగారు గనిని ఆగస్టులో సకార్ అనే గిరిజన తెగ ఆక్రమించుకుంది. వాస్తవానికి ఈ ప్రాంతంపై హక్కులు పయాండె తెగకు ఉన్నాయి. దీంతో రెండింటి మధ్య ఘర్షణ జరుగుతోంది. ఆదివారం వరుస ఘటనల్లో 300 పైగా రౌండ్లు కాల్పులు జరిగాయి. 30 మంది మృతిచెందారు. ఈ సంఖ్య 50కు చేరొచ్చని పోలీసులు చెబుతున్నారు. క్షతగ్రాతులూ భారీగానే ఉన్నారని పేర్కొన్నారు. ఆందోళనల్లో ఇళ్లు ధ్వంసమయ్యాయని తెలిపారు. కర్ఫ్యూ విధించినట్లు చెప్పారు. అక్రమ మైనింగ్ చేస్తున్నవారు, వలసదారులు హింసకు దిగుతూ స్థానికులు, భూమి హక్కుదారులను భయభ్రాంతులకు గురిచేస్తున్నట్లు వివరించారు. ఉద్రిక్తతల నేపథ్యంలో.. ఆయుధాలతో బహిరంగంగా తిరుగుతూ, ఎవరినైనా బెదిరిస్తూ కనిపించిన వారిని కాల్చివేయాలని ప్రభుత్వ ఆదేశాలిచ్చింది. మే నెలలో కొండచరియలు విరిగిపడింది ప్రొగెరా గని ప్రాంతంలోనే. ఇది కెనడా జాతీయుడి ఆధీనంలో ఉంది. పోప్ ఫ్రాన్సిస్ ఈ నెల మొదట్లో పపువాలో పర్యటించిన సందర్భంగా ఘర్షణలకు అంతం పలకాలని పిలుపునిచ్చారు.

గాజాపై ఇజ్రాయెల్ దాడిలో 16 మంది మృతి

జెరూసలేం, సెప్టెంబరు 16: గాజాపై ఇజ్రాయెల్ మరోసారి విరుచుకుపడింది. సోమవారం ఉదయం గాజాలోని న్యూసెరాట్ శరణార్థుల శిబిరం సమీపంలోని ఓ ఇంటిపై బాంబుల వర్షం కురిపించింది. ఈ ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ఏడుగురితో పాటు మొత్తం 10 మంది మృత్యువాత పడ్డారు. మరణించిన వారిలో నలుగురు మహిళలు, ఇద్దరు చిన్నారులు ఉన్నారు. మరో 13 మంది గాయపడ్డారు. మరో ఘటనలో గాజా సిటీలోని ఓ ఇంటిపై ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడిలో ఆరుగురు పౌరులు ప్రాణాలు కోల్పోయారు. హమాస్, ఇజ్రాయెల్ యుద్ధం కారణంగా ఇప్పటి వరకు 41 వేల మంది చనిపోయినట్లు గాజా ఆరోగ్యశాఖ తెలిపింది.

ఫలించిన 'కావడి' మంత్రం..!

ప్రకాశం బ్యారేజ్ వద్ద పైకి లేచిన బోటు.. నెమ్మదిగా ముందుకు లాగుతున్న కావడి బోట్లు.. నేటి సాయంత్రానికి ఒడ్డుకు చేర్చే అవకాశం





కావడి బోట్లతో ప్రకాశం బ్యారేజివద్ద బోట్లను బయటకు లాగుతున్న దృశ్యం

విజయవాడ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): 'కావడి' మంత్రం పనిచేస్తోంది. నీట మునిగిన బోటును పైకి లేపి.. నెమ్మదిగా ముందుకు కదిలిస్తోంది. ప్రకాశం బ్యారేజ్ వద్ద నీటిలో మునిగిన బోటును ఒడ్డుకు చేర్చడానికి ఇంజనీరింగ్ నిపుణులు అమలు చేస్తున్న కావడి విధానం కొంతమేరకు ఫలితాన్నిచ్చింది. సోమవారం మధ్యాహ్నం నుంచి ఈ ప్లాన్‌ను అమలు చేశారు. దుర్గాఘాట్‌కు అవతలి వైపు ఇనుప గడ్డర్లు అమర్చిన రెండు బోట్లను బ్యారేజ్ వద్దకు తీసుకొచ్చారు. నీటిలో మునిగిన బోటుకు చెరో పక్కన ఈ బోట్లను నిలిపారు. తర్వాత సీ లయన్ కంపెనీ డైవర్లు మునిగి ఉన్న బోటుకు రెండు వైపులా ఎనిమిది రోప్‌లు బిగించారు. వాటిని కావడి బోట్లపై ఉన్న ఇనుప గడ్డర్లకు లాక్ చేశారు. అనంతరం ఈ బోట్ల బరువును పెంచడానికి నదిలోని నీటిని లోడ్ చేశారు. దీంతో ఈ రెండు బోట్లు కాస్త నీటిలోకి దిగాయి. తర్వాత ఈ బోట్లలో ఉన్న నీటిని మొత్తం మోటార్ల ద్వారా తోడేశారు. అప్పుడు బోట్లు పైకి లేచాయి. అదే సమయంలో వాటితో పాటు నీటిలో మునిగిన బోటు ఒక భాగం కూడా పైకి లేచింది. తర్వాత రెండు బోట్లను నెమ్మదిగా ముందు కదిలించారు. ఈ క్రమంలో నీట మునిగిన బోటు కాస్త ముందుకు వచ్చింది. ఈలోగా చీకటి పడడంతో ఆపరేషన్‌ను నిలుపుదల చేశారు. మంగళవారం ఉదయం నుంచి మళ్లీ బోటును లాగడం ప్రారంభిస్తారు. మునిగిన బోటు ఒడ్డుకు చేర్చడానికి మరో రోజు పట్టే సూచనలు కనిపిస్తున్నాయి.

అబ్బులు ఫోన్ లభ్యం

బోటు ఆపరేషన్ పనులు చేయిస్తున్న కాకినాడకు చెందిన పెంటపాటి అబ్బులు ఫోన్ సోమవారం దొరికింది. అబ్బులు ఫోన్ పోయిందని 'ఆంధ్రజ్యోతి'లో వార్త ప్రచురితమైన విషయం తెలిసిందే. మోడల్ గెస్ట్‌హౌస్‌లో స్వీపర్లు సోమవారం క్లీనింగ్ చేస్తుండగా చెత్త బుట్టలో ఫోన్ ఉన్నట్టు గుర్తించారు. ఈ విషయాన్ని అధికారులకు తెలియజేశారు. అధికారులు ఈ ఫోన్‌ను అబ్బులుకు అందజేశారు.

భారత్‌లో ఇబ్బందుల్లో ముస్లింలు: ఖమేనీ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): భారత్‌లో ముస్లింల పరిస్థితులపై ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ చేసిన వ్యాఖ్యలను భారత్ తీవ్రంగా ఖండించింది. మహ్మద్ ప్రవక్త జయంతి సందర్భంగా ఎక్స్ వేదికగా ఖమేనీ భారత్‌లో ముస్లింల పరిస్థితుల గురించి ప్రస్తావించారు. మయన్మార్, గాజాతో పాటు భారత్‌లో కూడా ముస్లింలు ఇబ్బందులు పడుతున్నారని వ్యాఖ్యానించారు. ఇక్కట్లు ఎదుర్కొంటోన్న ముస్లింలను మిగతా ముస్లింలు పట్టించుకోవాలన్నారు. ఖమేనీ వ్యాఖ్యలను భారత విదేశాంగ శాఖ తిప్పికొట్టింది. తప్పుడు సమాచారంతో కూడిన ఆరోపణలు చేశారంటూ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇలాంటి వ్యాఖ్యలు చేసే దేశాలు సొంత రికార్డులు పరిశీలించుకోవాలని భారత్ హితవు పలికింది.

వైద్య కళాశాలలపై జగన్ అసత్య ప్రచారం

▸▸ దమ్ముంటే బహిరంగ చర్చకు రావాలి

▸▸ నిరూపిస్తే రాజీనామా చేస్తా.. లేదంటే ముక్కు నేలకు రాసి క్షమాపణ చెప్పాలి

▸▸ వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ సవాల్

▸▸ వైపీసీ అధికారుల వ్యవహారం నుంచి ప్రజల దృష్టి

▸▸ మళ్లించేందుకే తప్పుడు ప్రచారమని ఆగ్రహం



మంత్రి సత్యకుమార్ యాదవ్

పుట్టపర్తి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వైద్య కళాశాలల అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా? అని మాజీ సీఎం జగన్‌కు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సవాల్ విసిరారు. జగన్ చెప్పేవన్నీ అబద్ధాలేనని మండిపడ్డారు. శ్రీసత్యసాయి జిల్లాకేంద్రం పుట్టపర్తిలో సోమవారం నిర్వహించిన ఏపీ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) సమావేశానికి మంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'గత వైసీపీ పాలనలో కేంద్రం.. రాష్ట్రానికి 17 వైద్య కళాశాలలు మంజూరు చేసినా, వాటి నిర్మాణంలో నాటి సీఎం జగన్ నిర్లక్ష్యధోరణి అవలంబించారు. 25శాతం కూడా పనులు పూర్తి చేయలేదు. 16 శాతం బిల్లులను మాత్రమే చెల్లించారు. మదనపల్లి, ఆదోని, మార్కాపురం, పులివెందుల, పాడేరు వైద్యకళాశాలల పనులు ప్రారంభించినా పూర్తి చేయలేదు. దీంతో.. కూటమి ప్రభుత్వం జూన్‌లో ఏర్పాటైతే, జూలై 24న జాతీయ వైద్యకమిషన్ కళాశాలలను తనిఖీచేసి, పనుల పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. వాటిలో అడ్మిషన్లకు అనుమతులు నిరాకరించింది. ఇప్పటికిప్పుడు అవన్నీ పూర్తి కావాలంటే రూ.2వేల కోట్లు అవసరం. ఆర్థిక ఇబ్బందులను అధిగమించి పూర్తి చేయాలని ప్రయత్నించాం. బోధన సిబ్బంది, మౌలిక సదుపాయాల కల్పనకు కేబినెట్ అనుమతితో 380 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చినా కమిషన్ సంతృప్తి చెందలేదు. మెడికల్ కళాశాలలకు రూ.2 వేల కోట్లు ఖర్చు చేశామని జగన్ చెబుతున్న మాటలు అబద్ధం. రూ.1400 కోట్లే ఖర్చు చేశారు. అందులో కూడా రూ.700 కోట్లు కాంట్రాక్టర్లకు బకాయిలు పెట్టారు. దీంతో కాంట్రాక్టర్లు పనులు ఆపేశారు. చివరికి జగన్ సొంత నియోజకవర్గం పులివెందులలో కూడా 48 శాతం పనులు పూర్తికాలేదు. వీటన్నింటినీ దాచి వైద్య కళాశాలలను తానే పూర్తి చేసినట్లు అబద్ధాలు చెబుతూ విద్యార్థులు, ప్రజలను అయోమయంలో పడేస్తున్నారు' అని మంత్రి మండిపడ్డారు. గత వైసీపీ పాలనలో అక్రమాల ఆరోపణలు, దోపిడీతో సస్పెండై, జైళ్లకు వెళ్తున్న తన అనుయాయులపై చర్చ జరగకుండా దృష్టి మరల్చేందుకు జగన్ వైద్య కళాశాలల అంశాన్ని తెరపైకి తెచ్చాడని మంత్రి ధ్వజమెత్తారు. మెడికల్ కళాశాలలకు రూ.2400 కోట్లు ఖర్చు పెట్టినట్లు చెప్తున్న జగన్.. వాస్తవంగా రూ.1400 కోట్లే వెచ్చించారనీ, మిగిలిన రూ.1000 కోట్లు ఏమి చేశారో చెప్పాలని ప్రశ్నించారు. వైద్య కళాశాలలకు నిధుల ఖర్చుపై జగన్ కానీ, ఆ పార్టీ మాజీ మంత్రులు గానీ బహిరంగ చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. జగన్ చెప్పేది వాస్తవమని నిరూపిస్తే తాను రాజీనామాకు సిద్ధమని, లేదంటే ముక్కు నేలకు రాసి, రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలని మంత్రి సత్యకుమార్ డిమాండ్ చేశారు. సమావేశంలో మంత్రి సవిత, హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు పాల్గొన్నారు.

పాడేరు మెడికల్ కాలేజీలో నేటి నుంచి అడ్మిషన్లు

తొలివిడతలో 20 సీట్ల భర్తీకి చర్యలు

▸▸ 19 నాటికి పూర్తి చేయాలని ఉత్తర్వులు

▸▸ నెలాఖరుకు మిగిలిన 30 సీట్లు భర్తీ

▸▸ అక్టోబరు 1 నుంచి తరగతులు



పాడేరులోని మెడికల్ కాలేజీ

పాడేరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పాడేరు మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ ప్రవేశాల ప్రక్రియ మంగళవారం ప్రారంభం కానుంది. తొలి విడతగా 20 సీట్లను కేటాయించి వాటి ప్రవేశాల ప్రక్రియను ఈ నెల 19వ తేదీ సాయంత్రం 3 గంటల్లోపు పూర్తి చేయాలని వైద్య విద్య డైరెక్టర్ డాక్టర్ నరసింహం సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు. ఈ మేరకు గురువారంలోగా 20 సీట్లను, నెలాఖరులోగా మిగిలిన 30 సీట్లతో కలిపి మొత్తం 50 సీట్లను భర్తీచేస్తారు. అక్టోబరు ఒకటో తేదీ నుంచి తరగతులు ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఆ ఏర్పాట్లు చకచకా జరుగుతున్నాయి. రాష్ట్రంలోని గిరిజన ప్రాంతంలో ఉన్న ఈ మెడికల్ కాలేజీలో ఈ ఏడాది ప్రవేశాలకు అవకాశం కల్పించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్, వైద్య ఆరోగ్య శాఖ ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, వైద్య విద్య డైరెక్టర్ డాక్టర్ నరసింహం, ఇతర అధికారులకు ప్రిన్సిపాల్ డాక్టర్ టి.హేమలత ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మెడికల్ కాలేజీ ఏర్పాటుతో గిరిజనులకు మెరుగైన వైద్యసేవలు అందుబాటులోకి వస్తాయని ఆమె 'ఆంధ్రజ్యోతి'తో అన్నారు.

మొత్తం 50 సీట్లు మంజూరు

పాడేరు మెడికల్ కళాశాలకు ఈ ఏడాది (2024-25) 50 సీట్లు మంజూరయ్యాయి. అందులో రాష్ట్ర ప్రభుత్వ కోటా 22 సీట్లు కాగా, కేంద్ర కోటాలో 7 సీట్లు ఉన్నాయి. సెల్ఫ్ ఫైనాన్స్ కోటాలో 15 సీట్లు (ఏడాదికి రూ.12 లక్షలు చెల్లించాలి), ఎన్ఆర్ఐ కోటాలో 6 సీట్లు (ఏడాదికి రూ.20 లక్షలు చెల్లించాలి) ఉన్నాయి. ప్రస్తుతానికి రాష్ట్ర కోటా కింద తొలి విడతలో 20 సీట్ల భర్తీకి ఉత్తర్వులు అందాయి. విడతల వారీగా నెలాఖరుకు మొత్తం 50 సీట్లను భర్తీ చేస్తారు.

చైనాలో చిక్కుకున్న విద్యార్థుల్ని రక్షిస్తాం

▸▸ 'వారధి' కార్యక్రమంలో కేంద్ర మంత్రి వర్మ

అమరావతి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఇటీవల విజయవాడను ముంచెత్తిన బుడమేరు వరదల్లో నష్టపోయిన చిన్న, పెద్ద పరిశ్రమలను ఆదుకోవడానికి కృషి చేస్తామని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. విజయవాడలోని రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో సోమవారం ఆయన 'వారధి' కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని అన్నారు. రాష్ట్రానికి చెందిన ముగ్గురు ఎంబీబీఎస్ విద్యార్థులు చైనాలో కేసుల్లో చిక్కుకున్నారంటూ బాధితుల బంధువులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే విదేశీ వ్యవహారాల శాఖతో మాట్లాడి వారిని కాపాడడానికి చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. బీజేపీ మీడియా ఇన్‌చార్జి పాతూరి

▸▸ నేడు బెజవాడలో రక్తదాన శిబిరం: పాతూరి నాగభూషణం

నాగభూషణం మాట్లాడుతూ... 'ప్రధాని మోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం విజయవాడలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. పెదనలో వినాయకుడి మండపంపై అన్యమతస్తులు దాడి చేయడం హేయమైన చర్య అని యామినీ శర్మ అన్నారు.

మంగళూరులో మసీదుపై రాళ్లదాడి

▸▸ పూర్తి బందోబస్తు నడుమ హిందూ సంఘాల ర్యాలీ

బెంగళూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): దక్షిణకన్నడ జిల్లా కేంద్రం మంగళూరు తాలూకా కాటిపళ్లపేటలో ఆదివారం రాత్రి మసీదుపై రాళ్లు రువ్విన ఘటన ఉద్రిక్తతకు దారితీసింది. దీంతో సోమవారం భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. మండ్య జిల్లా నాగమంగలలో గణేశ్ నిమజ్జనం సందర్భంగా గొడవలు తలెత్తి దుకాణాలకు నిప్పు, ద్విచక్రవాహనాలను ధ్వంసం చేసిన వైనం తెలిసిందే. హిందువులపై దాడి జరిగిందని ఆరోపిస్తూ దక్షిణ కన్నడ జిల్లా బజరంగ్‌దళ్, విశ్వహిందూ పరిషత్ ముఖ్యులు 'చలో బీసీ రోడ్డు' ఆందోళనకు పిలుపునిచ్చారు. రెండు రోజులుగా సోషల్ మీడియాలో వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ చలో బీసీ రోడ్డు నినాదాలు పోస్టు చేయడం, అందుకు దీటుగా ముస్లిం సంఘాలు 'సత్తా ఉంటే రండి' అంటూ సవాల్ చేయడంతో వివాదం ముదిరింది. ఆదివారం రాత్రి బైక్‌పై వచ్చిన ఇద్దరు మసీదుపై రాళ్లు రువ్వారు. దీనిని ముస్లింలు తీవ్రంగా పరిగణించారు. మసీదు అధ్యక్షుడు అబ్దుల్‌రెహమాన్ ఫిర్యాదు మేరకు రాళ్లు రువ్విన ఘటనకు సంబంధించి సూరత్కల్ భరత్‌శెట్టి (26), చన్నప్ప శివానంద చలవాది (19), నితిన్ హడపద (22), సుజిత్‌శెట్టి (23), అణ్ణప్ప (24), కాటిపళ్లకు చెందిన ప్రీతమ్‌శెట్టి (34) అనే వారిని అరెస్టు చేశారు. కాగా, సోమవారం చలో బీసీ రోడ్డుకు పెద్దఎత్తున కార్యకర్తలు తరలివచ్చారు.

ఫ్రెండ్స్‌తో తిరిగేందుకు ఓకే

▸▸ వరుడికి బాండ్ పేపర్‌పై రాసిచ్చిన వధువు



చెన్నై, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పెళ్లయ్యాక కూడా స్నేహితులతో సరదాగా బయట తిరిగేందుకు అనుమతిస్తానంటూ కాబోయే భర్తకు అగ్రిమెంట్ రాసిచ్చింది ఓ వధువు. ఒప్పంద పత్రంపై ఆమె సంతకం చేశాకే తమ ఫ్రెండ్‌తో పెళ్లికి అనుమతిచ్చారు అతని స్నేహితులు. తమిళనాడులోని మైలాడుదురై జిల్లా శీర్గాళి సమీపంలో ఈ ఆసక్తికర ఘటన జరిగింది. తెన్‌పాదికి చెందిన ముత్తుకుమార్-పవిత్రల వివాహం ఆదివారం శీర్గాళి సమీపంలోని ఓ కల్యాణ మండపంలో జరిగింది. వివాహానికి వచ్చిన ముత్తుకుమార్ స్నేహితులు.. రూ.100 బాండ్ పత్రంపై వధువు చేత సంతకం తీసుకున్నారు. 'వివాహం తరువాత కూడా ముత్తుకుమార్ అతని స్నేహితులతో కలిసి తిరిగేందుకు, విహారయాత్రలు చేసేందుకు నాకెలాంటి అభ్యంతరం లేదు. అతని సరదాలకు నేను ఎలాంటి అడ్డుచెప్పబోను' అని ఆ అగ్రిమెంట్ పత్రంపై రాసివుంది. ఈ పత్రం చదువుకున్న ఆ వధువు, ఆమె కుటుంబీకులు ఈ వ్యవహారాన్ని సరదాగా తీసుకుని సంతకం చేశారు.

ట్రంప్‌పై కాల్పులకు యత్నించింది 58 ఏళ్ల ర్యాన్ రౌత్



న్యూఢిల్లీ, సెప్టెంబరు 16: అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై తాజాగా దాడికి యత్నించిన వ్యక్తిని 58 ఏళ్ల వయసున్న ర్యాన్ వెస్లీ రౌత్‌గా గుర్తించారు. ఆదివారం ఫ్లోరిడాలోని తన గోల్ఫ్ కోర్టులో ట్రంప్ ఆడుకుంటుండగా.. గోల్ఫ్ కోర్టుకు ఆనుకొని ఉన్న పొదల్లో 58 ఏళ్ల వయసున్న ర్యాన్ వెస్లీ రౌత్ అత్యంత శక్తిమంతమైన ఏకే-47-స్టైల్ తుపాకీతో మాటువేశాడు. సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు గుర్తించి కాల్పులు జరపగా, రౌత్ ఆ పొదల్లోంచి బయటికి వచ్చి నల్లని కారులో అక్కడి నుంచి పారిపోయాడు. ఘటన స్థలం నుంచి ఏకే-47-స్టైల్ తుపాకీ, గోప్రో కెమెరాను భద్రతా సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. అనంతరం భద్రతా అధికారులు ఆ కారును గుర్తించి రౌత్‌ను అరెస్టు చేశారు.

ఉక్రెయిన్ యుద్ధంలో చనిపోవాలని ఆకాంక్ష..

న్యూయార్క్ టైమ్స్ కథనం ప్రకారం నార్త్ కరోలినా గ్రీన్స్‌బోరోకు చెందిన రౌత్ గతంలో నిర్మాణరంగంలో పనిచేశాడు. ఉక్రెయిన్‌కు వెళ్లి యుద్ధంలో పాల్గొనాలని, ఆ యుద్ధంలోనే చనిపోవాలని ఉందని రౌత్ ఎక్స్‌లో చేసిన పోస్టు చేశాడు.

ఆంధ్రజ్యోతి

దిక్సూచి

diksuchi@andhrajyothy.com

విజయవాడ ● మంగళవారం 17 సెప్టెంబరు 2024

మేనేజ్‌మెంట్ కోర్సుల్లో ప్రవేశానికి

క్యాట్



మేనేజ్‌మెంట్ కోర్సుల్లో ప్రవేశాలకు ఉద్దేశించిన ప్రవేశ పరీక్ష 'కామన్ అడ్మిషన్ టెస్ట్(క్యాట్)' దరఖాస్తు గడువు తేదీని పొడిగించారు. అర్హులైన అభ్యర్థులు సెప్టెంబరు 20వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఆన్‌లైన్ కంప్యూటర్ ఆధారిత విధానంలో నిర్వహించే క్యాట్‌లో సాధించిన పర్సంటైల్ ఆధారంగా సీట్లను కేటాయిస్తారు. క్యాట్ స్కోరు ఆధారంగా ఐఐఎంలే కాకుండా ఇతర ప్రముఖ కళాశాలలు కూడా సీట్లను భర్తీ చేస్తాయి. ఈ ఏడాది ఈ పరీక్షను దేశవ్యాప్తంగా 170 నగరాల్లో నిర్వహించనున్నారు.

ఐఐఎంలు: ముంబయి, అమృత్‌సర్, బెంగళూరు, బోధ్ గయా, కోల్‌కతా, ఇండోర్, జమ్ము, కాశీపూర్, కోజికోడ్, లఖ్‌నవూ, నాగ్‌పూర్, రాయ్‌పూర్, రాంచీ, రోహ్‌తక్, సంబల్‌పూర్, షిల్లాంగ్, సిర్మౌర్, తిరుచిరాపల్లి, ఉదయపూర్, విశాఖపట్నం.

అర్హత: కనీసం 50 శాతం మార్కులతో బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు 45 శాతం మార్కులు చాలు. డిగ్రీ చివరి సంవత్సరం పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

పరీక్ష విధానం: ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారు. పరీక్షలో మూడు విభాగాలు ఉంటాయి. సెక్షన్-1 వెర్బల్ ఎబిలిటీ అండ్ రీడింగ్ కాంప్రహెన్షన్, సెక్షన్-2 డేటా ఇంట్రప్రిటేషన్ అండ్ లాజికల్ రీజనింగ్, సెక్షన్-3 క్వాంటిటేటివ్ ఎబిలిటీ నుంచి ప్రశ్నలు ఇస్తారు. ప్రతి ప్రశ్నకు మూడు మార్కులు కేటాయించారు. పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి ఆయా సంస్థలు గ్రూప్ డిస్కషన్స్, రిటెన్ ఎబిలిటీ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూస్ నిర్వహించి తుది ఎంపికను చేపడతాయి.

రిజిస్ట్రేషన్ ఫీజు: రూ.2500. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులు రూ.1250 చెల్లించాలి.

తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: అనంతపురం, చిత్తూరు, గుంటూరు, కాకినాడ, కర్నూలు, నెల్లూరు, రాజమండ్రి, శ్రీకాకుళం, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, విజయనగరం, హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, వరంగల్.

దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 20

అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్: నవంబరు 5 నుంచి 24 వరకు

పరీక్ష తేదీ: నవంబరు 24

ఫలితాల ప్రకటన: 2025 జనవరి రెండో వారంలో

వెబ్‌సైట్: https://iimcat.ac.in/

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో

పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లు



హైదరాబాద్‌లోని యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్(యూఓహెచ్) 2024-25 విద్యా సంవత్సరానికి గాను వివిధ పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి గడువు తేదీని పొడిగించింది. మొత్తం 22 పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఆల్ ఇండియా ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్, ఇంటర్వ్యూ ద్వారా సీట్లను భర్తీ చేస్తారు. హైదరాబాద్, భువనేశ్వర్, కొచ్చి, పట్నా, ఢిల్లీ, గువాహటి, కోల్‌కతాల్లో ప్రవేశ పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు.

స్పెషలైజేషన్లు - సీట్లు

- ఇంగ్లీష్-6, తెలుగు-19, ఉర్దూ-3, అప్లయిడ్ లింగ్విస్టిక్స్-8, హిస్టరీ-8, పొలిటికల్ సైన్స్-10, సోషియాలజీ-20, ఆంత్రోపాలజీ-9, ఎడ్యుకేషన్-2, రీజనల్ స్టడీస్-5, ఇండియన్ డయాస్పొరా-2, సోషల్ ఎక్స్‌క్లూజన్ అండ్ ఇన్‌క్లూజివ్ పాలసీ-4, జెండర్ స్టడీస్-5, ఎకనామిక్స్-28, డ్యాన్స్-3, ఆర్ట్ హిస్టరీ అండ్ విజువల్ స్టడీస్-1, కమ్యూనికేషన్-3, ట్రాన్స్‌లేషన్ స్టడీస్-4, ఇంగ్లీష్ లాంగ్వేజ్ స్టడీస్-8, హెల్త్ సైన్సెస్: ఆప్టోమెట్రీ-2, మెటీరియల్స్ ఇంజనీరింగ్-16, నానో సైన్స్ అండ్ టెక్నాలజీ-4.
- ఇంతకు ముందు(నోటిఫికేషన్ తేదీ 2024 జూన్ 3) దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు మరల దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదు.

అర్హత: కనీసం 55 శాతం మార్కులతో సంబంధిత మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.600. ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు రూ.550; ఓబీసీ-ఎన్‌సీఎల్ రూ.400; ఎస్సీ/ఎస్టీ/పీడబ్ల్యూడీ(పీహెచ్) అభ్యర్థులకు రూ.275.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 20
- **హాల్ టిక్కెట్స్ డౌన్‌లోడ్:** అక్టోబరు 10
- **ప్రవేశ పరీక్ష తేదీలు:** అక్టోబరు 19, 20
- **ఇంటర్వ్యూకు ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** నవంబరు 18
- **ఇంటర్వ్యూలు :** నవంబరు 18 నుంచి 21 వరకు
- **ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** డిసెంబరు 2
- **అడ్మిషన్ కౌన్సెలింగ్ తేదీలు:** డిసెంబరు 10, 11
- **తరగతులు ప్రారంభం:** 2025 జనవరి 1
- **వెబ్‌సైట్:** http://acad.uohyd.ac.in/

అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యా నిధి

విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసించాలనుకునే నిరుపేద ఎస్సీ విద్యార్థులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యా నిధి స్కాలర్‌షిప్ పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకం కింద రూ.20 లక్షల ఆర్థిక సాయం అందిస్తారు. అమెరికా, కెనడా, జర్మనీ, ఫ్రాన్స్ యూకే, సింగపూర్, జపాన్, దక్షిణ కొరియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాల్లో చదువుకోవాలనుకునే అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు. తెలంగాణ ఈ-పాస్ వెబ్‌సైట్ ద్వారా అర్హులైన విద్యార్థులు అక్టోబరు 13వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలి.

అర్హతలు: కనీసం 60 శాతం మార్కులతో ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. జీఆర్ఈ/జీమ్యాట్ మెరిట్ ఆధారంగా ఎంపిక చేస్తారు. కుటుంబం నుంచి ఒక్కరు మాత్రమే ఈ పథకానికి అర్హులు. విద్యార్థి కుటుంబ వార్షికాదాయం రూ.5 లక్షల కంటే తక్కువ ఉండాలి.

దరఖాస్తుకు చివరి తేదీ: అక్టోబరు 13

వెబ్‌సైట్: telanganaepass.cgg.gov.in/



ఐటీబీపీలో కానిస్టేబుల్ పోస్టులు

ఖాళీలు: 819

కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖకు చెందిన ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీస్ ఫోర్స్(ఐటీబీపీ)... కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు: కానిస్టేబుల్(కిచెన్ సర్వీసెస్)

ఖాళీలు: 819(యూఆర్-458, ఎస్సీ-48, ఎస్టీ-70, ఓబీసీ-162, ఈడబ్ల్యూఎస్-81). పురుషులకు 697, మహిళలకు 122 ఖాళీలు ఉన్నాయి.

శారీరక ప్రమాణాలు: పురుషులకు ఎత్తు 165 సెం.మీ., మహిళల ఎత్తు 155 సెం.మీ. పురుషుల ఛాతీ 75 సెం.మీ. నుంచి 80 సెం.మీ. మధ్య ఉండాలి.

వయోపరిమితి: 2024 అక్టోబరు 1 నాటికి 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి.

పే స్కేల్: నెలకు రూ.21,700- రూ.69,100

ఎంపిక ప్రక్రియ: ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్, రాత పరీక్ష, డిటైల్డ్ మెడికల్ ఎగ్జామినేషన్, రివ్యూ మెడికల్ ఎగ్జామినేషన్, ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా ఎంపిక చేస్తారు.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: అక్టోబరు 1

వెబ్‌సైట్: https://itbpolice.nic.in/

'టెక్నికల్ టీచర్స్ ట్రెయినింగ్ అండ్ రీసెర్చ్'లో ఖాళీలు

ఖాళీలు: 22

చెన్నైలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ టీచర్స్ ట్రెయినింగ్ అండ్ రీసెర్చ్...కింద పేర్కొన్న గ్రూప్-సి పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

గ్రూప్-సి పోస్టులు

1. అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్: **1 పోస్టు**
2. టెక్నికల్ అసిస్టెంట్ గ్రేడ్-2: **2 పోస్టులు**
3. సీనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్: **6 పోస్టులు**
4. సీనియర్ టెక్నీషియన్: **1 పోస్టు**
5. జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్: **2 పోస్టులు**
6. టెక్నీషియన్: **1 పోస్టు**

అర్హత: పదో తరగతి, ఇంటర్మీడియట్ పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఐటీఐ, డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: 35 ఏళ్ల మించకూడదు

ఫీజు: రూ.500. మల్టీ టాస్కింగ్ స్టాఫ్ పోస్టులకు రూ.300. ఎస్సీ/ఎస్టీ/పీడబ్ల్యూబీడీ/మహిళ/ఎక్స్ సర్వీస్‌మెన్ అభ్యర్థులకు ఫీజులో మినహాయింపు ఉంటుంది.

పని ప్రదేశాలు: విజయవాడ, హైదరాబాద్, బెంగళూరు, చెన్నై

ఎంపిక: రాత పరీక్ష, స్కిల్ టెస్ట్/ఫిజికల్ టెస్ట్, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: అక్టోబరు 15

వెబ్‌సైట్: https://www.nitttrc.ac.in/

ఐఐఎం జమ్మూలో ఆపరేటర్లు

ఖాళీలు: 16

జమ్మూ కశ్మీర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ జమ్మూ(ఐఐఎం- జమ్మూ)లో.... ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి బ్రాడ్‌కాస్ట్ ఇంజనీరింగ్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్(బీఈసీఐఎల్) దరఖాస్తులు కోరుతోంది.

పోస్టుల వివరాలు

1. ఆపరేటర్: **7 పోస్టులు**
2. ఐటీ టెక్నీషియన్: **2 పోస్టులు**
3. ఐటీ ఇంజనీర్: **1 పోస్టు**
4. నెట్‌వర్క్ ఇంజనీర్: **1 పోస్టు**
5. అకౌంట్ అసిస్టెంట్: 2 పోస్టులు
6. ఎగ్జిక్యూటివ్: **2 పోస్టులు**
7. ఆడియో- వీడియో టెక్నీషియన్: **1 పోస్టు**

విభాగాలు: ఏసీ/రిఫ్రిజిరేషన్, చిల్లర్/బాయిలర్, ఎస్‌టీపీసీ, రివర్స్ ఆస్మాసిస్/డబ్ల్యూటీపీ, ఫైర్ అలారమ్ తదితరాలు.

అర్హత: పోస్టును అనుసరించి ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: ఆడియో-వీడియో టెక్నీషియన్ పోస్టుకు 38 ఏళ్లు, మిగతా పోస్టులకు 35 ఏళ్లు మించకూడదు.

దరఖాస్తు ఫీజు: జనరల్/ఓబీసీ/ఎక్స్ సర్వీస్‌మెన్/మహిళా అభ్యర్థులకు రూ.590; ఎస్సీ/ఎస్టీ/ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.295.

ఎంపిక ప్రక్రియ: విద్యార్హత, పని అనుభవం, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ దరఖాస్తులను 'బ్రాడ్‌కాస్ట్ ఇంజనీరింగ్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్(బీఈసీఐఎల్), బీఈసీఐఎల్ భవన్, సీ-56/ఏ-17, సెక్టార్-62, నోయిడా' చిరునామాకు పంపించాలి.

దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 25

వెబ్‌సైట్: www.becil.com



పవర్‌గ్రిడ్‌లో ఆఫీసర్ ట్రెయినీ

ఖాళీలు: 9

ఢిల్లీలోని పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(పవర్‌గ్రిడ్)...కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

అర్హత: పోస్టును అనుసరించి కనీసం 60 శాతం మార్కులతో ఎల్ఎల్‌బీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. క్లాట్ స్కోరు తప్పనిసరి.

జీతం: నెలకు రూ.40,000

వయోపరిమితి: 28 ఏళ్లు మించకూడదు. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీలకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్లు సడలింపు ఉంటుంది.

దరఖాస్తు ఫీజు: రూ.500. ఎస్సీ/ఎస్టీ/పీడబ్ల్యూబీడీ/ఎక్స్ సర్వీస్‌మెన్ అభ్యర్థులకు ఫీజులో మినహాయింపు ఉంటుంది.

ఎంపిక ప్రక్రియ: ధ్రువపత్రాల పరిశీలన, బిహేవియరల్ అసెస్‌మెంట్, గ్రూప్ డిస్కషన్, మెడికల్ టెస్ట్, ఇంటర్వ్యూ, క్లాట్ స్కోరు తదితరాల ఆధారంగా.

ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం: నవంబరు 7

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: నవంబరు 27

వెబ్‌సైట్: https://www.powergrid.in/

ఎన్ఐఈలో కన్సల్టెంట్స్

ఖాళీలు: 7

చెన్నైలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఎపిడిమియోలజీ...ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

విభాగాలు: సైంటిఫిక్(మెడికల్/నాన్ మెడికల్), టెక్నికల్(మెడికల్/నాన్ మెడికల్)

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

జీతం: నెలకు కన్సల్టెంట్(మెడికల్/నాన్ మెడికల్) పోస్టులకు రూ.లక్ష, టెక్నికల్(మెడికల్/నాన్ మెడికల్) పోస్టులకు రూ.36,400.

వయోపరిమితి: 70 ఏళ్లు మించకూడదు.

ఎంపిక విధానం: ఆన్‌లైన్ ఇంటర్వ్యూ ఆధారంగా

పని ప్రదేశం: ఐసీఎంఆర్ - ఎన్ఐఈ, చెన్నై

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 24

వెబ్‌సైట్: https://www.nic.gov.in/

ఎన్ఐబీలో జూనియర్ సైంటిస్టులు

ఖాళీలు: 6

నోయిడా(ఉత్తరప్రదేశ్)లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బయోలాజికల్స్... డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- సైంటిస్ట్ గ్రేడ్-1: **1 పోస్టు**
- సైంటిస్ట్ గ్రేడ్-2: **2 పోస్టులు**
- జూనియర్ సైంటిస్ట్: **2 పోస్టులు**
- అసిస్టెంట్ -2: **1 పోస్టు**

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎంబీబీఎస్, పీజీ, మెడికల్ పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.

ఎంపిక ప్రక్రియ: అభ్యర్థుల విద్యార్హత, రాత పరీక్ష/స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ, పర్సనాలిటీ టెస్ట్ ఆధారంగా


చివరి తేదీ: సెప్టెంబరు 23 **వెబ్‌సైట్:** https://www.nib.gov.in/

లిటిల్స్

7 తేడాలను కనిపెట్టండి




దారి కనుక్కోండి






సరైన నీడను గుర్తించండి



గడుల ఆధారంగా బొమ్మ గీయండి



డైలీ సుడోకు - 411

		9				5		
	2		8		3		1	
				2	5	3	7	
		8						2
	7						6	
6						4		
	5	7	4	1				
	1		9		7		8	
		6				1		

సుడోకు - 410 సమాధానం

5	7	4	3	9	8	2	6	1
3	9	1	7	6	2	5	4	8
2	8	6	1	4	5	7	9	3
7	3	2	6	5	1	9	8	4
1	6	9	8	2	4	3	7	5
8	4	5	9	3	7	1	2	6
4	2	3	5	7	6	8	1	9
6	5	8	2	1	9	4	3	7
9	1	7	4	8	3	6	5	2

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.